
ఆంధ్రప్రదేశ్

ఏప్రిల్ 1968

★

30 పైసలు



ఆంధ్రప్రదేశ్‌ను గురించి....

వి_స్తీర్ణం	1 06,286 చ మై
జిల్లాలు	20
తాలూకాలు	189
గ్రామాలు	28,997
పట్టణాలు, నగరాలు	212
మొత్తం జనసంఖ్య (1961)	359 83 లక్షలు
జన సాంద్రత (1961)	339 చ మై 1
అక్షరాస్యులు (1961)	76 27 లక్షలు
షెడ్యూల్డు కులాలవారు (1961)	49 74 లక్షలు
షెడ్యూల్డు తెగలవారు (1961)	13 24 లక్షలు
నమోదైన కర్మాగారాలు	3,928
విశ్వవిద్యాలయాలు	4
పంచాయతీలు	15,266
పంచాయతీ సమితులు	321
ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంటు సభ్యులు	61
విధానసభ సభ్యులు	288
శాసనమండలి సభ్యులు	90

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 12] ఏప్రెల్ – 1968 [సంచిక. 6
చైత్ర – వైశాఖ–1890 శాక

ప్రధాన సంపాదకులు
టి. యస్. రామన్, ఐ ఎ యస్.

సంపాదకులు
ఎస్. వి. గోపాలశాస్త్రి

ఈసంచికలో.

మొదటి అట్ట : శాసనసభ్యుల నాగార్జునసాగర్ యాత్ర

మూడవ అట్ట : నగరంలో మొహరం

నాలుగవ అట్ట : భద్రాచలంలోని రామాలయం

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు. సం॥

పేజీ



ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నరుగా శ్రీ ఖండూభాయ్ దేశాయ్ పదవీ స్వీకారం

శ్రీ ఖండూభాయ్ కసంజీ దేశాయ్ ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా ఏప్రిల్ 11 న పదవీ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. జగన్మోహనరెడ్డి ప్రమాణస్వీకరణ కార్యక్రమం జరిపించారు.

ఉభయ రాష్ట్రశాసనసభల అధ్యక్షులు, మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నత సివిల్, మిలటరీ అధికార్లు, అనధి కార ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

పదవీ స్వీకారం తర్వాత పత్రికలవారితో మాట్లాడుతూ గవర్నరు యిలా అన్నారు. "ఇప్పుడు నేను కూడా ఆంధ్రుడ్నే అయ్యాను. ఆంధ్ర ప్రజల క్షేమానికై పాటు పడవలసిన బాధ్యత యిప్పుడు నామీద వున్నది".

మన నూతన గవర్నరు

శ్రీ ఖండూభాయ్ దేశాయ్



శ్రీ ఖండూభాయ్ కె. దేశాయ్ సుప్రసిద్ధ కార్మిక నాయకులు. భారత జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు వ్యవస్థాపకులలో ప్రముఖులు. గాంధీ పథగాములైన ప్రముఖ జాతీయ వీరులలో శ్రీ దేశాయ్ ఒకరు. ఖండూభాయ్ 1952లో ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షునిగా పదవీవిరమణ చేసినప్పుడు ఆనాటి ఐ.ఎన్.టి.యు.సి. ప్రధాన కార్యదర్శి అయిన శ్రీ హరిహరనాథ శాస్త్రి యిలా అన్నారు. "కాంగ్రెసుకు గాంధీజీ ఎట్టివారో ఐ ఎన్ టి యు సి కి ఖండూభాయ్‌జీ" అట్టివారు' అని. ఈ దేశంలో కార్మిక సంఘోద్యమంగాని, ఐ ఎన్ టి యు సి గాని చక్కగా రూపొందడానికి శ్రీ ఖండూభాయ్ దేశాయ్ వహించిన పాత్ర మరొకరెవరూ వహించి ఉండలేదు. శ్రీ ఖండూభాయ్ దేశాయ్ వయసు 70 సంవత్సరాలు.

శ్రీ ఖండూభాయ్ దేశాయ్ 1898 అక్టోబరు 23న బుల్సార్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1917లో బుల్సార్‌లోని భాయ్ అవబాయి హైస్కూలులో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి బొంబాయిలోని విల్సన్ కళాశాలలో చేరారు. ఆ రోజుల్లో ఆయన తోటి విద్యార్థులందరిలోకి అతిచురుకైనవారు, తెలివైనవారు అనిపించుకున్నారు. కళాశాలలో చదువుకొనే రోజుల్లోనే గాంధీజీ నాయకత్వమూ ఆయన సిద్ధాంతాలూ శ్రీ ఖండూభాయ్ దేశాయ్‌ని ఆకర్షించాయి. 1920లో కళాశాలలు, పాఠశాలల్ని బహిష్కరించడం జరుగుతున్నప్పుడు శ్రీ ఖండూభాయ్ దేశాయ్ కూడా కళాశాలను విడిచిపెట్టి సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత అహమ్మదాబాద్‌లోని గుజరాత్ విద్యాపీఠంలో తిరిగి చేరారు. అక్కడనుంచి పట్టభద్రుడై బొంబాయిలోని ఒక జాతీయ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ప్రవేశించారు.

కార్మికోద్యమం

అహమ్మదాబాదులో మహాత్మా గాంధీ నాయకత్వం క్రింద ప్రారంభించబడిన కార్మికోద్యమం నిర్మాణాత్మకమైన స్వరూపాన్ని సంతరించుకుంది. దీనిలోనుంచి గాంధీజీ ఆశీస్సులతో, అహమ్మదాబాదు జవుళి పరిశ్రమ కార్మికుల సంఘం—మజ్దూర్ మహాజన్—రూపొందింది. ఈ సంఘాన్ని శ్రీమతి అనసూయా బెన్ సారాభాయ్ వ్యవస్థాపించి నడిపిస్తుండేవారు. గాంధీజీ సన్నిహిత అనుచరుడూ, స్వాతంత్ర్యోద్యమ నాయకుడూ అయిన శ్రీ శంకర్ లాల్ జి. బంకర్ యీ సంఘం వ్యవస్థాపిత సభ్యులలో ఒకరు. ఈ సంఘం ఏర్పడానికీ, అభివృద్ధి జెందడానికీ ఆయన ప్రముఖపాత్ర వహించారు. సహాయ నిరాకరణోద్యమ సమయంలో శ్రీ ఖండూభాయ్ దేశాయ్‌కి శ్రీ శంకర్ లాల్ బంకర్‌తో పరిచయం ఏర్పడింది. శ్రీ దేశాయ్‌లోని స్వభావసిద్ధమైన కార్మిక నాయకత్వ ప్రతిభను శ్రీ బంకర్ గుర్తించారు.

జవుళి పరిశ్రమ కార్మికుల సంఘంలో పూర్తి సమయాన్ని కార్మికుల సంక్షేమానికై వెచ్చించేందుకు వీలుగా యీ సంఘంలో చేరవలసిందిగా శ్రీ బంకర్ శ్రీ దేశాయ్‌ని ప్రోత్సహించారు.

కొత్త దృక్పథం

జవుళిమిల్లు కార్మిక సంఘాన్ని గాంధీజీ కార్మికులలో ప్రయోగాలు జరిపే ఒక లేబరేటరీగా అభివర్ణించారు. ఈ సంఘంలో ఖండూభాయ్ దేశాయ్ చేరి గాంధీజీ చెప్పినట్టు కార్మికోద్యమంలో కొత్త కొత్త కోణాలను దర్శించగలిగారు. గాంధీజీ మార్గదర్శకత్వం క్రింద

శ్రీ శంకర్‌లాల్ బంకర్, శ్రీమతి అనసూయా బెన్‌లవంటి నాయకుల సహచర్యంతో వర్గపోరాట సిద్ధాంతాలను, పాతబడి పోయిన పురాతన ఆర్థిక శాస్త్రసిద్ధాంతాలను పూర్తిగా వదలివేశారు. కార్మికసంఘ వ్యవసలో శాంతియుత మార్గాలను అనుసరిస్తూ శ్రీ ఖండూభాయ్ దేశాయ్ అనేక కొత్త కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారు. వాటిని అభివృద్ధిపరిచారు. నేరుగా సంప్రదింపులు జరిపి సమస్యలను పరిష్కరించుకొనే పద్ధతిని, పని విషయంలో సామూహికంగా ఒడంబడికలు జరిపే పద్ధతిని ప్రవేశపెట్టారు.

శక్తివంతమైన కార్మిక సంఘం

అలహాబాదు జవుళిమిల్లు కార్మికులకు, కార్మికసంఘ విషయ పరిజ్ఞానాన్ని కలిగించడంతోపాటుగా సాంఘిక విద్యనుకూడా అందజేయడంవల్లనే అలహాబాదు జవుళిమిల్లు కార్మికసంఘం దేశంలోని కార్మికసంఘాలలో శక్తివంతమైనదిగా రూపొందింది. కార్మికులలో పౌరవిధుల నిర్వహణ పట్ల శ్రద్ధ కలిగించడానికి, వాటిని అభివృద్ధిజేయడానికి శ్రీ దేశాయ్ విశేషంగా కృషిచేశారు. కార్మికులు నివసించే ప్రాంతాల నుండి బట్టలమిల్లు కార్మికుల సంఘం సభ్యులు పురపాలక సంఘానికి పోటీచేశారు. నగర పౌర విషయాలలో కార్మికులు గత ముప్పయి సంవత్సరాలలో ప్రముఖ పాత్ర వహిస్తున్నారు.

ఆ ఉద్దేశంతోనే అహమ్మదాబాదులో కార్మిక సంఘాల కార్యకర్తల ప్రథమ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఆ పథకం క్రింద శ్రీ ఖండూభాయ్ దేశాయ్ శిక్షణ యిచ్చిన ప్రప్రథమ కార్యకర్త కీ. శే. డా॥బి. ఆర్. అంబేద్కర్. మధ్యప్రదేశ్‌లోని ఇండోరు జవుళి పరిశ్రమ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు.

ఐ. ఎన్. టి. యు. సి

శ్రీ ఖండూభాయ్ దేశాయ్ భారత జాతీయ కార్మిక కాంగ్రెసు సంఘం ఏర్పాటు చేయడంలో ప్రముఖపాత్ర నిర్వహించారు. ఆయన, కీ. శే. శ్రీ హరిహరనాథ్‌శాస్త్రి – ఉభయులు సంస్థను పటిష్ఠంచేయడానికి తీవ్రంగా కృషిచేశారు. 1947–48లో ఐ. ఎన్. టి. యు. సి. ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ తర్వాత 1952 వరకు అధ్యక్షులుగా ఉన్నారు. సర్వకాల సర్వావస్థలు కార్మిక శ్రేయస్సుకు పాటుపడినా, అహమ్మదాబాదు పౌర వ్యవహారాలలోను దేశ రాజకీయ, ఆర్థిక వ్యవహారాలలోను శ్రీ దేశాయ్ ప్రముఖపాత్ర నిర్వహించారు. 20 సంవత్సరాలపాటు అహమ్మదాబాదు మునిసిపాలిటీ సభ్యులుగా ఉన్నారు. జవుళి కార్మిక సంఘంలోని సహచరులతోను ఇతర పుర ప్రముఖులతో కలిసి అహమ్మదాబాదు పురోభివృద్ధికి తీవ్రంగా కృషి చేశారు.

1937లో బొంబాయి శాసనసభకు శ్రీ ఖండూభాయి దేశాయ్ ఎన్నికైనారు. ఆ సమయంలోనే పారిశ్రామిక వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకునే అవకాశం కల్గిస్తూ శాసనం ఆమోదింపజేయడంలో ఆయన తోడ్పడ్డారు. ఇటువంటి శాసనం ఆమోదింపబడడం దేశంలో అదే ప్రథమం. స్వాతంత్ర్యం లభించిన తర్వాత బొంబాయి శాసనసభ నియోజకవర్గం నుంచి ఆయన రాజ్యాంగ సభకు ఎన్నికైనారు. రాజ్యాంగసభలో కార్మికులు, పరిశ్రమలు, రైల్వేలు, ఆర్థిక విషయాలు దేశానికి సంబంధించిన ఇతర ఆర్థిక వ్యవహారాల చర్చలలో ఆయన ప్రముఖంగా పాల్గొన్నారు. మేనేజింగ్ ఏజన్సీలు, తత్సంబంధమైన పారిశ్రామిక సంస్థలకు వ్యతిరేకంగా శ్రీ దేశాయ్ నిర్విరామంగా కృషిచేశారు.

నెహ్రూ మంత్రివర్గంలో

నెహ్రూ మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా వ్యవహరిస్తూ శ్రీ ఖండూభాయి దేశాయ్, కార్మిక వ్యవహారాలలో అనేక నూతన విషయాలను ప్రవేశపెట్టారు. ఉద్యోగంనుండి తొలగింపు, మొదలగు చేసిన సందర్భాలలో కార్మికులు నష్టపరిహారరూపంలో లాభం కలిగించడానికి సాంఘిక భద్రత కల్పించడానికీ ఆయన చర్యలు తీసుకున్నారు. ఆయన కృషిఫలితంగానే వేతనాల విషయాలను పరిష్కరించడానికి వేతనం బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. ఆయన అధికారంలో ఉన్నసమయంలోనే వ్యవసాయ కార్మికుల స్థితిగతుల పరిశీలన నిర్వహించబడి, నివేదిక ప్రచురించబడింది.

బొంబాయి జవుళి పరిశ్రమ విచారణ సంఘం సభ్యులుగా శ్రీ దేశాయ్ జవుళి పరిశ్రమ కార్మికుల వేతనాల స్థిరీకరణ పథకానికి ప్రాతిపదికను ఏర్పరచడంలో సంఘానికి తోడ్పడ్డారు. ఆర్థిక సంఘ సభ్యులుగా దేశంలో ఆర్థిక విధానాలను రూపొందించడంలో సహాయపడారు. వేతనాల నియామక సంఘ సభ్యులుగా శ్రీ దేశాయ్ కనీస వేతనాల నిర్ణయం, జాతీయ వేతన విధానాలను రూపొందించడంలో తోడ్పడ్డారు.

అంతర్జాతీయ కార్మిక రంగం

1950 మేలో భారత కార్మికుల ప్రతినిధివర్గం నాయకులుగా శ్రీ దేశాయ్ జెనీవా వెళ్ళారు. 1953లో టోక్యోలో జరిగిన అంతర్జాతీయ కార్మికసంస్థ రెండవ ఆసియా ప్రాంతీయ సమావేశానికికూడా ఆయన హాజరయ్యారు.

1962 జూలైలో బెర్లిన్‌లో జరిగిన ఐ. సి. ఎఫ్. టి. యు. 7వ ప్రపంచ కాంగ్రెసు మహాసభలో కూడ శ్రీ దేశాయ్ పాల్గొన్నారు. జూలై 12వ తేదీన ఆ సంఘం అధ్యక్షులు శ్రీ దేశాయ్‌కి ప్రత్యేక ఆహ్వానితులుగా స్వాగతం చెప్పారు. అధ్యక్షులు తన పరిచయవాక్యాలలో శ్రీ దేశాయ్‌ని ఐ. ఎన్. టి. యు. సి. నిర్మాతగా వర్ణించారు. బెర్లిన్ సమావేశంలో శ్రీ దేశాయ్ చేసిన ఉపన్యాసం ప్రపంచ కార్మికోద్యమంలో చరిత్రాత్మకమైన పత్రంగా గుర్తించబడింది.


శ్రీ ఖండూభాయి దేశాయ్, శక్తిసామర్థ్యాలుగల ఆర్గనైజరుగా నిరూపించుకున్నారు. 1961 నుండి అఖిలభారత నూనెపరిశ్రమ సంస్థఅధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. పరిశ్రమదృష్ట్యానూ, దానిని సమర్థవంతంగా నిర్వహించే దృష్ట్యానూ శ్రీ దేశాయ్ అమోఘమయిన సత్ఫలితాలను సాధించారు. ఆయన అధ్వర్యంలో అఖిల భారత పరిశ్రమ; కార్మికులకు ఎన్నో సదుపాయాలను, సంక్షేమ కార్యక్రమాలను కల్పించింది.

థానుపిళ్ళె దంపతులకు వీడ్కోలు

ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా పదవీ విరమణ చేస్తోన్న శ్రీ పట్టం థానుపిళ్ళె, వారి సతీమణి శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళెగార్ల గౌరవార్థం ముఖ్యమంత్రి రాజ్‌భవన్‌లో వారికి ఏప్రెల్ 8 న విందు ఏర్పాటు చేసిన సందర్భంలో రాజ్‌భవన్ ఆత్మీయతా, అభిమాన వాతావరణంతో నిండిపోయింది.

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి అధ్యక్షులు, మంత్రివర్గ సభ్యులు, ఉన్నత మిలటరీ, సివిల్ అధికార్లు, అనధికార ప్రముఖులు, సాంఘిక కార్యకర్తలు ఈ వీడ్కోలు కార్యక్రమానికి హాజరయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్య మంత్రి, గవర్నరుకు అపూర్వ కళాఖండాలకు ప్రసిద్ధికెక్కిన నిర్మల్‌లో తయారైన స్క్రీన్‌ను బహుమతి చేశారు: కర్రతో తయారు చేసిన యీ తెరమీద బ్రహ్మాండమైన నాగార్జున సాగర్, చారిత్రాత్మకంగా ప్రసిద్ధికెక్కిన చార్మినార్, అపూర్వమైన విశాఖరేవు, రామప్ప, లేపాక్షి కళాప్రాంగణాలు, వరంగల్లు కాకతీయ సింహద్వారం చిత్రించబడి వున్నాయి. బిద్రీపని తనంలో చెక్కిన అందమైన పూలవాజు ఒకదానిని శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళెకు బహూకరించారు.



తమ వీడ్కోలు ప్రసంగంలో శ్రీ బ్రహ్మానందరెడ్డి, శ్రీ థానుపిళ్ళెకు తమ కృతజ్ఞతలను తెలియజేశారు. 1964లో ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా శ్రీ పట్టంథానుపిళ్ళె రావడం మన రాష్ట్రప్రజల అదృష్టంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'నాకు ఎప్పుడూ గవర్నరుగారి మార్గదర్శకత్వం, సలహాలు లభించేవి. అమితమైన అభిమానాన్ని ఆయన మామీద కురిపించేవారు. ఆంధ్రులకు ఆంధ్రకేసరి ఎటువంటి నాయకుడో కేరళ ప్రజలకు శ్రీ థానుపిళ్లె అట్టివారు. వారు యిక్కడ పదవిలోవున్న యీ విలువైన నాలుగేళ్ళను మేము మననం చేసుకుంటాము అన్నారు' ముఖ్యమంత్రి.

"పదవిలో వున్న నాలుగేళ్ళూ వీరు రాష్ట్రమంతటా పర్యటించారు. వేలాది ప్రజలను కలుసుకున్నారు. 'అచంచలమైన ఆత్మ విశ్వాసం, అగణితమైన ధైర్యసాహసాలే వీరిని ప్రముఖ రాజకీయ వేత్తగా తీర్చిదిద్దాయి' అనే దృఢమైన నమ్మకాన్ని ప్రజల హృదయాలలో ప్రతిష్ఠించారు. పరిపాలనలో సమస్యలు ఎదురైనప్పుడూ, సరైన మార్గ దర్శకత్వంనాకు అవసరమైనప్పుడూ నేను వారివద్దకు వెళ్ళేవాడిని. ప్రజా జీవితంలో వారికి గల అశేషమైన అనుభవంతో చక్కటి సూచనలు అందించేవారు' అన్నారు ముఖ్యమంత్రి.

సాంఘిక సేవా కార్యక్రమాలలో శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళె ఆసక్తి చూపించినందుకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. శ్రీథానుపిళ్ళెకు ఆమె ఎప్పుడూ నూతనోత్సాహాన్నీ, స్థైర్యాన్నీ కలిగించే వారని తెలియజేశారు. అన్ని సాంఘిక సేవా కార్యక్రమాలలోనూ శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళె ఆసక్తిని కనబరచే వారనీ, ముఖ్యంగా రెడ్‌క్రాస్‌లో అమితమైన ఆసక్తిని కనబరచే వారనీ, రూ. 7 లక్షల వరకు రెడ్‌క్రాస్‌కు విరాళాలు సేకరించారనీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

శ్రీ థానుపిళ్ళె మాట్లాడుతూ, తాను హైదరాబాదులో వున్న నాలుగు సంవత్సరాలూ 'నా జీవితంలో అత్యంత ఆనందమైన కాలం' అని అన్నారు. అన్ని వైపుల నుంచీ ఆదరాభిమానాలు ప్రసరించాయని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ ప్రజలు, వారి యితర లోపాలమాట ఎలావున్నా, ఆదరాభిమానాల్ని చూపించడంలో వారికి వారే సాటి అని నిస్సంశయంగా చెప్పగలను" అన్నారు శ్రీ థానుపిళ్ళె. ఈ గుణగణాలే మానవ సత్సంబంధాలలోనూ, కార్యకలాపాలలోనూ ప్రముఖ పాత్ర వహించేవని ఆయన పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి పరిపాలనా దక్షతను గవర్నరు ప్రశంసించారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి పైకి కనిపిస్తున్న దానికన్న అమితమైన శక్తి సామర్థ్యాలు కలవారనీ, మితంగా మాట్లాడే స్వభావం కలవారనీ, వారి మౌనంలోనే అపూర్వమైన శక్తి నిండి వున్నదనీ పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడిపించడం చాలా కష్టసాధ్యమనీ, శ్రీ బ్రహ్మానందరెడ్డి

ప్రతిభా సామర్థ్యాల వల్ల అది ఏమంత కష్టంగా అనిపించలేదనీ శ్రీ థానుపిళ్ళె పేర్కొన్నారు.

తమ మంత్రివర్గ సహచరులు, తమ పార్టీ వారూ మాత్రమే గాక ప్రత్యర్థుల సహకారాన్ని కూడా ముఖ్యమంత్రి పొంది, క్లిష్ట పరిస్థితులలో రాష్ట్రానికి మేలు జరిగేటట్టు చూడ గలరన్న విశ్వాసాన్ని శ్రీ థానుపిళ్ళె వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యవహారాలను నిర్వర్తించడంలో కలిసికట్టుగా అందరి సహకారంతో పని చేయడానికి శ్రీ బ్రహ్మానంద రెడ్డి పూనుకో గలరన్న తమ ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

రాష్ట్ర శాసనసభల అధ్యక్షులు, ఉభయసభల కార్యక్రమాలను నిర్వర్తించడంలో వహించిన పాత్రకు శ్రీ థానుపిళ్ళె తమ సంతృప్తిని ప్రకటించారు. వీరు నిజంగా న్యాయబద్ధంగా వ్యవహరించారనీ, ఇతర శాసన సభల్లో జరిగినట్టు యిక్కడ అసహ్యకరమైన సంఘటనలు జరగలేదంటే అందుకు వీరి ప్రతిభే కారణమని, శాసనసభలో చర్చలను నిర్వర్తించడంలో వారు చూపిన సహందా, ప్రశాంతతే కారణ మని పేర్కొన్నారు.

ఇక్కడి ప్రత్యర్థి పార్టీలు కూడా చాల సంయమనం గలవని పేర్కొన్నారు.

చివర్లో, ఆంధ్రప్రదేశ్ ముందుముందు మరింతగా అభివృద్ధిని సాధించగలదన్న తమ విశ్వాసాన్ని శ్రీ థానుపిళ్ళె ప్రకటించారు.

ఏప్రెల్ 9న శ్రీ థానుపిళ్ళె, వారి సతీమణితో తిరువేంద్రానికి బయలుదేరి వెళ్ళారు. •

"కేరళ కేసరి"—శ్రీ పట్టం





కేరళలోని సుప్రసిద్ధులూ, అగ్రగణ్యులూ అయిన రాజకీయ నాయకులలో శ్రీ పట్టం ఎ. థానుపిళ్ళె ఒకరు. కేరళ ముఖ్య మంత్రిగా మూడుసార్లు ఎన్నికోబడిన అపూర్వగౌరవం ఆయనకే దక్కింది.

శ్రీ పట్టం ఎ. థానుపిళ్ళె 1885లో జన్మించారు. పంథొమ్మిదివందల యిరవై ప్రాంతాల్లో భారతదేశమంతటా రాజకీయ అలజడి తీవ్రంగావుంది. జాతీయతా భావం ప్రభంజనంలా ప్రజాహృదయాలను ఆక్రమించుకుని దేశాభిమానంతో ఊపి వేస్తున్న రోజులవి. అగ్రశ్రేణిలాయర్లు స్వాతంత్ర్య సమరం లోకి దూకుతున్న రోజులు. స్వరాష్ట్రంలో అభిమానపురస్సరంగా 'పట్టం' అని పిలువబడే శ్రీ పట్టం ఎ. థానుపిళ్ళె కూడా బాగా ప్రాచుర్యంలో వున్న తమ న్యాయవాద వృత్తికి తిలోదకాలిచ్చి రాజకీయరంగంలోకి ప్రవేశించారు. 1927లో తిరువేంద్రం నియోజకవర్గంనించి రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. తమ నియోజకవర్గంలోని ప్రజల హృదయకుహరాలలో చెరిపివేయని గాఢమైన ముద్రలువేసి వారి అభిమానాన్ని చూరగొని వరుసగా మూడు దశాబ్దాలపాటు—మధ్యలో ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చట్టాలక్రింద పోటీకి అర్హత లేదని ప్రకటించిన కొద్దికాలంమినహా—అదే నియోజకవర్గం నుంచి ప్రజలచేత ఎన్నికోబడుతూ వచ్చారు.

స్వాతంత్ర్య పోరాటం

స్వాతంత్ర్య పోరాటం తీవ్రంగావున్న రోజుల్లో తిరువాన్కూరు రాష్ట్ర కాంగ్రెసు రథసారథిగా వున్నారు ఆయన స్వాతంత్ర్య ప్రభంజనోద్యమాన్ని నడిపించారు అనేకసార్లు కారాగారవాసం అనుభవించారు 1948 మార్చిలో తిరువాన్కూరులో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పుడు శ్రీ పట్టం ఎ థానుపిళ్ళె చేసిన ప్రజాసేవకు గుర్తింపుగా ముఖ్యమంత్రిగా ప్రజలు ఆయనను ఎన్నుకున్నారు అయితే ఏడు నెలల తర్వాత ఆయన కాంగ్రెసు నుంచి బైటికివచ్చి తిరువాన్కూరులో డెమొక్రటిక్ సోషలిస్టు గ్రూపును ఏర్పాటుచేసారు అదే ఆ తర్వాత ప్రజా సోషలిస్టు పార్టీగా రూపాంతరం చెందింది 1954 లో భారతదేశంలో తొలిసారిగా ప్రజా సోషలిస్టుపార్టీ మంత్రివర్గానికి నాయకత్వం వహిస్తూ రెండవసారి ముఖ్యమంత్రి అయ్యారు 1955 ఫిబ్రవరి వరకు వీరి మంత్రివర్గం అధికారంలో వుంది

1950 చివరిలో కేరళలో రాజకీయ రంగంలో అనేక మార్పులు వచ్చాయి 1959 జూలై 31 నుంచి రాష్ట్రపతి పాలన అక్కడ అమలులోకి వచ్చింది రాష్ట్రంలోని రాజకీయపార్టీలకు యిదొక సవాలుగా, ఒక అవకాశంగా అనిపించింది ప్రజా సోషలిస్టుపార్టీని నడిపిస్తున్న 'పట్టం' తిరిగి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి సుస్థిర మంత్రివర్గ స్థాపనకు వీలైన చర్యలన్నిటినీ చేశారు వారి కృషివల్ల 1960 ఫిబ్రవరి 22న కాంగ్రెసు - ప్రజా సోషలిస్టుపార్టీల మిశ్రమ మంత్రివర్గం ఏర్పడి, 205 రోజులుగా అమలులోవున్న రాష్ట్రపతి పాలనకు స్వస్తిచెప్పింది ఈ మంత్రివర్గంలో ఎనమండుగురు కాంగ్రెసువారు, ముగ్గురు ప్రజాసోషలిస్టు పార్టీవారు వున్నారు వీరంతా 'పట్టం' నాయకత్వానికి ఏకగ్రీవంగా సంతోషంతో అంగీకరించారు

1962 అక్టోబరు వరకు వీరు ఆ పదవిలోనే వున్నారు ఆ తరువాత పంజాబులో గవర్నరుగా నియమింపబడ్డారు పంజాబులోవున్న రెండేళ్ళలోనూ, అస్తవ్యస్తంగావున్న, అక్కడి రాజకీయ వాతావరణంలో ప్రభుత్వయంత్రాంగాన్ని సుస్థిరంగా నడిపించారు రెండేళ్ళ తర్వాత 1964 మే 4న ఆంధ్రప్రదేశ్‌లో జనరల్ ఎస్ ఎం శ్రీనగేష్ స్థానే గవర్నరుగా నియమింపబడ్డారు

ఆంధ్రప్రదేశ్‌లో గవర్నరుగా పనిచేసిన కాలంలో రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగి, ప్రజాస్వామ్యంలో, ప్రజాస్వామిక వ్యవస్థలో అంతటా గాఢమైన విశ్వాసం ప్రకటితమైంది సుస్థిరమైన మంత్రివర్గం ఏర్పడింది అనేక అడ్డంకులున్నప్పటికీ వాటన్నిటినీ రాష్ట్రం అధిగమిస్తూ భారతదేశంలోనే అగ్రగణ్యం కాగలదన్న ఆశాభావాన్ని అందరి హృదయాలలోనూ కలిగించింది శ్రీ పట్టం ఏ థానుపిళ్ళె రెడ్‌క్రాస్ తోనూ, సర్వీస్ మెన్స్ ఆర్గనైజేషన్‌తోనూ, సాలార్‌జంగ్ మ్యూజియంతోనూ సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్నారు. వారి దయార్ద్రదృష్టి హృదయ సౌకుమార్యం 'తండ్రి'వంటి గౌరవనీయమైన రూపం యివన్నీ వారు యీ రాష్ట్రంలో వున్నంతకాలమూ ప్రజలను ఆకర్షిస్తూనే వున్నాయి

దక్షతగల గవర్నర్లు

ఆంధ్రప్రదేశ్ కొత్త గవర్నరు శ్రీ ఖండూ భాయ్‌దేశాయ్ సుప్రసిద్ధ కార్మిక నాయకులు భారతజాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుతో అనేక సంవత్సరాలుగా వీరికి సన్నిహిత సంబంధం వుంది వీరిస్వరాష్ట్రమైన గుజరాత్‌లో రాజకీయాలలోనూ, కార్మిక విషయాలలోనూ వీరి ప్రభావం విశేషంగావుంది చిర కాలంగా వీరు కాంగ్రెసు వాది అనేక కార్మిక సంఘాలలోనూ, యితర సంఘాలలోనూ పనిచేశారు

కొంతకాలం పాటువీరు కేంద్ర కార్మిక శాఖా మంత్రిగా పనిచేశారు కార్మిక సమస్యలనుగురించి—ముఖ్యంగా జవుళి పరిశ్రమనుగురించి—వీరికిగల పరిజ్ఞానం అపారమైనది వీరి ఈ ప్రతిభ హైదరాబాదుకు ఎంతో విలువను, ప్రయోజనాన్ని కల్పించగలదు ఆంధ్రప్రదేశ్ నేడు అంతగా పారిశ్రామికంగా అభివృద్ధిచెందిలేదు అయితే అభివృద్ధికి అంకురార్పణలు మాత్రం జరిగాయి పారిశ్రామికీకరణ ఎట్టి ఒడుదుడుకులూ లేకుండా సాగడంలో కార్మికులు ప్రధాన పాత్రవహిస్తారు గవర్నరుగారి చిరకాల అనుభవం ఈ విషయంలో సహాయకారి కాగలదు

కొత్త గవర్నరు శ్రీ దేశాయ్‌కి ముందు గవర్నరుగావున్న శ్రీ పట్టం థానుపిళ్ళె ప్రజాభిమానాన్ని చూరగొన్న వ్యక్తి ఎంతో ప్రతిభతో, జాగ్రత్తతో రాష్ట్రాన్నినడిపించారు

—ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మార్చి 21

సంవత్సరాది

పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి

సంవత్సర ప్రారంభదినము సంవత్సరాది. సంవత్సరము యుగమనియు చెప్పబడును. యుగములు అనేక విధములు. 1 సంవత్సరము_యుగము. 5 సంవత్సరముల_యుగము, 60 సంవత్సరముల_యుగము. ఇట్లు 43,20,000 సంవత్సరములు_మహాయుగము. సూర్యాది గ్రహములలో సూర్య చంద్రులు గాని, మరి కొన్ని గ్రహములతో గూడిన రవిచంద్రులుగాని నక్షత్ర చక్రమునందు ఒక ప్రదేశము నందు కలసి, తిరిగి ఆ ప్రదేశమునందే కలియునప్పటికగు కాలము యుగము.

ఆకాశమునందు అశ్విని భరణి ఇత్యాదిగ పేర్లుగల నక్షత్రములు చక్రాకారముగ నేర్పడియున్నవి. ఈ సముదాయమే నక్షత్ర చక్రము. ఈ నక్షత్ర చక్రము 27 సమభాగములుగ విభజింప బడియున్నది. ఒక్కొక్క భాగమునకు ఆభాగమందుగాని దానికి సమీపమునగాని గల నక్షత్రమునుబట్టి ఆ నక్షత్రసంజ్ఞలు చేయబడినవి. ఒక్కొక్క నక్షత్రమునందు ఒకటిగాని అనేకములు గాని చుక్కలు గలవు. ఆ చుక్కల ఆకారమునుబట్టి వాటికి ఆపేర్లు పెట్టబడినవి.

ఉదా:_గుఱ్ఱముయొక్క మొగమువలెనుండు చుక్కలగుంపు అశ్విని. కత్తివలెనుండు చుక్కలగుంపు కృత్తిక. ఇట్లు అన్నిటికిని తఱచు ఆకారమును బట్టియే నామములు గలవు. కొన్నిటికి రంగు బరువు మొదలగు లక్షణములబట్టి గలిగినవి.

ఆ నక్షత్ర చక్రమును 12 సమభాగములుగ చేసి, ఆ భాగములకు రాసులని పేరిడిరి. ఒక్కొక్కభాగము ఒక్కొక్కరాశి. అట్లు ఆచక్రమునే 360 సమభాగములుచేసి, వాటికి భాగలు, అంశలు (డిగ్రీలు) అనియు; ఒక్కొక్కభాగకు 60 భాగములు, లిప్తలు ఇత్యాదిసంజ్ఞలను చేసిరి.

ఆ రాసులకు మేషము, వృషభము ఇత్యాదినామములు. ఒక్కొక్కనక్షత్ర ప్రదేశమును 4 సమభాగములు చేయగా ఆ భాగములు నక్షత్ర పాదములు. ఒక్కొక్కరాశికి నక్షత్రపాదములు 9 యగును. రాశికి 30 భాగలు. నక్షత్రమునకు 13 భాగలు 20 లిప్తలు.

ప్రకృతము; రవిచంద్రులు మీనరాశిలో కలసి, తిరుగ మీన రాశిలో కలియుటకగుకాలము సంవత్సరము. ఇట్లు సూర్యచంద్రులబట్టి యగుటచే సంవత్సరము సౌరచాంద్ర సంవత్సర మనదగియున్నది. కాని సౌర సంవత్సరమువేరుగ గలదుగాన దీనిని చాంద్రసంవత్సర మనిరి. సంవత్సర శబ్దమునకు_ఋతువులు ఈ కాలమందు క్రమముగ నుండును అని అర్థము. (సమ్యగ్వసంత్యస్మిన్ ఋతవః ఇతి సంవత్సరః). కాల లక్షణములబట్టి సంవత్సరము మారుట సులభముగ తెలియుచున్నది. సంవత్సరమునకు ఎండకాలము, వాన కాలము, చలికాలము_ఇట్లు మూడుకాలములు గలుగుచున్నవి. దానిచే 6 ఋతువులు ఏర్పడుచున్నవి.

ఎండకాలము గ్రీష్మఋతువు. వానకాలము వర్షర్తువు. చలికాలము హేమంతఋతువు. వర్షర్తువునకును, హేమంతర్తువునకును మధ్య కాలమున నగు ఋతువు శరదృతువు. చలికాలమునకును, ఎండకాలమునకును మధ్యఋతువు వసంతర్తువు. ఎండకాలమునకును, వర్షకాలమునకును మధ్యకాలము లేదు. కావున చలికాలము హేమంతర్తువు. శిశిరర్తువు అని 2 ఋతువులుగ చెప్పిరి. ఈ రెంటిని కలిపి ఒకఋతువుగనే చెప్పి, సంవత్సరమునకు 5ఋతువులని వేదములందు గలదు.

"ద్వాదశమాసాః పంచర్తవః హేమంతశిశిరయో స్సమాసేన" అనిగలదు.

వసంతర్తువునకు ఆకురాలుకాలమని లోకవ్యవహారము. ఈ కాలమున వృక్షలతాదులు విశేషముగ ఆకురాల్చి చిగురించును. ఋతుభేదముచే వేరు వేరు వృక్షలతాదులు పుష్పించును. ఫలించును. చైత్రాదిమాసములు 12ను, ఋతువునకు 2 నెలలచొప్పున వసంతము గ్రీష్మము మొదలగు 6 ఋతువులుగ వ్యవహారము.

ఈ ఋతు విభాగము సుశ్రుతమను వైద్యశాస్త్రగ్రంథమున వేరుగ చేయబడినది.

ఆషాఢశ్రావణములు ప్రావృడృతువు. భాద్రపద ఆశ్వయుజములు వర్షర్తువు. కార్తిక మార్గశీర్షములు శరదృతువు. పౌష మాఘములు హేమంతర్తువు. ఫాల్గున చైత్రములు వసంతర్తువు. వైశాఖ జేష్ఠములు గ్రీష్మర్తువు. ఇట్లు విభాగము చేయబడెను. సుశ్రుతుని పద్ధతిలో వర్షకాలమునకు ప్రావృడృతువు, వర్షర్తువు ఇట్లు 2 ఋతువులు. పూర్వపద్ధతిలో 1 హేమంతర్తువు, 2 శిశిరర్తువు. ఇట్లు శీతకాలమునకు 2 ఋతువులు. ఇది దేశభేదముచే గలుగుచున్నది. హిమాలయప్రాంతమున శీత (చలి) కాలము 4 మాసములుండును. మన దేశమున వర్షకాలము 4 మాసములుండును. కావున దక్షిణ భారతమున నుండెడి సుశ్రుతుడు వర్షకాలమును 4

మాసములుగ చెప్పెను. ప్రావృట్ అనగా అధికవర్షములు గలుగు కాలము. వర్షర్తువు అనగా సాధారణ వర్షములు గలుగు కాలము.

ఈ రెండు పద్ధతులలోను వర్షకాల శీతకాలముల పరిమాణము దేశభేదముచే గలిగినట్లు చెప్పవచ్చును. కాని వసంతర్తువున మొదటి మాసము చైత్రమనుట పూర్వపద్ధతి. ఫాల్గునమనుట సుశ్రుతుని పద్ధతి. ఈ భేదము కాలభేదముచే గల్గినదియే.

ఇట్లు ఎండలు వానలు చలి ప్రారంభించిన నాటనుండి తిరుగ నట్లు ప్రారంభించుట కగుకాలము సంవత్సరము. దీనిని ఇపుడు ఆర్తవ (సీజన్) సంవత్సర మనుచున్నారు. ఈ ఋతుపరిణామము సూర్యసంచారముచేతనే గలుగుచున్నది. కావున నీ యార్తవ సంవత్సరములు-సౌర సంవత్సరములు. పూర్వపద్ధతిలోని ఋతు విభాగము-దక్షిణమున రామేశ్వరమునుండి ఉత్తరమున కాశ్మీరము వరకుగల భారతదేశమున మధ్యదేశమందగు శీతోష్ణస్థితినిబట్టి చేయ బడినది. అది ఈ క్రిందిపద్ధతిగ చేయబడినది. సూర్యుడు భూభ్ర మణవశముచే, నక్షత్రచక్రమునందు అశ్వినినుండిభరణికి ఇట్లుక్రమ ముగ నడచుచు ఉత్తరమునుండి దక్షిణమునకు 6నెలలును, దక్షిణ మునుండి ఉత్తరమునకు 6నెలలును పోవుచున్నట్లు మనకు గన్ప ట్టుచుండెను. ఈ కాలము దక్షిణాయనమనియు ఉత్తరాయణమనియు చెప్పబడును. ఉత్తరమునుండి దక్షిణమునకుపోవునపుడును, దక్షి ణమునుండి ఉత్తరమునకు పోవునపుడును 2 పర్యాయములు భూ మధ్యరేఖకు తిన్నగ వచ్చుచున్నాడు. ఆ భూమధ్యరేఖ విషువవృత్త ము (ఈక్వేటర్)అని చెప్పబడుచున్నది. అట్లు సూర్యుడు గమన ముచేయు వృత్తము క్రాంతివృత్తము అని చెప్పబడును. ఇదియే నక్షత్రచక్రము.

సూర్యుడు ఉత్తరగమనారంభమునుండి 3 మాసములకును, దక్షిణ గమనారంభమునుండి 3 మాసములకును భూమధ్యరేఖ (విషువవృత్తమున)కు వచ్చును. అపుడు క్రాంతివృత్తము విషువ వృత్తముతో గలియు ప్రదేశమునకు వచ్చును. దానికి విషువ ప్రదేశము లేక విషువద్బిందువు (ఈక్వినాక్సు) అని పేరు. ఆ విషువమునకు సూర్యుడు వచ్చిన రోజు విషువద్దినము. ఆ నాడు రాత్రింబవళ్ళు సమముగ నుండును. అందు ఉత్తర గమనము చేయునపుడు అగు విషువత్తు వసంతవిషువత్తు. దక్షిణగమనము చేయునపుడగు విషువత్తు శరద్విషువత్తు.

దీనింబట్టి ఋతువిభాగ మిట్లు చేయబడెను. దక్షిణపుకొనకు బోయిన సూర్యుడు ఉత్తరమునకు మళ్ళిన దినము ఉత్తరాయణ దినము. అట్లు మళ్ళుటయే ఉత్తరాయణమగుట. పూర్వ మీయుత్త రాయణము మాఘమాసమున నయ్యెడిది. కావున ఆనాడు శీతమునకు పరమావధి. అటనుండి 2 నెలలు శిశిరఋతువు. అంతకు ముందున్నవి యగు 2 నెలలు హేమంతఋతువు. వసంత విషువత్తునకు పూర్వమొకమాసము, వసంత విషువత్తు తరువాత నొకమాసము వసంతఋతువు. పిమ్మట 2 మాసములకు ఉత్తరగమనముచేసిన సూర్యుడు దక్షిణ గమనమారంభించును. ఇదియే దక్షిణాయనము. దక్షిణగమనమారంభమగుటయే దక్షిణాయనమగుట. ఈ దక్షిణాయ నారంభమునకు పూర్వము 2 మాసములు ఎండలు తీవ్రముగ నుండును.కావున నీకాలము గ్రీష్మఋతువు.దక్షిణాయన ప్రారంభము నుండి వర్షము లారంభించును. కావున దక్షిణాయన ప్రారంభము నుండి 2 నెలలు వర్షఋతువు. దక్షిణాయనారంభమునుండి 3 నెల లకు సూర్యుడు శరద్విషువత్తుకు వచ్చును. శరద్విషువద్దినమునకు పూర్వమొక మాసమున్ను,అనంతర మొకమాసమున్ను శరదృతువు.

ఇట్లు సూర్యగమనముచే నేర్పడిన వగుటచే ఋతువులు అయనములు, సౌరములు. అనగా సూర్యునిబట్టి గలిగినవి. సౌర ములు 2 విధములు. ఆ విషయము ముందు వివరింపబడును. సౌరములైన ఋతువులు చాంద్రములుగ వ్యవహారము జరుగు చున్నది. ఈ విషయము తెలియచేయబడుచున్నది. దీనినిగూర్చి ఇది వరలో కొంత సూచింపబడినది. మాఘమాసం మొదట ఉత్తరా యణమైనచో వసంత విషువత్తు వైశాఖప్రారంభంలో కాగలదు. అట్లైన దానికి పూర్వమాసము చైత్రము.తర్వాతమాసము వైశాఖము వసంతఋతువు అగుచున్నది. కావున మాఘఫాల్గునములు శిశిర ఋతువు. చైత్రవైశాఖములు వసంతఋతువు. ఇట్లు రెండేసి మాసములొక ఋతువుగా నేర్పరచిరి.

ఋతువు అనగా పుష్పోత్పత్తి, ఫలోత్పత్తి మొదలగు అసాధారణచిహ్నముల నొందు కాలవిశేషము. ఇవి సూర్యగమన ముచే గలుగుచున్నవైనను చంద్రకిరణప్రసారముగూడ దోహద మై అభివృద్ధికారణమగుటచే చాంద్రమాసములబట్టి ఋతు విభాగముచేయబడినది. చైత్రాది మాసములు చంద్రునిబట్టి గలుగు చున్నవి. అమావాస్యాంతమునుండి తిరుగ నమావాస్యాంతమువరకు నగుకాలము చాంద్రమాసము. రవిచంద్రుల కలయికదినము అమా వాస్య. ఇది ఏర్పడుటకు చంద్రగతి విశేషప్రధానమైన దగుటచే చాంద్రముగ చెప్పబడినది. చైత్రము, వైశాఖము మొదలగు మాస నామములు పూర్ణిమనాటి చంద్రనక్షత్రసంబంధముచే గలిగినవి. చిత్రతో చంద్రుడుగలిసిన పూర్ణిమగల మాసము- చైత్రము. విశా ఖతో గలసిన మాసము- వైశాఖము. ఇట్లు జేష్ఠ. పూర్వాషాఢ శ్రవణము పూర్వాభాద్ర అశ్విని కృత్తిక మృగశిర పుష్య మాఘ ఉత్తర ఫల్గుని. ఈ నక్షత్రములతోగాని వీటికి వెనుక ముందు నక్ష త్రములతో గాని పూర్ణిమనాడు చంద్రుడు కలియుచుండుటచే క్రమ ముగ జ్యేష్ఠము, ఆషాఢము మొదలగు మాసనామములు ఏర్పడినవి.

అట్లు పూర్ణిమనాటి చంద్రనక్షత్రసంబంధముచే గలిగినను గణితముచే సూక్ష్మనిర్ణయము చంద్రునిబట్టి చేయుట నిస్సందిగ్ధము కాకుండుటచే దీనికి సంబంధించి సూర్యునిబట్టి చైత్రాదిమాస నిర్ణయము చేయబడుచున్నది. పూర్ణిమాంతమున చిత్రతో చంద్రుడు కలిసినపుడు సూర్యుడు మేషరాశియందు (అశ్వినియందు) ప్రవే శించును. కావున ఏ మాసమందు సూర్యుడు మేషరాశియందు ప్రవేశించునో ఆ మాసము చైత్రము. ఇట్లు వృషభసంక్రమణము గలది వైశాఖము. ఇట్లు క్రమముగ జ్యేష్ఠాది మాసములందు మిధు నాది రాశి సంక్రమణము లగును. సంక్రమణము లేని మాసము అధిక మాసము. రెండు సంక్రమణములు గల మాసము క్షయ మాసము. అనగా అపుడు ఒకమాసము లోపించినదనిగాని, ఆ మాస

మునకు రెండు పేర్లును గలవనిగాని గ్రహించవలెను _ ఇది మాస నిర్ణయపద్ధతి. క్షయమాస విషయమై సంస్కృత భాషలోను, తెలుగులోను నిర్ణయము వేరుగ ముద్రింపబడినది. ఇంతవరకు వ్రాయబడిన విషయమునుబట్టి చైత్రవైశాఖములు వసంతఋతువులోనివగుటచే చైత్రము వసంతఋతువులోని మొదటిమాసము అనుటయు, చైత్ర ప్రారంభము వసంతఋతు ప్రారంభమనియు స్పష్టమగుచున్నది.

సంవత్సర ప్రారంభము

సంవత్సరము పొడవునా వచ్చు 6 ఋతువులలోను మొదటిది వసంతఋతువు అని వేదములందు గలదు.

"ముఖంవా ఏతదృతూనాం
యద్వసంతః."

సంవత్సరారంభము దేశమునం దనేకవిధములుగ నున్నది. వేదములందు వేదాంగములందు పురాణములందును కొన్నిభేదములు సూచింపబడినవి. అన్నిటిలోను వసంతఋతువు మొదటిదనుట వేదమందు చెప్పబడిన దగుటచే దీనికి ప్రాముఖ్యము గలిగినది. వసంత ఋతువునందు వృక్షలతాదులు ఆకులురాల్చి చిగురించి నూతన శోభతో కాలముయొక్క నూతనత్వమును ప్రకటించును. చూతపల్లవముల దిని కోకిలలు కూయుకాలమనియు, మల్లెలు మొదలగు పుష్పజాతులు పుష్పించుననియు, సమకాలమనియు పూర్వకవులు వర్ణించిరి. నూతన శోభను కలుగచేయు ఋతువుగావుననే ప్రకృతి రామణీయకతనుబట్టి ప్రకృతిదేవతయగు దుర్గను చైత్రశుక్ల పాడ్యమినుండి 9 రోజులు పూజించుటయగు వాసంత నవరాత్రములు ఇందు ప్రతి పాదింపబడినవి. కావున, చైత్రశుక్ల పాడ్యమి సంవత్సరారంభము సంవత్సరాది_యుగాది_ఉగాది అని వ్యవహారము ప్రసిద్ధమైయున్నది.

మీ నాతంమున కలసిన రవిచంద్రులు, తిరుగ మీ నాంతమందు ఈ సంవత్సరాదికి పూర్వమే కలియుదురు. కావున నిది యుగాది. ఒకే నక్షత్రమునుండి బయలుదేరిన రవిచంద్రులు, తిరుగ ఆ నక్షత్ర ప్రదేశమందే కలియుటకు మధ్యమ మానముచే 5 సంవత్సరము లగుచుండుటంబట్టి, 5 సంవత్సరములు యుగమని వేదాంగ జ్యోతిషమందును, వేదమందును గలదు.ఆ రవిచంద్రులు గురుశనులు ఒక నక్షత్రముందు గలసి తిరుగ, ఆ నక్షత్రమందే కలియుటకు 60 సంవత్సరములగును. కావున 60 సంవవత్సరములు ఏర్పరుపబడినవి. రవిచంద్రులు ఒకే నక్షత్రమున కలియుటకు 5 సంవత్సరములు. అవి 1. సంవత్సరము. 2. పరివత్సరము. 3. ఇదావత్సరము. 4. అనువతర్సము. 5. ఇద్వత్సరము. గురుడు అశ్విన్యారంభమునుండి బయలుదేరి తిరుగ అశ్విన్యారంభమునకు వచ్చుటకు 12 సంవత్సరములు. ఇట్లు శని రాశిచక్రమును చుట్టివచ్చుటకు 30 సంవత్సరములును అగుచున్నవి. కావున_

5, 12, 30, వీటిచే భాగింపబడు చిన్నసంఖ్య 60.

యుగ శబ్దమునకు మరియొక అర్థమున్ను గలదు.

ఇన్నవజన్మము అని గాని, ఇన్నవ తరము అని గాని అనుటకు ధర్మశాస్త్రములందు ఇన్నవ యుగమని యుగశబ్దమును వాడిరి. దీనింబట్టి సస్యములు తిరిగి ఉత్పత్తియగు కాలమగుటచే సంవత్సరమును యుగమనిరని చెప్పవచ్చును.

సంవత్సర ప్రారంభమున ఆనందముతో నున్న ఆ సంవత్సరమంతయు ఆనందముతో నుండుననుట ప్రసిద్ధవిషయము. ప్రతిదినమును ఉదయమున సంతోషముతో మేల్కొనిన ఆ దినమంతయు సంతోషముతో నడచుననియే గదా! మేల్కొను సమయమున సంతోష వాక్యములు వినుట, ప్రియమైన వస్తువులు చూచుటయు గలుగుచున్నది.

సంవత్సర పరిపాలనము

మనకు కనుపించు గ్రహములు 7 గావున, ఆగ్రహముల పేర్లనుబట్టి ప్రతిదినము అధిపతులుగ వరుసగా ఆగ్రహములను నిర్ణయించిరి. అవియే వారములు. ప్రతిదినము ఆ వారాధిపతిని బట్టి ఆయాకార్యములు ఆరంభింపబడుచున్నవి. ఆదినమునకు ఆవారాధిపతి అధిపతి. సంవత్సరాదినాడు ఏవారమగునో అ వారాధిపతి ఆసంవత్సరమునకు రాజు. సంవత్సరారంభము వసంత ప్రారంభము అని మనము తెలిసికొని యుంటిమి. ఆ వసంత ప్రారంభము, సంవత్సర ప్రారంభము మేషసంక్రమణదినమని కేవల సౌరమానముచే వ్యవహరించువారు వ్యవహరించు చున్నారు. అట్లు వంగదేశ మందును, తమిళదేశమందును వ్యవహారము గలదు. కావున మేషసంక్రమణదినము సంవత్సరాతుల్య మగుటచే ఆనాటి వారాధిపతి మంత్రి యగుచున్నాడు. రాజు మంత్రి పరిపాలనము ఇవి గలిగిన సేన, సేనాధిపతియు గావలెను. సేనాధిపతి పరాక్రమవంతుడు గావలెను. రాసులలో పరాక్రమముగలది నామముచే సింహము. కావున సింహసంక్రమణ వారాధిపతి సేనాధిపతి. అదియుగాక సంవత్సరమున కంతకు అన్ని పంటలకు ఆధారము వర్షములు. అవి కర్కాట మాసమునకు ముందే ఆరంభించినను, ఆ వర్షము నిచ్చు మేఘముల పరాక్రమము సింహమాస మందే యగుటయు ఇందులకు కారణ మనవగియున్నది. కర్కాట సంక్రమణ వారాధిపతి సస్యాధి పతి. వర్షప్రారంభము కర్కాట మాసమునకు ముందే యగుచుండెడిది. కర్కాట సంక్రమణముగల మాసమే ఆషాఢ మాసము. ఇది వర్షప్రారంభమై సస్యోత్పత్తిమాస మగుటచేతనే ఈ మాసమందలి శుక్లైకాదశి తొలిఏకాదశి యని చెప్పబడుచున్నది. కావున కర్కాట సంక్రమణ వారాధిపతి సస్యాధిపతి. ధనుస్సంక్రమణ వారాధిపతి ధాన్యాధిపతి. ధాన్యపుపంట ఈ మాసమందగుటచే నిట్లు ఏర్పరుపబడెను. ధనుర్మాసమున పండిన పంటలు, 6 మాసములకు వచ్చు మిధునమాసమున ధరగలవియగును. ఏసస్యమైనను పండిన 6 మాసములకు ధరగలదియగునని పూర్వసంప్రదాయము. కావున మిధున సంక్రమణ వారాధిపతి అర్ఘాధిపతి. "ఆర్ద్రాయాం మేఘోత్పత్తిః" అని పూర్వసంప్రదాయము. కావున ఆర్ద్రకార్తి ప్రవేశ వారాధిపతి మేఘాధిపతి. సామాన్యముగ పశువులు సంతానము గలవియగుట ఆశ్వయుజములో నధికము. అది తులామాసము. మరియు రసవస్తువులగు మిర్చి

మొదలగువాటి ఉత్పత్తి ఇందు అధికము కావున తులా సంక్రమణ వారాధిపతి రసాధిపతి వర్షములు పూర్తిగ తగ్గిన పిమ్మటనే లోహాదులను గనులనుండి తీయుట రత్నములను సేకరించుట మొదలగు నీరసవస్తు సంపాదనాదికము అభివృద్ధియగును గావున మకర సంక్రమణ వారాధిపతి నీరసాధిపతి ఇట్లుగనే ఇతరవస్తు నాయకాదులను గ్రహింపవచ్చును ప్రభవాది సంవత్సర నామములు వాటి వాటి ఫలములబట్టి యేర్పడినవని గ్రహింపవచ్చును సంవత్సర ఫలము గురుశనుల స్థితినిబట్టి చెప్పబడినది ఈ కీలక సంవత్సరమున గురుడు సింహమందును, శని మీనమందును మధ్యమ మానముచే నుండుసను కొందము సింహమందు గురుడుండ వర్షములు బాగుగ గురియును యుద్ధములు గలుగును సజ్జనులకు బ్రాహ్మణులకు ధనహాని అని ఫలము మీనమందు శనియుండ దుర్భిక్షము, యుద్ధభయము, చోరభయము, రోగబాధలు ఫలము ఈ రెండిటి సమ్మేళనచే మధ్యవృష్టి వ్యాధులు శత్రుభయము ఈతిబాధలు ప్రజలలో సంక్షోభము గలుగునని సంవత్సర ఫలము సింహరాశియందున్న ఆఫలమెట్లు గలిగెననగా గురునకు మూల త్రికోణరాశియగు ధనుస్సునుండి భాగ్యమందుండుటచే సువృష్టి, బ్రాహ్మణులకు సత్పురుషులకు కారకుడగు గురుడు రవిక్షేత్రమందుండుట వారలకు హాని, యుద్ధభీతి ఇట్లు గ్రహింపదగియున్నది అట్లే శనికిని గ్రహింపవలెను ఇట్లు అన్నిటికిని వివరింప వచ్చును గాని అదియొక పెద్ద గ్రంధమగును గాన విరమింపబడు చున్నది

మరియొకవిషయము —ఆయా సౌరమాసములం దగునట్లు వ్రాయబడిన వర్షములు, పుష్పఫలాదుల ఉత్పత్తి, గ్రీష్మము మొదలగునవి 1–2 మాసముల వ్యత్యాసములో గలుగుచున్నవి మామిడిచెట్లు చిగురించుట, కోకిలలు కూయుట వసంత ఋతువునందు గలుగునని పూర్వకవుల వర్ణనములు గలవు వారు చైత్ర వైశాఖములందే వర్ణించిరని గ్రహింప వలెను అదిసహజమే ఇప్పటి కవులును, చైత్ర వైశాఖములందే కోకిలలు కూయుచున్నట్లు పద్యముల రచించుచున్నారు ఇది లోకస్థితి నెరుంగని వ్రాత పూర్వకాలమందు చైత్ర వైశాఖములందే వసంత లక్షణములు గలిగెడివి ఇపుడు మాఘ మాసమునందే మామిడి చెట్లు చిగురించుచున్నవి ఇట్లు ఋతులక్షణము లన్నియు తారుమారైనవి చైత్రమాసారంభమునకు వేపచెట్లు కాయలు కాయుచున్నవి వేపపూవు దుర్లభమగుచున్నది దీనికి సౌరమాసములు జరుగుటయే కారణము ఇదివరలో సౌరమాసములు రెండు విధములని వ్రాయబడెను అశ్విని ప్రారంభం నుండి బయలుదేరిన సూర్యుడు తిరిగి అశ్వినీ ప్రారంభమునకు వచ్చుట, సౌర సంవత్సరము ఇది నాక్షత్ర సౌరవర్షము, లేక నిరయన సౌర వర్షము అని చెప్పబడుచున్నది ఈ సంవత్సరము పూర్తియగుటకు దినములు 365 గం 6 ని 9 7/ స్వల్పలోపముగ నిపుడగుచున్నవి పూర్వ సిద్ధాంతములందు ఈ నాక్షత్ర సౌరవర్ష ప్రమాణము ది 365 గం 6 ని 3½ (రమారమి) అని చెప్పబడినది మేష సంక్రమణము వృషభ సంక్రమణము ఇత్యాది రాశి సంక్రమణములు ఈ నిరయన సౌరవర్షమునకు సంబంధించినవి ఈ నిరయన సౌర సంక్రమణములబట్టియే చైత్ర వైశాఖాది మాసములు ఏర్పడు చున్నవి

సూర్యుడు దక్షిణము నుండి ఉత్తరమునకు బోవుచు మధ్యకాలములో విషువవృత్తమునకు వచ్చుచున్నాడు. అనగా క్రాంతి వృత్తవిషువవృత్తములు గలసిన బిందువుకు చేరుచున్నాడు ఈ బిందువు వసంత విషువద్బిందువని చెప్పబడుచున్నది అట్లు ఉత్తరపు కొననుండి దక్షిణమునకు బోవుచు విషువవృత్తముతో గలియు బిందువునకు వచ్చుచున్నాడు ఆ బిందువు శరద్విషువత్తు. వసంత విషువద్బిందువు నుండి బయలుదేరిన సూర్యుడు, తిరుగ వసంతవిషువద్బిందువును చేరుటకు పట్టు కాలము సాయన సౌర సంవత్సరము ఈ సాయన సౌరసంవత్సర ప్రమాణము దినములు 365 గం 5 ని 48.76 అగుచున్నది దీనిని బట్టియే ఋతువులేర్పడుచున్నవి కావున దీనిని ఆర్తవసంవత్సరమని యందురు మరియు ఆ వసంతవిషువద్బిందువును వసంతసంపాతమనియు శరద్విషువద్బిందువును శరత్సంపాతమనియు వ్యవహరించుచున్నారు కావున నీ సాయన సౌరసంవత్సరమును సాంపాతిక సౌర సంవత్సరమనియు చెప్పెదరు సూర్యుడు వసంత సంపాతమునకు వచ్చుట సాయనమేషసంక్రాంతి ఇది మేషాయనమని వ్రాయబడుచున్నది ఇట్లు సంపాతమునుండియగు రాశి విభాగముచేనగు రాసులు సాయనరాసులు సూర్యుని సాయనరాశి ప్రవేశములు మేషాయనము, వృషభాయనము ఇత్యాదిగవ్యవహరింపబడుచున్నవి

మీనాయనము మేషసంక్రమణము ఇంచుమించుగ నొకమారగుకాలములో చైత్ర వైశాఖములు వసంతర్తువు ఇత్యాది ఋతువిభాగము ఏర్పడినది మీన మేషమాసములుగాని, మేష వృషభమాసములుగాని వసంత ఋతువు అని బోధాయన మహర్షి వ్రాసెను దీనికి వ్యాఖ్యాతలు మన ఇష్టప్రకారము మీన మేష మాసములుగాని, మేష వృషభమాసములుగాని వసంత ఋతువని వ్యవహరించవచ్చునని అభిప్రాయపడి యున్నారు సాయన పద్ధతిచే మీన మేషమాసములు, నిరయనపద్ధతిచే మేషవృషభమాసములగు కాలమది కావున సాయన మీన మేషమాసములుగాని, నిరయన మేషవృషభమాసములుగాని వసంత ఋతువు అగునని వారు చెప్పిరని గ్రహింపవలెను చైత్ర వైశాఖములు నిరయన మేష వృషభములకు సంబంధించినవగుటచే చైత్రవైశాఖములు వసంతమను వ్యవహారము దృఢమయ్యెను వేదములందు మధుమాధవాది నామములు మాసములకు పేరుగ వ్యవహరింపబడినవి ఈ మధు మాధవాది శబ్దములు కాలమునుబట్టి గలుగు ప్రకృతి లక్షణములనే బోధించును దానిని బట్టి మీనాయనముగల మాసము మధుమాసము మేషాయనముగల మాసము మాధవమాసము ఇట్టి వ్యవహారమే పూర్వముండెడిదని తెలియుచున్నది ఆ మీనాయనము (ఫిబ్రవరి 18) సాయికముగ నిపుడు మాఘమందు వచ్చును మేషాయనమునకును మేష సంక్రాంతికిని ఇంచుమించుగ 23½ రోజులు దూరము గలుగుచున్నది మీనాయనము మేష సంక్రమణము దగ్గరగనగు కాలమున చైత్రమాసము మధు మాసము ఒక్కటిగనయ్యెను దానివలన మధు చైత్ర శబ్దములు

(తరువాయి 30వ పుటలో)

నాడూ-నేడూ

ఆంధ్రప్రదేశ్‌లో సహకార రంగం

సి. వి. హెచ్. రావు

గత కొద్ది సంవత్సరాలలోనూ ఆంధ్రప్రదేశ్‌లో సహకారోద్యమం బహుధా విస్తరించింది అయితే ఈ విస్తరణ అన్ని సందర్భాలలోనూ సామర్ధ్యంతో ముడిపడి జరగలేదు గ్రామీణ ప్రాంతాలలో తక్కువ వడ్డీకి ఋణసౌకర్యాన్ని కల్పించవలసిన అవసరం ఏర్పడడంతో, సహకార ఋణసౌకర్యాలను, తదితర కార్యక్రమాలను అధిక సంఖ్యాకులకు వర్తింపజేయవలసిన అవసరం ఏర్పడింది అందువల్ల యీ ఉద్యమం సహజంగానే అధిక సంఖ్యాకుల్ని, అధిక వర్గాలను తన పరిధిలోకి తీసుకొని వచ్చింది సహకార సూత్రాన్ని యించుమించు అంతటా నేడు అంగీకరిస్తున్నారు అయితే వున్నలోపమంతా ఈ సూత్రం లక్ష్యాలను అన్ని సందర్భాల్లో కార్యాచరణలో పెట్టలేక పోవటమే

సహకారోద్యమం ఎంతగా విస్తరించిందంటే యీనాడు మన రాష్ట్రంలోని గ్రామాల్లో 90 56 శాతం గ్రామాలకు యీ వుద్యమం పరివ్యాప్తమైవుంది నూటికి యాభై ఒక్క మంది గ్రామీణ జనాభాకు సహకార రంగం వర్తిస్తూవుంది ఈనాడు సుమారుగా 26 లక్షల మంది గ్రామీణులు సహకార సంఘాలలో సభ్యులుగా వున్నారు 1951-52 లో 3 1 శాతం వ్యవసాయ దారులకు సహకార పరపతి సౌకర్యం కల్పించబడగా 1965-66 లో 14 శాతం వ్యవసాయ దారులకు యీ సౌకర్యం కల్పించబడింది దీనిని 1970-71 నాటికి 28 శాతానికి పెంచాలని ఉద్దేశిస్తున్నారు సహకార సంఘాలు పంపిణీ చేసే తక్కువ వ్యవధి ఋణాలు, మధ్యకాలిక ఋణాల మొత్తాలు క్రమక్రమంగా ఎక్కువ అవుతున్నాయి 1967-68 లో ఈ విధంగా పంపిణీ అయిన సొమ్ము రూ 28 కోట్లు వుంది 1970-71 నాటికి ఈ సౌకర్యాన్ని నూటికి నూరు పాళ్ళు గ్రామాలకు వర్తింపజేయాలని, గ్రామీణ జనాభాలో 60 శాతానికి యిది వర్తించే విధంగా వుండాలని లక్ష్యంగా పెట్టుకున్నారు 1970-71 నాటికి మన వ్యవసాయ దారులకు కావలసిన ఋణాల మొత్తం రూ 250 కోట్లు వుండగలదని అంచనా వేస్తున్నారు దీనివల్ల, సహకార పరపతి సౌకర్యానికి సంబంధించిన కార్యక్రమాలను బాగా విస్తృత పరచాలన్న విషయం స్పష్టపడుతోంది పైగా పెద్ద మొత్తాలలో ఋణాల అవసరంకూడా క్రమక్రమంగా పెరుగుతోంది సరిగానూ, సమర్ధవంతంగానూ పనిచేయని సహకార సంఘాలను అంచెలంచెలుగా పునశ్శక్తిమయంగా, సమర్ధవంతంగా చేయడానికి గతకొన్నేళ్ళుగా ఒక విస్తరణ కార్యక్రమం చేపట్టబడి అమలుపరచబడుతోంది

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగు, వాటి ప్రోసెసింగు, నిత్యావసర వస్తువుల పంపిణీ, ఋణకల్పన, పారిశ్రామిక సహకార సంఘాలు, సహకార చక్కెర మిల్లులు మొదలైన రంగాలలో సహకారోద్యమం బాగా విస్తరించింది సహకార సంఘాలు ఋణాల పంపిణీ విషయంలో అనుసరిస్తున్న దృక్పథంలో కూడా మార్పువచ్చింది ఋణగ్రహీత ఆస్తులను, వనరులను బట్టిగాక ఋణావసరాన్ని, ఋణం దేనికై కోరబడుతున్నదో, ఏపనికై వుపయోగింపబడనున్నదో ఆ విషయాలన్నిటినీ ఈనాడు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతున్నది

ఋణాల పంపిణీ ఋణగ్రహీత స్థితి మీద ఆధారపడక ఉత్పత్తి శక్తి మీద, వినియోగ విధానం మీదా ఆధారపడి జరగడంతో ప్రజల నిధులనుండి ప్రజల సంస్థల ద్వారా కల్పించ బడిన ఋణాలను, అవి మంజూరుచేయబడిన పనులకుగాక యితర వాటికి దుర్వ్యయం చేయకుండా చూడడానికి వీలు కలుగుతుంది ఋణగ్రహీతలు తీసుకున్న ఋణాలను తిరిగి చెల్లించడంలో గాని, బకాయీలను చెల్లించడంలో గానీ ఏవిధమైన లోపానికీ తావులేకుండా చూడడానికి వీలు కలుగుతుంది వ్యవసాయ ఋణాల పంపిణీలో 'క్రెడిట్ పాస్‌బుక్' పద్ధతిని ప్రవేశ పెట్టడం వలన ఋణగ్రహీత ఎప్పుడు ఎంత తీసుకున్నదీ, ఎంత యిస్తున్నదీ మొదలైన వివరాలను ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలుసుకో గలిగే వీలు ఏర్పడింది ఈ పాస్‌బుక్ పద్ధతి పథకంలోని ప్రయోజనాలను గూర్చి వ్యవసాయ దారులకు బాగా తెలియ జెప్పడానికి యింకా ఎక్కువ కృషి చేయవల్సిన అవసరం వుంది

సహకారోద్యమం ద్వారా వ్యవసాయ దారులకు సహాయపడే ప్రత్యేక కార్యక్రమం ఒకటి ఆంధ్రప్రదేశ్‌లో అమలుపరచబడుతున్నది అదే-రాష్ట్రంలోని సేద్యపు నీటి ప్రాజెక్టుల క్రింద ఆయకట్టుల అభివృద్ధికి రాష్ట్ర భూమి అభివృద్ధి బ్యాంకు ద్వారా దీర్ఘ కాలిక ఋణ సౌకర్యాన్ని కలిపించే కార్యక్రమం ఈ కార్యక్రమానికి సంబంధించిన పథకాలన్నిటిలోకీ అధిక వ్యయంతో కూడినదీ, అత్యంత ప్రాముఖ్యమైనదీ నాగార్జునసాగర్

ఆయకట్టు అభివృద్ధి పథకం. ఇకపోతే మిగిలిన వాటిలో ముఖ్యమైనవి కడప–కర్నూలు కాలువ, కడెం, తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టు అభివృద్ధి పథకాలు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రిందఆయకట్టు అభివృద్ధికి సంబంధించిన 1.16 లక్షల ఆయకట్టును అభివృద్ధి పరిచేందుకు రూ. 4.57 కోట్ల మేరకు దీర్ఘకాలిక ఋణాల పంపిణీ అప్పుడే పూర్తయ్యింది. ఆయకట్టు అభివృద్ధికై ఋణాలను గూర్చి, ఆయకట్టు దార్లనుంచి దరఖాస్తులు అందుతున్నాయి. అందువల్ల ఈ దరఖాస్తుల్ని కూడా పరిశీలించి ఋణాల పంపిణీచేస్తే మొత్తం యీ ఆయకట్టు అభివృద్ధికి అవసరమైన సహాయాన్నంతటినీ అందించినట్లు కాగలదు. త్వరలోనే యీ పని పూర్తవుతుందని భావిస్తున్నారు. కడెం ప్రాజెక్టు క్రింద 0.22 లక్షల ఎకరాలకు వర్తించే విధంగా రూ. 65.21 లక్షల ఋణాలను పంపిణీ చేయడం జరిగింది. కడప–కర్నూలు కాలువ క్రింద 0.43 లక్షల ఎకరాలకు వర్తించే ఆయకట్టు అభివృద్ధికి రూ. 138.24 లక్షల్నీ, తుంగభద్ర ఎగువకాలువ అభివృద్ధి తొలిదశ క్రింద రూ. 0.50 లక్షల్నీ, రెండవదశ క్రింద రూ. 0.48 లక్షల్నీ పంపిణీ చేయడం జరిగింది.

ఆయకట్టు అభివృద్ధి

నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేద్యపు నీటివసతి కల్పించబడిన 6.50 లక్షల ఎకరాలలోను 0.4 లక్షల ఎకరాలను 1967_68 లో సాగునీటి వసతితో పండించే పంటల్ని వేయడానికి వీలుగా పూర్తిగా అభివృద్ధి పరచడం జరిగింది. వ్యవసాయ రీఫైనాన్స్ కార్పొరేషన్ కల్పిస్తున్న సౌకర్యాలవల్ల భూమి అభివృద్ధి బ్యాంకు యీఆయకట్టు దార్లందరికీ ఆర్థిక సౌకర్యాన్ని అందజేస్తోంది. తగిన యంత్రాంగం, పరికరాలు లేక భూమిని సేద్య యోగ్యం చేసే కార్యక్రమం యిటీవలికాలం వరకు శీఘ్రంగా అభివృద్ధి చెందింది కాదుగాని యిటీవలే యిది శీఘ్రగమనాన్ని పుంజుకుంది. సహకార శాఖామంత్రి శ్రీ విజయభాస్కరరెడ్డి చెప్పినట్టు మన దేశంలోని ప్రాజెక్టుల చరిత్రను గాని, ప్రపంచంలోని ఏ ప్రాజెక్టు చరిత్రను గాని పరిశీలిస్తే; నీటిని విడుదల చేసిన తొలిసంవత్సరమే 65 శాతం ఆయకట్టును అభివృద్ధి చేయడం ఎక్కడా కనిపించదు_ఒక్క నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో తప్ప. సహకార బ్యాంకులు కూడా సేద్యపు నీటి అభివృద్ధి పథకాలను చేపట్టి యీ రంగంలో ప్రముఖమైన కృషి చేస్తున్నాయి. కృష్ణాజిల్లాలో రూ. 37 లక్షల వ్యయంతో పంపుసెట్ల ఏర్పాటు, బావుల త్రవ్వకానికి సంబంధించిన మూడు సేద్యపు నీటి అభివృద్ధి పథకాలను చేపట్టడం జరిగింది.

సాంద్రవ్యవసాయ కార్యక్రమం

పశ్చిమ గోదావరి జిల్లాలోని సాంద్ర వ్యవసాయ కార్యక్రమం, రాష్ట్రంలోని అనేకసమితి బ్లాకుల్లోని సవరించబడిన సాంద్ర వ్యవసాయ కార్యక్రమాలు కూడా సహకార నిధులనుండి విశేషమైన సహాయం పొందుతున్నాయి. తీవ్రతర జిల్లావ్యవసాయ కార్యక్రమాలు ఆచరణలోనికి వచ్చినప్పటి నుంచి, అక్కడి రైతులకు ఋణ సౌకర్యాన్ని కల్పించడానికి వీలుగా, ఆ ప్రాంతాలలోని సహకార బేంకులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రిజర్వుబేంక్ ప్రత్యేక ఏర్పాట్లుకూడా చేసింది. 1967 లో ఖరీఫ్ పంట కాలంలో పశ్చిమ గోదావరి జిల్లాలో సాంద్ర వ్యవసాయ కార్యక్రమం అమలు జరుపబడుతున్న ప్రాంతాలలో రూ. 190.47 లక్షలను పంపిణీ చేయడం జరిగింది. 1966_67 లో యిలా పంపిణీ చేసిన మొత్తం రూ. 172.55 లక్షలు వుంది. అధిక దిగుబడినిచ్చే రకాలను పండించడానికి వీలుగా ఋణ సహాయాన్ని సాధ్యమైనంత ఎక్కువ చేయడం జరిగింది. ఇంతవరకు ఒక సభ్యునికి యిస్తున్న గరిష్ఠఋణ మొత్తం రూ. 4,000 లు వుండగా దీనిని రూ. 10,000 కు పెంచారు. హామీకత్తు ఋణాన్ని రూ. 500 నుంచి 750 కు పెంచారు.

తీవ్రతర వ్యవసాయ కార్యక్రమం అమలు జరుగుతున్న ప్రాంతాలలో ఋణాలను యిచ్చే సంస్థలకు, సహకార మార్కెటింగు సంస్థలకు మధ్య చక్కటి సమన్వయం వున్నది. మార్కెటింగును ఋణాలతో ముడివేయడం ఈనాడు సహకార పరపతి విస్తరణ విధానంలోని మూలసూత్రం. ప్రతి జిల్లాలోను మార్కెటింగు సంఘాలను నెలకొల్పడంతో ఈ రెంటిని జతపరచే పద్ధతి రాష్ట్రమంతటా శక్తివంతంగా ఆచరణలోకి వచ్చింది. తీవ్రతర వ్యవసాయ కార్యక్రమం అమలులోవున్న ప్రాంతాలలో మరింత ఎక్కువగా యిది ఆచరించ బడుతోంది. అందువల్ల ఉత్పత్తి దారునికి చక్కటి ధర పలకడమేగాక, వారినుండి సకాలంలో తక్కువ వ్యవధి ఋణాలను తిరిగి వసూలు చేసుకోవడానికి కూడా మంచి అవకాశం ఏర్పడుతోంది. సహకారమార్కెటింగ్ కార్యక్రమంలో ఒకభాగంగా, సభ్యుల ఉత్పత్తులను నిలువ చేసుకోవడానికి వీలయిన వసతులను కల్పిస్తూ అనేక గిడ్డంగులను నిర్మించడం జరిగింది. సభ్యులుకూడా వీటిని ఉపయోగించు కుంటున్నారు. 1964_65 లో గిడ్డంగుల సంఖ్య 37 వుండగా 1967_68 లో 146 కు పెరిగింది. 21 గిడ్డంగులు నిర్మాణంలో వున్నాయి.

సవరించబడిన ప్యాకేజి కార్యక్రమం అమలు జరిగే ప్రాంతంలో వ్యవసాయదార్లకు ఋణాలు యివ్వడం, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు మొదలైనవి పంపిణీ చేయడం విషయాలలో సహకార సంస్థలు ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నాయి. ఋణాలకు సంబంధించి, వ్యవసాయ దారులకు పైర్లపై ఋణాలు యిచ్చే పద్ధతిన ఋణాలు లభింప జేస్తున్నారు. 1967_68 ఖరీఫ్ కాలంలో యీపథకం క్రింద రు. 6.37 కోట్లు ఋణాలుగా మంజూరు చేయడం జరిగింది. గుంటూరు, నల్లగొండ జిల్లాలలో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతాలకు పైర్లపై ఋణాలు యిచ్చే పద్ధతిని విస్తరింప జేయడంతో పాటు ఋణాల ప్యాస్‌బుక్ పద్ధతిని కూడ వర్తింప జేయడం సముచితంగా ఉంటుంది.

సహకార సేద్యం

ఆంధ్ర ప్రదేశ్‌లో సహకార ఉద్యమం, సహకార సేద్య పథకం అమలు జరపడంద్వారా వ్యవసాయ ఉత్పత్తులను అధికం

చేయడంలోను, గ్రామీణ నిరుద్యోగ సమస్యను కొంత వరకు పరిష్కరించడంలోనూ ప్రత్యేకమైన పాత్ర నిర్వహించ గలుగుతుంది. ఆర్థికంగా లాభ సాటిగాని భూకమతాలుగల రైతులు ఎక్కువగా ఉన్న మన వంటి రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో సేద్యపు విధానాలను అనుసరించడానికి సహకార సేద్యం ప్రతిష్ఠమైన సాధనగా ఉపయోగ పడుతుంది. సహకార సేద్యం ప్రాతిపదికపై ప్రభుత్వానికి చెందిన బంజరు భూములను సాగులోకి తేవచ్చు. భూమిలేని వ్యవసాయ కార్మికులతో సహకార సేద్య సంఘాలను ఏర్పాటుచేసి వారికి వృథాగా ఉన్న యీ భూములను యివ్వవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో మూడవ పంచ వర్ష ప్రణాళిక కాలంలో మాత్రమే సహకార సేద్యం విధానాన్ని కొంత వరకు అమలు జరిపారు. అయితే యితర రాష్ట్రాలలో మాదిరిగానే యిక్కడ కూడ యీ రంగంలో అంతగా అభివృద్ధిని సాధించడం జరగలేదు. నాలుగవ ప్రణాళికా కాలంలో రు. 2.50 కోట్ల పెట్టుబడితో 1700 సహకార సేద్య సంఘాలను ఏర్పాటుచేసే కార్యక్రమాన్ని అమలు జరపాలని ఉద్దేశించారు. ఈ ఖర్చులో 75 శాతం మేరకు కేంద్రం భరిస్తుంది. పేరుకు 466 సహకార సేద్య సంఘాలు ఉన్నా, అందులో 52 సంఘాల పేర్లు మాత్రమే నమోదు అయ్యాయి. వాటికి కేంద్ర ప్రభుత్వం రు 7.80 లక్షల సహాయం మంజూరు చేసింది. 1967-68లో మరో రు 7.80 లక్షల గ్రాంటుతో దాదాపు 350 సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అంత మాత్రాన సత్వర అభివృద్ధిని సాధించినట్టు భావించరాదు.

తూర్పు గోదావరి జిల్లాలో 200 సంఘాలద్వారా దాదాపు 13,500 ఎకరాల బంజరు, లంక భూములలో సహకార సేద్యాన్ని అమలు జరిపే పైలెట్ పథకాన్ని ప్రారంభించారు. కృష్ణా జిల్లా దివి తాలూకాలో సహకార సేద్య రంగంలో విస్తృత ప్రాతిపదికపై మాస్టర్ ప్రణాళికకు యిటీవల ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రణాళిక క్రింద 3 సంవత్సరాల దశల వారీ కార్య క్రమంలో 4000 సహకార సేద్య సంఘాలకు దాదాపు 29000 ఎకరాల బంజరు భూమిని యివ్వడం జరుగుతుంది. సహకార సేద్యం క్రింద బ్లాకులలో భూమిలేని వ్యవసాయ కూలీలకు దాదాపు 250 ఎకరాల భూమి మంజూరుచేసి సహకార సమిష్టి సేద్య సంఘాలను ఏర్పాటుచేసే ప్రతిపాదనకూడ ఉంది. 1967లో యిటువంటి 13 సంఘాలకు భూమిని సేద్య యోగ్యంచేసే నిమిత్తం రు 3.60 లక్షలు మంజూరు చేశారు. ఈ కార్య క్రమం చురుకుగా కొనసాగుతుందని ఆశిస్తున్నారు.

సహకార స్టోర్లు

ఉత్పత్తి తగ్గుదల, ధరల పెరుగుదల సందర్భంలో అత్యవసర వస్తువుల క్రయ విక్రయాలను నిర్వహించి ధరల పెరుగుదలను అరికట్టడంలో సహకారోద్యమం ప్రయోజనాత్మకమైన పాత్ర నిర్వహిస్తుందని రుజువు అయింది. ఈ సందర్భంలో వాటి ప్రయోజనాలను గుర్తించినప్పటికీ సమస్యా పరిష్కారానికి సహకార స్టోర్లు, పంపిణీ ఏజన్సీలు ఎంత వరకు దోహదం చేస్తాయో తెలియదు. బాగా నిర్వహించ బడుతున్న కొన్ని సంస్థలు మినహా, అవినీతి, అధికార దుర్వినియోగం ఫలితంగా సహకార స్టోర్ల ఉద్యమం ఆశించిన ఫలితాలను యివ్వలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 50,000, అంతకు పైగా జనాభా గల పట్టణాలలో 26 కేంద్ర సహకార స్టోర్లను నెలకొల్పారు. దానికి తోడు, హైదరాబాదు, విశాఖపట్నాలలో రెండు డిపార్టుమెంటు స్టోర్లను ఏర్పాటుచేశారు. ప్రస్తుత పరిస్థితులలో అత్యవసర వస్తువులను సరసమైన ధరలకు అందజేస్తూ మార్కెటులో యీ వస్తువుల ధరలు పెరగకుండా అదుపుజేయడమే యీ స్టోర్ల నిర్వహణ ప్రధాన లక్ష్యం. ఈ సూపర్ బజార్లను శాశ్వత ప్రాతిపదికపై డిపార్టుమెంటల్ స్టోర్లుగా నిర్వహిస్తూ తద్వారా నేటి ప్రత్యేక్ష్య పరిస్థితులలో ధరల పెరుగుదలను నివారించగలుగుతాయి. అయితే అటువంటి స్టోర్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయడాన్ని హర్షించినప్పటికీ వాటి నిర్వహణ ఖర్చులు లాభాలపై దెబ్బతియ్యకుండా చూడాలి.

సమాజంలోని అనేక ఆర్థిక కార్యక్రమాలను సహకార వ్యవస్థ పరిధిలోకి తీసుకవచ్చే అవకాశం ఉన్నప్పటికీ యీ సంస్థల ద్వారా వివిధ రంగాలలో లభిస్తున్న లాభాలు, ప్రయోజనాలను పలుకుబడిగల వర్గాలవారే పొందగలుగుతున్నారనే అపవాదును తొలగించే విధంగా విస్తృత ప్రాతిపదికపై సభ్యులను చేర్చుకోవాలి. అంతేగాక సహకార సిద్ధాంతాలు, లక్ష్యాలను గూర్చి సభ్యులకు వివరంగా ప్రబోధించాలి. దీని ఫలితంగా వారు తమ హక్కులు, అధికారాలను తెలుసుకుని మోసానికి గురికాకుండా ఉండగలుగుతారు.

సహకార సంస్థల సభ్యులు మూల సూత్రాలను అవగాహన చేసుకుని ఆచరిస్తూ, బడుగువర్గాల ఆర్థిక అభివృద్ధిని సాధించడానికి యీ ఉద్యమాన్ని వినియోగించినప్పుడు పైన పేర్కొన్న విమర్శలను తగిన విధంగా ఎదుర్కొనగలుగుతారు. ఆర్థిక అవసరాలను గరిష్ఠ స్థాయిలో తీరుస్తూ, స్వయం సహాయం, పొదుపును పెంపొందించడానికి సహకార సంఘాలు కృషిచేయాలి.

వ్యవసాయదారులు, యితర ప్రజలందరు ప్రయోజనం పొందడానికి ఉద్దేశించిన సహకార ఉద్యమాన్ని ప్రస్తుతం, కలిగిన వారే ఎక్కువగా వినియోగించుకుని భూమి అభివృద్ధి, భూమిని సేద్య యోగ్యం చేయడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాల నిమిత్తం ఆర్థిక సహాయం పొందుతున్నట్టు కనిపిస్తున్నది. నేటి మన అభివృద్ధి పథంలో మారుతున్న నేటి ఆర్థిక సంధికాలంలో యిది బహుశ అనివార్యమైన అంశంగా పేర్కొనవచ్చు. బడుగు వర్గాల ప్రజలు తమ అవసరాలను తీర్చుకోడానికి యీ ఉద్యమం సహాయపడే విధంగా మార్పులు రావడం చాలా అవసరం.

సహకార ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ అన్నివిధాల పురోగమిస్తున్నది. యిది హర్షించదగిన విషయం. సహకార మార్కెటింగ్, ప్రాసెసింగ్, లఘు పరిశ్రమల స్థాపన, వ్యవసాయ దార్లకు పరపతి సౌకర్యాలు కల్పించడం మొదలైన విషయాలలో యీ వ్యవస్థద్వారా రాష్ట్రం సత్వరాభివృద్ధిని సాధిస్తున్నది. "భారతీయ ప్రణాళికలలో నిర్దేశించిన సాంఘిక లక్ష్యాలను సాధించే ముఖ్యమైన అంశంగా పేర్కొన్న సహకార వ్యవస్థను ఆర్థిక పరమైన కార్యక్రమాల వ్యవస్థగా నాలుగవ ప్రణాళిక ముసాయిదాలో వర్ణించారు. ●

మహాభారతము

తెన్నెగంటుల లక్ష్మీశాస్త్రి

16

సుముహూర్తమునందు వ్యాసాది మహర్షులు ధర్మరాజును రాజసూయ యాగమునందు దీక్షితుని చేసిరి అతడు బంధు మిత్ర పురోహితులతో పాటు యజ్ఞశాలలో మూర్తీభవించిన ధర్మమా యనునట్లు ఆసీనుడై ఉండెను అతిథులకు వేరు వేరుగా నివాసము లేర్పాటు చేయబడెను స్వర్గములో ఇంద్రునివలె భూమండలమునందు మహావీరుడైన ధర్మరాజు యజ్ఞమును ప్రారంభించెను

భీష్మ, ద్రోణ, దుర్యోధనాదులు, కురుదేశవాసులైన ప్రజలు రాజసూయ యాగమును, మయసభా వైభవమును చూచుటకు వచ్చిరి అనేక దేశములనుండి శిశుపాలాదులైన రాజులు వచ్చిరి వారికి అన్ని విధములైన సౌకర్యములు ఏర్పాటు చేయబడెను

ధర్మరాజు, భీష్మ ద్రోణాదులకు నమస్కరించి యజ్ఞము చేయుటకు వారి అనుజ్ఞ గైకొనెను అతిథులకు భోజన సౌకర్యముల నేర్పాటుచేయుటకు దుశ్శాసనుని, సేవా సత్కారములకొరకు సంజయుని నియమించెను ఆయా కార్యములు సక్రమముగా జరుగునట్లు పరిశీలించవలసినదని భీష్మ ద్రోణులను ప్రార్థించెను దక్షిణలనిచ్చు కార్యము కృపాచార్యులకు ఒప్పగించెను ధనమును వ్యయముచేయు పనిని విదురునకు, రాజులిచ్చు కప్పములను, కానుకలను స్వీకరించుమని దుర్యోధనునకు ఒప్పగించెను శ్రీకృష్ణుడు స్వయముగా బ్రాహ్మణులకు కాళ్ళు కడిగి పూజించుపనిని స్వీకరించెను వచ్చిన రాజులలో వేయి బంగారు నాణెములకన్న తక్కువ కానుకలిచ్చినవారు ఎవరును లేరు అందరును పోటీపడి ధనమును సమర్పించిరి ఆకాశములో దేవతలు నిలిచి యజ్ఞ వైభవమును చూచుచుండిరి యజ్ఞశాలలో ధర్మరాజు "ఆరంభణీయము, క్షత్రము, ధృతి, వ్యుష్టి ద్విరాత్రము, దశపేయము" అను ఆరు అగ్నులను స్థాపించి యజ్ఞముచేయుటకు ఆరంభించెను అతిథులందరు సంతృప్తులై సంతోషించుచుండిరి

శ్రీకృష్ణునకు అగ్రపూజ

రాజసూయ యజ్ఞ సమాప్తియందు అభిషేచనీయ కర్మ చేయుటకు ధర్మరాజు ఆరంభించెను రాజసూయ సమాప్తియందు చేయబడు నొక సోమయాగమునకు 'అభిషేచనీయము' అని పేరు దానియందు, అతిథులలో పూజనీయులను పూజించు కార్యము జరుగును నారదాది మహామునులు రాజసూయమును గూర్చి వాద వివాదములు జరుపుచుండిరి ఋషులచేత విరాజిల్లుచున్న ఆ విశాల యాగశాల, నక్షత్రములచే ప్రకాశించుచున్న ఆకాశమువలె భాసిల్లు చుండెను

వారిలో నారదుడు, పూర్వము శ్రీమన్నారాయణమూర్తి కృష్ణుడుగా అవతరించుటకు అంగీకరించుటను, ఇంద్రాది దేవతలు యాదవులుగా జనించుటను తలచుకొనుచు కూర్చొని ఉండెను అప్పుడు భీష్ముడు ధర్మరాజుతో "అతిథులుగా వచ్చిన రాజులను యథా యోగ్యముగా సన్మానముచేయుము ఆచార్యులు, ఋత్విక్కులు, బంధువులు, స్నాతకులు, ప్రియమిత్రులు, రాజులు, ఈ ఆరు వర్గములకు చెందినవారు ఇప్పుడు పూజార్హులుగా నున్నారు వీరందరిలో శ్రేష్ఠతమునకు తొలుత పూజచేయుము" అనిచెప్పెను

అదివిని యుధిష్ఠిరుడు "పితామహా! అగ్రపూజ ఎవరికి చేయవలయునో చెప్పుము" అని యడిగెను ఆ మాటకు భీష్ముడు "గ్రహ నక్షత్రములలో సూర్యువలె ఈ సభా సదులలో శ్రీకృష్ణుడు ప్రకాశించుచున్నాడు కనుక అతనినే తొలుత పూజించుము" అని ధర్మరాజుతో చెప్పెను అందుకు ధర్మరాజు అంగీకరించెను అప్పుడు ధర్మరాజాజ్ఞచేత సహదేవుడు అర్ఘ్యపాద్యాదులతో శ్రీకృష్ణుని పూజించెను

శిశుపాలవధ

శ్రీకృష్ణుని పూజించుట శిశుపాలుడు సహించక భీష్మ యుధిష్ఠిరులను నిందించి, శ్రీకృష్ణుని ఆక్షేపించుచు ఇట్లనెను

"ధర్మరాజా! ఇందరు మహాత్ములు ఇక్కడ ఉండగా కృష్ణుని ఒక మహారాజునుగాదలచి నీవు పూజించితివి అతడు ఎన్నటికిని పూజార్హుడు కాడు నీవు అజ్ఞానముచే ధర్మము నెరుగక శిశువని చేసితివి వార్ధక్యముచే మతి చెడి భీష్ముడు నీకు ఇట్లాదేశించెను నీవంటి ధర్మజ్ఞుడు స్వార్థముచే ఇట్టి అధర్మమును చేయవచ్చునా? ఇక్కడివారందరు కృష్ణుడు రాజుకాదని ఎరుగుదురు ఇతడు వృద్ధుడు అని తలచినచో ఇతనికన్న వృద్ధుడగు యాదవుడు ఇతని తండ్రి వసుదేవుడున్నాడు అతడు పూజార్హుడు కాడా? ప్రియుడని తలచినచో ఇతనికంటె మీకు ప్రియుడు ద్రుపద మహారాజు ఉన్నాడు గురువని తలచితివేని మీకు ద్రోణాచార్యులకంటె పెద్ద గురువు ఎవరు ఉన్నారు? మహా ఋత్విజుడు అని యనుకొనినచో ఇచట వ్యాస భగవానుడు అతనికన్న గొప్పవాడు ఉన్నాడు కదా? మహాత్ముడు స్వచ్ఛంద మరణముగల భీష్మునివంటి పెద్దవారిని, మహా వీరుడైన అశ్వత్థామను, రాజాధి రాజైన దుర్యోధనుని, ఆచార్యుడైన కృపుని, భీష్మ రుక్మి, శల్య, కర్ణాదులగు వీరులను విడిచి, పై గుణములేవియును లేని కృష్ణునకు ఎందుకు పూజ సలిపితివి? ఈ రాజుల నందఱిని అవమానపఱచితివి" అని చెప్పెను

శిశుపాలుడు అచ్చటి రాజుల నందఱిని ఉద్దేశించి "యుధిష్ఠిరుడు ధర్మజ్ఞుడని మీరందరు ఇతనికి కప్పములను చెల్లించి సార్వభౌముని చేసితిరి కాని, ఈ మహాసభలో నితడు మీ యందఱిని అవమానపఱచెను జరాసంధునితో ఓడిన కృష్ణుని మహాత్ముడని ధర్మరాజు పూజించెను ఇతడు తన అజ్ఞానమును ప్రకటించుకొనెను మీరందఱు ఇచట ఉండగా కృష్ణుడు ఈ అగ్రపూజను ఎట్లు స్వీకరించెను అంధునకు అద్దము చూపుటవలె, మీరుండగా యుధిష్ఠిరుడు ఈతనికి పూజచేసెను" అని చెప్పి ఆ రాజుల నందరిని లేవదీసుకొని సభనుండి పోవుటకు బయలుదేఱెను

అప్పుడు యుధిష్ఠిరుడు పరుగెత్తుచు శిశుపాలుని సమీపించి అతనితో మృదు మధురముగా నిట్లనెను "రాజా! నీవు ఇట్లన కూడదు భీష్ముడు అధర్మము నుపదేశించలేదు నీకంటె వృద్ధులైన మహారాజులీ సభలో శ్రీకృష్ణునకు చేయబడిన అగ్రపూజను అంగీకరించినపుడు నీవాక్షేపించుట తగదు శ్రీకృష్ణుని మహిమ, తత్త్వము భీష్మునకు తెలిసినంతగా నీకు తెలియదు"

తరువాత భీష్ముడిట్లనెను "ధర్మరాజా! శ్రీకృష్ణుడే జగత్తులో సర్వశ్రేష్ఠుడు అతడే పరమపూజ్యుడు అట్టి కృష్ణుని యగ్రపూజకు అంగీకరించని శిశుపాలుని శాంత పరచుట ఎందులకు? అతనిని దీనముగా వేడుకొనుట నీకు తగదు శ్రీకృష్ణుడు మనకే కాక మూడు లోకములకు పూజ్యుడు కనుక ఈ సభలో ఇందఱు వయోవృద్ధులు ఉన్నను శ్రీకృష్ణుడొక్కడే పూజార్హుడు శిశుపాలా! మహనీయులందఱికిని పూజార్హుడైన కృష్ణుని మహిమను నీవేమి యెరుగుదువు? బ్రాహ్మణులలో జ్ఞాన వృద్ధుడు, క్షత్రియులలో బలాధికుడు, వైశ్యులలో ధనధాన్య సమృద్ధుడు, శూద్రులలో వయోవృద్ధుడు పూజార్హులగుదురు సర్వ సద్గుణ సంపన్నుడు, జ్ఞానవృద్ధుడు బలాధికుడునైన శ్రీకృష్ణునికన్న గొప్పవాడగు పూజ్యుడెవడున్నాడు?"

శ్రీమహావిష్ణువుయొక్క దశావతార విధమునుగూడ చెప్పి భీష్ముడు కృష్ణావతారమును గూర్చి అతి విపులముగా చెప్పి, "ఇట్టి మహా మహాత్ముడైన కృష్ణుని మహిమను మూఢుడైన శిశుపాలుడెట్లు గ్రహించగలడు. కనుక కృష్ణుని పూజించుట సర్వ విధముల తగినది" అని చెప్పెను

భీష్ముడు ఇట్లు చెప్పిన తరువాత సహదేవుడు క్రోధావేశముతో "శ్రీకృష్ణభగవానుని పూజించుటకు వ్యతిరేకముగా మాట్లాడు వారి తలపై తన్నెదను" అని ఆ సభలో బిగ్గరగా అనెను ఆ మాటకు దేవతలు అభినందించి పుష్ప వర్షము కురిపించిరి నారదుడు సహదేవుని మిక్కిలి అభినందించెను సహదేవుని మాట కెవరును ఎదురాడలేదు కృష్ణపూజ అయిన తరువాత రాజులందరిని సహదేవుడు పూజించెను

అప్పుడు శిశుపాలుడు లేచి "క్రోధముతో కన్నుల నిప్పులు గ్రక్కుచు అక్కడనున్న రాజులతో "నేను సేనాపతిగా ఉండెదను, మీ రేల చింతించెదరు? మనమందరము కలిసి పాండవులను, యాదవులను ఎదిరింతము రండు" అని రాజుల నందరిని ప్రోత్సాహపఱచెను సునీథుడు మొదలైన రాజులు కొందఱు అతనితో సహకరించిరి వారందఱును ధర్మరాజు యొక్క పట్టాభిషేకమును, కృష్ణుని అగ్రపూజను వ్యతిరేకించవలెనని నిర్ణయించుకొనిరి

అపుడు ధర్మరాజు భయపడి భీష్మునితో "పితామహా! యజ్ఞమునకు విఘ్నము కలుగకుండ ప్రజాహితమైన కార్యమును ఉపదేశించుము ఈ రాజులందఱు యుద్ధమునకు సన్నద్ధులైనారు ఇప్పుడేమి చేయుదము" అని పలుకగా భీష్ముడు "నాయనా! నీవు భయపడకుము కుక్క సింహమును ఎదిరించగలదా? సింహము నిదురించినంతసేపు కుక్కలు మొరుగుచుండును అలాగే కృష్ణుడు శాంతుడుగానున్నందున ఈ రాజులు పదరుచున్నారు ఒక్క త్రుటిలో ఆ మహానుభావుడు వీరి నందఱను యమలోకమునకు పంపగలడు" అని చెప్పెను

భీష్ముని మాటలు విని శిశుపాలుడు భీష్మునితో "వృద్ధుడవై బుద్ధి పోగొట్టుకున్నావు నీవు అంధుడవై కౌరవులను కుమార్గములోనికి లాగుచున్నావు మూర్ఖుడైన కృష్ణుని స్తోత్రము చేయుచున్న నీ నాలుక ఏల చీలకున్నది? యాదవుని స్తుతించుచున్నావే గోవులను (వృషభాసురుని), స్త్రీలను (పూతనను) హత్యచేసినవానిని పూజించమందువే అంబ మొదలగు కన్యలను అపహరించిన నీవు కూడ ధర్మమును నేర్పుచున్నావా? నీవు నిర్వీర్యుడవై బ్రహ్మచర్యము అను వ్యాజముతో తిరుగుచున్నావు సంతతి హీనుడవై ఇహ పర సుఖములకు దూరమైన నీవు ధర్మజ్ఞుడ వెట్లగుదువు? వృద్ధుడవైనంత మాత్రముచేత నీవు గొప్పవాడవెట్లగుదువు? పూర్వము హంసవలె నీవును జ్ఞాతులచేత వధింపబడుదువు ఆ కథ చెప్పెదను వినుము" అని యిట్లు చెప్పదొడగెను

"పూర్వము సముద్ర తీరమునందు ఒక వృద్ధ హంస నివసించుచుండెను అది ధర్మములను ఉపదేశించుచుండెను కాని దాని ఆచరణము ధర్మమునకు విపరీతముగా నుండెను దాని ధర్మోపదేశములు సత్యములని తలచి సముద్రమునందున్న జల పక్షులన్నియు దానికి భోజనము తెచ్చి పెట్టుచుండెను దానిని నమ్మి దాని వద్ద తమ అండములను దాచిఉంచి ఆ పక్షులు స్వేచ్ఛగా విహరించుచుండెను. కాని పాపియగు నా హంస ఆ యండములను తినుచుండెను అట్లుండగా నొకనాడు బుద్ధిశాలియగు నొక పక్షికి హంసపై సందేహము గలిగి, అది చేయుపనిని పరిశీలించి చూచెను అన్ని పక్షులకు హంస చేయు దుష్కృత్యమును తెలిపెను పక్షులన్నియు వచ్చి ఆ కృత్యమును కనిపెట్టి అన్నియు ఏకమై హంసను చంపెను"

పై కధను చెప్పి శిశుపాలుడు "భీష్మా' నీవుగూడ ఆ హంసవంటి వాడవే కనుక ఈ రాజులందఱు ఏకమై నిన్నుగూడ చంపెదరు పూర్వము కృష్ణుడు జరాసంధునికి ఎంతయో అపకారము చేసెను నిర్వీర్యుడవై వృద్ధుడవైన నీవు ఉపదేశించు మార్గములో నడచు పాండవులకు దుర్గతి పట్టును" అని చెప్పెను

ఆ మాటలు విని భీమసేనుడు అత్యంత కోపావిష్టుడై పండ్లు పట పట కొఱుకుచు ప్రళయకాలరుద్రునివలె శిశుపాలునిపై పడెను వెంటనే భీష్ముడు త్వరగా పోయి భీముని పట్టుకొని శాంతపఱచెను ఉప్పొంగినప్పటికిని సముద్రము తటములను దాటనట్లుగా భీముడు భీష్ముని ఆజ్ఞను ఉల్లంఘించలేక పోయెను అప్పుడు శిశుపాలుడు "భీముని విడువుము, ఈ రాజులు చూచుచుండగా ఒక్క నిమేషములో నితనిని దహించి వేయుదును" అని భీష్మునితోననెను

శిశుపాలుని జన్మ వృత్తాంతము

భీష్ముడు శిశుపాలుని చరిత్రను భీమసేనునకు ఇట్లు తెలిపెను "చేది రాజైన దమఘోషునకు శిశుపాలుడు, మూడు కన్నులు నాలుగు భుజములతో జనించెను ఇతని రోదనము గార్దభ ధ్వనివలె ఘోరముగా నుండెను తల్లిదండ్రులు, బంధువులు భయపడి అతనిని విడిచిపెట్టుటకు నిశ్చయించిరి అప్పుడు ఆకాశవాణి యిట్లనెను 'రాజా' ఇతడు మహా బలశాలి నీవు భయపడకుము ఈ శిశువును కాపాడుము వీనికి మృత్యువాసన్నము కాలేదు ఇతనిని చంపువాడుమఱియొకచోట జన్మించియున్నాడు' ఆ మాటవిని శిశుపాలుని తల్లి మిక్కిలి దుఃఖితురాలై ఆకాశవాణిని ఉద్దేశించి యిట్లనెను 'మహాత్మా' నా పుత్రుని జంపువారెవరో తెలుపుము' ఆ మాటకు ఆకాశవాణి యిట్లనెను 'ఎవరి ఒడిలో ఇతడున్నప్పుడు ఇతని రెండుచేతులు రాలి క్రింద పడునో, లలాట నేత్రము అదృశ్యమగునో, వారి వలన ఇతనికి మృత్యువు సంభవించును ' అని చెప్పెను

విచిత్రాకృతితో పుట్టిన ఆ బాలుని చూచుటకు భూమండలములోని రాజులందఱు వచ్చిరి. చేది రాజు వచ్చినవారిని సత్కరించి, ప్రతి యొక్కరి ఒడిలో బాలకుని ఉంచుచు వచ్చెను ఒకనాడు కృష్ణ బలరాములు కూడ తమ మేనత్త కనిన విచిత్ర శిశువును చూచుటకు వచ్చిరి అప్పుడు ఆమె పూర్వమువలె శిశువును కృష్ణుని ఒడిలో ఉంచిన వెంటనే అతని రెండు చేతులు రాలి క్రిందపడెను మూడవ కన్నుగూడ అదృశ్యమయ్యెను అది చూచి శిశుపాలుని తల్లి భయపడి కృష్ణునితో నాయనా' ఇతని అపరాధములన్నిటిని మన్నించుము ఇదియే నేను కోరు వరము' అని యనెను ఆ మాట విని కృష్ణుడు 'అత్తా' ఇతడు నా యెడల చేయు నూరు అపరాధముల వఱకు మన్నించెదను ఆ తరువాత ఇతడు చేయు దోషములకు ఇతడు వధ్యుడగును" అని చెప్పెను

భీష్ముడు పై వృత్తాంతమును భీమసేనునకు తెలిపి "తప్పక ఇతనిని కృష్ణుడు వధించగలడు నీవు చింత చేయకుము ఇతడు కృష్ణునియొక్క అంశమై యున్నాడు ఇప్పుడు భగవంతుడు తిరిగి తన అంశమును తనలో ఆకర్షించుకొను కాలము ఆసన్నమైనది అందువలన నేడు ఇతడు పెద్దలను ధిక్కరించి వదరుచున్నాడు " అని చెప్పెను

ఆ మాట విని శిశుపాలుడు ఉద్రిక్తుడై ' భీష్మా ' పూర్వులెవరుకూడ ఆత్మనింద ఆత్మస్తుతి, పరనింద, పరస్తుతి చేయలేదు నీ వట్లు చేయుచున్నావు నీవు స్వార్థముచేత కృష్ణుని పొగడుచున్నావు బుద్ధి పోగొట్టుకున్నావు పూర్వము హిమాలయము వెనుక భూలింగము అను పేరుగల ఒక పక్షి ఉండెను అది పలుకు మాటలు, చేయు పనులు పరస్పర విరుద్ధములుగా నుండెను అందుచేత, అది నింద్యమైన పక్షిగా భావింపబడుచుండెను అది సింహము దంతములలో నున్న మాంసమునుగూడ ఊడదీసుకొని తినుచుండెను అయినను, సింహముయొక్క ఇచ్ఛచేత అది జీవించుచుండెను ఆ విధముగానే భీష్మా ! నీవుకూడ ఈ రాజుల యిచ్ఛచేత జీవించియున్నావు " అని చెప్పెను

ఆ మాట విని భీష్ముడు "ఒక్క నిమేషములో ఈ రాజులనందఱను పశువులను వలె సంహరించెదను" అని కోపముచే పలికెను అది విని వెంటనే రాజులందఱు క్రోధావిష్టులై శిశుపాలునితో భీష్మునిపై పడిరి భీష్ముడు వారిని హతమార్చుటకు కృష్ణుని ఆహ్వానించెను అప్పుడు కృష్ణుడు "రాజులారా ! మా మేనత్తకు ఇచ్చిన వరము ప్రకారము, ఇతడు చేసిన అనేక అపరాధములను నేను మన్నించితిని మేము పురమందు లేనప్పుడు ఇతడు ద్వారకను దహించెను మా తండ్రిచేయు అశ్వమేధయాగముయొక్క అశ్వము నితడు హరించెను మా యాదవ స్త్రీల నిద్దరను హరించెను ఇటివే యెన్నియో అపరాధములు చేసెను అన్నిటిని నేను మా మేనత్తను తృప్తిపఱచుటకు సహించుచు వచ్చితిని ఇప్పుడు నేను క్షమించజాలను " అని చెప్పెను

ఆ మాటలను రాజులు విని శిశుపాలుని నిందించి, అతనితో సహకరించక పోయిరి శిశుపాలుడు, కృష్ణుని అనేక విధములుగా నిందించెను భగవంతుడు సహించక సుదర్శన చక్రమును స్మరించగనే అది వచ్చెను దానిని వెంటనే శిశుపాలునిపైకి విడిచెను దాని దెబ్బచేత అతని కంఠము తెగి నేలపైపడెను అతని శరీరమునుండి తేజస్సు బయలుదేఱి కృష్ణునిలో లీన

మయ్యెను రాజులు ఋషులు అందఱు సంతోషించి కృష్ణుని స్తోత్రము చేయుచు వెడలిపోయిరి తరువాత ధర్మరాజు శిశుపాలునకు ఉత్తరక్రియలు జరిపించెను శిశుపాలుని కొడుకును చేది రాజ్యమునకు పట్టాభిషిక్తుని జేసెను.

ఈ విధముగా ధర్మరాజు యొక్క రాజసూయము నిర్విఘ్నముగా నెరవేరెను యజ్ఞ సమాప్తి వరకు కృష్ణుడు యజ్ఞ రక్షణ చేయుచుండెను రాజు లందఱు ధర్మరాజును ప్రశంసించి తమ తమ దేశములకు పోయిరి రాజులను పాండవులు వీడ్కొల్పిరి చివరకు కృష్ణుడు పాండవులనుండి, మేనత్తయగు కుంతీదేవి నుండియు సెలవుగైకొని ద్వారకా పురికి వెడలి పోవుచు యుధిష్ఠిరునితో "రాజా! జాగ్రత్తతో ప్రజాపాలనము చేయుము ప్రాణులన్నియు మేఘములను, పక్షులన్నియు మహావృక్షములను, దేవతలందఱు ఇంద్రుని ఆశ్రయించి జీవించి యుండునట్లు బంధుమిత్రులు నిన్ను ఆశ్రయించి జీవించి యుందురు" అని చెప్పి కృష్ణుడు వెడలిపోయెను

అందరు ఇంద్రప్రస్థమును విడిచి వెడలిన తరువాత గూడ దుర్యోధనుడు, శకుని మాత్రము దివ్యమైన మయసభలో నివసించుచు నింద్రప్రస్థములోనే యుండిరి

రాజసూయ యాగము ముగిసిన తరువాత శిష్యులతో పాటు వ్యాస భగవానుడు యుధిష్ఠిరుని వద్దకు పోయెను ధర్మరాజు తమ్ములతో వారి నెదుర్కొని సముచితాసనములపై కూర్చొనజేసెను వ్యాసుడు ధర్మరాజును ప్రశంసించి తాను అతనిని వీడ్కొని పోవదలచెను ధర్మరాజు వ్యాసునకు, ఋషులకు పాదాభివందనము చేసి వ్యాసుని ఇట్లు ప్రశ్నించెను "మహాత్మా! నారదుడు స్వర్గము, అంతరిక్షము, భూమండలము ఈ మూడింటికి సంబంధించిన ఉత్పాతములు (అపశకునములు) ఉన్నవని చెప్పెను శిశుపాల వధానంతరము ఆ ఉత్పాతములు శాంతించెనా?"

ఆ మాటకు వ్యాస భగవానుడు "రాజా! ఉత్పాతములయొక్క ఫలము పదమూడు సంవత్సరముల వరకు ఉండును ఇట్టి అపశకునముల వలన సమస్త క్షత్రియుల నాశనము కలుగును ఈ క్షత్రియ నాశనమునకు నీవు కారణమగుదువు! అది దుర్యోధనుని అపరాధముల కారణముగా భీమార్జునుల పరాక్రమముచేత జరుగును నీవు అపరరాత్రమునందు స్వప్నములో భగవంతుడైన శంకరుని దర్శించెదవు ఆ భగవంతుడు తాను దక్షిణ దిక్కువైపు చూచుచున్నట్లుగా నీకు దర్శనమిచ్చి నిన్ను గెలుచును నీవు చింతచేయనక్కఱ లేదు ఎంతవానికైనను కాలము నుల్లంఘించుట శక్యముగాదు నేను ఇక పోయెదను శాంతుడవై భూమండలమును పాలించుచుండుము" అని చెప్పి వ్యాసుడు శిష్యులతో కైలాస పర్వతమునకు వెడలిపోయెను

తరువాత యుధిష్ఠిరుడు వ్యాసుని మాటలను తలచుకొనుచు తమ్ములతో ఆలోచించి మిక్కిలి చింతించెను "సమస్త రాజుల మరణమునకు తనను నిమిత్తముగా దైవము విధించెను కనుక తాను మరణించెదను" అని తమ్ములతో చెప్పెను ఆమాటకు అర్జునుడు "రాజా నీవంటి బుద్ధిశాలి ఇట్టి మోహమున పడకూడదు" అనెను ఆ మాటకు యుధిష్ఠిరుడు "సోదరులారా! అందఱి వినాశము కొఱకు నేను పదమూడు సంవత్సరములు జీవించవలెను కదా! దానివలన లాభమేమి? నేటినుండి యెవరి మనసును నొప్పించక అందఱిని సంతోష పఱచుచు వారుకోరిన వస్తువుల నిచ్చుచు అందఱిని సమత్వముచే చూచుచుఎవరియందును భేద భావము లేక ప్రవర్తించ దలచితిని భేదభావమే జగడములకు మూలకారణముకదా ఇట్లు ప్రవర్తిల్లుచు ప్రపంచములో నిందకు పాత్రుడను కాకుండెదను" అని చెప్పెను ఆ మాటలు విని తమ్ములు సంతోషించి ఆయన యిష్టప్రకారమే నడచుకొనిరి

(సశేషము)

వైద్య కళాశాలలలో ప్రవేశాలు: ప్రభుత్వాధికారాలు

—(పి. శేషాద్రి)

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో సమీకృత ఎం. బి. బి.ఎస్ కోర్సులో ప్రవేశానికై అభ్యర్థుల ఎన్నిక కొరకు నిబంధనలు రూపొందిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, గృహనిర్మాణ, మునిసిపల్ పరిపాలనా శాఖ 1966 జూన్ 16 వ తేదీన 1135,1136 వ నెంబర్లు గల రెండు ఉత్తర్వులు జారీచేసింది. కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోడానికై చివరి రోజుగా ఆంధ్ర ప్రాంతంలో 25-7-1966 తేదీనీ, తెలంగాణా ప్రాంతంలో 30-7-1966 తేదీనీ నిర్ణయించారు. తరువాత గడువును 16-8-1966 వ తేదీవరకు పొడిగించారు.

ప్రభుత్వ ఉత్తర్వునూ, గడు పొడిగింపునూ సవాలు చేస్తూ శ్రీ పి. సాగర్ ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషను పెట్టుకున్నారు. ప్రదేశాలను ప్రాంతాల క్రింద విభజించడం, భారత రాజ్యాంగంలోని 15, 16, 19 సూత్రాల క్రింద హామీ యిచ్చిన ప్రాథమిక హక్కులకు భంగకరమని హైకోర్టులో వాదించడం జరిగింది.

ప్రదేశాలను ప్రాంతాల క్రింద విభజించ డానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వును సమర్థిస్తూ హైకోర్టు యీ విధంగా పేర్కొన్నది. "ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల క్రింద వర్గీకరణకు పుట్టుక ప్రాతి పదికకాదు. కేవలం నివాసం మాత్రమే దీనికి ప్రాతి పదిక. దీని దృష్ట్యా ప్రాంతాల వారీగా స్థానాలను కేటాయించడం, రాజ్యాంగంలో హామీ యిచ్చిన ప్రాథమిక హక్కులకు భంగకరం కాదు"

ఉత్తర్వుద్వారా స్థానాల కేటాయింపు

నివాసం ప్రాతి పదికగా ప్రాంతాల వారీగా స్థానాలను కేటాయించడం ప్రభుత్వ ఉత్తర్వుద్వారా గాక చట్టంద్వారా మాత్రమే జరుగ వలసి వుంటుందని కూడా హైకోర్టులో వాదించడం జరిగింది. సాంఘికంగానూ, విద్యా విషయికంగానూ వెనుకబడిన వారి అభివృద్ధికై ప్రత్యేక చర్యలు గైకొనడానికి రాజ్యాంగంలోని 15 (4) వ సూత్రం ప్రభుత్వానికి అధికారాన్ని సంక్రమింపజేస్తున్నది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య 15 (1) వ సూత్రానికి భంగకరంకాదు, "..........15 (4) వ సూత్రం క్రింద ప్రభుత్వం, ఉత్తర్వుద్వారా ప్రత్యేక చర్య తీసుకొన వచ్చు" నని హైకోర్టు అభిప్రాయ పడింది.

రాష్ట్రేతర అభ్యర్థుల కొరకు స్థానాల ప్రత్యేకింపు

ఆంధ్ర ప్రదేశ్ నుంచి కాక బయటి ప్రదేశాల నుంచి భారత ప్రభుత్వం ఎన్నిక చేసిన అభ్యర్థుల కొరకు ప్రభుత్వం ఆంధ్రలో 5 స్థానాలనూ, తెలంగాణాలో 3 స్థానాలనూ కేటాయించింది. దీనిని కూడా సవాలు చేయడం జరిగింది. కాని హైకోర్టు ఈ కేటాయింపును సమర్థిస్తూ యిది, జాతీయ సమైక్యతను పెంపొందించే విధానానికి ప్రోది చేస్తుందనీ, భారత దేశంలో విద్యాభ్యాసం చేయదలచినట్టి విదేశాలలో నివసిస్తున్న భారతీయ సంతతి వారి పిల్లలకు అందుకు అవకాశం కలిగిస్తుందనీ, యితర దేశాలకు చెందిన విద్యార్థులకు విద్యాసౌకర్యాలు కల్పించడంద్వారా అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడానికై కేంద్ర ప్రభుత్వానికి అవకాశం కలుగ జేస్తుందనీ పేర్కొన్నది.

దక్షిణాది రాష్ట్రాలు

పూర్తిగా ప్రతిభ ప్రాతిపదికపై ఎన్నిక చేసిన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు స్థానాలు ప్రత్యేకించడానికి కూడా ప్రభుత్వ ఉత్తర్వులు అవకాశం కలుగజేస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన విద్యార్థులకు యితర దక్షిణాది రాష్ట్రాలలోగల ఇట్టి సౌకర్యాలను ఉపసంహరించుకున్నారు. కాబట్టి ఈ ప్రత్యేకింపు కూడా సవాలు చేయబడింది. హైకోర్టు దీనిని త్రోసిపుచ్చుతూ, అనేక యితర విషయాలలో వలెనే విద్యా విషయంలో కూడా భారత యూనియన్‌లోని ఏ రాష్ట్రమైనా, సంకుచితంగా ఆలోచించడం, యితర రాష్ట్రాలలో తనకు అటువంటి సదుపాయాలు లేవు కాబట్టి తాను వాటిని కల్పించరా దనుకోవడం ప్రమాదకరమని అభిప్రాయపడింది. ఈ విషయంలో ఉదారంగా విశాల దృక్పథంతో వ్యవహరించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమును అభినందించ వలసి వుంటుంది.

స్త్రీలకు అవకాశాలు

స్త్రీలకు 30 శాతం స్థానాలను కేటాయించడానికి కూడా ఈ ఉత్తర్వులు అవకాశం కలుగజేస్తున్నాయి. దీనినికూడా సవాలు చేయడం జరిగింది. 15 (3) వ సూత్రం క్రింద స్త్రీలు, బాలల కొరకు ప్రత్యేక అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వానికి అధికారం

(తరువాయి 28 వ పుటలో)

బడ్జెట్ డిమాండ్లు

ఆరోగ్యశాఖామంత్రి ఫిబ్రవరి 29న శాసనసభలో వైద్యశాఖ పద్దులను ప్రవేశపెడుతూ యీ ఏడాది ఏప్రెల్ ఒకటవ తేదీ నుంచి, ఆసుపత్రులకు మందులను పంపిణీ చేయడంలో కొత్త పద్ధతి అమలులోకి వస్తుందని తెలియజేశారు. ఆసుపత్రులకు ముఖ్యమైన మందులను, ప్రాణాలను రక్షించే విలువైన మందులను మెడికల్ స్టోర్స్ శాఖ సరఫరా చేస్తుందని అన్నారు. ఈ మెడికల్ స్టోర్స్ శాఖలో యితర మందులు లేనప్పుడు 'నో స్టాక్' సర్టిఫికెట్టును యిస్తుందనీ, అప్పుడే వైద్య సంస్థలు విడిగా బయట కొనుగోలు చేస్తాయనీ అన్నారు. ప్రభుత్వ డాక్టర్ల ప్రయివేటు ప్రాక్టీసుపై నిషేధాన్ని గూర్చిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'కన్సల్టేషన్ ప్రాక్టీసుల'కు సంబంధించిన నిబంధనలను సవరించాలని యిటీవల తీసుకున్న నిర్ణయాన్నిబట్టి, ప్రతి డాక్టరును కన్సల్టేషను ప్రాక్టీసులకు అనుమతించడం జరుగుతుందనీ, అయితే వారు అవసరమైన అన్ని వివరాలనూ ప్రకటించే విధంగా అందుకు వుద్దేశించబడిన రిజిష్టరు నొకదానిని నిర్వహిస్తూ వుండాల్సి వుంటుందనీ ఆయన అన్నారు. రోగి గృహంలో గాని, నర్సింగ్ హోంలోగాని, లేదా ప్రభుత్వ సంస్థ కానట్టి మరేచోటగాని అత్యవసర పరిస్థితిలో తప్ప మిగతా సమయాలలో శస్త్ర చికిత్సలు జరపడం నిషేధించబడినదని ఆయన తెలియజేశారు. ఈ చర్యలు కేవలం తాత్కాలికమైనవనీ, త్వరలోనే -అంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో- భారతీయ వైద్య సర్వీసు ఏర్పాటు చేశాక ప్రయివేటు ప్రాక్టీసును పూర్తిగా నిషేధించడం జరుగుతుందనీ ఆరోగ్యశాఖా మంత్రి అన్నారు.

పోలీసు సేవ

ముఖ్యమంత్రి మార్చి 4 న పోలీసుశాఖ పద్దును ప్రవేశపెడుతూ పోలీసు బలాన్ని ఒక అంచెలవారీ కార్యక్రమం ప్రకారం పటిష్ఠవంతం చేయడానికి ప్రభుత్వం నిశ్చయించిందని అన్నారు. జిల్లా ఆర్మ్డ్ రిజర్వుపోలీసు బలంలో అదనపు దళాలను ఏర్పాటు చేయడానికి, కొత్త పోలీసు స్టేషన్లను ప్రారంభించడానికి సుమారు రూ 25 లక్షలను బడ్జెటులో కేటాయించడం జరిగింది. ఈ ఏడాది విద్యార్థులు, వివిధ సంస్థల ఉద్యోగులు, వివిధ రాజకీయపార్టీలు చేసిన సమ్మెలు, ఆందోళనలు కారణంగా ఉత్పన్నమైన పరిస్థితిని అణచివేయడంలో పోలీసులు వహించిన పాత్రను ముఖ్యమంత్రి కొనియాడారు.

చర్చా సందర్భంలో శాసనసభ్యులు అనేక సూచనలను చేశారు. ఖైదీలలో పరివర్తన కలిగించడానికి తీసుకోదగిన చర్యలనుగూర్చి సూచనలు చేసేందుకై మనస్తత్వశాస్త్రజ్ఞులు, నేరాలకు సంబంధించిన న్యాయశాస్త్రంతో సంబంధంగల లాయర్లు, తదితర నిపుణులుగల సంఘాన్ని ఒకదానిని ఏర్పాటుచేస్తే బాగుంటుందని ఒక సభ్యుడు సూచించారు. పోలీసు బలాన్ని పెంచాలని, పోలీసు వారికి యిచ్చే ప్రయాణపు భత్యాన్ని పెంచాలని, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో శాంతిభద్రతలను బాగా పరిరక్షించాలని మొదలైన సూచనలను సభ్యులు కొందరు చేశారు. హైదరాబాదు పాతపట్టణంలోని కొన్ని ప్రాంతాలలో శాంతి భద్రతల పరిస్థితులను గూర్చి కొందరు సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొనివచ్చి, యీ ప్రాంతాలలో పటిష్ఠమైన భద్రతాచర్యలు తీసుకోవాలని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో శాంతిభద్రతల అతిక్రమణకు కారణం, అక్కడ దౌర్జన్య ధోరణులను నమ్మే కొన్ని రాజకీయపార్టీల కార్యకలాపాలేనని ముఖ్యమంత్రి తెలియజేశారు.

నగరంలో రక్షణచర్యల్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం పూనుకుంటుందని పేర్కొంటూ 1958 నుంచి పట్టణాలు, నగరాలు పెరుగుతున్నా పోలీసు బలాన్ని పెంచడం జరగలేదనీ, అందువల్ల 1968-69 లో పోలీసు బలగాన్ని పెంచాలని ప్రభుత్వం నిశ్చయించిందని ముఖ్యమంత్రి వ్యక్తంచేశారు. సబ్ఇనస్పెక్టర్ల ఉద్యోగాలకు నేరుగా అభ్యర్థులను చేర్చుకునే విషయాన్నిగూర్చి చెబుతూ 70 శాతం ఉద్యోగాలను యీ విధంగా నేరుగా రిక్రూటుచేసుకోవడం ద్వారానూ, మిగిలిన 30 శాతాన్ని హెడ్‌కానిస్టేబిల్‌లకు ప్రమోషన్ యివ్వడంద్వారానూ భర్తీచేయడం జరుగుతున్నదని తెలియజేశారు.

పరిశ్రమలశాఖామంత్రి మార్చి 6న పరిశ్రమలశాఖ పద్దును ప్రవేశపెడుతూ, భారతదేశంలోనివీ, ఇతరదేశాలలోనివీ అనేక ప్రయివేటు సంస్థలు మనరాష్ట్రంలో ఎరువుల కర్మాగారాలను నెలకొల్పడానికి ఎంతో ఆసక్తిని కనబరుస్తున్నాయని తెలియజేశారు. ఒక కర్మాగారాన్ని విశాఖపట్టణంలో నెలకొల్పాలని ఇంటర్నేషనల్ ఓర్ అండ్ ఫెర్టిలైజర్స్ సంస్థవారు తలపోస్తున్నారనీ, మరొక కర్మాగారాన్ని రాష్ట్రంలోని ప్రైవేటు సంస్థ సహాయంతో నెలకొల్పాలని అట్లాంటిక్ రైస్ ఫీల్డ్ అనే సంస్థ భావిస్తోందనీ మంత్రి తెలియజేశారు.

విజయవాడ దగ్గర నాఫ్తా ప్రాతిపదికగాగల ఎరువుల కర్మాగారాన్ని ఒకదానిని నెలకొల్పాలని సుప్రసిద్ధ పారిశ్రామిక వేత్తల బృందం ఒకటి ఆలోచిస్తున్నట్టు మంత్రి తెలియజేశారు. కేంద్ర రంగంక్రింద హైదరాబాదులోవున్న భారత ఎలక్ట్రానిక్స్ కర్మా

గారంలో రెండవ యూనిటును ఏర్పాటు చేయడానికీ, ఒక అటో మేటిక్ బేకరీని నెలకొల్పడానికీ ప్రణాళికలు సిద్ధపరచడం జరుగుతోందనికూడా పరిశ్రమలమంత్రి తెలియజేశారు

ఉక్కు కర్మాగారం

పరిశ్రమల పద్దుపై జరిగే చర్చలో ముఖ్యమంత్రి కల్పించుకుని మాట్లాడుతూ, అయిదవ ఉక్కు కర్మాగారాన్నిగురించి ఒత్తిడి తేవడానికి యిది తగిన సమయం కాదనీ, సమయం వచ్చినప్పుడు ఉక్కుకర్మాగారాన్ని సాధించడంలో ఊరుకోవడం అంటూ ఉండదనీ అన్నారు ఆంధ్రప్రదేశ్‌లో జింకుశుద్ధి కర్మాగారాన్ని నెలకొల్ప వలసిన స్థలనిర్ణయం విషయంలో తన వాదనను ప్రభుత్వం పునః ఆలోచించుకుంటుందని, కొత్తగూడెంవద్ద బొగ్గు ప్రాతిపదికగాగల ఎరువుల కర్మాగారాలను పబ్లిక్ రంగంక్రింద నెలకొల్పే విషయంలోనూ, తక్కువ కార్బొనైజేషన్ కర్మాగారాన్ని నెలకొల్పే విషయంలోనూ ప్రభుత్వం గట్టి పట్టు పట్టగలదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు కొత్తగూడెంనుంచి ఎన్నూర్ థర్మల్ ప్లాంటుకు బొగ్గును సరఫరా చేసేందుకై మద్రాసు ప్రభుత్వానికి లేఖ వ్రాసినట్టుకూడా ఆయన తెలియజేశారు రాష్ట్రం పారిశ్రామికంగా వెనుకబడివున్న విషయాన్నిగూర్చి పేర్కొంటూ చతుర్థ పంచవర్ష ప్రణాళికలో కార్యక్రమాలను రూపొందించేందుకుగాను, వివిధ రాష్ట్రాలకు 1951 తర్వాత కేంద్రం యిచ్చిన గ్రాంట్లు, పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాల వివరాలను సేకరించాలని తాను చేసిన సూచనను ఉప ప్రధాని అంగీకరించారని ముఖ్యమంత్రి తెలియజేశారు

పరిశ్రమలమంత్రి ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ చిరకాలంగా ఎదురు చూస్తున్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మండలివారి బాల్ బియరింగ్ కర్మాగారం 1969 మధ్యలో ఉత్పత్తి ప్రారంభించగలదని తెలియజేశారు అదేవిధంగా గాజు కర్మాగారం అభివృద్ధిని గూర్చి కొన్ని వివరాలు తెలియజేశారు ఈ కర్మాగారం ఖర్చును రూ 3 15 కోట్లకు తగ్గించడం జరిగిందనీ, దీనిలో హంగేరీ వారు రూ, 5 లక్షలు పెట్టుబడి పెడుతున్నారనీ చెప్పారు ఒక పెద్ద ఇనుప కర్మాగారాన్ని నెలకొల్పే విషయమై, యిక్కడ లభించే ముడి ఖనిజాన్ని నార్వేకుపంపి పైలట్ స్కేలుగా పరిశోధనలు జరిపించడం జరిగిందనీ, దుక్క యినుము తయారీ కర్మాగారాన్ని నెలకొల్పడానికి అనువైనదిగా ఆ పరిశోధనలద్వారా వెల్లడైనదనీ మంత్రి తెలియజేశారు

1968 మార్చినాటికి రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీ ఉత్పత్తిచేయడం ప్రారంభిస్తుందనీ, శ్రీకాకుళంజిల్లాలోని సాలూరువద్ద గ్రాఫైటు నిక్షేపాలు పుష్కలంగా వున్నట్టు పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషను కనుగొన్నదనీ మంత్రి తెలియజేశారు అమెరికాలోను యితర విదేశాల్లోనూ గిరాకీతగ్గి అనుకోకుండా మన చేనేత వస్త్రాల మార్కెటు మందగించిందనీ, చేనేత కార్మికుల ఈ సమస్యను అధిగమించడానికై ప్రభుత్వ శాఖల్లో అవసరమైన బట్టలను 80 శాతంమేరకు చేనేత వస్త్రాలే వాడాలని ప్రభుత్వం ఉత్తర్వులు చేసిందని ఆయన పేర్కొన్నారు.

పరిశ్రమల శాఖా డిమాండుపై చర్చకు సమాధానమిస్తూ భారత ప్రభుత్వ భూగర్భ పరిశీలకశాఖ, మైనింగ్ కార్పొరేషన్ల సహకారంతో ఖనిజవనరుల శాఖ మూడేళ్ళ సర్వే కార్యక్రమాన్ని ఒకదానిని రూపొందించిందనీ, దీనికి ఖర్చు రూ 2 కోట్లు అవుతుందనీ పరిశ్రమలమంత్రి అన్నారు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి మండలినీ లఘు పరిశ్రమల అభివృద్ధి మండలినీ, విలీనంచేయమని ఒక సభ్యుడు సూచించారు అయిదవ ఉక్కు కర్మాగారాన్ని గూర్చిన ప్రస్తావన ఏమీ పరిశ్రమల మంత్రి చేయలేదన్న ఒక సభ్యునికి సమాధానం చెప్తూ అయిదవ ఉక్కు కర్మాగారాన్ని రాష్ట్రంలోనే ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ విధానంలో ఎలాటి మార్పులేదనీ, లోగడ కోరినంత గట్టిగానే యిప్పుడూ కోరుతున్నామనీ చెప్పారు

క్రెడిట్ పాస్ బుక్

సహకారశాఖ డిమాండును మార్చిలోన ప్రవేశ పెడుతూ సహకారశాఖ మంత్రి, వ్యవసాయ ఋణాల విషయాలలో విశేషమైన విజయాన్ని సాధించడం జరిగిందనీ, 1968_69లో రూ 40 కోట్ల మేరకు తక్కువే వ్యవధి ఋణాలను, మధ్యకాలిక ఋణాలను యివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియ జేశారు 'క్రెడిట్ పాస్ బుక్' పథకానికి అనుమతి లభించినా, కొన్ని చట్టబద్ధమైన సమస్యలవల్లా, పరిపాలనా విషయికమైన సమస్యలవల్లా దీనిని ఆచరణలో పెట్టడంలో ఆలస్యం జరిగినదని మంత్రి తెలియజేశారు ప్రయోగాత్మకంగా దీనిని ఆరు తాలూకాలలో ప్రవేశ పెట్టాలని ఉద్దేశించారు.

చర్చలోపాల్గొన్న సభ్యులు చాలామంది సహకారోద్యమాన్ని ప్రయోజనాయుతంగా చేయాలంటే దానిని మరింత పటిష్ఠవంతం చేయవలసిన అవసరాన్నిగూర్చి నొక్కి చెప్పారు మత్స్యపారిశ్రామికులు, రిక్షా డ్రైవర్లు మొదలైన బలహీన వర్గాల వారికి అధిక రజకులు ప్రయోజనకరంగా ఉండేటందుకు సహకార సంఘాలకు చేసే కేటాయింపులను ఎక్కువచేయాలని వీరు తెలియజేశారు ఈ చర్చకు సహకార శాఖామంత్రి సమాధానమిస్తూ వ్యవసాయ సకాలంలో తేలిగ్గా ఋణాలను లభింపజేయడానికి క్రెడిట్‌పాస్‌బుక్ దారులకు పద్ధతిన ఋణాలను మంజూరు చేయాలని రాష్ట్రప్రభుత్వం ఉద్దేశిస్తున్నట్టు చెప్పారు

వ్యక్తిగత రైతులకు చెక్కుల పద్ధతిన ఋణాలను యివ్వాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది ఈ చెక్కులను నగదుగా మార్చుకోవడానికై జిల్లాలలో డబ్బు చెల్లింపు కార్యాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు సహకారమంత్రి పేర్కొన్నారు భూమితనఖా బ్యాంకులు రైతులకు చాలా ప్రయోజన కారులుగా వున్నాయన్నారు ఈ భూమి తనఖా బ్యాంకులు చేపట్టిన ఆయకట్టు అభివృద్ధి కృషిని మంత్రి అభినందించారు

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా 6 5 లక్షల ఎకరాలకు నీరు విడుదల చేయబడగా మొదటి సంవత్సరమే దాదాపు 5 3 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం వినియోగించుకున్నారు ఇప్పుడు

భారతదేశంలో నీరు విడుదల చేయబడిన మొదటి సంవత్సరమే ఒక ప్రాజెక్టు క్రింద ఆయకట్టులో 65 శాతాన్ని అభివృద్ధి చేయడం ఇక్కడే జరిగింది.

సూపర్ బజార్లు

రాష్ట్రంలో ఎన్ని ప్రాంతాల అభివృద్ధి పథకాలను తయారు చేస్తే అన్నిటినీ మంజూరు చేయడానికి వ్యవసాయ రీ ఫైనాన్సు కార్పొరేషన్ సిద్ధంగాఉన్నదని మంత్రి అన్నారు. ప్రతిరెవిన్యూ డివిజన్‌కు కనీసం ఒక ప్రాంతం అభివృద్ధి పథకాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ కార్యక్రమం విషయంలో ప్రత్యేక శ్రద్ధవహించాలని జిల్లా కలెక్టర్లను కోరడం జరిగింది. బియ్యం మిల్లులు నడవడంలేదనే ఆరోపణలను మంత్రి ఖండించారు. హైదరాబాదు, విశాఖపట్నాలలోని సూపర్‌బజార్లు గాక అదనంగా సికింద్రాబాదు, పాతనగరం (చార్మినారు) లలో మరోరెండు సూపరుబజార్లను త్వరలోనే ఏర్పాటుచేస్తున్నారు. కేంద్రప్రభుత్వం మరో ఐదింటిని మంజూరుచేసిందని మంత్రి వెల్లడించారు. వరంగల్లు, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, కర్నూలు లలో వాటిని నెలకొల్పడం జరుగుతుంది. వసతిసౌకర్యం ఏర్పడగానే యీసంస్థలను నెలకొల్పుతారు.

మార్చి 16 న వ్యవసాయశాఖ డిమాండులను ప్రవేశపెడ్తూ, కేంద్రప్రభుత్వం పంపిన నమూనా పథకంలో సూచించబడిన రీతిలో రాష్ట్రస్థాయిలో రాష్ట్ర విత్తనాల కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించినదని వ్యవసాయ శాఖ మంత్రి వెల్లడించారు. మేలిరకం విత్తనాలను యితోధికంగా సరఫరాచేయాల్సిన అవసరాన్నిగూర్చి మంత్రి నొక్కిచెప్పారు ముఖ్యమైన పైరకు సంబంధించిన విత్తనాల సరఫరాను నిర్వహించే నిమిత్తం రాష్ట్రస్థాయిలో విత్తనాల కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వానికి చెందిన వర్కింగ్ గ్రూపు సానుకూలంగా పరిశీలించిందని ఆయన అన్నారు. నాలుగవ ప్రణాళిక ఆఖరుకు పశ్చిమ గోదావరి జిల్లాలో తీవ్రతర జిల్లా వ్యవసాయ కార్యక్రమం క్రింద ధాన్యం ఉత్పత్తి స్థాయిని 40 శాతానికి ఎక్కువ చేయడానికి ప్రభుత్వ ఉద్దేశించిన కార్యక్రమాన్ని గూర్చి మంత్రి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆదిలాబాదు జిల్లాలో దాదాపు 30,000 ఎకరాలలోను, గుంటూరు జిల్లాలో 5 వేల ఎకరాల లోనూ వర్షంపై ఆధారపడే పత్తిని ప్యాకేజి పథకాన్ని అమలు జరుపుతున్నట్లు కూడ మంత్రి చెప్పారు. మూడవ ప్రణాళిక ఆఖరులో ఉన్న 10.78 లక్షల టన్నుల నూనె విత్తుల ఉత్పత్తిని 1970-71 నాటికి 15.28 లక్షల టన్నులకు ఎక్కువ చేయాలని ప్రతిపాదించారని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరంలో ఎఫ్. సి. వి. పొగాకు ఉత్పత్తి శక్తిని 125 మిలియన్ పౌండ్లకు ఎక్కువచేయాలని ఉద్దేశించారు.

పంటల భీమా

చర్చసందర్భంలో సభ్యులుచేసిన సూచనలలో కొన్నియివి. పైరభీమా పథకం త్వరలో ప్రవేశపెట్టడం; ఎగువ ప్రాంతాలలో భూగర్భ నీటి సర్వేకార్యక్రమాన్ని చేపట్టడం; వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఋణాలు యివ్వడం; తరచుగా కరువు ఏర్పడే ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి సరఫరాచేయడం; ప్రతిరెవిన్యూడివిజన్‌కు వ్యవసాయాధికారిని నియమించడం; కాంటూరు కట్టలను ఏర్పర్చడంలో ప్రత్యేక శ్రద్ధవహించడం; సహకార సంఘాల ద్వారాగాక, శాఖ ద్వారా ఎరువులను సరఫరాచేయడం; అటవీ ప్రాంతంలో భూమిహీనులైన రైతులకు పట్టాలు. భూమి తనఖా బ్యాంకుల ద్వారా ఋణాలు మంజూరు చేయడంలో జరిగే జాప్యాన్ని నివారించడం.

రెండు రోజులు జరిగిన చర్చలకు వ్యవసాయ మంత్రి సమాధానమిస్తూ, రైతులకు సహాయపడే విధంగా పైరభీమా, పశువుల భీమా పథకాలను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ఆతృతతో ఉన్నదని పునరుద్ఘాటించారు. పది సంవత్సరాల క్రితం రాష్ట్రంలో సంవత్సరానికి రు. 5 నుండి 6 కోట్లు విలువచేసే లక్షటన్నుల ఎరువులను వినియోగించేవారనీ, నేడు దాదాపు రు. 30 కోట్లు విలువ చేసే 8 లక్షల టన్నులను వాడుతున్నారని మంత్రి అన్నారు. కొత్త పైర పద్ధతిని ప్రవేశపెట్టి, మహారాష్ట్రంలో చేసిన విధంగా భూసార సంరక్షణ పనులను చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని ప్రభుత్వం ఉద్దేశించినదని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు గిడ్డంగుల సౌకర్యం కల్పించ బడుతుంది. రైతుల పిల్లలకు ఆధునిక వ్యవసాయంలో శిక్షణయిచ్చే మూడు, లేక ఆరు నెలలకోర్సును ప్రారంభించ నున్నట్లు మంత్రి వెల్లడించారు.

రేషనింగు

రెవిన్యూ, పౌరసరఫరాల శాఖల మంత్రి, మార్చి 13న తన శాఖా డిమాండులను ప్రవేశపెడ్తూ బియ్యానికి సంబంధించినంత వరకు హైదరాబాదు, సికింద్రాబాదులలో ప్రస్తుతంగల చట్టబద్ధమైన రేషనింగును కొంత సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించిందని అన్నారు. 1968 మార్చి 15 నుండి నిజామాబాదు మినహా మిగతా తెలంగాణా జిల్లాల నుండి నగరానికి బియ్యం, ధాన్యం రవాణాపై నిర్బంధాలను తొలగించాలని ప్రతిపాదించారు. అయితే దిగుమతి చేసుకోబడిన గోధుమలు, చక్కెర, గోధుమ ఉత్పత్తుల పంపిణీ విధానం, రేషనింగ్ సంస్థ అమలులో ఉంటాయి. నిజామాబాదు ప్రత్యేక మండలంగానే ఉంటుంది. రేషన్ వస్తువుల షెడ్యూలునుండి బియ్యాన్ని తొలిగించడానికి వీలగా రేషనింగు ఉత్తర్వును సవరించడం జరుతుంది బియ్యంపై రేషనింగు తొలిగింపు మార్పుఫలితంగా బడుగు వర్గాల వారికి యిబ్బంది ఏర్పడకుండా ఉండే దృష్టితో రేషన్ దుకాణాలలో మామూలు ప్రాతిపదిక పై బియ్యం సరఫరా చేయాలని ప్రతిపాదించారు.

ఈ క్రొత్త విధానాన్ని అనుసరించి నెలకు రు. 200- ల ఆదాయానికి మించని నలుగురు సభ్యులుగల (కారుగల వారికి) కుటుంబానికి ఒక వయోజనుని రేషన్ తగ్గించి ముతక బియ్యం సరఫరా చేస్తారు. నెలసరి ఆదాయం రు. 200- లకు మించి ఉన్న కుటుంబాల రేషన్ను సగానికి సగం తగ్గిస్తారు. వారు తమకు కావలసిన బియ్యాన్ని బహిరంగ మార్కెటునుండి కొనుగోలు చేయవచ్చు. రేషన్ దుకాణాలలో ముతకబియ్యం మాత్రమే సరఫరా చేస్తారు.

ప్రభుత్వ కంట్రోల్ దుకాణాలలో సన్న బియ్యం సరఫరా చేయబడవని మంత్రి అన్నారు. వ్యాపారులు సరసమైన ధరలకు బియ్యాన్ని విరివిగా లభింప చేస్తారనే ఆశాభావాన్ని ఆయన వెల్లడించారు.

రెవిన్యూ మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన మొత్తం కార్డులు దాదాపు 2.75 లక్షలు ఉన్నాయనీ, యివి దాదాపు 16 లక్షల జనాభాకు వర్తిస్తాయనీ, ఎక్కువ ఆదాయ వర్గాలకు చెందిన కార్డులు 1.26 లక్షలు ఉన్నాయనీ, యివి దాదాపు 9 లక్షల మందికి వర్తిస్తాయనీ ఆయన అన్నారు. మొత్తం తెలంగాణా ప్రాంతంలో మొదటి పంట బాగా ఉత్పత్తి అయింది. రెండవ పంట కూడా సంతృప్తికరంగా ఉన్నట్టు రిపోర్టు అందినదని అన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రత్యేకంగా మిగులు రాష్ట్రంగా ఉండి, యితర లోటు రాష్ట్రాలకు తగిన మొత్తంలో బియ్యం ఎగుమతి చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌లో యీ పద్ధతి కొనసాగడం హర్షదాయంకాదు.

పౌర సరఫరా డిమాండులపై జరిగిన చర్చ సందర్భంలో ఆహార ధాన్యాలపైగల కంట్రోలును తొలిగించడాన్ని ఒక ఇండిపెండెంట్ సభ్యుడు వ్యతిరేకించారు. చెక్‌పోస్టులు, లంచగొండి పోస్టులు కారాదని ఆయన హెచ్చరించారు. సరస ధరల దుకాణాలు బాగా పనిచేయడంలేదనీ, భారత ఆహార కార్పొరేషన్ తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేస్తూ ఎక్కువధరలకు విక్రయిస్తున్నదనీ మరొక సభ్యుడు ఫిర్యాదుచేశారు. జంటనగరాలలో రేషనింగును తీసివేస్తూ మరొవైపు విశాఖపట్నంలో రేషనింగును కొనసాగిస్తున్నందుకు మరొక సభ్యుడు ప్రభుత్వాన్ని విమర్శించారు.

పౌరసరఫరాల మంత్రి, చర్చకు సమాధానమిస్తూ ప్రస్తుత పంట సంవత్సరంలో రాష్ట్రంలో ప్రభుత్వం 8 లక్షల టన్నుల బియ్యాన్ని సేకరిస్తుందని ఆశించ బడుతున్నదనీ ఇందులో 4 లక్షల టన్నులు ఎగుమతి చేస్తుందనీ ఆయన అన్నారు. మొదటి పంట నుండి దాదాపు 3.46 లక్షల టన్నుల బియ్యం సేకరించారు. దాదాపు 94,000 టన్నులు యితర రాష్ట్రాలకు ఎగుమతిచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 1 57,000 టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని మంత్రి అన్నారు. మొదటి పంటనుండి మరో 50,000 టన్నుల బియ్యం సేకరించి నిల్వలకు చేర్చడం జరుగుతుంది.

చక్కటి పంట

మొదటి పంట పరిస్థితి మెరుగ్గాఉండడం, రెండవ పంట పరిస్థితికూడ బాగాఉంటుందని ఆశిస్తున్న దృష్ట్యా జంటనగరాలలో రేషనింగును సడలించాలని ప్రభుత్వం నిశ్చయించిందని మంత్రి అన్నారు. అల్పాదాయవర్గాల ప్రజలకు ప్రభుత్వ దుకాణాలద్వారా ముతక బియ్యం సరఫరా చేయ బడుతుంది. మేలిరకం బియ్యం బహిరంగ మార్కెటులో లభ్యమవుతాయి. బహిరంగ మార్కెటులో బియ్యం ధరలు, ప్రభుత్వదుకాణాలలో బియ్యం ధరలమధ్య ఎక్కువ వ్యత్యాసంలేకుండా ప్రభుత్వం గమనిస్తుంది. బహిరంగ మార్కెటులో ధరలు పెరిగినప్పుడు పరిస్థితిని అదుపులో పెట్టడానికి ప్రభుత్వం తమ నిల్వలను విడుదలచేస్తుందని మంత్రి అన్నారు.

అక్రమరవాణాను అరికట్టడానికీ, ఆహారధాన్యాల అక్రమ నిల్వలు, బ్లాకుమార్కెటింగును నిరోధించడానికీ, ప్రత్యేకరహస్య పోలీసుదళం పటిష్ఠమైన చర్యలను తీసుకుంటున్నదనీ మంత్రి తెలిపారు. 5,938 ప్రాసిక్యూషన్స్ నిర్వహించ బడగా 3,240 కేసులలో శిక్షలు విధించారు. అక్రమరవాణా, బ్లాక్‌మార్కెటింగ్ కేసులలో 2,166 మంది వ్యక్తులను యీ సిబ్బంది అరెస్టుచేసిందని మంత్రి అన్నారు.

రెవిన్యూ మంత్రి చర్చకు సమాధానమిస్తూ జిల్లాకలెక్టరేటును పటిష్ఠంచేసి జిల్లాఅభివృద్ధికి అవి బాధ్యత వహించే విధంగా చేయాలని ప్రభుత్వం నిశ్చయించిందని అన్నారు. రెవిన్యూబోర్డును రద్దుచేయాలనే కోర్కెను ప్రస్తావిస్తూ యీ విషయంలో త్వరలోనే నిర్ణయంతీసుకుంటుందని అన్నారు. అదనపు పన్ను వసూలు చేయాలా? చట్టానికి సవరణలు అవసరమా అనే విషయాలను పరిశీలించే టంతవరకు చెరకుగడ సెస్సుచట్టం అమలును నిలుపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి వెల్లడించారు. తెలంగాణా ప్రాంతంలో భూసంస్కరణల అమలు కొనసాగుతుందనీ, యింతవరకు 2 లక్షలమంది రక్షితకౌలుదార్లు సంబంధిత భూముల యజమానులయ్యారనీ ఆయన అన్నారు. నష్టపరిహారం చెల్లింపు సమస్య మిగిలిఉంది. కొన్ని ప్రాంతాలలోని కరువు పరిస్థితులను ప్రస్తావిస్తూ కరువు అయినా, అనావృష్టి పరిస్థితులైనా ఫేమిన్‌కోడ్‌లోని పాత పద్ధతులు ఉపయోగకరమైనవి కావని మంత్రి అన్నారు అనంతపురంజిల్లాలో రు. 14 కోట్ల ఖర్చుతో శాశ్వత కరువు నివారణ చర్యలకు సంబంధించిన పథకాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఏప్రిల్ నెలలో కేంద్ర ప్రభుత్వ అధికారులు యీ ప్రాంతాలలో పర్యటించిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహాయం లభిస్తుందని ఆశించబడుతున్నది.

మునిసిపల్ పరిపాలన శాఖామంత్రి, తమ డిమాండులపై జరిగిన చర్చకు మార్చి 16న సమాధానమిస్తూ తూర్పుగోదావరి, విశాఖ పట్నంజిల్లాలలోని ఏజన్సీ ప్రాంతాలలో కాఫీతోటల పెంపకానికి అటవీ భూములను ప్రైవేటు వ్యాపారస్థులకు యివ్వాలనే విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. తదనుగుణంగానే యింతవరకు 5000 ఎకరాలను లోకలైజ్‌చేశారు. 1968 జూన్ నాటికి మరో 5000 ఎకరాలలో యీ పనులను పూర్తి చేయడం జరుగుతుంది. 1968 ఏప్రిల్ 1వ తేదీ నుండి అడవులలో ఉచితంగా పశువులను మేపుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రిచెప్పారు.

మార్చి 22 మొదలుకొని మూడురోజుల్లోనూ రాష్ట్ర శాసన సభ, గవర్నరు, మంత్రులు, హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది, జన సంబంధశాఖ, నీటిపారుదల, పబ్లిక్ వర్క్స్ శాఖలకు సంబంధించిన బడ్జెటు డిమాండులను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సందర్భంలో జరిగిన చర్చలలో సభ్యులు అనేక నిర్మాణాత్మక సూచనలను చేశారు. నిర్వహణలలోని లోపాలను తెలియజేసి వాటిని తొలగించాల్సిన అవసరాన్ని ప్రకటించారు. బడ్జెటు సమావేశం ముగుస్తూ శాసనసభ మార్చి 27న నిరవధికంగా వాయిదాపడింది.

*

ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు వాడకం

దిగువ పేర్కొన్న ప్రభుత్వ కార్యాలయాలలో, వాటికి దిగువ తెలిపిన అధికార ప్రయోజనాలకొరకు 1968 మార్చి 26 వ తేదీనుంచి ఇంగ్లీషుకు బదులు తెలుగుభాషను ఉపయోగించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ కార్యాలయాలు శాసనభిన్న స్వభావం కలిగి అధికారికమైన ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటికీ తెలుగును ఉపయోగిస్తారు.

1. అగ్నిమాపకశాఖ

డివిజనల్ ఫైర్ ఆఫీసులు, వారి ఆధీనంలోని కార్యాలయాలలో

1. జనసామాన్యంతో ఉత్తర ప్రత్యుత్తరాలు

2 గ్రామాధికార్లు, గ్రామపంచాయతీలు, పంచాయతీ సమితులతో ఉత్తర ప్రత్యుత్తరాలు

2. రేవుశాఖ

కాకినాడలోని స్టేట్ పోర్ట్ ఆఫీసు, మచిలీపట్నంలలోని పోర్ట్ ఆఫీసులు మినహా రాష్ట్రంలోని పోర్ట్ శాఖ అధీనంలోని కార్యాలయాలన్నింటిలో

1. పడవ యజమానులు, కంట్రాక్టర్లు, లైసెన్సుదార్లు మొదలైన జనసామాన్యంతో ఉత్తర ప్రత్యుత్తరాలు

2 తెలుగులో అందిన జాబులకు ప్రత్యుత్తరాలు

3. మహిళాసంక్షేమశాఖ

1 బాలల గృహాల సూపరింటెండెంటు కార్యాలయాల్లోనూ

2. క్రీచే-ప్రీబేసిక్ తరగతులు బాలవిహారాల్లోనూ

1 జనసామాన్యంతో ఉత్తర ప్రత్యుత్తరాలు

2 గ్రామాధికార్లు, గ్రామపంచాయతీలు, పంచాయతీ సమితులతో ఉత్తరప్రత్యుత్తరాలు

3 తెలుగులో అందిన జాబులకు ప్రత్యుత్తరాలు

4 ఉపాధ్యాయుల సూచనలు, ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు

చట్టబద్ధమైన రేషనింగు సడలింపు

ప్రభుత్వ నిర్ణయం మేరకు యిటుపై జంటనగరాలలో బియ్యం రేషను సరకు కాదు అయినప్పటికీ 1963 ఏప్రెల్ 1 నుంచి యీ దిగువ పద్ధతిన రేషను దుకాణాలలో ముతక బియ్యం యిస్తుంటారు -

(అ) రేషను కార్డులువున్న తక్కువ అదాయవర్గం వారికి (నెలజీతం 200 రూ మించని వారికి)—

(1) రేషను కార్డులో సూచించబడిన సభ్యుల సంఖ్య నలుగురికి మించని చోట ప్రస్తుతం యిస్తున్న పద్ధతిలోనే యిస్తారు


(2) రేషను కార్డులో సూచించబడిన సభ్యుల సంఖ్య నలుగురికి మించినప్పుడు ఒక వయోజనుని రేషను తగ్గించి యిస్తారు (అంటే రోజుకు రెండు యూనిట్లను తగ్గిస్తారు)

(ఆ) నెలకు రూ 200 పైగా ఆదాయంగల వారికి—సగం రేషనును (ముతక బియ్యాన్ని) తగ్గిస్తారు సన్న బియ్యాన్ని రేషను దుకాణాల్లో అసలు పంపిణీ చేయరు గోధుమలు, గోధుమ ఉత్పత్తులు, చెక్కర పంపిణీలలో ఎలాటి మార్పూ వుండదు

ఆహార పదార్థాలను దుబారా చేయకండి

విగ్రహాల పోతకు, చేతిపనులకు పేరుగాంచిన పెంబర్తి

ఎ. పండరినాథ్



అనంతమైన ఈ సృష్టిలో ఎన్నో తరాల, ఎన్నో రాజవంశాలు దేదీప్యమానంగా వెలిగి కాల గర్భంలో కలిసిపోయాయి. ఎందరో కళాకారులు, కళాభిమానులు, మేధావులు గిర్రున తిరిగే కాలచక్రం క్రింద నలిగి కనిపించకుండా పోయారు. కాని ఆ కాలపు సంస్కృతి, సాంప్రదాయాలు మనస్మృతి పథంలో నేటికీ మెదులుతూనే ఉన్నవి. ఇలా ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాలను రాబోవు తరాల వారి కందించు శక్తి కళలకే ఉందనడంలో అతిశయోక్తి లేదేమో ! అందుకే అంటారు కాబోలు "జీవితం కలలాగా కరిగి పోతుంది, కళలు కలకాలం విలుస్తాయి అని." అన్ని కళల్లోకి అతి కష్టమై ఇతరులను అబ్బుర పరచేది శిల్పకళ. శిల్పకళలో రాతిపై విగ్రహాలు, రకరకాల డిజైన్లు చెక్కడం ఒక రకం. వివిధ లోహాలతో విగ్రహాలు పోత పోయడం, వివిధ డిజైన్లు తయారు చేయడం మరొకరకం. మొదటి రకానికి చెందిన శిల్పం కేవలం శిల మీదా ఉలులమీదనే ఆధారపడి ఉంటుంది. కాని రెండవ రకానికి చెందినది ఒక పెద్ద ప్రయోగశాలలో ఎన్నో సాంకేతిక పరికరాలతో, ఎన్నో సాంకేతిక పరిణామాలతో తయారవుతుంది. ఈ కోవకు చెందిన శిల్పం బహుకష్టమైనదైనా మంచి కళాత్మకమై నాణ్యమైనదై చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది.

పెంబర్తి పేరు వినని ఆంధ్రుడు ఉండడనుకుంటాను. భూగోళశాస్త్రంలో పెంబర్తి కేవలం చేతి పనులకు, ఇత్తడి పాత్రలకు ప్రసిద్ధి చెందినట్లు వ్రాయబడి ఉంది. పెంబర్తి వరంగల్ జిల్లా జనగామ తాలూకా లోనిది. హైదరాబాదు నుండి విజయవాడ వెళ్లే మార్గంలో హైదరాబాదుకు సుమారు 50 మైళ్ళ దూరంలో ఉంటుంది. పెంబర్తి కేవలం ఇత్తడిపాత్రలు, చెంబులు, గిన్నెలు, బిందెలకు పేరు పొందిన గ్రామ మనడం కంటే ; నేడు మన దేశం శిల్ప కళకు ప్రసిద్ధి చెందినదని చాటే ముఖ్యమైన కళా కేంద్రాలలో ఒకటి అనడం సమంజసం. లోహపు విగ్రహాలు బొంబాయి, మద్రాసు లాంటి పెద్ద పెద్ద పట్టణాల్లో వివిధ సాంకేతిక పరికరాలతో తయారవుతాయి. కాని పెంబర్తి పెద్ద పట్టణం కాదు, ఒక గ్రామం. ఇచట విగ్రహాలు భారీ ఎత్తున సాంకేతిక పరికరాలతో కాక, ఇచటి కళాకారులు స్వయంగా తయారుచేసుకున్న సామాన్య పరికరాలతో తయారవుతాయి. సామాన్య పరికరాలు అనగానే విగ్రహాలు కూడా చిన్న తరహాకు చెందినవే తయారవుతాయి అని అనుకోవడానికి ఆస్కారం లేకపోలేదు. కాని సామాన్య పరికరాలతో భారీ ఎత్తున విగ్రహాలు, వాహనాలు తయారు చెయ్యడం ఇచటి కళాకారులలోగల ప్రత్యేక, అపురూప నైపుణ్యం.

ఒకప్పుడు ఈ గ్రామం శిల్పకళా కేంద్రమై వుండి ఉంటుంది. కాలక్రమేణా నాటి రాజులు, కళా పోషకులు, కళాభిమానులు అంతరించగానే కళాకారులలోనున్న ఉత్తేజ పూరితమైన కళాశక్తి కొందరిలో అంతరించగా మరి కొందరిలో కుంటుపడుతూ వొచ్చింది. ఒకప్పుడిచట వందకు పైగా కళాకారుల కుటుంబాలుండేవి. కళపట్ల సంఘానికి ఆసక్తి తగ్గగానే కొన్ని కుటుంబాలు జీవికకై వలస పోయినవి. అలా వలసపోగా మిగిలిన కుటుంబాలు స్వగ్రామాన్నే పట్టుకొని పెనుగులాడుతున్నాయి. ఇంకా కాలం మారి శిల్ప కళకు, విగ్రహాలకు గిరాకీ తగ్గగానే ఇచటి కళాకారులు కాలంతో పాటు తమ కళను కూడా మార్చుకున్నారు. ఉదర పోషణకై బజారులో అమ్ముడుపోవు వస్తువులవైపు దృష్టి మరల్చి లోహాలతో (ఇత్తడి, రాగి, వెండి, అల్యూమినియం) వంట పాత్రలు, అలంకరణ సామానులు, యింకాఅనేక వస్తువులను కళాత్మకంగా తయారుచేయడం ప్రారంభించారు. ఎన్ని ఇక్కట్లొచ్చినా, బజారులో చేతి పనులకు గిరాకీ తగ్గినా, వారు తమ వృత్తిని మాని వేరొక వృత్తిని చేపట్టలేదు. కొన్ని మార్పులూ, చేర్పులూ కల్పించి వివిధ చేతి కళాఖండాలను తయారు గావిస్తూ వొస్తున్నారు. పైగా తర తరాలుగా వొస్తున్న కళాత్మకమైన వృత్తిని మాని డబ్బు సంపాదనకై ఇతరవృత్తిని చేపట్టడం ఒక విధమైన ఆత్మవంచనే అవుతుంది. 'మేం కళారంగంలోనే పుట్టాం, దీంట్లోనే పెరిగాం, జీవితాంతం వరకు దీన్నేచేపడ్తాం' అంటారు ఇచట కళాకారులు.

సహకారసంఘం ఏర్పాటు

ప్రభుత్వం వీరిలోని కళాపిపాసను గుర్తించి ఇచట వీరికొక "రాగి, ఇత్తడి, వెండి పారిశ్రామిక సహకార సంఘము"ను నెల

కొల్పింది. 1930లో ఇచట మొదటిసారిగా "అంజుమన్ కసార్" కంచరివారల సహకార సంఘ మనునది స్థాపించబడది. ఇచ్చటి పనివాండ్లు ఎక్కువగా పనులను తమ తమ ఇండ్లయందే చేసేది వారు. 1966లో ఈ సంఘం రూపు రేఖలు దిద్దుకున్నది. 1956లో మూడువేల రూపాయల పెట్టుబడితో నడుపబడిన ఈ సహకార సంఘం నేడు 45 వేల పెట్టుబడితో నడుస్తున్నది. అయినా కళాకారులకు చేతినిండా పని దొరకడం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఇందులో 76 గురు సభ్యులు పని చేస్తున్నారు. ఈ సహకార సంఘంలో ప్రాచీన భారతీయ సంస్కృతిని శిల్పమును స్ఫురింపజేయు విగ్రహాలు వాహనాలు వోటకుపరీలు వివిధ పాత్రలు గృహాలంకరణ వస్తువులు తయారుచేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ దేవాలయాలు పుణ్యక్షేత్రాల్లోకి అవసరమగు విగ్రహాలు రామ లక్ష్మణ హనుమంత ఆండాళు శంకరి పార్వతి రాధాకృష్ణ ఉడయ్యవార్ నమ్మాళ్వార్ లాంటి దేవతల విగ్రహాలు వాటి తొడుగులు తయారు చేస్తారు. ఇచట సహకార సంఘంలో చేర్చిన విగ్రహాల్లో ఒక విగ్రహం ఎరుపు పసుపు తెలుపు రంగుల్లో కనిపించింది.

ఏమండీ ఇత్తడి విగ్రహానికి తెలుపు ఎరుపునీరు పోశారా? అని అడిగాను సెక్రెటరీగారిని.

లేదండీ ఇది ఇత్తడి రాగి వెండి—మూడులోహాలతో తయారు చేయబడింది.

మూడు లోహాలను కలిపి కరిగితే ఇలా మూడు విడివిడి రంగులు ఎలా వొస్తాయండీ ?—అన్నాను.

మూడు లోహాలు విడివిడిగా పోత పోస్తాం. ఒక్కొక్క భాగం ఒక్కొక్క లోహంతో విడివిడిగా పోస్తాం. ఎరుపు రాగి లోహంతోను తెలుపు వెండితోను పసుపు ఇత్తడితోను వొస్తాయి.

ఇచటి పనివారంతా సామాన్యమైన గుడ్డల్లో ఉన్నారు. వారి భాష వారి తీరు చూస్తుంటే ప్రాథమిక విద్యమాత్రం అభ్యసించినట్టే కనిపిస్తుంది. కాని వారిలోని సాంకేతిక పరిజ్ఞానం పనిలోని నేర్పరితనం గొప్పగొప్ప సాంకేతిక నిపుణులను ఇంజనీర్లను సహితం ఆశ్చర్య చకితులను గావిస్తుంది.

ఈ విగ్రహాలు మీరు ఎలాచెక్కుతారండీ ?

ఇవి చెక్కినవి కాదండీ పోతపోసినవి. మొదట అనుకున్న ప్రమాణంలో తేనె మైనంతో విగ్రహాలను తయారు చేసుకుంటాం. దానిపై నుండి కొన్ని పొరలుగా సన్నని పొరలమట్టి దొడ్డుమట్టిని వేసుకుంటూ దాన్ని ఎండలో పెడ్తాం. ఈమట్టినిమేం స్వయంగా తయారు చేసుకుంటాం విగ్రహానికి అడుగుభాగానగాని లేదా పైభాగాన గాని రెండు రంధ్రాలుంచుతాం మట్టి మెత్తకుండా. కరిగిన లోహ పదార్థాన్ని ఆ రంధ్రాలగుండా పోయడానికి. అట్లు అవికొన్ని రోజులు ఎండినతర్వాత దాన్ని కొలిమిలో వేడిచేసి మట్టి మెత్తకుండా ఉంచిన రంధ్రాలగుండా మైనాన్ని తీసివేస్తాం. అప్పుడది బూర తయారవుతుంది. మైనంతో తయారుచేసిన విగ్రహం ఆకారం బూరలా



పోత విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

ఉంటుంది. కరిగిన లోహాన్ని ఆ రంధ్రాలగుండా బూరలో నింపుతాం. మొదట మైనంతో చేసిన ఆకారమే లోహంలో వొస్తుంది. లోహం చల్లారిన తర్వాత మట్టిని పగులగొట్టి విగ్రహాన్ని ఆకురాళ్లతో మెరుగులు దిద్దుతాం.

అంత ఎత్తున కరిగిన లోహాన్ని మట్టి బూరలో పోస్తే బూర పగులకుండా ఏలా వుంటుంది ?

పగులుతుంది. ఎందుకు పగులదు ! కాని అలా పగులకుండా బూరకు ఇనపతీగలు చుట్టి జాగ్రత్త పడ్తాం.

పెద్ద విగ్రహాలకు లోహం ఎక్కువ మొత్తంలో పడుతుంది కదా లోహం తక్కువ పట్టే పద్ధతి ఏదైనా అవలంభిస్తారా ?

అలాంటప్పుడు విగ్రహం ఆకారం మొదట రఫ్‌గా చేసుకొని దానిపై నుండి రెండులేదా ఒక అంగుళం మందంలో విగ్రహం ఆకారన్ని మైనంతో పూర్తి చేస్తాం. అలాంటప్పుడు లోహం మైనం ఉన్నంత వరకే పడుతుంది. పైగా తక్కువ ఖరీదులో తయారవుతుంది. తద్వారా మాకు పోతకూడా సులభ సాధ్యమవుతుంది.


చూడండీ లోహం కరిగేప్పుడు ఎంత కరుగుతారు. ఒక్కొక్కప్పుడు ఎక్కువగాని తక్కువగాని కావొచ్చు గదా ?

అట్లా కాకుండా చూసుకుంటామండీ. ఒక తులం మైనంకు అయిదు తులములు ఇత్తడి నిష్పత్తిచొప్పున కరుగుతాం.

ఒక్కొక్కప్పుడు పోత చెడిపోవొచ్చుగదా ఎట్లాగండి ?

చెడిపోవొచ్చు దానికి మనమేం చేస్తాం ! చెడిపోతే మళ్లీ చేయాలి. సాధ్యమైనంత వరకు చెడిపోకుండా చూస్తాం.

పెద్దపెద్ద విగ్రహాలను ఏ పరికరాలకు బిగించి తీర్చి దిద్దుతారు ?



మావద్ద ప్రత్యేకమైన పెద్దపెద్ద పరికరాలంటూ ఏవీ లేవండీ. కాళ్ళతో, చేతుల్తో కదలకుండా పట్టి చేస్తాం. వీలయితే ఇద్దరం ముగ్గురం కూడా కలసి చేస్తాం.

ఈ శిక్షణ మీరు ఎక్కడ పొందారు ?

మేం ఎలాంటి శిక్షణకూడా పొందలేదు. ఈ పనులు మా ఇండ్లలో తరతరాల నుండి సాగుతూ వొస్తున్నవి. మేంపని చేయడం మొదలు పెడితే దానంతటదే వొచ్చేస్తుంది.

లోహాలుకరిగే పద్ధతి ఎక్కడ నేర్చుకున్నారు ?

మేం ఒకచోట ప్రత్యేకంగా నేర్చుకున్నదంటూ ఏమీలేదు. ఏలోహాన్ని ఎలా కరగాలి, లోహం తేలిక కావడానికి అందులో ఏం కలపాలి ఇవన్నీ మాకు తెలుసు.

అపూర్వ కళా నైపుణ్యం

ఇలా ఏ శిక్షణ, చదువు లేకుండా ఇంత గొప్ప సాంకేతిక శాస్త్రజ్ఞానాన్ని తమలో దాచుకొని "నివురుగప్పిన నిప్పులా" కని పిస్తున్న కళాకారులను ఏవిధంగా అభినందించాలో అర్థం కాలేదు. 'చాలా గొప్పగా ఉందండీ' అని మాత్రం అనగలిగాను. పెద్దపెద్ద విగ్రహాలు, వివిధ వస్తువులు తెల్లగా కనిపిస్తే వెండితో చేసినవని భ్రమ పడతాం. కాని చాలా వరకు ఇత్తడిపై Silver Plating (వెండి నీరు) పోసిందని తెలియగానే వీరికి ఈ లాంటి రసాయనిక సూత్రాలు కూడా తెలియునని ఎంతో ఆశ్చర్యపడతాం.

అల్మారాలో చిన్నచిన్న విగ్రహాలు ఇంట్లోవాడుకొనే వస్తువులు, అత్తర్‌దాన్లు, పన్నీరుదాన్లు, పాన్‌దాన్లు పేపర్ వెయిట్స్, గోడలకు అలంకరణకై తగిలించుకొనే జింక తలలు, అజంతా కళకు సంబంధించిన స్త్రీమూర్తులు, కాకతీయ శిల్పాన్ని పోలే నాట్యభంగిమలు, నటరాజ విగ్రహాలు, గాంధార శిల్పాన్ని పోలిన బుద్ధుని విగ్రహాలు వెండి, ఇత్తడి, రాగి లోహంతో తయారు చేయబడినవి పొందు పర్చబడివి ఇవన్నీ చూస్తున్న వారిలో, క్రమేణా అడుగంటుతున్న ప్రాచీన శిల్ప కళకు వీరు పునరుజ్జీవం పోసి భారతీయ సంస్కృతికే దోహదం చేస్తున్నారనే తలంపు రాకమానదు.

ఇంకా తలుపులకు, బల్లలకు, అల్మారాలకు బిగించుకొను రకరకాల హాండిల్స్, నేంప్లేట్స్ నీరు పోసుకొను వివిధ డిజైన పాత్రలు ఎన్నోఉన్నాయి. టిఫిన్ కారియర్ లాంటి దొకటి కనిపించగానే దీని ఖరీదెంతుంటుందని అడిగాను.

ఇది టిఫిన్ కారియర్ కాదండీ, కుక్కర్. దీనిలో రెండు గిన్నెలుంటాయి. ఒకదానిలో కడిగిన బియ్యం, నీరుపోసి రెండవపాత్రలో కూరగాయలు తరిగి, దానిలో వేయవలసిన సామగ్రింతా వేస క్రిందనున్న బొగ్గులు అంటిస్తే వొంట దానంతటదే తయారవుతుంది. పైగా మీరు దాన్ని మాటిమాటికి చూసి కలపవల సిన అవసరం కూడా ఉండదు. దీన్నిలా ఇంట్లో పెట్టి ఆఫీసు నుండి వచ్చేవరకు వొంట సిద్ధమైపోతుంది.

బాగుందండీ. ఇది బ్రహ్మచారులకు బాగా ఉపయోగపడు తుంది. సరే ఈ వస్తువులన్నీ మీరు మొదటే వివిధ డిజైన్లలో తయారుచేసి ఉంచుతారా, లేదా ఎవరైనా ఆర్డర్ ఇస్తారా ?

కొన్ని అలా సాంపిల్స్‌కై రకరకాల డిజైన్లలో తయారు చేసి ఉంచుతాం. ఎక్కువగా ఆర్డర్స్ పుచ్చుకొని తయారుచేస్తాం.

మీకు ఆర్డర్స్ ఎక్కడెక్కడినుండొస్తాయి?

ఆల్ ఇండియా హాండి క్రాఫ్ట్స్ బొంబాయి, మద్రాసు, కలకత్తాల నుండీ ఆంధ్రప్రదేశ్ హాండి క్రాఫ్ట్స్ వారి నుండీ మరిన్ని వ్యక్తిగతమైన ఆర్డర్లు కూడా వొస్తాయి.

మీ సామానులు కేవలం మనదేశంలోనేనా లేదా ఇతర దేశాల్లోకూడా అమ్మకం అవుతాయా?

మనదేశంలోనే కాక ఇతర దేశాల్లోకూడా అమ్మకానికి పోతాయి. నేటివరకు ఇంగ్లాండ్, అమెరికా, పోలెండ్ ఫ్రాన్స్, జర్మనీ, పాకిస్తాన్ లాంటి విదేశాల్లో అమ్ముడుపోయాయి.

ప్రక్కనే ఒకచిన్న కర్మాగారంలాంటి దుంది. అందులో కళాకారులు వివిధ పరికరాలతో పనిచేస్తూ తమ తమ పనుల్లో నిమగ్నులై ఉన్నారు గాలినిచ్చే సాధనముల (కొలుముల)ను సహితం వారే తయారుచేసుకున్నారు.

శిక్షణ కేంద్రం

అక్కడినుండి సమీపంలోనే ఉన్న "షీట్ మెటల్ ట్రైనింగ్ సెంటర్ కు వెళ్లాను. ఇది ఆల్ ఇండియా హాండి క్రాఫ్ట్స్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్, మద్రాసు—వారి అధ్వర్యమున నడుప బడుతున్నది. ఈ బోర్డువారు మన దేశంలో ఇలాంటి పదకొండు

ట్రైనింగ్ సెంటర్లను నడుపుతున్నారు అందులో ఆంధ్రప్రదేశ్‌కై 3 సెంటర్లు పంపిణీచేసారు అవి తిరుపతి, కరీంనగర్, పెంబర్తి లోనివి పెంబర్తిలోని సెంటర్లో ఇత్తడిరేకులపై వివిధ లతల చెక్కడాలు నగిషీలు, కట్‌వర్క్స్, ఉబ్బెత్తు మొదలగు పనులు నేర్పుతారు ఇందులో 6 గురికి శిక్షణ ఇవ్వబడుతున్నది ఇది రెండు సంవత్సరముల కోర్సు, ఇండియన్ కాఫర్ కార్పొరేషన్ వారు సప్లై చేసే ఇత్తడి రేకులను కొలతల ప్రకారం కత్తిరించి చూసుండగానే వివిధ ఆకారాల్లోకి మలిచి అతుకు తున్నారు వాటిపై రకరకాల డిజైన్లు కట్ చేస్తున్నారు వీరికి శిక్షణ ఇచ్చుటకు ఒక "క్రాఫ్ట్ మాస్టర్" ఉన్నాడు క్రాఫ్ట్ మాస్టర్ కాగితాలపై వివిధ డిజైను తయారుచేస్తున్నాడు కొన్ని రేకుముక్కలపై రకరకాల డిజైను పెన్సిల్ స్కెచ్ వేసి ఉంచాడు ప్రక్కనేఉన్న అల్మారాలో శిక్షణ పొందేవారు తయారు చేసిన వివిధ గృహాలంకరణ, వాడుక వస్తువులు ఎన్నో పొందుపరచబడి ఉన్నవి అందులో ఫ్లవర్‌వాజెస్, టేబుల్ లాంప్స్, హాంగింగ్‌లైట్ షేడ్స్, పేపర్‌వెయిట్స్ డోర్ హాండిల్స్, కాట్‌లెగ్స్, ఆష్‌ట్రేస్ అద్భుతమైన కళానైపుణ్యంతో చూపరులను యిట్టే ఆకర్షింపజేస్తున్నాయి వీటిపై ప్రాచీన హైందవ సాంప్రదాయమునకు సంబంధించిన దేవతల చిత్రములు రాధాకృష్ణులు, దశావతారములు, శివపార్వతీ చిత్రములు, శ్రీకృష్ణుని లీలలు తెలుపు కొన్ని చిత్రములు, నాట్యగత్తెలు మొదలయినవి సున్నితమైన రేఖలతో అంగుళం, అర అంగుళం మేరలో కూడా తీర్చబడినవి మరి కొన్నింటిపైన ఉబ్బెత్తుగా తీర్చనైనవి కొన్నింటిపైన కట్ చేయబడ్డవి వీనిలో కొన్నింటికి వెండిపూత వేశారు

ఏమండీ ఇవన్నీ "ట్రైనీస్" చేసినవేనా ?_అని అడిగాను క్రాఫ్ట్ మాస్టరుగారిని

అవునండీ, వీటిలో కొన్నింటిని మాత్రమే నేను మాడల్స్‌కై తయారు చేసాను మిగిలినవన్నీ ట్రైనీస్ చేసినవే

శిక్షణ ప్రారంభించి ఎంతకాలమైంది ?

ఆరు నెలలు

ఆరు నెలల్లో వీరు పనిలో ఆరితేరిపొయ్యారుగదా ! ఇంకా వీరు నేర్చుకోవలసిందంటూ ఏముంటుందని అడగాలనిపించింది కాని కళకూ, విద్యకూ అంతు అంటూ ఉండదుకదా అని స్మృతిపథంలో మెదిలి ఊరుకున్నాను

ఈ పనిలో మీరేదయినా శిక్షణగాని, సర్టిఫికేట్‌గాని పొందారా ?

దీనికి శిక్షణ సర్టిఫికేట్ అంటూ ఏమీలేదు దీంట్లో కష్టపడి ప్రత్యేకమైన పనితో కొన్ని మాడల్స్ తయారు చేశాను. ప్రభుత్వం నా పనినిగుర్తించి ఈ సెంటర్‌కు నన్ను మాస్టర్‌గా నియమించింది

ప్రభుత్వ సహాయం

ఇచ్చట శిక్షణ పొందేవారికి 80 రూపాయిలు చొప్పున ప్రభుత్వం ఉపకారవేతనం ఇస్తుంది ఇలాంటి కళాకారులను కొందరినితయారుచేసి చేతిపనులను అభివృద్ధి పరచడమే ప్రభుత్వం యొక్క ముఖ్యోద్దేశం ఈ కళా కారులలోని ప్రత్యేకత అతి శ్లాఘనీయమైనది ప్రభుత్వం వీరికి ఎలాంటి పరికరాలనూ సప్లై చేయదు సైజును బట్టి పరికరాలను వీరే తయారు చేసుకుంటారు డిజైన్లలో రోజు రోజుకు మార్పులు కల్పించి సాధ్యమైనంత వరకు జనరంజక మగునట్లు చూస్తారు ఇక చెక్కడాల్లో కాశ్మీర్ డిజైన్ అనుదానిని అనుకరించి, దాంట్లో కొన్ని మార్పులు కల్పించారు కట్‌వర్క్, ఎంబోసింగ్ అనునవి ఈ గ్రామంలోనే కనిపెట్టబడ్డవి కూజాపైకి కవర్ నొకదానిని తీసి చూపించాడు దీనిపై డిజైన్లు కట్‌వర్క్‌లో చూపబడ్డవి ఇవిచేతితో కట్‌చేయబడవో, యంత్రంతో కట్‌చేయ బడ్డవో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉన్నవి దీని ఖరీదు ఎన్నివంద లుంటుందని అడిగాను

వందలెందు కండీ! ఏబది రూపాయిల్లో ఇచ్చేస్తామన్నాడు

ఒక వ్యక్తి దీన్ని ఎన్నిరోజుల్లో తయారు చేసాడు?

రెండు రోజుల్లో తయారు చేస్తాడు

రెండురోజుల్లోనే! అవును మరి మానవుడు సృష్టించిన యంత్రాలే మనుష్యులకు పోటీపడి తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తిని అందిస్తుంటే ఇక మనుష్యులు మాత్రం ఊరుకుంటారా! పెంబర్తి కళాకారుల ప్రతిభే అలాంటిది మరి పెంబర్తి నిజంగా మనం గర్వపడ దగ్గ కళాకేంద్రం ★

(19వ పుట నుండి)

వుంది స్త్రీల కొరకు స్థానాలను ప్రత్యేకించడాన్ని హైకోర్టు సమర్థించింది

చివరి తేదీని పొడగించడానికి ప్రభుత్వానికి అధికారం వుందనీ, ఉత్తర్వులూ, నిబంధనావళీ గెజెటులో ప్రచరింప బడవలసిన అవసరం లేదనికూడా హైకోర్టు పేర్కొన్నది

శ్రీ సాగర్ కేసు సందర్భంలో హైకోర్టు యిచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చాలా ముఖ్యమైనది విద్యా సంస్థలలో, పైన ఉదహరించిన ప్రయోజనాల నిమిత్తం స్థానాలను కేటాయించడానికి గాను ప్రభుత్వానికిగల అధికారాన్నిసవాలు చేయడానికి యిప్పుడు ఆస్కారం లేదు ప్రవేశ నిబంధనలను మార్పుచేయడానికి ప్రభుత్వానికి పూర్తి అధికారం వుంది

ఇతర రాష్ట్రాలలో కూడా యిటువంటి విధానాన్ని అవలంభించడంవల్ల విద్యాసంస్థల ద్వారా జాతీయ సమైక్యతా లక్ష్యాలను సత్వరంగా సాధించడానికి దోహదం కలుగుతుంది ★

సాంద్ర వ్యవసాయంలో యూరియా ఎరువుల వాడకం

ఎల్. వెంకటరత్నం

చాలావరకు మన వ్యవసాయపు పంటల దిగుబడి తక్కువగా వుండానికి కారణం భూసారలోపమే పంట ఉత్పత్తికి భూమి మీదే ఆధారపడ వలసివున్నప్పటికీ, అనేక తరాలుగా మనం భూసారం విషయంలో అలక్ష్యం చేస్తున్నాం మనదేశంలో వరపాతం ఎక్కువగావుండడం వల్ల, ఇక్కడి భూసారం, యితర వేడి దేశాలలో కన్నా ఎక్కువగా కొట్టుకుపోయి భూసారనిధులు వ్యర్థమైపోతున్నాయి అందుచేత మనదేశంలో భూమి బాగా చేవతగ్గిపోయి భూసారానికై మొహంవాచి పోయివుంది నిజానికి యిక్కడి ప్రజల కన్న నేలే ఎక్కువ ఆకలితో వుందనవచ్చు ప్రజల ఆకలిని గూర్చి ఆలోచిస్తున్నంతగా భూమి ఆకలిని మనం పట్టించుకున్నట్టు లేదు

ప్రస్తుతం ఏర్పడ్డ ఆహారకొరతవల్ల వ్యవసాయరంగంలో మనకృషినంతటినీ కేంద్రీకరించవలసినఅవసరం అంతటా గుర్తింపబడింది ఇంతవరకూ మనంచేసిన కృషి సరిపోదని కూడా తెలిసొచ్చింది. ఎక్కువ పండించి ఎకరాదిగుబడిని పెంచాలని సాగునేలను ఎక్కువచేయడంకన్న వున్ననేలలోనే ఎక్కువ పండించి ఎకరా దిగుబడిని పెంచాలని ఈనాడు అంతా అంగీకరించిన విషయమే సేద్యపునేలను విస్తృత పరచి అధికోత్పత్తిని సాధిద్దాం అనే పద్ధతి పాతకాలపు పద్ధతి ఆదిమానవుడు ఒకచోటి నించి మరోచోటికి ఎప్పుడూ నిరంతరంగా తిరుగుతూనే వుండేవాడు కనుక వెళ్ళిన చోటల్లా అరణ్యాన్ని తగులబెట్టి ఆనేలలో రెండు మూడేళ్ళ పాటు సేద్యం చేసి, దానిని వదిలే మరోకొత్త ప్రదేశానికివెళ్ళి అక్కడా అలానే చేసి, ఆతర్వాత యింకోచోటికి వెళ్ళి-ఈవిధంగా ఒక చోటినుంచి మరోచోటికి తరలుతుండేవాడు ఈవిధంగా కొత్తగా ఒక చోటినుంచి మరోచోటికి సేద్యాన్ని మార్చి వేస్తూ, తద్వారా ఉత్పత్తి దిగుబడిలో సేద్యానికి తావిచ్చేవాడుకాదు అయితే యీనాడు జనాభా పెరిగి పోతున్న రేటును దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే మరికొంతకాలంలో సేద్యానికీ, అడవుల్ని పెంచడానికీ అట్టే నేల మిగలదు ఈ శతాబ్దాంతానికి మన జనభా రెట్టింపు కావచ్చు అప్పుడు జనాభా నివాస సమస్య ఏర్పడి అడవుల్నీ, సేద్యపు భూమినీ ప్రజావాసానికి వుపయోగించాల్సి వస్తుంది అందువల్లవున్న సాగునేలలోనే అధిక దిగుబడిని సాధించడానికి ప్రయత్నించడం మంచిది అది అవసరంకూడా

నత్రజనిసంబంధమైన ఎరువులు

సాంద్ర వ్యవసాయానికి-అంటే ఉన్న సేద్యపునేలనుంచే అత్యధిక దిగుబడిని సాధించడానికి-పూనుకున్నప్పుడు ఆ విధంగా అధిక దిగుబడిని సాధించడానికి తేలిక పద్ధతులు ఏమైనావున్నాయేమో ముందుగా మనం ఆలోచించాలి భారత దేశంలో సేద్యానికి ఉపయోగిస్తున్న నేలలో సాధారణంగా నత్రజని లోపిస్తూ వుంటుంది ఇతర దేశాలతో పోల్చిచూస్తే మనదేశంలో నత్రజని సంబంధమైన ఎరువుల వినియోగం చాలతక్కువనే చెప్పాలి ఈ దిగువ పట్టికనుచూస్తే ఆవిషయం వెల్లడికాగలదు —

దేశం	ఒక ఎకరానికి వినియోగించే ఎరువు (పౌనులలో)
జపాన్	233 57
హాలెండ్	181 77
బెల్జియం	171 08
పశ్చిమ జర్మనీ	147 97
ఇంగ్లాండు	57 35
ఫ్రాన్స్	50 84
యు ఎ ఆర్	45 46
ఇటలీ	36 67
అమెరికా	13 94
రష్యా	23 53
భారతదేశం	1 27

జపానువంటి అభివృద్ధిచెందిన దేశాల స్థాయికి మనం ఎదుగవలెనంటే మనం వాడుతున్న నత్రజని ఎరువుకు యింపు మించు రెండువందల రెట్లు ఎక్కువగా వినియోగించాలి అంటే అసాధారణమైన, బృహత్తరమైన కృషి చేయాలన్నమాట

యూరియా ఎరువుల ప్రయోజనాలు

వరిపంట ఎకరాకు మొత్తం 10 కి గ్రాముల నత్రజని కావాలనుకుంటే మన దేశానికి మొత్తం కృత్రిమ ఎరువులు 2 కోట్ల టన్నుల వరకు అవసరమౌతాయి.

1	అమోనియం సల్ఫేటు	1 కోటి టన్నులు
2	యూరియా	40 లక్షల ..
3	కాల్షియం అమోనియం నైట్రేట్	40 .. ..
4	అమోనియం సల్ఫేట్ నైట్రేట్	20 .. ..

ఇంతవరకు అమోనియం సల్ఫేటును, కాల్షియం అమోనియం నైట్రేట్‌ను ఉత్పత్తి చేయడానికే ఎక్కువ ప్రాధాన్యతను యిస్తూవచ్చారు ముందు ముందు మనం వినియోగించే ఎరువులో

కనీసం 60 శాతం, యూరియాను వినియోగిస్తే, తద్వారా 10 కోట్ల రూపాయల మేరకు రవాణా ఛార్జీలు కలిసివస్తాయి. రవాణా సదుపాయాలు సరిగా లేక ముఖ్యంగా వార్తా సౌకర్యాలు, గిడ్డంగి సౌకర్యాలు తగినంతగా లేక యిప్పుడు ఎరువులు సకాలంలో గ్రామాలకు చేరడంలేదు. అందువల్ల అమోనియం సల్ఫేటు స్థానే యూరియా ఎరువుల్ని వినియోగించడం సమంజసం. ఎందుకంటే అమోనియం సల్ఫేటును భద్రపరచడానికి ఎంత స్థలం కావలసివస్తుందో యూరియా ఎరువుల్ని భద్రపరచడానికి అంతే స్థలం కావాలి వస్తుంది. అంతే పరిమాణం అవసరమౌతుంది. యూరియా ఎరువులు అమోనియం సల్ఫేటు ఎరువులకన్న రెట్టింపు పంటనేలకు వాడవచ్చు. పైగా సేద్యపుసీటి ప్రాజెక్టులో పాలవరి, వరి, చెరకు పండించే ప్రాంతాలలో ఎక్కువ విస్తీర్ణంలో మురుగు, చెమ్మ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటిచోట అమోనియం సల్ఫేటునుగానివేస్తే అమోనియం సల్ఫేటులో వుండే సల్ఫర్ క్రమక్రమంగా హైడ్రోజన్ సల్ఫైడ్‌గా రసాయనికచర్య జరిగి విషపూరితం కావడానికి ఆస్కారం వుంది. అప్పుడు మొక్క మాడిపోతున్న రంగుగా గాని, మట్టిరంగుగా గాని కనిపిస్తుంది. వ్రేళ్ళు క్రమక్రమంగా నశించిపోతాయి. ఇలాంటిచోట్ల అమోనియం సల్ఫేటునువేయడంవల్ల హైడ్రోజన్ సల్ఫైడ్ తయారయి చెడు వాసన వేస్తుంది. అటువంటి మురుగు ప్రాంతాలు ఉత్తర ప్రదేశ్ తరాయీ ప్రాంతంలోవున్నాయి. పంజాబు, బీహారులో ప్రవాహంతో కొట్టుకొచ్చినసీరు నిలవవుండి మురుగు రొంపి భూములు ఏర్పడ్డాయి. దేశంలో సముద్ర తీర ప్రాంతాలలోనూ అటువంటి రొంపి భూములు వున్నాయి. ఈప్రాంతలన్నిటా యీవిధమైన పరిస్థితులే నెలకొని వున్నాయి. మురుగు, రొంపి భూముల్లో పంటలకుదెబ్బతగులకూండా వుండాలంటే యూరియా చాలా చక్కటి ఎరువు. ఇది నేలకు అవసరమైన నత్రజనిని మాత్రమే సరఫరా చేస్తుంది. ఆమ్ల గుణాలుగల నేలలో అమోనియం సల్ఫేటు ఎరువుల్ని వేయడం అంత సమంజసమైనదికాదు. అలాటిచోటలో యూరియా గాని, కాల్షియం నైట్రేట్ గానీ వాడడంమంచిది.

బంగాళాదుంపలు, కేబేజి, అరటి, చెరకు, కొబ్బరి, పోక వంటి వాటికి యూరియా ఎరువు వాడవచ్చు. ఇటువంటి వాటికి ఎక్కువ సీరు కావాలి. యూరియా ఎరువు అమోనియం సల్ఫేటు కన్న, కాల్షియం అమోనియంనైట్రేట్‌కన్న చాలా శీఘ్రంగా నత్రజనిని మొక్కకు అందజేస్తుంది.

మన పంట దిగుబడిని హెచ్చించాలంటే యూరియా ఎరువు వేయడం అవసరం. సాంద్ర వ్యవసాయంలో యూరియా ఎరువును వుపయోగిద్దాం.

(11వ పుట నుండి)

పర్యాయ పదములుగ నిఘంటుకర్తలు చెప్పిరి. ఇట్లు మీనాయనము మేషసంక్రమణము దగరగనగుట ఇప్పటికి సుమారు 4000 సంవత్సరములకు పూర్వమే ఆయెను. ఇప్పటికి సుమారు 1680 సంవత్సరములకు పూర్వము మేషాయనము మేషసంక్రమణమున్ను ఒకమారయ్యెను. ఇపుడు మేషాయనము వృషభ సంక్రమణమునకు సమీపముగ నగుచున్నది. ఇది వసంతవిషువద్బిందువు (క్రాంతివృత్తవిషువవృత్త సంపాత బిందువులు) వెనుకకు పోవుచుండుటచే గలుగుచున్నది. ఈ సంపాతముయొక్క గతి సంవత్సరమునకు లిప్తలు 50.2. అట్లు సంవత్సరములు 71.6 అగుసరికి సంపాతము భాగం (డిగ్రీ) వెనుకకుబోవును. నక్షత్ర సౌర సంవత్సరమున సూర్యుడు సంపూర్ణముగ 360 భాగలను నడచుట యగుచున్నది. సాంపాతిక సంవత్సరము సూర్యుడు భా359 వితలు 11 వి.లి.98 నడచునప్పటికే పూర్తియగుచున్నది ఋతువులు వర్షపాతాదికము సాంపాతిక సంవత్సరములోనివి. ఈ విషయములను గమనించి సవరింపవోవుటచే కొన్ని ఫలములు సరిపడుట లేదు. ఋతువులను సరిగ గుర్తించుట వైద్యశాస్త్రప్రకారము వైద్యము చేయువారికి ఆవశ్యకము ఋతుపరివర్తనమును సరిగ గమనించి ఫలములు వ్రాసిన వ్యవసాయమునకు వర్తకమునకు గొప్పగ ఉపకారముకాగలదు. ఈ శాస్త్రమును శోధించి నూతన సంస్కరణముతో ఫలశాస్త్రమును సంస్కరించి వ్రాయుట దేశమునకు శ్రేయోదాయకము.

విద్యుచ్ఛక్తి

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా: కార్యక్రమాల ప్రగతి

ముందు ముందు గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేందుకు పూనుకునేటప్పుడు, అధికాహారోత్పత్తి సాధనకు ప్రాధాన్యం చూపవలసి ఉంటుంది గ్రామాలలో నివసించే లక్షలాది ప్రజల ఉపయోగానికై విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేందుకు సకల ప్రయత్నాలు జరుగుతున్నాయి ఇప్పటికప్పుడే 12 కోట్ల మంది ప్రయోజనం పొందారుకూడా

ప్రస్తుతం దేశంలో దాదాపు 50 వేల గ్రామాలకు విద్యుత్ సరఫరా సదుపాయం ఉన్నది ఒకలక్ష పైచిలుకు గ్రామాలకు ఈ సౌకర్యాన్ని కలుగ జేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు జాతిపిత గాంధీజీ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా 1969 అక్టోబరునాటికి ఈ లక్ష్యాన్ని సాధ్యమైనంతవరకూ చేరుకోడానికి చర్యలు తీసుకుంటున్నారు

స్వాతంత్ర్యం లభించిన లగాయతు భారతదేశంలో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసే కార్యక్రమం తీరుతెన్నులు అనేక విధాల గమనించదగవి ప్రథమ పంచవర్ష ప్రణాళిక చేపట్టక పూర్వం, 1951కి ముందు, మనదేశంలోని ప్రతి 150 గ్రామాలలోనూ ఒక గ్రామానికి మాత్రమే విద్యుత్ సరఫరా సదుపాయం ఉంటూండేది అలాంటిది ఇప్పుడు ప్రతి 10 గ్రామాలలోనూ ఒక గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా అవుతున్నది. 1951 కి పూర్వం దేశంలో మొత్తం 3,678 గ్రామాలకు మాత్రం విద్యుచ్ఛక్తి సరఫరా అవుతూ ఉండినదల్లా ఈ సంవత్సరం మార్చి నెలాఖరునాటికి, 61,092 గ్రామాలకు ఈ సౌకర్యం కల్పించ గలిగారు ఒకటిన్నర దశాబ్దం అయ్యీ కాకుండానే దేశంలో విద్యుదుత్పాదక శక్తి 27 లక్షల కిలోవాట్ల నుంచి, కోటి 23 లక్షల కిలోవాట్లకు పెరిగింది

స్వాతంత్ర్య సముపార్జనకు పూర్వం దేశంలో విద్యుదుత్పత్తి సరఫరా కార్యక్రమాలు ఏమంత చెప్పుకోతగినంతగా ఉండేవికావు అందుకై లైసెన్సు పొందిన ప్రయివేటు ఆసాముల అధ్వర్యాన ఆపనులు జరుగుతూ ఉండేవి 1948 లో విద్యుచ్ఛక్తి సరఫరా వ్యవహారాల శాసనాన్ని రూపొందించి నప్పటినుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలలో విద్యుదుత్పత్తి సరఫరా కార్యక్రమాలను సహేతుకమైన ఒక పద్ధతిన సమన్వయించడానికి పూనుకొనటం మొదలయింది

ప్రణాళికల ప్రాతిపదిక

మొదటి పంచవర్ష ప్రణాళికను చేపట్టడంలోనే, గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడంతోసహా విద్యుచ్ఛక్తికి సంబంధించిన వివిధ కార్య కలాపాలను, ముందుగా అనుకున్న ఒక పద్ధతి ప్రకారం సమన్వయ పూర్వకంగా చేపట్టడంకూడా మొదలయింది మొదటి ప్రణాళికలో ఈ యీ పనులకుగాను 27 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు ఇలాంటిది మూడవ ప్రణాళికా కాలంలో ఇందుకు 110 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగింది

అనేక కారణాల మూలంగా, గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేపని అన్ని రాష్ట్రాలలోనూ ఒకరకంగా సాగలేదు ఇంతవరకు ప్రధానంగా పరిశ్రమలలో వాడకానికీ, పట్టణాలకు సరఫరా చేయటానికిగాను విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతూ వచ్చింది ఉత్పత్తి అయినమొత్తం విద్యుచ్ఛక్తిలో కేవలం 7 లేక 8 శాతం మాత్రమే, గ్రామాలలో వాడకం అవుతూ ఉంది

ఐతే రాష్ట్రంలోని మొత్తం గ్రామాలలో సగానికి పైచిలుకు గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయగలిగిన ఘనత మద్రాసుకు దక్కింది ఈ విషయంలో ద్వితీయస్థానం కేరళ రాష్ట్రానిది అక్కడ 39 70 శాతం గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతున్నది

మూడవ ప్రణాళిక ముగుస్తూన్న దనగా 1966లో, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే విషయమై అనుసరిస్తూండిన వైఖరిలో కొంత మార్పువచ్చింది ఇళ్లలో వాడకానికంటె, పొలాలకు నీరు సప్లయి చేయడానికవసరమైన పంప్ సెట్లకూ, గొట్టపు బావులకూ విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి అధిక ప్రాధాన్యం చూపడం మొదలయింది అధికాహారోత్పత్తి సాధనకు తోడ్పడే నిమిత్తం తలపెట్టిన ఈ మార్పును పురస్కరించుకుని, మూడవ ప్రణాళిక చివరి రెండు సంవత్సరాలలోనూ, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేసే పథకాలకు మామూలుగా కేటాయించే సొమ్ముకు మించి 11 కోట్ల 21 లక్షల రూపాయలు కేటాయించారు

గ్రామాలలో, భూమి అడుగున నమ్మకంగా తగినంత నీరు లభ్యమయ్యే ప్రదేశాలలో ఏర్పాటైఉన్న పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి

సరఫరా చేసేందుకు ప్రాధాన్యం చూపుతూనే పల్లెల్లో ఇతర వాడకాలకు కూడా విద్యుచ్ఛక్తి లభించేట్లు చూడడానికై సమగ్రమైన పథకాలను రూపొందించవలసిందిగా వివిధ రాష్ట్రాలను కోరడం జరిగింది.

దేశంలో వరుసగా రెండు సంవత్సరాలపాటు వర్షాలు పడక పోవటాన, అంతకంతకూ ఎక్కువ పంప్‌సెట్లకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయవలసిన ఆవశ్యకత పెరిగింది. మూడవ ప్రణాళిక ఆఖరుకి మొత్తం 5,10,000 పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా మొదలయింది. వీటిలో 1,09,000 పంప్ సెట్లకు, ప్రణాళిక చివరి సంవత్సరంలోనే ఈ సదుపాయాన్ని కల్పించగలిగారు.

1966_67 సంవత్సరంలో బాగా పెద్దఎత్తున కార్యక్రమాన్ని చేపట్టి దాదాపు 1,43,000 పంప్ సెట్లకూ, గొట్టపు బావులకూ విద్యుచ్ఛక్తి సరఫరాచేయటమయింది. పంప్ సెట్లను, గొట్టపు బావులనూ ఏర్పాటుచేసుకోవటంలో మద్రాసు, ఆంధ్రప్రదేశ్ దేశం మొత్తంమీద ప్రథమ, ద్వితీయస్థానాలను వహిస్తాయి. మద్రాసులో అవి 2,77,891, ఆంధ్రప్రదేశ్‌లో 73,959 ఉన్నాయి గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసే పని కుంటుపడకుండా చూడడానికై ప్రభుత్వం చాలినంత సొమ్ము కేటాయిస్తుంది. 1966 67 లో వేర్వేరు రాష్ట్రాలకు సహాయంగా 39 కోట్ల 38 లక్షల రూపాయలు కేటాయించారు ఇదికాక, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనే సందర్భంలో గొట్టపు బావులకూ, పంప్ సెట్లకూ విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికిగాను మరో 22 కోట్ల 79 లక్షల రూపాయలను కూడా రాష్ట్రాలకు సహాయంగా ఇచ్చారు

చార్జీల తగ్గింపు

1966_67 లో చేపట్టడానికై మామూలుగా రూపొందించిన కార్యక్రమానికి అదనంగా వీలైనన్ని ఎక్కువ పంప్‌సెట్లకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసేందుకు సమగ్రమైన పథకాలను తయారు చేయవలసిందిగా బీహార్, ఉత్తర ప్రదేశ్‌లను కోరడమయింది. ఆ రెండు రాష్ట్రాలకూ 6 కోట్ల రూపాయలు అదనపు సహాయంగా సమకూర్చారు కూడా. దీనిమూలంగా బీహార్‌లో 14,000 పంప్ సెట్లకూ, ఉత్తర ప్రదేశ్‌లో దాదాపు 17,000 పంప్ సెట్లకూ కొత్తగా విద్యుచ్ఛక్తిని సరఫరా చేయగలిగారు.

పొలాలకు నీరు పెట్టుకునేందుకై గ్రామస్థులకు వీలైనంత చవకగా విద్యుచ్ఛక్తి సరఫరా అయేట్లు చూడాలనుకుంటూన్న కేంద్ర ప్రభుత్వం, రైతాంగానికి ఉపయోగపడేవిధంగా విద్యుచ్ఛక్తి ఛార్జీ యూనిట్‌కు 12 పైసలకు మించకుండా చూడవలసిందని రాష్ట్రాలను కోరింది. ప్రస్తుతపు రేట్లు ఇంతకుమించి ఉన్నట్లయితే ఆ వ్యత్యాసాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చొప్పున సబ్సిడీగా 1966_67 నుంచి మూడేళ్లపాటు భరించాలని నిశ్చయించారు.

విద్యుచ్ఛక్తి ఉత్పత్తి ఖర్చులను మరింత తగ్గించే ఉద్దేశంతోలో, అమెరికా తోడ్పాటుతో, గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడానికై ఆంధ్రప్రదేశ్‌తోసహా అయిదు రాష్ట్రాలలో కొది ఎత్తున సహకార సంఘాలను [illegible] జరిగింది. ప్రాథమిక పరిశీలన పూర్తి అయి సవివరమైన పరిశీలన జరుగుతూంది. చవకగా విద్యుచ్ఛక్తిని గ్రామస్థులకు సరఫరా చేసేందుకేకాక, విద్యుత్ సరఫరా విషయంలో అటానమీ అధికారాలను కొంతవరకూ స్థానిక ప్రజలకు ఇవ్వటం ద్వారా వారు బాధ్యతాయుతంగా వ్యవహరించేట్లు చూడడానికి, అవసరమైన పరికరాలనూ ఇతర సరంజామానూ సేకరించడానికీ, నెలకొల్పడానికీ అవసరమైన పెట్టుబడి పెట్టడానికీగాను స్థానికంగా కొన్ని సంస్థలను ఏర్పాటుచేయడానికీ, గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే కార్యక్రమాలను దేశమంతటా చురుకుగా ప్రామాణికమైన పద్ధతిని జరపడానికి కూడా ఈ సహకార సంస్థలు తోడ్పడతాయి.

"శ్రమదాన" పథకాలు

స్థానిక ప్రజల "శ్రమదానం" తో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసేందుకు కూడా కృషి జరుగుతూంది. కృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాలో కొద్దిఎత్తున ఇలాంటి పథకం ఒకటి అమలుజరిపారు. 7 లక్షల 95 వేల రూపాయల ఖర్చుతో ఈ పథకం మేరకు 150 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడం మొదలయింది. 163 పంప్ సెట్లకు విద్యుచ్ఛక్తి లభిస్తుంది. ఈ పెట్టిన ఖర్చులో దాదాపు 10 శాతం_అంటే 83 వేల రూపాయలు_సాలీనా రాష్ట్ర విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలికి లభిస్తుంటాయి.

ఈ పథకం వల్ల ప్రయోజనం పొందిన గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి, బండరాళ్లను పగలగొట్టడం, స్తంభాలను పాతడానికి అవసరమైన గోతులు తవ్వటం, సరఫరా తీగెలను స్తంభాలకు బిగించడం వంటి పనులను శ్రమదాన రూపేణా ఉచితంగా చేయటం ఇక్కడి విశేషం. డబ్బు ఏదీ తీసుకోకుండా సామాన్లు మోయడానికి బండ్లను 363 సార్లు త్రిప్పారు. ఒక్కొక్క మనిషి ఒక రోజుచేసే పనికి 2,483 రెట్లపనిని ఈ గ్రామస్థులు ఉచితంగాచేశారు. ఇందువల్ల విద్యుత్ సరఫరా పథకానికయ్యే ఖర్చు చాలావరకు తగ్గింది ఇలాంటి పనివిషయంలో స్థానిక ప్రజలకు ఉత్సాహం ఆసక్తి కూడా కలిగాయి.

సీరియల్

భాగ్యచక్రం

ఆరెకపూడి కౌసల్యాదేవి



జరిగిన కథ

తండ్రి మతి చాంచల్యాన్ని బాగుచేసిన బావ శ్రీ నగేష్ అంటే జయశ్రీకి చిరాకు. అతను ఎంత సన్నిహితంగా రావాలని ప్రయత్నించినా తనంత తానే దూరమై పోయింది జయశ్రీ. అప్పటికీ అతను చూపిస్తున్న అభిమానాన్ని స్వార్థ పూరితమైనదిగా భావించి తూలనాడింది. అతనిమీద కక్ష కొద్దీ అతని దగ్గర అసిస్టెంటుగా వున్న శ్రీకాంత్‌ను పెళ్ళాడాలని నిశ్చయించుకుంది. చూడ వచ్చిన మేనత్త శ్రీదేవిని దూషించింది.

జయశ్రీ తర తమ భేదంలేకుండా మాట్లాడుతుంటే శ్రీదేవి తననుతాను సర్ధిచెప్పుకోలేక పోయింది.

"మూర్ఖురాలా! పెద్దదాన్నన్న గౌరవం కూడా నీకు లేదు. నా కొడుకు లక్షణంగా పెళ్ళి చేసుకొని కాపురం చేసుకొంటూంటే ఇంకా నీ మీద కోపమెందుకు నాకు? నువ్వు నా కోడలివైనా కాకున్నా ఎక్కడైనా ఎప్పుడైనా సుఖంగా వుండాలనే కోరుతున్నాను కోరుకుంటున్నాను. ఆపైన దైవలిఖితం ఎలావున్నదో! అయినా ఈ శుభ సమయంలో పెద్దదాన్ని అశుభం ఎందుకు పలకాలి? ఏమో పెళ్ళి అయ్యాక అల్లరీ, ఆటలూ కట్టిపెట్టి బుద్ధిగా వున్న వాళ్ళెందరో వున్నారు. శ్రీకాంత్ కూడా అలాగే బుద్ధిమంతుడౌతాడేమో! కలకాలం సుఖంగా వుండు. వెళ్తున్నాను."

జయశ్రీ క్రోధ, మౌనాలను విడువలేదు.

"ఏది ఎలా జరిగినా, నా బాధ్యతను నేను నిర్వర్తించానన్న తృప్తి నాకు మిగుల్తుంది." స్వగతంగా అనుకుంటూ నిష్క్రమించింది శ్రీదేవి.

"ఎవరమ్మా ఆ మాటలు?" మేడమీద నుండి శ్రీపతి ప్రశ్నించాడు క్రింది హాలులో కుమార్తెను.

"అత్తయ్య, వచ్చి వెళ్ళిపోయింది."

"అరరే! నా కెందుకు చెప్పలేదు? ఈ పెళ్ళియింట్లో పెద్ద ఆడ దక్షత అంటూ లేని లోటు ఎంతో కన్పిస్తున్నది. కాస్త ఈ పదిరోజులూ వుండమనలా నువ్వు? అయినా యిప్పుడే వచ్చి యిప్పుడే వెళ్ళడమేమిటీ నాకు కన్పించకుండా? ఉండు పిలుస్తాను."

"అక్కరలేదు. పరుగెడుతూన్న తండ్రిని మాటలతోనే అధికారంతో ఆపింది జయశ్రీ. "ఆవిడ వచ్చిన పని వేరు. పెళ్ళి చేయించడానికి గాదు; చెడగొట్టడానికి." అంటూ సర్వం వివరించింది.

"అయ్యయ్యో! మీ అత్తయ్య చెప్పిన మాటలు నిజమే ఔతాయి. పెద్దది. గుణవంతురాలు— నీమేలు కోరుతుందిగాని కీడు కోరుతుందా?" కూతుర్ని మందలించబోయాడు శ్రీపతి.

"చాలిద్దూ నాన్నా. ఎంతైనా ఆ చెల్లిలికి తగిన అన్నవే. శ్రీకాంత్ చాలా మంచివాడు. ఆవిడ తన కక్షను సాధించాలని వచ్చింది. అంతే."

కుమార్తె అతి విసుగుదలను చూచిన తండ్రి మరి కిమ్మన లేదు.

అతి వైభవంగా జరుగుతూన్న కుమార్తె వివాహాన్ని తిలకిస్తూంటే శ్రీపతి ఆలోచనలు పరిపరి విధాల పోయాయి. కుమారులూ, వారి వివాహాలూ, తన కుటుంబం యొక్క పూర్వపు ఔన్నత్యమూ అన్నీ గుర్తుకు వచ్చి మనస్సు వికలమైపోయి

ఒక్కసారి తల తిరిగిపోయింది. హఠాత్తుగా మనసున రేగిన ఆ దాహామోహనం వెనువెంటనే తట్టుకోలేని శ్రీపతి తెలివి తప్పి పడిపోయిన విషయం, వివాహ వేదికపై నున్న జయశ్రీ చెవుల వరకూ వెళ్ళనేలేదు.

తంతు యావత్తూ ముగిసిన పిమ్మట తండ్రి పాదాలకు నమస్కరించి ఆశీర్వచనం బడయగోరిన వధువు, అప్పుడు అసలు విషయం తెలిసి, కంట తడిపెడుతూ తండ్రి శయ్యను జేరింది.

"ఆఁ దానికేముంది? మరి కాస్సేపటికో, తెల్లారేసరికో తేరుకుంటారు. ఇది మామూలేగా. ఆయనకు. అందుకే నీతో చెప్పలేదు. పెళ్ళిపీటలమీద వుండగానే తెలిసింది నాకు." అంటూ తేలిగ్గా సిగరెట్ వెలిగించాడు శ్రీకాంత్.

అలా నిశ్చింతగా, నిబ్బరంగా, తనకేం పట్టనట్లున్న భర్తను చూస్తూంటే జయశ్రీ కనుబొమలు అప్రయత్నంగా ఆమెకు తెలియకుండానే ముడిపడ్డాయి. ఆమె అనుమతి లేకుండానే మనస్సు ఆలోచించసాగింది. బావ శ్రీనగేష్ అయితే ఈ పరిస్థితులలో యిలాగే ప్రవర్తించేవాడా? ఊఁహూ. ఒక్కనాటికీ అతడలా నిర్లక్ష్యం చేయడు నాన్నను. కడకు సూత్రధారణ సమయంలోనైనా అది ఆపి ముందు నాన్న సంగతి చూచివుండే వాడు!

తన ఆలోచనకు తానే ఉలికి పడింది జయశ్రీ. "ఏమిటిది? ఎందుకిలా ఇద్దరినీ పోల్చి చూస్తున్నది నా మనస్సు? నా హృదయంలో శ్రీనగేష్‌కు యింతటి స్థానముందా?" ఆవేశంతో అల్లాడిపోయింది ఆ అబల అంతరంగం. ఛీ! ఏమిటీ శ్రీనగేష్ ప్రత్యేకత? ఎందుకిలా నా ఆలోచనలలోనికి వస్తాడు పదేపదే? ఎవరు రమ్మన్నారు? ఎలా వచ్చిందితడికి నా మీద యింత ప్రభావం?"

అనుకోకుండా వచ్చి ఆ సమయంలో తన మనసున తిష్ఠ వేసిన శ్రీనగేష్ ప్రతిమను అతి బలవంతంపైన తాత్కాలికంగా త్రోసివేసింది జయశ్రీ.

* * *

హఠాత్తుగా ఏదో గందరగోళం వినరావడంతో ప్రశాంత సుందర వాతావరణం చెదరిపోయింది.

"జయా! మీనాన్నగారికి విపరీతంగా ఫిట్లు వస్తున్నాయి!" గది బయట గొళ్ళెం కొట్టి చప్పుడుచేసి, చెప్పి వెళ్ళిపోయారెవరో.

చటుక్కున లేచి వెళ్ళబోయిన జయశ్రీని వదలిపెట్టలేదు శ్రీకాంత్. "పోనిద్దూ, అది మామూలేగా? ఈ మొదటి రోజున ఎంత సుఖంగా, చక్కగా గడపాలి మనం ఈ రోజు!"

జయశ్రీ కొంచెం వెనుకాడుతూ అన్నది "నిజమే! కాని ఎంతో విపరీతంగా వుంటేకాని ఈ సమయంలో నాకు చెప్పరు కదా!"

"అందుకని ఏమంటావ్?" అతి కఠినంగా పలికింది శ్రీకాంత్ కంఠం. "శోభనం రాత్రి మొగుడు ముఖ్యమా, పిచ్చి తండ్రి ముఖ్యమా?" అంటూనే లైట్ తీసేశాడు.

"ఏమిటీ......ఏమిటి మీరనేది?" శ్రీకాంత్‌లో అది వరకెన్నడూ చూడని కఠినత్వాన్ని నేడు చూస్తున్న జయశ్రీ కంపించి పోతూ అడిగింది.

"అంతగా అర్థం కాకపోవడానికి నేనేమి పరభాషలో చెప్పడంలేదే! తెలుగులోనే నేను మాట్లాడేది!"

నివ్వెరపాటు చెందిన జయశ్రీ కంఠం మూగపోయింది.

"ఇంకా పిచ్చిపూర్తిగా తగ్గని ముదే ఒక్కడినీ నౌకర్ల పర్యవేక్షణకు వదలి దేవిగారు పొలంగట్ల వెంబడీ, నదీ తీరాలకు విహారార్థం వెళ్ళి గంటలు గంటలు గడపడం నేనెరుగుదును. ఇక అట్టే తర్కించకు." ఖండితంగా అన్నాడు.

నిస్సహాయతతో గిలగిల లాడుతూన్న జయశ్రీ అంతరంగంలో ఎందుకో ఒక్కసారిగా శ్రీనగేష్ రూపం కదులాడింది. "ఈ పరిస్థితిలో బావ అయితే యిలా చేసేవాడా?" తన మనస్సే తనను నిలదీసి అడుగుతూంటే జయశ్రీ తెల్లబోయింది. లోలోన శ్రీనగేష్ తనకు తానై దగ్గర కావించబోయినా తాను ప్రయత్నపూర్వకంగా దూరంగా త్రోసివేసింది. అతడికి అప్పట్లో ప్రాధాన్యతేలేదు. మరి అతడిప్పుడు అడుగడుగునా తన జీవితపు ప్రతి ప్రధాన ఘట్టంలోనూ ఎందుకలా వచ్చి మనస్సున తిష్ఠవేస్తున్నాడు? ఈసారి ఈ ఆలోచనతో పూర్వం వలె ఆమె మనస్సులో క్రోధం రగుల్కొన లేదు; పదేపదే వచ్చి మనస్సున నిలుస్తూన్న అతడి ఆకారాన్నీ, ఆలోచనలనూ బలవంతంగా పార ద్రోలడానికి ప్రయత్నించలేదు. తనకు తెలియకుండానే మనస్సు ఆత్మవిమర్శ చేసుకోవడం ప్రారంభించింది: 'శ్రీనగేష్‌ను తృణీకరించడంలో నేను తెలివితక్కువగా ప్రవర్తించానా?'

తెల్లవారులూ నిదురలేకగడిపిన జయశ్రీ తెలతెల వారుతూండగానే లేస్తూ ప్రక్కనే నిశ్చింతగా నిదురిస్తూన్న భర్తను చూచి ఈర్ష్య జెందకుండా వుండలేక పోయింది. తనకు అయిష్టంగా ప్రవర్తించి, తన బాధను తనను వదిలివేసే భర్త కూడా ఒకభర్తేనా? సున్నిత హృదయాలులేని దాంపత్యం కూడా ఒక దాంపత్యమేనా? ఆనందంతో, మధురానుభవాలతో మత్తెక్కించి పరవశింప జేయాల్సిన ఈ మొదటిరోజు యిలా మనోదేహాలు రెంటికీ బాధాకరమై పరిణమించాయి. బావ శ్రీనగేష్ అయితే అనుభవాలు యిలాగే వుండేవా? అతి మృదు హృదయుడైన అతడితోడి ప్రణయం మధుర మనోజ్ఞమై పరిణమించక పోయేదా?

మస్తిష్కంలో ఆ యోచన మెదలగానే మేను తృళ్ళిపడింది. 'భగవాన్! జీవితంలో అతి ముఖ్య సమయాలలో, ఆనందంతో లాస్యంచేయాల్సిన క్షణాలలో, అందునా భర్త సమక్షంలో, పరాయి పురుషుడు గుర్తు రావడం ఎంత విచారకర విషయం! ఎంత సిగ్గిల వలసిన సంగతి! వివాహమైన ఈ మొదటి రోజులే యింత చిత్రవధా సాదృశ్యమై బాధిస్తూంటే ఇక ముందు జీవితం ఎలావుంటుంది?'

నవ వధువువలె సుందరమైన నును సిగ్గుతో కాక, తండ్రిని రాత్రి చూడలేకపోయాననే అనే లజ్జతో—బాధతో కుంచించుకు పోతూ, బంధువుల—స్నేహితుల బాణాల వంటిచూపులకు ముకుళించుకుపోతూ

తం(డిగదిలో అడుగు పెటింది జయశ్రీ అప్పుడే పరీక్ష ముగించి పోబోతున్న డాక్టర్ దెస ప్రశ్నార్థకంగా చూచింది డాక్టర్ చెప్పాడు "క్రొత్త జబ్బేమీలేదు మనస్సుచాలా బలహీనస్థితిలో వుది ఆయన మనస్సునూ, పరిసరాలనూ ఏ సమస్యలూ గందరగోళాలూ లేకుండా వీలైనంత ప్రశాంతంగా వుండ నీయండి పూర్వంలాగే ఏపల్లెటూరికో వెళ్ళిపోతే మరీ మంచిది" అంటూనే డాక్టర్ నిష్క్రమించాడు

నాన్నా! ఒక్కసారి తండ్రిని చేతులతో చుట్టివేసి బావురుమన్నది జయశ్రీ తండ్రి మతిభ్రమణానికీ, తన ఒంటరి జీవితానికీ లోగడ చీకాకు జెంది విసుగుతున్న ఆమెకు నేడు ఒక్కనాటి పతి ర్లక్ష్యంతో తండ్రివిలువ తెలిసివచ్చింది ఏమిటిది నాన్నా మళ్ళీ?'

'ఏంలేదు తల్లీ ఊరుకో, ఏదోకాస్త మనస్సు కలతపడింది గతం అంతా గురుకు వచ్చి అంతే, డాక్టర్లకేముంది, డబ్బుకోసం ఎన్నైనా చెప్తారు'

'అహాఁ అలాగా?" అప్పుడే గదిలో ప్రవేశించిన శ్రీకాంత్ సిగరెట్ ముట్టిస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు హేళనధ్వనింప జేస్తు "డాక్టర్లంటే అంత తేలికగావుందన్నమాట మీకు?" ఆకంఠంలో అధికారం!

క్రొత్త అల్లుడినుండి అటువంటి ధోరణిని చూచిన శ్రీపతి నివ్వెరపాటుతో చూస్తూండిపోయాడు మౌనంగా

"ఆహాఁ నాన్న ఏదో మాటవరుసకంటున్నారు ఆయనను పరీక్ష చేసిన డాక్టర్ని ఉద్దేశించి మధ్యన మీకు కోపం దేనికీ?" జయశ్రీ సర్దిచెప్పింది

'తెలుసులే నువ్విలారా" అంటూనే వెళ్ళిపోయాడు శ్రీకాంత్ మరోగదిలోకి కనీసం మర్యాదకైనా మామగారి ఆరోగ్యం సంగతిని విచారించలేదు తండ్రీ కూతుళ్లు ముఖాముఖాలు చూచుకున్నారు జయశ్రీ అభిమానం తలెత్తింది

"అదేమిటి? కాస్త ఆయన ఆరోగ్యం ఎలావున్నదో కనుక్కోవాలని కూడా మీకు తెలియదా?" భర్త వెనుకనే వెళ్ళి అడిగింది జయశ్రీ

"ఎందుకూ? క్రొత్తగా అడిగేదేమిటి? పాతపాటేగా? నాకిలాంటి శుష్కమర్యాదలు అలవాటులేవు అదటుంచు కాని నా ఫ్రెండ్స్ కొందరు వస్తున్నారు వాళ్ళను రిసీవ్ చేసుకోవడానికి నువ్వు సిద్ధంగా వుండు నేనూ స్నానంచేసి డ్రెస్ చేసుకువస్తాను' జయశ్రీకి మరోమాటకు అవకాశమే ఈయకుండా వెళ్ళిపోయాడు శ్రీకాంత్

నిస్సహాయ క్రోధంతో అనిర్వచనీయమైన బాధతో తనలో తాను దిగ్గుళ్ళి ఏడ్చింది క్రొత్తపెళ్ళికూతురు జయశ్రీ ఆమె అలా ఎంతసేపు బాధపడిందో తనకే తెలియదు ఒక అరగంట అనంతరం శ్రీకాంత్ తిరిగివచ్చి పలుకరించేవఱకూ అలానే వుండిపోయింది.

"ఏం ఇంకా అలాగే కూర్చున్నావేం? నా స్నేహితులు వస్తారని చెప్తే అంత నిర్లక్ష్యమా?" వాపోకరించాడు శ్రీకాంత్ అర్థంలేని నీరసహాసం ఒకటి వెలువడి అంతలో మాయమైంది జయశ్రీ పెదవులపై తలెత్తి సూటిగా అతడి కండ్లలోకి చూస్తూ నెమ్మదిగా అడిగింది "మీకు స్వంత మామగారిపైననే నిర్లక్ష్యమైనప్పుడు నాకు మీ స్నేహితులమీద నిర్లక్ష్యం కలిగితే ఆశ్చర్యమేమిటి?"

ఓ!'' కనుబొమలు లం తమాషాగా ఎగరేశాడు శ్రీకాంత్. "పెళ్ళైన మర్నాడే చక్కగా ఎదురు సమాధానాలు చెప్తున్నావే!"

మరింత తలతిక్కగా సమాధానం చెప్పబోయిన జయశ్రీ అంతలో తనను తాను సంబాళించుకుంది లేని శాంతం కొనితెచ్చుకుంటూ మెల్లని స్వరాన అడిగింది, అతడి చేరువుగాపోయి నిల్చుంటూ చూడండీ ఇంతకుముందు మీ స్వభావానికీ యిప్పటికీ చాలా తేడా కన్పిస్తూన్నది నాకు పెళ్ళవగానే ఒక్కరోజులోనే యిలా మారిపోయారంటే ఇది సాధ్యమా _ అనిపిస్తూన్నది నాకు మీరు నాతో పరిహాసమాడుతున్నారో లేక నా ఓరిమిని పరీక్ష చేస్తున్నారో _ అని అనుకుంటున్నాను"

అతి నిర్లక్ష్యంగా సిగరెట్ పొగపీలుస్తూ తేలికగా నవ్వేసి వెనుదిరిగాడు శ్రీకాంత్ అడుగు వేయబోయి, ఒక్క క్షణం ఆగి అన్నాడు, వెనక్కు చూడకుండానే "ఆ తాపత్రయాలన్నీ పెళ్ళి కాకముందు రైలు అందుకోవడానికి ఎవడైనా పరుగెడతాడు గాని, రైల్లో కూర్చున్నాక మరి కష్టం దేనికీ? అర్థమైందా?" అంటూనే వడి వడిగా నడచి అటనుండి నిష్క్రమించాడు

తల తిరిగిపోయింది జయశ్రీకి భూమ్యాకాశాలు కలసి తిరిగిపోతూన్నట్లు అన్పించింది భవిష్యత్తు ఎలా వుంటుందో లీలగా గ్రాహ్యం కావించుకుంటూన్న ఆమె కనులముందు అతి రీవిగా హుందాగా, మర్యాదగా మాట్లాడే శ్రీ నగేశ్ విగ్రహం వచ్చి నిలచింది జాలిగా చూస్తూన్నట్లు భరించలేకపోయింది జయశ్రీ "వద్దుబావా వద్దు, నీప్రేమ నీజాలి నీదయ, నీజ్ఞాపకాలు _ ఏమీ వద్దు నాకు, వద్దు! భగవాన్! ఏమిటీ చిత్రవధ!" వ్రయ్యలైపోతూన్న తలను రెండుచేతులా పట్టుకు దుఃఖిస్తూన్న ఆమె మనోపథంలో తాను శ్రీలక్ష్మిని అవమానించి వెళ్ళగొట్టడం, శ్రీనగేశ్ ఆమెకు ఆతిధ్యమిస్తే తాను ఆగ్రహం జెందడం, ఆ ఆగ్రహంపై చన్నీరు చిలకరించినట్లుగా అతడు చల్లటి సమాధానాలు చెప్పడం _ ఒక్కొక్కటే సినిమా రీలులాగా తిరిగిపోసాగాయి

* * *

"ఏమిటి ఆ వ్రాసేది?"

శ్రీకాంత్ ప్రశ్నకు తలెత్తింది జయశ్రీ చిరునవ్వుతో చెప్పింది "అప్లికేషన్ ఫారం"

"ఎందుకు?" ప్రక్కనేకూర్చుంటూ అడిగాడు

"నేను కాలేజీలో జేరడానికి! తెలియనట్లడుగుతారేం?" తల వంచి వ్రాసుకుంటూనే మామూలుగా అన్నది జయశ్రీ

"అనవసరం !" అంతలో శ్రీకాంత్ స్వరం కఠినత్వంతో నిండిపోయింది ఆ అప్లికేషన్ ఫారం చటుక్కునలాగి చింపిపారేశాడు

జయశ్రీ మొదట తెల్లబోయింది అంతలో ఆమెలో అంత మైన రోషావేశాగ్రహాలు ముప్పిరిగొని తలెత్తాయి ఏమిటీ మోటుపని? నేను నా చదువు పూర్తిచేయాలని వివాహానికి ముందు అనుకున్న దేగా?

'వివాహానికి ముందు అనేకం అనుకుంటారు అన్నీ జరుగుతాయా? అనవసరం నీకిక చదువు"

"నేను మర్యాద నిలుపుతూన్న కొద్దీ మీరు మితిమీరుతున్నారు ఏమిటి, అదు గడుగునా ఈ నిరంకుశత్వం?"

"అదంతే" బిగ్గరగా హేళనగా నవ్వాడు శ్రీకాంత్ " మగవాడు మగవాడే ఆడది ఆడదే పెళ్ళయ్యాక యింకా చదువేమిటి ఆడదానికి, ఏడాది తిరగకముందే మేమున్నామంటూ పిల్లలు క్యార్ క్యార్ మంటూ తయారు కారూ?" మళ్ళీ మళ్ళీ నవ్వాడు భుజాలెగరేస్తూ

కోపాన్నీ చికాకునూ బలవంతంగా అణచుకుంటూ అన్నది జయశ్రీ 'దానికేముంది? తగిన జాగ్రత్తలు తీసుకుంటేసరి ఇదేమైన పూర్వకాలమా? అందునా డాక్టర్లకి ఈ రోజుల్లో ఇదేమైనా బ్రహ్మవిద్యా?"

"ఆహా బ్రహ్మవిద్య కాక మరేమిటి? జాగ్రత్తగా వుండడాలూ, నియమాలు పాటించడాలూ ఎవరో సిరస్థులకు కాని, మన లాంటి వాళ్ళకా? అయినా ఎందుకంత కష్టపడాలి? దేశంలో లేడీ డాక్టర్లకేం కొదువలేదు నువ్వు డాక్టర్ కానంత మాత్రాన దేశానికి కాదుకదా–దేశంలో ఒక్కమనిషికి కూడా వాటిల్లబోయే ప్రమాదమేమీ లేదు నీవిధి ఏదో నువ్వు నిర్వర్తించు"

"ఏమిటి మీరు మాట్లాడేది? ఇది నా విధికాక మరేమిటి? మా నాన్న నామీద పెట్టుకున్న ఆశలు తీర్చవద్దా? ఆసుపత్రికోసం ముందే యింత బిల్డింగు కట్టించి"

"ఆ! ఆ! మీనాన్న ఆస్తినీ ఆసుపత్రినీ ఉద్ధరించడానికి నేనున్నాను కానీ, నువ్వు దేశోద్ధారణ మాని నన్నుద్ధరించు ఆసుపత్రి పనిలో నేను అలసిపోయి విసిగిపోయి వస్తే, తమరు మహారాణీలాగా మరో వ్యాపకంలో వుంటే ఇక నా అతీగతీ కనుక్కొనేదెవడు? ఇలాంటి వేషాలు మాని లక్షణంగా ఆడాళ్ళంతా ఉన్నట్టువుండు చాలు"

అంటూనే వెళ్ళిపోతూన్న భర్తనుచూస్తూ కొలది నిముషాల పాటు కాలగమనాన్నే విస్మరించింది జయశ్రీ తిరిగి నౌఖరు పిలుపు విని జాగ్రదావస్థనుపొందిన ఆమె తన కనులనుండి తనకు తెలియకుండానే అశ్రువులు స్రవించడం గమనించి తనలో తానే ఆశ్చర్యపోయింది ' నాలో యింత బలహీనత్వం ఎప్పుడేర్పడింది ? నా అహంకారం ఏమైపోయింది ? వివాహమంటే యింతేనా ? ఇందుకేనా యౌవన ప్రాయంనుండీ వయసూ, మనసూ ఎగిరెగిరిపడేది ? ఊహాలోక నిర్మిత రమ్యహర్మ్యాలకూ నిజజీవిత నిష్ఠురానుభవాలకూ సామ్యమే లేదా ? కాదు, కాదు పురుషులందరూ యిలా వుండరు అందరి తరహా ఈ తీరులో వుండదు ఉదాహరణకు–బావ శ్రీనగేష్ ఎంత ఉదార ఉన్నత స్వభావి ! అవును అతడితోగి జీవితం అయితే యిలా వుండదు ఎన్నటికీ ఉండదు. ఉండబోదు భగవాన్ ! ఒక పొరపాటు పనిని చేయించడమేగాక దానిని యింత త్వరలో గుర్తింపజేసి మనస్సును చిత్రహింస పాలు జేస్తున్నావా ?

అమ్మగారూ!' మెల్లిగా పిల్చాడు నౌకరు "వచ్చి గంటసేపుగా నిల్చున్నా మీ ఆలోచనలలో మీరున్నారుగాని నాతో మాట్లాడడం లేదు।

'ఏమిటిరా?" నీరసంగా ప్రశ్నించింది గంట నుండీ నౌకరు తన బలహీనతను కనిపెడ్తున్నాడన్న విషయం గమనించి లోలోన సిగ్గుచెందుతూ

"ఏముంది తల్లీ ? ఇంత కాలం మీ ఒక్కరి కోసమే పని చేశాం ఏదో విధంగా సరిపెట్టుకుపోయి పనులు చేసుకుపోతున్నాం ఇక ముందు మాత్రం ఈ యింట్లో మేం నౌకరీలు చెయ్యలేం వెళ్ళిపోతున్నాం మాకు రావలసిందేదో యివ్వండమ్మా"

అప్పటికి పూర్తిగా పరిసరాలను గమనించింది జయశ్రీ ఆ నౌఖరు ఒక్కడేకాదు, అతడిని ముందుపెట్టి, ఆ వెనుక మరో నలుగురు – ఇంట్లోవున్న మొత్తం పనివాళ్ళంతా నిల్చొనివున్నారు"

" ఏం ? ఏమైంది ?" ఖంగారుగా ప్రశ్నించింది

" ఏముంది తల్లీ ? ఒకటా చెప్పడానికి ? కూరలో కారం ఎక్కువైందని నిన్న నానా బండతిట్లూ తిట్టారు కొత్తయ్యగారు, ఇవాళ అన్నం చల్లారిపోయిందని ప్లేటు నా ముఖానపెట్టి కొట్టారు చూడండి ఎలా బొప్పి కట్టిందో! ఒకవేళకంటూవస్తే బాగుంటాది కాని, ఎప్పుడో వేళమీరి వస్తే పదార్థాలు బాగా ఎలాగుంటాయి?" వంటవాడు పితూరీ చేశాడు

తోటమాలి ఎదరకొచ్చి వాడి ఫిర్యాదు బయటపెట్టాడు "అంతేనండమ్మా కొత్తయ్యగారు, అలాగే బాధ పెడ్తున్నారు అందరినీ రాత్రి ప్రొద్దుపోయి వచ్చి కారు దిగి " భయపడ్తూ అర్ధోక్తిలోనే ఆపేశాడు

"ఊ దిగి" నొసలు చిట్లిస్తూ ప్రశ్నించింది జయశ్రీ

"అమ్మాయిగారు క్షమించాలి" చేతులు నలుపుకొన్నాడు మాలి

"ఫర్వాలేదు చెప్పు, ఏమీ అనను" అభయహస్తమిచ్చింది యజమానిని

ఆ భరోసాతో తోటమాలి తన ఫిర్యాదును పూర్తిచేశాడు "కారు దిగి, తూలుతూ నడుస్తూ పూలకుండీలను తన్నేసి, దారిలో పెట్టానని అనవసరంగా నన్ను బూటుకాలితో తన్నారమ్మా తన్నులు తిని పని చెయ్యాల్సిన కర్మ మాకు లేదు"

(సశేషం)

భారతావనిలో కుటుంబ నియంత్రణ

రావుల శ్రీరామచంద్రమూర్తి

యుగయుగాల నుంచి వివాహమనేది ప్రతి సమాజంలోను గుర్తింపబడింది. అది సంతోషమయమైన కుటుంబజీవితం నెలకొల్పడానికి నిర్ణయింపబడింది గాని, తద్వారా శారీరక వాంఛలను తీర్చుకోవడానికి, వ్యక్తుల ఆర్థిక స్థోమత పెంచుకోవడానికి కాదు. ఆదిమానవులు సంఘాలుగా ఏర్పడి తమ అవసరాలను తీర్చుకొనేవారనే విషయం మన కందరకు తెలిసిందే. ఆ కాలంలో ఏక పత్నీత్వ, బహు పత్నీత్వ పద్ధతులు అమలులో ఉండేవి. కాని సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బట్టి భార్య యెడల, తమ సంతతి యెడల అనురాగం, పరస్పర ప్రేమ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశ్యంతో చట్టరీత్యా ఏక పత్నీత్వమే ఈ నాడు అమలులో ఉంది.

మానవుడు సంఘజీవి. అతని పరువు ప్రతిష్ఠలు సంఘంలో అతని నడవడి మీద ఆధారపడి ఉంటాయి. దుష్ప్రవర్తకులను ఏ సమాజం హర్షించదు. అలాంటివారు సమాజం దృష్టిలో ద్రోహులు గాను, నీచులు గాను పరిగణింప బడతారు. కనుక ధనిక వర్గం, మధ్య రకం కుటుంబీకులు, బీదవారు కూడా సంఘంలో అగ్ర స్థానం వహించాలని ఆకాంక్షిస్తారు. తల్లి దండ్రులలో కలతలు ఏర్పడినప్పుడు, ఏ ఒక్కరి నడవడి అయినా సరిగా లేనప్పుడు వారి కుటుంబ జీవితంలో మనశ్శాంతిలేక పిల్లల భావి జీవితం నాశన మౌతుంది.

తమ పిల్లలకు విద్య చెప్పించడం, ఆరోగ్య, సౌఖ్యాలు సమకూర్చి, వారికి ఉజ్వల భవిష్యత్తును కలగ జేయడం ప్రతి తల్లి దండ్రుల విధి. పిల్లలు ఎక్కువగా ఉండి కుటుంబ పోషణకు తగిన ఆర్థిక స్థోమత లేక కొంతమంది మానసికంగా బాధపడుతుంటారు. తగు మాత్రం పిల్లలు ఉన్నప్పుడే ఆనందదాయక జీవితం గడప డానికి అవకాశముంది కోరని బిడ్డ కుటుంబానికే గాక, సమాజానికే ఒక కళంకం.

కుటుంబ నియంత్రణ కేవలం కుటుంబాలను పరిమితం చేయడానికి ఉద్దేశింపబడినదని కొందరి భావం. సంతానం లేని వారికి కలిగే పద్ధతులను సూచించడం, కాన్పుకూ కాన్పుకూ మధ్య తగు కాల వ్యవధి చూడడం. కొత్తగా వివాహమైన వారికి వైవాహిక బాధ్యతలు, పితృ విధులు తెలియజేయడం మొదలైన కుటుంబ సంక్షేమ విధానాలన్నీ కుటుంబ నియంత్రణ భాగాలే. పిల్లలను ఆరోగ్యవంతులుగా చేయడానికీ, తల్లి ఆరోగ్యం కాపాడు కోవడానికీ బిడ్డకూ, బిడ్డకూ మధ్య కొంత కాల వ్యవధి అవసరం. ముగ్గురు పిల్లలు కలిగిన తరువాత తల్లి దండ్రులలో ఏ ఒక్కరైనా వంధ్యాకరణ శస్త్ర క్రియ చేయించుకోవడం ఎంతైనా మంచిది.

భగవంతుడు ప్రసాదించే సంతానాన్ని నిరోధించడం పాప కార్యమని కొందరి వాదన. నిజంగా ప్రతిబిడ్డ దేవుని ప్రసాదమే. అయితే భగవంతుని వలన సంప్రాప్తించిన బిడ్డలకు తగిన సౌకర్యాలు కలగజేయలేక వారిని అనారోగ్యులు గాను, నిరాధారులుగాను చేయడం పాపం కాదా? ఈ "కుటుంబ నియంత్రణ" అనే పదం ఇటీవలనే వాడుకలోకి వచ్చినప్పటికీ, దీని పద్ధతులు పూర్వకాలం నుంచి ప్రజలచే అనుసరింపబడుతునే ఉన్నాయి. కాని శాస్త్రీయాభివృద్ధి వలన ఈ నాడు ఆధునిక పద్ధతులు కనిపెట్టబడ్డాయి. ఇదివరలో యుద్ధాలు, కరువులు, కలరా, మశూచి మొదలైనవి సంభవించి అనేకమంది చనిపోయేవారు. ఇప్పుడు వైద్య, పారిశుద్ధ్య సౌకర్యాలు వృద్ధిచేసి మరణాల సంఖ్యను చాలవరకు తగ్గించ గలుగుతున్నారు.

ఇతర దేశాలతో పోల్చి చూస్తే చైనా తరువాత జనాభా విషయంలో భారతదేశానిదే అగ్ర స్థానం. మనదేశ ప్రస్తుత జనాభా 51 కోట్ల వరకు ఉంది. ప్రతి సంవత్సరం 2.5 శాతం వంతున పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితులలో ఆహార సమస్య, నిత్యావసర వస్తువుల ధరలు అధికమగుటయే గాక, కొన్ని సంవత్సరాలకు మన భారతావనిలో నిలువడానికి నీడ కూడా లేక పోవచ్చును.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మన ప్రభుత్వం సంక్షేమ రాజ్యంగా చేయాలని తలపెట్టింది. అందుచేతనే పంచవర్ష ప్రణాళికలను రూపొందించింది. మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలోను వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, రవాణా సౌకర్యాలు, సాంఘిక సంక్షేమం మొదలైన కార్యక్రమాలలో కొంతవరకు మనం ముందంజ వేశాం. అయినప్పటికీ ఫలితాలు మన ప్రణాళికా సంఘం ఆశించినంతగా లేవు. వీటికి జనాభా పెరుగుదల కొంతవరకు కారణమని చెప్పాలి. కనుకనే చతుర్థ పంచవర్ష ప్రణాళికలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు 234 కోట్ల రూపాయలు కేటాయించి, ఇదివరకటి కంటే అత్యధిక ప్రాధాన్యత నిచ్చారు.

ఇప్పుడు మన భారత ప్రభుత్వం స్త్రీల వివాహ వయస్సును 20 సంవత్సరాలకు పెంచడానికి, ముగ్గురు పిల్లలు కలిగిన తర్వాత భార్యా భర్తలలో ఏ ఒక్కరైనా వంధ్యాకరణ శస్త్ర క్రియ చేయించుకోవడం నిర్బంధం చేయడానికి, ఉద్యోగాలలో ఉన్న మహిళలకు ప్రసూతి శలవు మంజూరు చేయకుండుటకు ఆలోచిస్తున్నది. ప్రజాస్వామ్య పరిపాలనలో ఏ కార్యక్రమం ప్రజల సహకారం, ప్రోత్సాహం లేనిదే జయప్రదం కాదు. కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రతి కుటుంబం వారికి సంబంధించినది కనుక భారత పౌరులంతా ఈ ముఖ్య కార్యక్రమాన్ని ఇతోధికంగా ప్రోత్సహించి మన దేశాన్ని సంక్షేమ రాజ్యంగా చేస్తారని ఆశిద్దాము. ★

మహిళా సముద్ధరణ గృహం

సాంఘికంగా దుర్బలులైన మహిళలను ఆపదలనుంచి రక్షించి, వారిలో మానసిక పరివర్తనతెచ్చి సమాజంలో వారిని పునః ప్రతిష్ఠించడమూ, సంఘంలోని దుర్నీతిని నిర్మూలించడమూ మహిళలకు ఉద్దేశించిన సాంఘిక, సముద్ధరణ పథకాల యొక్క, కార్యక్రమాల యొక్క ప్రధాన లక్ష్యం. సాంఘిక, నైతిక పరిరక్షణ పథకం క్రింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజమండ్రి, హైదరాబాదు, కర్నూలు, మహబూబ్‌నగర్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం నాలుగు సముద్ధరణ గృహాలను మహిళా సంక్షేమశాఖ అధ్వర్యం క్రింద ఏర్పాటు చేసింది.

వివాహితలు కాని తల్లులు, నైతికపతనం చెందిన యువతులు, భర్తృపరిత్యక్తలు, బాల వితంతువులు మొదలైన వారి సంక్షేమం నిమిత్తం, ఆపదలనుండి అట్టివారికి రక్షణ కల్పించే నిమిత్తం హైదరాబాదులోని సముద్ధరణ గృహం 1958లో నెలకొల్పబడింది. ఇది హైదరాబాదులోని అమీర్‌పేటలో చుట్టూ 4 ఎకరాల సువిశాలమైన ఆవరణ మధ్య ప్రభుత్వభవనంలో వుంది. జిల్లా మహిళాసంక్షేమాధికార్లద్వారా, సాంఘిక కార్యకర్తలద్వారా ఈ సముద్ధరణ గృహంలో మహిళలకు ప్రవేశం కల్పించబడుతుంది ఇతర మహిళాసముద్ధరణ సంక్షేమసంస్థలనుండి కూడా బదిలీలు జరుగుతుంటాయి. చదువుకొనదలచిన వారికి యిక్కడ సాధారణ విద్యగరపబడుతుంది. ఎస్.ఎస్.ఎల్.సి. ఆంధ్రమెట్రిక్ పరీక్షలకు వెళ్ళడానికి వీలుగా యిక్కడ తక్కువ వ్యవధి కోర్సులను నిర్వహిస్తుంటారు. ఈ కోర్సులను పూర్తిచేశాక వారివారి అభిరుచులనుబట్టి నర్సుశిక్షణకుగాని, ఉపాధ్యాయిని శిక్షణకుగాని లేదా కంపెనీలలో, ఫర్మ్‌లలో కార్మికులుగాగాని పంపిస్తారు. చదువులో ఆసక్తిలేనివారిని ఉత్పత్తి - శిక్షణ కేంద్రాలలో చేర్చుకుంటారు. అలాంటివి రెండు వున్నాయి.

ఈ రెండు కేంద్రాలలో ఒకటి - రడీమేడ్ దుస్తులవిభాగం రెండవది - గ్లాస్ ఆంపుల్‌తయారీ విభాగం. ఆరునెలల కాలంపాటు శిక్షణ యిచ్చాక యీ యూనిట్‌లలో కార్మికులుగా వీరిని చేర్చుకుంటారు. వాళ్ళంతటవారు తమ జీవనభృతిని సంపాదించుకోవడానికీ, సంఘంలో నిలబడడానికీ ఏదో ఒక వృత్తిలో శిక్షణ కల్పించడమే వీటి ప్రధాన ఆశయం.

జాతీయసమైక్యత-బాపూజీ హితవు

భారత దేశం సువిశాలమైనది. వివిధ సంస్కృతులు పరస్పర గౌరవాభిమానాలతో మిళితమైన గొప్పజాతి. ఈ సమ్మేళనం పూర్తి అయ్యే వరకు వేచి ఉండాల్సి ఉంటే నేను వేచి ఉంటాను. అయితే యిది నా జీవిత కాలంలో పూర్తి అయ్యేది కాదు. సంపూర్ణ సమైక్యత సిద్ధిస్తుందనే విశ్వాసంతో మరణించాలని నేను కోరుకుంటున్నాను. సంపూర్ణత సాధనకు అడ్డంకి కలిగించే పని యేదీ నేను చేయలేదనే భావిస్తున్నాను. యీ నిబంధనకు కట్టుబడి సౌహార్దసాధనకు నేను కృషిచేస్తాను.

ఇంతవరకు విభిన్న విశ్వాసాలుగల ప్రజలు స్నేహభావంతో కలిసి మెలసి జీవిస్తూ అపూర్వమైన సంస్కృతులను సృష్టించారు. ఆ సంస్కృతిని పటిష్ఠంచేసి పెంపొందించడానికి మనం కృషిచేయాలి. లేదా హిందూదేశంలో ఒకే ఒక మతం, సంస్కృతి ఏర్పడే రోజు కొరకు వేచిఉండాలి. అటువంటి చరిత్రాత్మక మైన రోజు రావడం సాధ్యంకాదు. అయితే మనం తిరోగమించి ఆ విధంగాచేస్తే మన సంస్కృతి వెనక్కు మళ్ళించి గత కాలపు అధ్వాన్నపు పరిస్థితులను కల్పించుకుని ప్రపంచానికి దూరం కావాల్సి ఉంటుంది.

అన్ని వర్గాలలో సమైక్యత

హిందూ మహమ్మదీయుల సమైక్యత, కేవలం ఆ రెండు వర్గాల మధ్య మాత్రమే సంఘీ భావన ఉండాలనడం కాదు. భారత దేశాన్ని తమ మాతృ దేశంగా భావించే అన్ని వర్గాల మధ్య సమైక్యత ఉండాలనేదే భావం.

స్నేహానికీ, మతానికీ ప్రేమాభి మానమే మూల ప్రాతిపదిక. అదే విధంగా ఒక వర్గంపై మరోవర్గానికి ప్రేమాభిమానం ఏర్పడితే మన జాతీయ జీవితంలో సమైక్యతను సాధించవచ్చు.

ప్రపంచంలో స్నేహభావంతో మెలగడమే ఉత్తమ మార్గం. మానవులందరు ఏక కుటుంబీకులుగా వ్యవహరించాలి. కుటుంబాల మధ్య విచక్షణ చూపిన వ్యక్తి తన కుటుంబ సభ్యులను తప్పుడు మార్గాన పెట్టిన వాడవుతూ తద్వారా కలతలను సృష్టించిన వాడవుతున్నాడు.

అన్ని మతాలకు సమానస్థాయి

ప్రతి ఒక్కరు యితరుల మతాన్ని గౌరవించాలి. రహస్యంగానైనా సరే యితరులపై ద్వేష భావం ఉండరాదు.

ఇతరుల మతాన్ని దూషించే ప్రచారాన్ని అరికట్టాలి. ఇతరుల మతాన్ని దూషించడం, అపహాస్య కరమైన ప్రకటనలు చేయడం, అమాయకుల ప్రాణాలుతీసే అసత్య వాక్కులను పలుకడం దేవాలయాలను, మసీదులను కూలదోయడం దేశద్రోహ కారకమే అవుతుంది.

ఎటువంటి క్షోభ్యం లేకుండా తన మతాన్ని సంరక్షించుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది.

ప్రతి ఒక్కరు తన మతంలోని మంచిని ఆచరిస్తూ యితర మతాల వారిని, వారి అనుయాయులను గౌరవించడమే మత సామరస్య సాధనకు కీలకం.

అల్ప సంఖ్యాక వర్గాలు

అధిక సంఖ్యాక వర్గాల ప్రజల మాదిరిగానే తాముకూడ గౌరవం గల దేశ పౌరుల మని అల్ప సంఖ్యాక వర్గాల ప్రజలు భావించే విధంగా చేయాలి.

అధిక సంఖ్యాకులైన హిందువులు తమమతాన్ని, విధి బాధ్యతలను సక్రమంగా నిర్వహించినప్పుడు అల్ప సంఖ్యాకుల తప్పులను విస్మరించ గలుగుతారు. వారు న్యాయాన్యాయాలకు తమతో సమానమైన పౌరులుగా మహమ్మదీయులను భావించాలి.

అణచి వేస్తున్నారనే భావన అల్ప సంఖ్యాకులలో కలుగనివ్వరాదు. అన్ని సమస్యలను (భాష, లిపివంటివి) సామరస్యంగా పరిష్కరించాలి.

సంపూర్ణ న్యాయాన్ని ఆశించే హక్కు అల్ప సంఖ్యాకులకు ఉంది.

హిందూ, సిక్కు యువకులు, మహమ్మదీయ సోదరుల వద్దకు వెళ్ళి, వారితో స్నేహ బాంధవ్యాలను నెలకొల్పుకోవాలి. పండుగ సందర్భాలలో వారిని తమ గృహాలకు ఆహ్వానించాలి.

మహమ్మదీయ బాలబాలికలు సాధారణ పాఠశాలలకు వచ్చే విధంగా ఆకర్షించాలి.

సెక్యులర్ రాజ్యం

మత తత్వానికన్నా జాతీయ భావం మహోన్నత మైనది. ఆ అర్థంలో మనం మొదట భారతీయులము, ఆతర్వాతనే హిందువులు, మహమ్మదీయులు, పార్శీలు, క్రైస్తవులము. మనదేశం యిప్పుడు సెక్యూలర్ రాజ్యం. న్యాయ శాస్త్రం దృష్టిలో అందరు సమానులే. అయితే సామాన్య న్యాయ సూత్రాలకు విరుద్ధం కాకుండా ప్రతి వ్యక్తి ఏ ఆటంకం లేకుండా తాను నమ్మిన మతాన్ని ఆచరించ వచ్చు.

పరస్పర సౌహార్ధంతో దేశంలో సెక్యులర్ ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొనాలన్నదే మన లక్ష్యం. ★

ఇతోధిక ఉత్పత్తి—ఉద్యోగావకాశాలు

"ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మన ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వంకూడ శ్రామిక సమస్యలపట్ల మిక్కిలి శ్రద్ధచూపుతూనే వున్నది. ఇతర చోట్లలో మాదిరే మన రాష్ట్రంలోనూ జీవన వ్యయం పెరిగింది. దీనిమూలంగా, పారిశ్రామిక శాంతిని కాపాడడంలోను, ఉత్పత్తి స్థాయిని నిలబెట్టడంలోను శ్రామిక శాఖకు అప్పగించబడిన బాధ్యత మరింత గురుతరమవుతుంది. సాంఘిక భద్రతను, రక్షణను సమంజసమైనపని పరిస్థితులను చేకూర్చడానికి ఉద్దేశించిన వివిధ చర్యలను ఈ శాఖ తీసుకుంటున్నది. వీటివల్ల అధికోత్పత్తి, మంచి వేతనాలు, ఉత్తమ ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అక్కడక్కడ కొన్ని అసంతృప్తికర సందర్భాలు ఉన్నప్పటికి మొత్తంమీద పారిశ్రామిక శాంతి నెలకొనివున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి కావడం మనకు గర్వకారణం.

కనీస వేతనాల చట్టం

ఈ చట్టంయొక్క షెడ్యూలులోని 1,2 భాగాలలో తెలిపిన ఉద్యోగాలకు సంబంధించి కనీస వేతనాలు నిర్ణయించడం, సవరించడం జరిగింది. ఇంతవరకు పద్దెనిమిది షెడ్యూలు ఉద్యోగాలకు కనీస వేతనాలు నిర్ణయించబడినాయి, లేదా సవరించబడినాయి.

ఒక ఉద్యోగానికి ఇదివరకే నిర్ణయించిన కనీస వేతనాను ప్రతి 5 సంవత్సరాలకు సవరించవలసి వుంటుంది. ఈ బాధ్యతను నెరవేర్చడంకోసం ఆ యా సమయాలలో కనీస వేతనాల సంఘాలు నియమింపబడతాయి. ప్రభుత్వం నియమించిన కనీస వేతనాల సంఘం చేసే సిఫారసులను రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి పరిశీలిస్తుంది. షెడ్యూలు ఉద్యోగాలకు సంబంధించిన వేతనాల కనీసరేటు యొక్క నిర్ణయం, లేదా సవరణ గురించి ఈ మండలి ప్రభుత్వానికి సలహా ఇస్తుంది.

సలహామండలి సిఫారసులు అందినమీదట ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ణయించడమో సవరించడమో చేస్తుంది.

ఈ దిగువ తెలిపిన ఆరు సంఘాలు తమ నివేదికలు సమర్పించాయి. కాగా ఇంకా రెండు సంఘాలు తమ నివేదికలను సమర్పించవలసివున్నవి. అందుచేత వాటి విషయమై ప్రతిపాదనలను ప్రచురించి, ఆక్షేపణలను, సూచనలను తెలుపుకోవలసిందిగా కోరి, వాటినిబట్టి తుదిరూపం ఇవ్వడంద్వారా ఈ ఉద్యోగాల విషయంలో కనీస వేతనాలను నిర్ణయించడం, లేదా సవరించడం యుక్తమని ప్రభుత్వం భావించింది:

(1) లిథో, ఆఫ్‌సెట్ ముద్రణతో సహా ముద్రణాలయాలలో ఉద్యోగం. ... వేతనాల నిర్ణయం

(2) బియ్యంమిల్లు, పిండిమిల్లు లేదా పప్పుమిల్లు, రోలరు ఫ్లోరుమిల్లు దేనిలోనైనా ఉద్యోగం. ... సవరణ

(3) నూనెమిల్లులు వేటిలోనైనా ఉద్యోగం ... సవరణ

(4) స్థానిక అధికారవర్గాల క్రింద ఉద్యోగం ... సవరణ

(5) మైకావర్క్సు వేటిలోనైనా ఉద్యోగం ... సవరణ

(6) పబ్లికు మోటారు ట్రాన్సుపోర్టులో ఉద్యోగం ... సవరణ

ఈ క్రింది ఉద్యోగాలను చట్టంలోని షెడ్యూలుయొక్క 1 వ భాగంలో చేర్చడానికి సంబంధించిన ప్రతిపాదనలను 22-1-68 తేదీ హోంశాఖ మిస్. నెం. 72 జి ఓ లో ప్రచురించి, వాటి విషయమై ఆక్షేపణలను, సూచనలను తెలుపుకోవలసిందిగా కోరడం జరిగింది.

(1) చేనేత పరిశ్రమలో ఉద్యోగం.

(2) నూలు తివాసీలు తయారు చేసే సంస్థలలో ఉద్యోగం.

బ్లాకులలో గ్రామ సేవకులను, సాంఘిక విద్యా కార్యకర్తలను చట్టం క్రింద ఇన్‌స్పెక్టర్లుగా నియమించడం ద్వారా ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన కనీస వేతనాల రేట్లను అమలు పరచడానికి కూడా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నది. [20 10-67 తేదీ హోం (శ్రామిక IV) శాఖ మిస్ నెం. 1770 జి. ఓ. చూడండి].

కొన్ని ఉద్యోగాలకు సంబంధించి, ముఖ్యంగా బీడీ పరిశ్రమకు సంబంధించి, వేతనాల కనీసపు రేట్లలో వ్యత్యాసాలు ఉండడంచేత శ్రామికులు ఇతర తావులకు వెళ్ళిపోవడం కొన్ని సందర్భాలలో పరిశ్రమనే వేరొకచోటకు మార్చడం జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. అట్టి వ్యత్యాసాలను తొలగించే

సమస్యను చర్చించడానికి గాను 1967 డిసెంబరు 29 తేదీన హైదరాబాదులో శ్రామిక మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమస్యలను పరిశీలించే నిమిత్తం ఒక స్థాయీ సంఘాన్ని, మూడు మండల సంఘాలను ఏర్పరచడానికి నిర్ణయం తీసుకోబడింది.

పనివారల నష్టపరిహార చట్టం

1-1-1967 తేదీ నాటికి పనివారి నష్టపరిహార వ్యవహారాల కమీషనరు వద్ద పరిష్కారం నిమిత్తం క్లెయిములకు సంబంధించిన 237 కేసులు పెండింగులో వున్నాయి. 1967 లో 166 క్లెయిములు దాఖలు చేయబడినాయి. ఆ విధంగా ఈ కేసుల మొత్తం సంఖ్య 393 అయింది. వీటిలో 178 కేసులు అంతిమంగా పరిష్కరింపబడినాయి. (అ క్రిందటి సంవత్సరం పరిష్కరింపబడిన కేసులు 166). కాగా మిగతా 215 కేసులు వివిధ విచారణ దశలలో వున్నాయి.

అదే కాలంలో, మరణించిన పనివారిపై ఆధారపడివున్న వారికి, గాయపడిన పనివారికి చెల్లించే నిమిత్తం ప్రభుత్వ, ప్రయివేటు రంగాలకు చెందిన యజమానులు రూ. 23,21,023.26 ల మొత్తాన్ని పనివారి నష్టపరిహార వ్యవహారాల కమీషనరు వద్ద డిపాజిటు చేశారు. ఇందులో 1-1-1967 తేదీ నాటికి గల నిలువ కూడా చేరివున్నది. ఈ మొత్తంలో రూ. 17,21,942.67 లు ప్రయోజనం పొందేవారికి 1967 లో పంపిణీ చేయబడింది. ఆ క్రిందటి సంవత్సరం పంపిణీ చేసిన మొత్తం రూ. 15,49,998.81 లు.

ఫ్యాక్టరీల చట్టం

1966 లో 3376 ప్రమాదాలు జరుగగా 1967 లో 3450 ప్రమాదాలు జరిగినాయి. 1966 లో ప్రమాదాల రేటు ప్రతి 1000 మంది పనివారికి 13.30 కాగా 1967 లో ఈ రేటు 12.

ఫ్యాక్టరీల మెడికలు ఇన్‌స్పెక్టరుతో కూడిన యూనిటు ఈ దిగువ తెలిపిన పారిశ్రామిక వృత్తులలో - అంటే ముద్రణాలయాలలో పనిచేసే పనివారిపై సీసంవల్ల కలిగే ప్రభావం విషయంలో మేంగనీసు, ఫెర్రో మేంగనీసు ప్లాంటు, పెట్రోలియం ప్యూయలు ప్లాంటులో ట్యాంకు శుభ్రపరచేపని మున్నగు వాటిలో నియమించబడిన పనివారి విషయంలో కొన్ని ఆరోగ్య సర్వేసులు నిర్వహించింది. అనేక ఫ్యాక్టరీలలో పర్యవేక్షక సిబ్బంది ఉపయోగార్థం శ్రామిక శాఖకు చెందిన సీనియరు అధికార్లు, ఫ్యాక్టరీల మెడికలు ఇన్‌స్పెక్టరు పారిశ్రామిక భద్రత, ఆరోగ్యంపై ప్రసంగాలు చేశారు.

భారత బాయిలర్ల చట్టం

కేంద్ర చట్టమైన 1923, భారత బాయిలర్ల చట్టాన్ని మన రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ బాయిలర్ల శాఖ అమలు పరుస్తున్నది.

రిజిస్టరులో నమోదైవున్న బాయిలర్ల సంఖ్య 2299. అయితే వాటిలో పనిచేస్తున్నవి 1416 మాత్రమే. ఇన్‌స్పెక్టరేటు వారు సంవత్సరంలో 2067 తనిఖీలు జరిపారు.

వేతనాల చెల్లింపు చట్టం

ఈ సంవత్సరంలో ఈ చట్టం అమలు సంతృప్తికరంగా వున్నది. ఇప్పటివరకు కొన్ని సందర్భాలలో మాత్రమే ఉద్యోగులు కోర్టుఖర్చుల చెల్లింపునుండి మినహాయించబడుతున్నారు. ఉద్యోగులందరిని కోర్టు ఖర్చుల చెల్లింపునుండి మినహాయించడానికి నిబంధిస్తూ సవరణ చేసే బిల్లు శాసనమండలి ప్రస్తుత సమావేశంలో ప్రవేశపెట్టబడింది.

1961 మోటారు రవాణా పనివారి చట్టం

1961 మోటారు రవాణా పనివారల చట్టం, 1963 ఆంధ్రప్రదేశ్ మోటారు రవాణా పనివారి నియమావళి రాష్ట్ర మంతటా అమలుపరచబడుతున్నాయి. ప్రస్తుతం అయిదుగురు అంతకంటె ఎక్కువమంది మోటారు రవాణా పనివారు పనిచేసే సంస్థలు ఈ చట్టం క్రిందికి తేబడినాయి. సుమారు 27,980 మంది పనివారు ల 961 సంస్థలు రిజిస్టరు అయ్యాయి. ఐదుగురు కంటే తక్కువ మంది పనివారు గల సంస్థలకు ఈ చట్ట నిబంధనలను విస్తరింపజేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో వున్నది.

దుకాణాలు, సంస్థల చట్టం

1966 ఆంధ్రప్రదేశ్ దుకాణాలు సంస్థల చట్టం 15-6-1967 న అమలులోనికి వచ్చింది. అది అమలు జరుగుతున్నది. దుకాణాలలోను వాణిజ్య సంస్థలలోను, థియేటర్లు, సినిమాలవంటి సార్వజనిక వినోద స్థలాలలోను పనిచేసేవారి ఉద్యోగ నిబంధనలను ఈ చట్టం క్రమబద్ధం చేస్తుంది. 1967 లో మన రాష్ట్రంలో 1,15,618 మంది పనిచేసే 1,49,041 దుకాణాలు, సంస్థలు వున్నాయి. 1967 లో 1218 ప్రాసిక్యూషన్లు చేయబడ్డాయి. అందులో 1120 కేసుల విషయంలో నేరస్థాపన జరిగింది.

ఈ చట్టంలోని నిబంధనలు కొన్నింటిని-ముఖ్యంగా ప్రతి ఆదివారం దుకాణాలు మూసే నిబంధనను-అమలు పర్చడంలో కొన్ని అచరణాత్మకమైన చిక్కులు ఏర్పడినందున ఈ చిక్కులను తొలగించడానికి వీలుగా సవరణ బిల్లును ఒకదానిని ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వం సంకల్పిస్తున్నది.

1965 బోనసు చెల్లింపు చట్టం

భారత ప్రభుత్వం, 1965 బోనసు చెల్లింపు చట్టాన్ని చేయడమన్నది శ్రామిక శాసన రంగంలో ఒక మైలురాయి. విస్తృతిలోను వర్తింపు, అవధిలోను, ప్రాధాన్యతలోను ఈ చట్టం పారిశ్రామిక వివాదాల చట్టం, ఫ్యాక్టరీలచట్టం వంటి ఇతర ప్రధాన చట్టాలతో సరితూగగలదు ఫ్యాక్టరీల చట్టంక్రిందకువచ్చే

పనివారికే కాకుండా 20 మంది అంతకంటే ఎక్కువమంది పని వారు ఉన్న సంస్థలకు కూడా ఇది వర్తిస్తుంది. రాష్ట్రంలో దాదాపు 5,590 ఫ్యాక్టరీలు, 1,000 సంస్థలు ఈ చట్టం క్రిందికి వస్తాయి. ఈ చట్టం క్రిందకు వచ్చే మొత్తం పనివారి సంఖ్య దాదాపు 3 లక్షలు.

సంస్థకు లాభం ఏమీలేనప్పటికీ కూడ ఈ చట్ట నిబంధనలు వర్తించే ఉద్యోగులకు కనీసం 4 శాతం బోనసు లభించడమన్నది దీనివల్ల కలిగే ముఖ్యమైన ప్రయోజనం. ఏ సంవత్సరంలోనైనా మిగులు ద్రవ్యం ఉన్నట్లయితే 20 శాతం గరిష్ఠ బోనసు చెల్లించిన మీదట మిగిలిన దానిని ప్రత్యేకంగా ఉంచడం జరుగుతుంది. మిగులు ద్రవ్యం ఏమీలేని సందర్భంలో, లేదా మిగులు తక్కువగావున్న సందర్భంలో పైన పేర్కొన్న రీతిగా వెనుకటి సంవత్సరాలలో కూడబెట్టి వుంచిన లాభాలను విడుదల చేసి వినియోగించడం జరుగుతుంది.

పారిశ్రామిక సంబంధాలు

వివాదాలు సామరస్యంతో పరిష్కారమయ్యేటట్లు, తద్వారా పారిశ్రామిక శాంతి నెలకొనేటట్లు చూడడం అన్నది పారిశ్రామిక వివాదాలకు సంబంధించి ప్రభుత్వం అనుసరించే విధానం. సంప్రదింపులు, రాజీ, మధ్యవర్తి పరిష్కారం, న్యాయనిర్ణయం ఇవి–పారిశ్రామిక వివాదాలను పరిష్కరించడంలో అవలంబించే పద్ధతులు. పారిశ్రామిక శాంతి తీర్మానాన్ని అనుసరించి ఆ తీర్మాన లక్ష్యాల సాధనకోసం అనేక చర్యలు తీసుకోబడినాయి. పారిశ్రామిక సంబంధాల యంత్రాంగం, వివాదాలను శాంతియుత విధానాలద్వారా పరిష్కరించడంలో యజమానుల, ఉద్యోగుల సంస్థలతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటుంది.

దౌర్జన్యం, నిర్బంధం, మందకొడిపని, సమ్మెలు–ఈ పద్ధతులను పనివారు అనుసరించకుండాను అనుచిత శ్రామిక పద్ధతులను లాకవుట్లను మేనేజిమెంట్లు అవలంభించకుండాను, వారిని వురినీ నిరుత్సాహ పరచడమే ప్రభుత్వ విధానం. మామూలు పరిష్కార మార్గాలను అవలంబించడానికి ముందే అట్టి విధానాలకు పాల్పడేవారికి సహాయం అందజేయరాదని శాఖ అధికార్లకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

రాజీ అధికార్లు తమ పలుకుబడిని ఉపయోగించి పరిష్కారానికి రావలసిందిగా పార్టీలను ఒప్పించి సమ్మతింపజేయడంతప్ప వారికి ఇతరమైన అధికారాలు ఏవీ లేనప్పటికీ వివాదాలను పరిష్కరించడంలో శాఖ చేసిన కృషి జయప్రదమైంది. రాజీ పరిష్కారానికి వెలుపల రాజీ అధికార్లు గత ఏడాది 276 కేసులను పరిష్కరించగా ఈ ఏడాది 601 కేసులను పరిష్కరించగలిగారు.

ఈ సంవత్సరంలో పారిశ్రామిక సంబంధాల యంత్రాంగం పరిష్కారంకోసం 308 వివాదాలను స్వీకరించింది. ఇందులో 141 కేసులు పరిష్కరించబడ్డాయి. 46 కేసులు న్యాయవిచారణకు పంపబడ్డాయి. 13 కేసులలో ఇరుపక్షాలవారు స్వచ్ఛంద మధ్యవర్తిత్వం ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోడానికి అంగీకరించారు. పరిష్కారం విఫలమై, న్యాయ విచారణకు పంపడానికి తగనివిగా భావించబడిన కొన్ని కేసులు ముగింపు చేయబడ్డాయి. మిగిలినవి పెండింగులో ఉన్నాయి.

ఈ సంవత్సరంలో పారిశ్రామిక ట్రిబ్యునలు, కార్మిక న్యాయస్థానాలలో న్యాయవిచారణకోసం పెండింగులోఉన్న 181 కేసులలో 103 కేసులు తీర్పుచెప్పబడ్డాయి. గత సంవత్సరం 149 కేసులు తీర్పు చెప్పబడినాయి. 78 కేసుల న్యాయవిచారణ పెండింగులో ఉంది.

గత సంవత్సరం 105 పని నిలుపుదలలు నివేదించబడగా 1967 లో 90 పని నిలుపుదలలు నివేదించబడ్డాయి. 1966 లో 5,14,688 పని దినాలు నష్టంకాగా ఈ సంవత్సరం సుమారు 5,69,439 పని దినాలు నష్టమయ్యాయి.

ఆంధ్రప్రదేశ రాష్ట్ర శ్రామిక సలహామండలి

శ్రామిక విధానం, పారిశ్రామిక సంబంధాలు, శ్రామిక శాసన సూత్రాలకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వానికి సలహాఇచ్చే నిమిత్తం ప్రభుత్వ, యజమానుల, ఉద్యోగుల ప్రతినిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రామిక సలహామండలి ఏర్పాటుచేయబడింది. శ్రామిక సలహామండలి తన 13 వ సమావేశాన్ని 9–8–1967 తేదీన, 14 వ సమావేశాన్ని 20–2–1968 తేదీన జరిపి అనేకమైన ముఖ్యాంశాలనుకూడ పరిశీలించింది. అంతేకాక జాతీయ శ్రామిక సంఘంలో చర్చకువచ్చే అంశాలనుకూడ పరిశీలించింది. ఈ సంఘం 1968 ఫిబ్రవరి 21, 22 తేదీలలో హైదరాబాదులో సమావేశమైంది.

శ్రామిక సంక్షేమ కేంద్రాలు

వయోజన శ్రామికులకు విద్యగరపడానికి, వారి పిల్లలకు నర్సరీ తరగతులు నిర్వహించడానికి, వివిధ వృత్తులలో వారి కుటుంబాలకు శిక్షణ నీయడానికిగాను కార్మిక సంక్షేమ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. వినోద సదుపాయం కల్పించడమే కాకుండా, కుటుంబనియంత్రణ, శిశు సంక్షేమం విషయంలోకూడా సలహా ఈయబడుతున్నది. పరిశ్రమల కార్మికుల పిల్లలకు శాఖ కొనుగోలు చేసిన తాజా పాలు, అంతర్జాతీయ శిశు సంక్షేమ సంస్థ సరఫరాచేసే మీగడతీసిన పాలు సరఫరా చేయడం జరుగుతున్నది. బాలింత, చూలింతల విషయంలో తోడ్పడేందుకుకూడ ఏర్పాట్లు చేయబడ్డాయి. ప్రస్తుతం అట్టి కేంద్రాలు 11 ఈ క్రింది స్థలాలలో పనిచేస్తున్నాయి.

1. ముషీరాబాదు, 2. సనత్‌నగర్, 3. ఆజమాబాదు, 4. సీతాఫల్‌మండి, 5. వరంగల్లు, 6. సిర్‌పూర్ కాగజ్‌నగరు, 7. నిజామాబాదు, 8. విజయవాడ, 9. విశాఖపట్నం, 10. గుంటూరు, 11. ఆదోని.

బొగ్గు, అభ్రకం, ఇనుపగనుల కార్మికులకోసం సంక్షేమ కార్యకలాపాలను చేపట్టే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం సెస్సు వసూలు చేస్తున్నది. బొగ్గుగనుల విషయంలో వసూలు చేయబడిన సెస్సు చాలా ఎక్కువగా వున్నది. ఉచిత వైద్యసహాయం, క్షయరోగులకు ప్రత్యేక చికిత్స, సంక్షేమకేంద్రాలను, భారత దర్శన యాత్రలు మొదలైనవాటిని నిర్వహించడంవంటి సంక్షేమ కార్యకలాపాలను చేపట్టడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ బొగ్గుగని ఉపసంఘానికి శ్రామిక శాఖ కమీషనరు అధ్యక్షులు.

అభ్రకం గనుల విషయంలో నెల్లూరు కలెక్టరు అధ్యక్షులుగా వున్నారు. వీరు శ్రామికుల సంక్షేమ పథకాన్ని అమలు జరుపుతున్నారు.

ఇనుప గనులకు సంబంధించి, సెస్సు వసూలుచేసే విషయంలో తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధం లేదు. శ్రామికశాఖ డెప్యూటీ కమీషనరు ఒకరు సలహా సంఘం సభ్యులుగా ఉన్నారు. ఇనుప గనులకు సంబంధించి సంక్షేమ కార్యకలాపాలు అంత ఎక్కువగా చేపట్టబడలేదు. ఇనుప ఖనిజంపై కొన్ని వందల లక్షల రూపాయల సెస్సు వసూలైంది. కాని సంక్షేమ కార్యకలాపాలపై చేసే ఖర్చు సంతృప్తికరంగా లేదు. ఈ విషయం 19-1-1968 తేదీన గోవాలో జరిగిన సమావేశంలో పరిశీలించబడింది. ఆ సమావేశంలో సంఘాల స్వరూపాన్ని మార్చాలని, పథకాలను రూపొందించి, అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకోవాలని శ్రామిక మంత్రి చేసిన సూచన ఆమోదించబడింది.

కార్మిక విద్య

రాష్ట్రంలోని ఎనిమిది వేరు వేరు ఫ్యాక్టరీలలో కార్మిక విద్యా తరగతులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ శాఖ నియమించిన వయోజన విద్యా బోధకులు ఫ్యాక్టరీ కార్మికులకు చదవడంలోను, వ్రాయడంలోను, గణితంలోను ప్రాథమిక విద్య గరుపుతారు. తరగతులకు అవసరమైన పలకలు, పెన్సిళ్లు, పుస్తకాలు, స్టేషనరీ మొదలైన వాటిని ఈ శాఖ సరఫరా చేస్తున్నది. తరగతులను నడపడానికి గాను ఫర్నీచరును, వసతిని ఆ యా యాజమాన్య వర్గాలవారు సమకూరుస్తారు.

ఫ్యాక్టరీలలో కార్మికులకు శాఖ ప్రారంభించిన విద్యాబోధన తరగతులకు అదనంగా, భారత ప్రభుత్వంచే ప్రతిపాదించబడిన కార్మికుల విద్యా పథకాన్ని అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందజేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను, వాటిలోగల కార్మికులు యూనిటు స్థాయి తరగతులకు హాజరయ్యేందుకు అవసరమయ్యే సమస్త సహాయ, సదుపాయాలను సమకూర్చవలసిందని కోరడం జరిగింది. సుశిక్షితులైన అధికారులు, వివేకవంతులైన సభ్యులద్వారా పటిష్టము, సమర్థవంతము అయిన ట్రేడు యూనియన్లను రూపొందించడం, కార్మికులు తమ కర్తవ్యాలను, హక్కులను ఇతోధికంగా గ్రహించేట్లు చేయడంతోపాటు వారిలో నాయకత్వాన్ని పెంపొందించడమే కార్మికుల విద్యా పథకపు ముఖ్య ఉద్దేశం. గత పది సంవత్సరాలలో ఈ పథకం ద్వారా ప్రయోజనము పొందిన కార్మికుల మొత్తం సంఖ్య 72,624.

శిక్షణ పొందిన కార్మికుల ఉపాధ్యాయులు	... 1,201
శిక్షణ పొందిన కార్మికులు	... 67,294
కార్మికులకు స్వల్పకాలిక శిక్షణ	... 4,129

గృహవసతి

ఈ సంక్షేమ కార్యకలాపాలకు తోడు కార్మికుల ప్రయోజనార్థం సబ్సిడీ పారిశ్రామిక గృహ నిర్మాణ పథకం క్రింద పట్టణంలోని వివిధ ప్రాంతాలలోను, జిల్లాల్లోను గృహాల నిర్మాణం చేపట్టబడింది. దీనికోసం భారత ప్రభుత్వం నుండి, ప్రభుత్వ ఆరోగ్య, గృహవసతి, మునిసిపలు పరిపాలన శాఖ ద్వారా రుణాల సబ్సిడీల రూపంలో సహాయం లభిస్తుంది.

ఉద్యోగుల రాష్ట్ర భీమా పథకం

ఉద్యోగుల రాష్ట్ర భీమా చట్టంక్రింద, దాని క్రింద తయారు చేసిన పథకం క్రింద కార్మికులకు వైద్య సౌకర్యాలు కలిగించబడుతున్నాయి. ఉద్యోగుల రాష్ట్ర భీమా అధికారులు ఇంతవరకు ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదు, కాగజ్ నగర్, వరంగల్లు, విజయవాడలలో 4 ఆసుపత్రులను నిర్మించారు. రాష్ట్రంలో ఉద్యోగుల రాష్ట్ర భీమా డిస్పెన్సరీలు 54 చోట్ల నడుపబడుతున్నాయి. ఈ పథకం లక్షమందికిపైగా కార్మికులకు వర్తింపచేయ బడింది. ఈ చట్టపు ప్రయోజనాలను ఈ చట్టం అమల్లోకి తేబడిన ప్రదేశాలలో కార్మికుల కుటుంబాలకు విస్తరింపచేసిన మొట్టమొదటిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

ప్రణాళికా పథకాలు కలుపుకొని 1966-67లో అయిన ఖర్చు రూ. 38.39 లక్షలు. వైద్య రక్షణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వము, ఉద్యోగుల రాష్ట్ర భీమా సంస్థలు 1:7 నిష్పత్తిలో భరిస్తాయి.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మరొక సాంఘిక భద్రత చర్య-ప్రావిడెంటు ఫండు పథకం. కొన్ని షెడ్యూల్డు ఉద్యోగాలు ఈ పథకం క్రిందకు వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ పథకం వర్తింప జేయ బడిన కార్మికుల మొత్తం సంఖ్య 2,14,000, సంస్థల సంఖ్య 2,540.

1967వ సంవత్సరంలో ప్రసూతి సహాయచట్టం క్రింద చేసిన క్లెయిములకు, ప్రసూతి సహాయం నిమిత్తం చెల్లించిన మొత్తానికి సంబంధించిన సమాచారం ఈ క్రింద తెలియజేయబడింది.

1. ప్రసూతి సహాయచట్టంక్రింద 1967వ సంవత్సరంలో ప్రసూతి సహాయాన్ని క్లెయిముచేసిన స్త్రీలసంఖ్య— —65

2 అంగీకరించి పూర్తిగా లేక పాక్షికంగా చెల్లించిన క్లెయిముల సంఖ్య 65

3 ప్రత్యేక బోనసు చెల్లించిన కేసులసంఖ్య 8

4 బోనసుతో కలుపుకొని చెల్లించిన ప్రసూతి సహాయంమొత్తం రూ 7,351 73

5 స్త్రీలు ప్రసవమునకు ముందు ప్రసూతి సెలవు పూర్తిగా పొందిన కేసులసంఖ్య 16

300 మంది, అంతకుమించి కార్మికులు పనిచేస్తున్న సంస్థలలో వాడకందార్ల సహాకార స్టోర్లు ప్రారంభించాలని 1962 ఆగస్టులో న్యూఢిల్లీలో జరిగిన భారత శ్రామిక మహాసభ 20వ సమావేశంలో తీర్మానించబడింది అట్టి యూనిట్లు మొత్తం 143 వుండగా ఇంతవరకు 121 యూనిట్లలో వాడకందార్ల సహకార స్టోరు లేదా సరస ధరల దుకాణాలు ఏర్పాటు చేయబడ్డాయి అందులో 107 గత సంవత్సరమే ఉన్నాయి మిగిలిన యూనిట్లలో కూడా వాడకందార్ల సహకార స్టోర్లను ఏర్పాటుచేయదానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి

సాధారణ ఉద్యోగ పరిస్థితి

1966 67 ఉద్యోగ పరిస్థితితో పోల్చిచూస్తే 1967_68లో మొత్తంమీద రాష్ట్రంలోని ఉద్యోగ పరిస్థితిలో కొద్దిపాటి తగ్గుదల కనిపించింది రాష్ట్రంలోని ఉద్యోగవసతి కార్యాలయాలలో 1966 క్యాలెండరు సంవత్సరంలో 2,38 366 మంది నమోదుకాగా 1967 డిసెంబరు నెలాఖరువరకు 2 21,986 మంది నమోదు అయినారు ఈ కార్యాలయాలకు తెలుపబడిన ఖాళీల సంఖ్య 1966లో 43,501 కాగా, 1967 డిసెంబరు నెలాఖరు వరకు ఇది 30,598 ఉద్యోగాలు ఇవ్వబడ్డ వ్యక్తులసంఖ్య 1967 డిసెంబరు నెలాఖరువరకు 22 641 కాగా, 1966లో వీరి సంఖ్య 33 786, 31_12_1967 నాటికి లైవ్‌రిజిష్టరులో మిగిలివున్న వ్యక్తుల సంఖ్య 1,57,177

వికలాంగులకు 3 శాతం ఖాళీలను ప్రత్యేకించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1_8_1966 తేదీ సాధారణ పరిపాలన (ఉద్యోగాలు_డి) శాఖ మిస్ 1034 జి ఓ లో ఉత్తరువు చేసింది ఈ వ్యక్తులు పబ్లికు సర్వీసు కమీషను పరీక్షకు హాజరైతే, వీరు పరీక్ష రుసుముల చెల్లింపునుండి కూడ మినహాయించబడ్డారు

వృత్తి పనివారల శిక్షణ పథకాలు

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని పరిశ్రమలను విస్తృతం చేయడానికి "రక్షణ వ్యవస్థలకు" అవసరమైన వివిధ వృత్తులల్లో వృత్తి పనివారికి శిక్షణ నివ్వడమే భారత ప్రభుత్వంతో కలిసి అమలు జరిపిన కేంద్ర ప్రతిపాదిత వృత్తి పనివారల శిక్షణ పథకాల ఉద్దేశం అందువల్ల ఈ కార్యక్రమాలను రక్షణావసరాలకు అనుకూలపరచినట్టివిగా కూడా పరిగణించడం జరిగింది

మూడవ పంచవర్ష ప్రణాళిక ఆఖరయ్యేనాటికి రాష్ట్రంలోని మొత్తం 21 పారిశ్రామిక శిక్షణ సంస్థలలోని స్థానాలసంఖ్య 7,420కి పెరిగింది కడప మహబూబ్‌నగర్ జిల్లాలలో తప్ప రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ముఖ్యంగా ఆయా జిల్లాల అవసరాలు తీర్చదానికిగాను ఒక పారిశ్రామిక శిక్షణ సంస్థ ఏర్పాటు చేయబడింది

ప్రస్తుతమున్న పారిశ్రామిక శిక్షణ సంస్థలను విస్తృత పరచడంద్వారాగాని క్రొత్తపారిశ్రామిక శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయదంద్వారాగాని నాల్గవ ప్రణాళికా కాలంలో ప్రవేశపెట్టడానికిగాను భారత ప్రభుత్వ ఉద్యోగ, శిక్షణ డైరెక్టరేటు జనరలు 6 531 సీట్లను తాత్కాలికంగా కేటాయింపు చేశారు భారత ప్రభుత్వం నిర్ణయించిన విధానాన్ననుసరించి మొదటి రెండేండ్లలోని ప్రణాళికా కార్యక్రమాలు ప్రస్తుతమున్న పారిశ్రామిక శిక్షణ సంస్థలను విస్తృత పరచడానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయి ప్రణాళికా కాలం మిగిలిన భాగంలో క్రొత్త పారిశ్రామిక శిక్షణ సంస్థలు నెలకొల్పడానికి తలపెట్టబడింది ఆ ప్రకారం ప్రణాళిక మొదటి సంవత్సరంలో (1966_67) అదనంగా 2,008 సీట్లను చేర్చడం ద్వారా ప్రస్తుతమున్న 9 పారిశ్రామిక శిక్షణ సంస్థలను విస్తృతపరచడం జరిగింది

అప్రెంటీసు చట్టం

నిపుణులైన పనివారలుగా, అప్రెంటీసుల శిక్షణను క్రమపరచి నియంత్రించడానికి అందుకు సంబంధించిన ఇతర విషయాలకు 1961, అప్రెంటీసు చట్టంలో నిబంధన చేయబడింది, రాష్ట్రంలో 1968_69లో కూడా ఈ చట్టపు అమలు కొనసాగుతుంది ఈచట్టపు నిబంధనల క్రింద ప్రకటిత పరిశ్రమను నిర్వహిస్తున్న యజమానులందరూ, ప్రతి నిర్ణీత వృత్తిలోను నియమితులైవున్న నిపుణ కార్మికుల సంఖ్యను నిర్ణయించి దామాషాలో అప్రెంటీసులను నియమించి, నిర్ణీత శిక్షణ ప్రణాళిక ననుసరించి పని స్థలంలో శిక్షణనిచ్చి అఖిల భారత వృత్తి పరీక్షకు తయారు చేయవలసివుంటుంది ఇందుకుగాను ఇంతవరకు 40 ఇంజనీరింగ్ వృత్తులు నిర్ణయించబడి ఉన్నాయి 1968లో కేటరింగు పరిశ్రమలో మరో ఆరు వృత్తులు, తోలు, ప్లాస్టిక్ పరిశ్రమ మొదలైనవాటిలో మరికొన్ని వృత్తులు నిర్ణయించ బడుతున్నాయి పబ్లిక్, ప్రైవేటు రంగాలు రెంటిలోను 88 సంస్థలు ఈ చట్టాన్ని అమలు జరుపుతున్నాయి ఇంతవరకు 455 మంది పూర్తి కాలిక అప్రెంటీసులు, 1058 మంది స్వల్పకాలిక అప్రెంటీసులు తమ శిక్షణను పూర్తి చేశారు 543 మంది పూర్తికాలిక అప్రెంటీసులు, 134 మంది స్వల్పకాలిక అప్రెంటీసులు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏడాదికి 1000 మంది అప్రెంటీసులను తయారుచేయాలన్నది నిర్ణయించబడిన లక్ష్యం 1968లో ఈ లక్ష్యాన్ని చేరుకోగలమని ఆశించ బడుతున్నది *

(శ్రామికమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కార్మికశాఖ బడ్జెటు డిమాండునుండి కొన్ని భాగాలు)

తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి



" ఏంకల వచ్చిందని అడగవేం బావా ? " అంది సరళ

"నిన్న అంత భయపెట్టిన కలను మళ్లీ నీచేత చెప్పించటం నాకు ఇష్టంలేదు పడుకో రేపు చెబుదువుగానిలే " అన్నాడు సత్యం

"బావా?" అంటూ సరళ సత్యంముఖంలోకి చూసింది కాని చీకట్లో మసకగా ముఖంమాత్రమే కనిపించింది సరళ కంఠంలో వణుకు, ఏదో తెలియని ఆవేదన కనిపించి సత్యం ఉలిక్కిపడ్డాడు

"ఏమిటిసరళా! ఎన్నడూ లేని ఈ ఆవేశం ఎందుకు ?" అని ప్రశ్నించాలనిపించింది సత్యానికి సరళను గాఢంగా హృదయానికి హత్తు కోవాలని పించింది

జరిగిన కథ

సత్యం, సూర్యం అన్నదమ్ములు సత్యం చిత్రకారుడు, సూర్యం పట్నంలో చదువుకుంటున్నాడు సరళ చిన్నప్పుడే తల్లి దండ్రులను కోల్పోయి ఆ యింట ఆశ్రయం పొందింది సరళను సత్యానికి యిచ్చి పెళ్ళి చెయ్యాలని చిన్నప్పటినుంచీ అనుకుంటు న్నారు అయితే సూర్యం నాజూకు చూస్తే సరళకు వ్యామోహం కలిగింది ఒకరాత్రి సరళకు విచిత్రమైన కల ఒకటి వచ్చింది అమె కెవ్వున వేసిన కేకకు హడావిడిగా పరుగెత్తుకుని వచ్చాడు సత్యం

"పడుకో, భయంలేదు నేను ఇక్కడే వున్నాగా?" అన్నాడు మంచం మీద ఓరగా కూర్చుంటూ.

సరళకు హృదయం తేలిక పడింది తను పెద్ద బావ సొత్తు. తను మరొకర్ని గురించి ఆలోచించ కూడదు సరళ నిద్రపోయి నట్లు గమనించిన సత్యం కాళ్ల దగ్గిర వున్న దుప్పటిని తీసి కప్పి అక్కడ నుంచి వెళ్ళి పోయాడు

4

బాగా తెల్లవారింది "ఏమిటమ్మా సరళా? ఇవ్వాళఇంకా లేవ లేదు?" అంటూ శాంతమ్మ సరళను లేపింది ఉలిక్కి పడి లేచి కూర్చుంది సరళ కళ్లు మంటగా, తల బరువుగా వున్నట్లనిపించింది.

"ఏమే? అలా కళ్లు ఎర్రగా వున్నాయి? జ్వరం గానీ లేదు గదా?"ఆదుర్దాగా శాంతమ్మ సరళ నొసటి మీద చెయ్యి వేసింది

"జ్వరం ఏం లేదు రాత్రి సరిగా నిద్ర పట్టలేదు అంతే " అంటూ సరళ ముఖం కడుక్కోవటానికి వెళ్ళింది.

" అమ్మ గుర్తొచ్చిందేమో ! " తనలో తనే అనుకుంది శాంతమ్మ, వెళ్ళి పోతున్న సరళను చూస్తూ.

ఆ ఉదయమంతా సరళ తనకు తప్పుకు తిరుగుతున్నట్లు గమనించాడు సూర్యం సరళ కళ్ళు ఎర్రగా వుండటంకూడా గమనించాడు అమ్మ తనతో అంత చనువుగా తిరుగుతున్నందుకు మందలించిందేమో ! అని అనుకున్నాడు సూర్యానికి ఏమీ తోచక ఇల్లంతా కలియ తిరిగాడు సరళ ఆ విషయాన్ని గమనించక పోలేదు సరళ చిన్న బావతో ఏదో పేచీ పెట్టుకొని వుంటుందని ఊహించుకొని నవ్వుకుంది శాంతమ్మ

ఆరోజు తెల్లవారు ఝామునే లేచి సత్యం విజయవాడలో జరుగుతున్న 'చిత్ర' ప్రదర్శనం చూట్టానికి విజయవాడ వెళ్ళాడు భోజనంచేసి శాంతమ్మ తల వాల్చింది చంద్రయ్య పొలం వెళ్ళాడు సూర్యం స్నేహితుడు రామం వస్తే బయట వసా రాలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు సరళకు మనస్సేమీ బాగా లేదు అటూ ఇటూ కొంచెం సేపు తిరిగింది కమల గుర్తొ చ్చింది ఇంకా ఎన్నో బస్తీ విషయాలు కమల్ని అడిగి తెలుసు

కోవాలనే కుతూహలం కలిగింది సరళకు శాంతమ్మ నిద్రలేచేలోగా అక్కడకు వెళ్ళి రావచ్చును అనుకుంది సరళ

సరళ వెళ్ళేప్పటికి కమల అద్దంముందు కూర్చొని తల దువ్వుకుంటున్నది మధ్యాహ్నం ఒంటి గంటకు తలదువ్వు కుంటున్న కమలనుచూసి సరళ ఆశ్చర్యం వేసింది

"రా సరళా !" కమల ఉత్సాహంగా సరళను ఆహ్వానించింది

"ఎవరూ ? ఓహో శాంతమ్మ కోడలా ! ఏం పిల్లా, ఎప్పుడు పప్పన్నం పెడతావు?" అంటూ ప్రశ్నించింది కమల తల్లి సరళ తల సిగ్గుతో వాలిపోయింది చెక్కిళ్ళలోకి రక్తం చిమ్మింది

సిగ్గుతో ఎర్రబడిన బుగ్గలను చూస్తూ " ఎంత అందంగా వుంటావు సరళా అంది కమల కమల విడిచిన నిట్టూర్పుకు సరళ ఆశ్చర్యంగా తల పైకెత్తింది

"అత్తయ్య ఏం చేస్తుందమ్మా." కమల తల్లి ప్రశ్నించింది

"నిద్ర పోతుంది " అని సరళ జవాబు ఇచ్చింది కమల తల్లి అక్కడ నుంచి వెళ్ళిపోయింది

అప్పటికే కమల రెండు సార్లు ముడి చుట్టడం ఊడదీయటం జరిగింది మళ్లీ చుట్టటానికి ప్రయత్నిస్తున్న కమలనే చూస్తూ కూర్చుంది సరళ

"పొద్దుటి నుంచీ ఏంచేశావు " అంది సరళ

"పొద్దుట చుట్టుకున్న ముడి సరిగా దర్లేదు అందుకే మళ్లీ చుట్టుకుంటున్నాను అంది కమల

అయిదు నిముషాల్లో ఏదోముడిచుట్టి రెండు చేతులతో రెండద్దాలు పట్టుకొని, ఒక అద్దం వెనక నుంచీ, ఒక అద్దం ముందునుంచీ చూపిస్తూ ముడి చూసుకుంటున్న కమలను కుతూహలంగా చూస్తుంది సరళ

"ఛ ! కుదర్లేదు " విసుగ్గా జుట్టు లాగేసింది కమల "వెధవ ముడి, చేతులు పీకుతున్నాయి ఇంక వేసుకోను, ఆఁ సరళా' అలా పలకకుండా కూర్చున్నావేం , ఏమయినా చెప్పు, " అంటూ మళ్లీ అదేముడిని వేసుకోసాగింది కమల

చుట్టిన ముడిని అద్దంలో చూసుకొని పెదవులు చప్పరిస్తూ మళ్లీ తీసివేసింది

"అదేమిటి మళ్లీ తీసేశావ్?" సరళ ఆశ్చర్యంగా అడిగింది

"కుదరటంలేదు గంటనుంచి అవస్త పడుతున్నాను వెధవ ముడి ఇక అసలు వేసుకొనే వేసుకోను " అంది కమల విసుగ్గా

"ఏమో నాకు బాగానే వున్నట్లనిపించింది అయినా నీకు ఎంత ఓపికబ్బా?" అంది సరళ

కమల వేసుకోను అంటూనే మళ్లీ అదేముడి చుట్టటానికి ప్రయత్నించటాన్ని వింతగా చూస్తూకూర్చుంది సరళ కమలకు ఆ ముడి కుదిర్తేనేకాని తనతో కూర్చుని తాపీగా మాట్లాడదని అర్థం అయింది సరళకు మరో పది పదిహేను నిముషాలకు ముడి చుట్టుకొని ఏదో ఘనకార్యం సాధించినదానిలా ముఖంపెట్టి సరళ దగ్గరగా వచ్చి కూర్చుంది కమల

"నేను రేపు వెళ్ళిపోతున్నాను " అంది కమల

"రేపేనా? ఇంతత్వరగా?" ఆశ్చర్యంగా చూసింది సరళ

"ఇక ఉండలేను బాబూ ఈ వెధవ పల్లెటూర్లో నాలుగు రోజులూ నాలుగు యుగాల్లాగా గడిచాయి ఏం మనుషులో ఏం ఊరో? ప్రతి చిన్నదానికీ ఆరాలు తీస్తారు ప్రతివాళ్ళకు సంబంధించిన ప్రతి చిన్నవిషయం ప్రతి ఒక్కరికీ కావాలి పల్లెటూరివాళ్లు అమాయకులనీ, మంచి హృదయం కలవారనీ బస్తీల వాళ్లనుకుంటారు నాకుమాత్రం అనిపించదు ఎవరన్నా చస్తే వాళ్లింట్లోవాళ్లు సరిగా ఏడ్చారా లేదా అనే విషయం మీద కూడ చర్చలు జరుపుతారు ఛ' ఛ!" ఉపన్యాస ధోరణిలో మాట్లాడుతున్న కమలను కళ్లు పెద్దవి చేసుకొని చూస్తూకూర్చుంది సరళ

"మా ఆయన కూడా వీలయినంత త్వరగా వచ్చేయమని రాశారు ఆయనకు అసలే హోటల్ భోజనం పడదు వసంతను కూడా తీసుకెళుతున్నాను'' అంది కమల

సరళ నిట్టూర్చింది వసంత అదృష్టవంతురాలు అనుకుంది మనస్సులోనే

"ఏవిటోయ్ అలా మౌనంగా కూర్చున్నావ్' నీ పెళ్ళెపుడు? నీ పెళ్ళికి మాత్రం తప్పక వస్తాను " అంది కమల చేతిని తన చేతిలోకి తీసుకుంటూ

సరళ జవాబివ్వలేదు

"మీ పెదబావకూడా బాగానే చదువుకున్నాడు ఆ బొమ్మలు వేసే పిచ్చిమానేసి ఏదైనా ఉద్యోగం చెయ్యమను మా ఆయనకు హైదరాబాదులో చాలామంది పెద్ద పెద్ద వాళ్ళు తెలుసు మీ పెద బావక్కూడా ఉద్యోగం చూడమని చెబుతాను మీరుకూడా బస్తీకి వచ్చెయ్యొచ్చు మనందరం ఒకచే పెద్ద ఇల్లు అద్దెకు తీసుకోవచ్చు ఎంత హాయిగా కాలం గడపొచ్చు '" కలల్లో తేలిపోతూ మాట్లాడుతుంది కమల

సరళ నిట్టూర్పు విని ఆశ్చర్యంగా సరళ ముఖంలోకి చూసి విస్తుబోయింది కమల సరళ ముఖం మేఘావృతమైన శ్రావణ మాసపు ఆకాశంలా వుంది ఏ నిముషంలోనైనా ఆమె నేత్రాల నుంచి అశ్రుధారలు వర్షించవచ్చును అన్నట్లుంది

"ఏమిటి సరళా! ఏదో దిగులుగా వున్నావు ?" అంటూ ఆప్యాయంగా సరళ చేతిని తన చేతిలోకి తీసుకుంది

మేఘావృతమైన ఆకాశానికి చల్లనిగాలి సోకినట్లు, బరువుగా వున్న సరళ హృదయాన్ని కమల స్నేహంలోని స్నిగ్ధత సోకింది ఒక్కసారిగా కళ్ళలో నీరు తిరిగింది

"మాట్లాడవేం సరళా ?" అంటూ తనచేతి మీద పడిన అశ్రుబిందువుకు ఉలిక్కి పడింది కమల

"సరళా ? ఏమిటిది ? ఏడుస్తున్నావా ! ఛా ! ఏం జరిగింది? నాకు చెప్పవూ ?" అంటూ తన రెండు చేతుల్నీ సరళ చుట్టూ చుట్టి గుండెల దగ్గరకు లాక్కుంది

సరళ కళ్ళు తుడుచుకుని సంబాళించుకొంది

"చెప్పు సరళా ? ఏం జరిగిందో చెప్పవూ ?" బ్రతిమాలుతు అడిగింది కమల

"నిన్నొకమాట అడుగుతాను సరైన సలహా ఇస్తావు గదూ ?" అంది సరళ అనుమానంగా కమల ముఖంలోకి చూస్తూ

"తప్పకుండా అడుగు" అన్నదే కాని కమలకు ఆశ్చర్యం వేసింది, తను సలహా ఇవ్వవలసిన సమస్యలు సరళకు ఏం ఎదురయి ఉంటాయని

"నేను మా పెద్దబావను పెళ్ళిచేసుకోను" అంది సరళ హృదయంలోకి ధైర్యాన్ని కూడదీసుకుంటూ

అకస్మాత్తుగా ఏదో ప్రేలుడు వినిపించినట్టూ, అనుకోకుండా ఎవరో వెన్నుమీద చరచినట్లూ కమల ఉలిక్కి పడింది మతిపోయినదానిలా, సరళ చెప్పిన విషయం అర్థం కానట్లు చూసింది

"ఈ విషయంలో నీ సలహా కావాలి" అంది సరళ

కమలకు తాను వింటున్నది నిజం అని నమ్మటానికి ఓ క్షణం పట్టింది

"ఏమిటి సరళా నువ్వంటుంది ? నిజమేనా ? తమాషాగానా?" అంది ఆశ్చర్యం నుంచి పూర్తిగా కోలుకోని కమల

"నిజమే ?" అంది తలవంచుకొని అపరాధిలా సరళ

"ఎందుకూ ? పెద్దబావంటే నీకు చాలా ఇష్టం గదూ? మీరిద్దరూ భార్యాభర్తలుగా ఏనాడో నిర్ణయమయి పోయిందిగా?"

"అందుకేగా నీ సలహా కోసం వచ్చాను ?"

"నీకు మీ పెద్ద బావంటె ఎంతో గౌరవం ఉండేది"

"ఇప్పుడూ వుంది పెద్ద బావను నేను దైవంలా గౌరవిస్తాను" అంది సరళ

"నువ్వనేది నాకు అర్థం కావటంలేదు మరి పెద్ద బావను వివాహం చేసుకోవటానికి నీ అభ్యంతరం ?" అంది కమల సాలోచనగా

చిన్నబావ డాక్టరవుతాడు పట్నంలో ఉంటాడు ఎంతో ఉత్సాహంగా కబుర్లు చెబుతాడు పెద్దబావ ఈ ఊరువదలడు తన బొమ్మలేమో తనే మోగా ఉంటాడు పైగా ఏదో అనబోయి సరళ నాలుక కొరుక్కుంది

"ఊఁ చెప్పు, ఆగావేం ? పైగా ..పైగా కుంటివాడు అతన్ని చేసుకొని ఏం సుఖం అనుభవించాలి అనేగా అనబోయావు?" కమల స్వరంలోని తీవ్రతకు సరళ జంకుతూ స్నేహితురాలి ముఖంలోకి చూసింది

"మీ పెద్ద బావకు నువ్వంటే ప్రాణం వయస్సుతోపాటు అతని రక్తంలో నీ ప్రేమ రక్తమై పెరిగింది చిన్నప్పుడు మనందరం కలిసి ఆడుకునేవాళ్ళం మీ చిన్న బావకు ఎప్పుడూ నువ్వు మీ పెద్ద బావతో ఆడటం ఇష్టం ఉండేది కాదు ఇద్దర్నీ కొట్టి పారిపోయేవాడు గుర్తుందా ? చాలా పోకిరీగా ఉండేవాడు"

"అది చిన్నప్పటి విషయం అసలు చిన్న బావ అలా ప్రవర్తించటానికి కారణం నేనంటే ప్రేమ కాబట్టే" అంది సరళ

కమల ఆలోచనల్లోకి ఎగిరిపోయింది చిన్ననాటి జ్ఞాపకాలు ఆకాశంలోని నక్షత్రాల్లా మెరవసాగాయి తను సత్యం అంటే పడిచచ్చిపోయేది చిన్నప్పుడు తను పెద్దదయాకకూడా సత్యం అంటే చాలా ఇష్టపడేది కాని సత్యానికి సరళ అంటే ప్రాణం అని తనకు తెలుసు అందుకే తన ప్రేమను మరో వ్యక్తికి తెలియకుండా గుండెల్లో దాచుకుంది సత్యం ఒప్పుకోవాలే కాని ఒక్క చెయ్యి కాదు అతనికి రెండు చేతులు లేకపోయినా సంతోషంగా వివాహం చేసుకొని ఉండేది సత్యంతో సాంగత్యం ముందు తనకు ఈ బస్తీ జీవితం, తను అనుభవిస్తున్నాననుకుంటున్న ఈ సుఖం ఒకలెక్కలోనిది కాదు సత్యం ముందు తన ప్రేమను ప్రకటించే అవకాశమే లభించలేదు చిన్నప్పుడు ఎంత కలిసి ఆడుకున్నా పెద్దయాక సత్యాన్ని చూసే అవకాశం కూడా తనకు లభించలేదు తను దాని కోసం ప్రయత్నంకూడా చెయ్యలేదు కారణం సత్యం భార్య సరళ అని ఏనాడో నిర్ణయించటం అందరూ ఆ దృష్టితోనే చూట్టం ముఖ్యంగా సత్యానికి సరళ మీద వున్న ప్రేమను తను అర్థం చేసుకుంది అందుకే నోరుమెదిపి ఎవరికీ ఏమీ చెప్పుకోలేక పోయింది తల్లిదండ్రులు కుదిర్చినవ్యక్తిని వివాహం ఆడింది పట్నం జీవితంలో ఓవిధంగా సత్యాన్ని మర్చిపోయాననే అనుకుంది తను. కాని మళ్ళీ ఈ ఊళ్ళో అడుగు పెట్టిన మరుక్షణంనుంచే చిన్నప్పటి జ్ఞాపకాలు తనను వేధించసాగాయి సత్యాన్ని ఒక్కసారి చూడాలనే కోర్కెను అణచుకోలేక పోయింది అందుకే ఆనాడు తను వాళ్ళింటికి వెళ్ళింది కాని సత్యం కనిపించలేదు అదీ ఒకవిధంగ మంచిదేనని సరిపెట్టుకుంది తను సరళ అదృష్టానికి ఓవైపు ఈర్ష్య పడింది మళ్ళీ సత్యం సుఖంగా ఉండడమే తనకు కావాల్సిందని సరిపెట్టుకుంది తను సత్యం ఏవిధంగా బాధపడతాడన్నా, సత్యాన్ని ఎవరైనా చిన్నచూపు చూసినా ఈనాటికీ తన హృదయాన్ని బల్లెంతో గుచ్చి ఎత్తినట్లు విలవిలలాడిపోతుంది ఎందుచేత ? సరళ అభిప్రాయం సత్యానికి ఏమాత్రం తెలిసినా ఆమెను వివాహం చేసుకోడు కాని తనలోతానే కృషించి పోతాడు

ఆలోచిస్తున్న కమల, బాధపడుతూ సత్యం ఎదురుగా నిల్చున్నట్లు ఊహించుకొని ఆవేదనపడింది

కమల మౌనాన్ని సరళ అపార్థం చేసుకుంది కమల ఒట్టి చుప్పనాతి సూర్పణఖ తను డాక్టరుభార్య కావటం, పట్నంలో కాపరం పెట్టటం ఇష్టంలేదు కమలకంటే తను గొప్పగా ఉండటం ఇష్టంలేదు పెద్దబావను చేసుకోవాలిట తన మొగుడిచేత ఉద్యోగం ఇప్పిస్తుందట బోడి ఉద్యోగం ! ఇక్కడకూడా తనగొప్పే చూపించాలి కాబోలు ! చిన్నబావకు ఎవరి సహాయం అక్కర్లేదు

డా క్టరయితే అందరూ అతని కాళ్ళదగ్గిరకు రావల్సినవాళ్ళే తను చిన్నబావనే చేసుకుంటుంది

కమల ఈర్ష్య పడుతుందనుకోవటంతో సరళలో మరీ పట్టుదల పెరిగింది

" నేను చిన్నబావనే చేసుకుంటాను !" కసిగా అంది సరళ కమలముఖంలోకి చూస్తూ

ఆలోచనలో కొట్టుకుపోతున్న కమల కొంచెం ఉలిక్కిపడింది.

"బాగా ఆలోచించుకో సరళా, ఇది ఒకరి జీవితానికి సంబంధించిన విషయం " అంది కమల సరళ ముఖంలోకి నిశితంగా చూస్తూ

"బాగానే ఆలోచించుకున్నాను. ఒకరి జీవితంకోసం నా జీవితాన్ని నాశనంచేసుకోలేను బావకు ఎవరోగంతకు తగ్గ బొంత దొరక్కపోదు " అంది సరళ దూకుడుగా

"సరళా?" అరవబోయి తమాయించుకుంది కమల

" సత్యం విషయంలో అంత చిన్నతనంగా మాట్లాట్టానికి నీకు నోరు ఎలా వచ్చింది సరళా " అందికమల జాలిఉట్టిపడే స్వరంతో

సరళకు తను ఆవేశంలో అన్నమాటల అర్థం తెలిసింది సరళకు ఏడుపు వచ్చింది

"నీవల్లనే పెద్ద బావను అలా అనాల్సి వచ్చింది" అంది సరళ ఏడుపు గొంతుతో

"నావల్లనా ?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది కమల.

"అంటేనా ఉద్దేశం, నువ్వు పెద్దబావను సమర్థిస్తున్నావనే కసికొద్ది ఏదో అనేశాను పెద్దబావ చాలా మంచివాడు దైవం లాంటివాడు పెద్ద బావకు నేను అర్హురాలినికాదు " అంది సరళ ఆవేశంగా.

"పిచ్చిపిల్లా ! నీకు అసలు ఏంకావాలో నీకే తెలియటంలేదు నాకుతెల్సు నీకుకావాల్సింది నిజంగా నీ పెద్దబావే కానీ సూర్యం చదువుచూసీ, అధునాతన వేషభాషల్నిచూసీ నీ మనస్సు ఆకర్షణకు లోనయింది నువ్వు చిన్న బావను ప్రేమిస్తున్నట్లు భ్రమపడుతున్నావు బాగా ఆలోచించుకో "

"అబద్ధం, నేను చిన్న బావను ప్రేమిస్తున్నాను చిన్న బావనే చేసుకుంటాను " ఎవరిమీదో కక్ష సాధిస్తున్నట్లు గబగబా అనేసింది సరళ

"మీ అత్తయ్యా మామయ్యా ఒప్పుకుంటారా ? సూర్యానికి తల్లిదండ్రులను ఎదిరించి నిన్ను వివాహం చేసుకునేధైర్యంఉందా! నీకు నేను పెద్దబావను చేసుకోను అని చెప్పగల సాహసం ఉందా?" అని నిలదీసినట్లు ప్రశ్నించింది కమల

"వచ్చిన చిక్కే-అది అత్తయ్య మామయ్య ఒప్పుకోరు పైగా వాళ్ళతో ఎలా చెప్పటం? అందుకే నీ సలహా అడగాలని వచ్చాను" అంది సరళ దిగులుగా

"నిజంగా నా సలహాను పాటిస్తావా?" అంది కమల సరళను చురుగ్గా చూస్తూ

"ముందు సలహా చెప్పు తరవాత 'వింటానో లేదో చెబుతాను" అంది సరళ

" నీ మంచి కోరి చెప్పే సలహా నాది ఒక్కటే నువ్వు సత్యాన్ని పెళ్లిచేసుకో, సుఖపడతావు లేకపోతే నువ్వూ సుఖపడవు. పైగా కుటుంబాన్నంతనూ సర్వనాశనం చేసినదానివి అవుతావు?" అంది కమల ఉద్రేకంగా

"అన్నీ అబద్ధాలే నన్ను భయపెట్టటానికి చూస్తున్నావు నేను చిన్నబావనే చేసుకోదలచుకున్నాను చేసుకుంటానుకూడా అసలు నువ్వు ఇలాంటి సలహా యిస్తావని తెలిస్తే నీ దగ్గిరకే రాకపోదును" కోపంగా అంది సరళ

"కోపం వచ్చిందికదూ? నీ భవిష్యత్తునూ, మీ కుటుంబ మంచి చెడ్డల్నీ దృష్టిలోపెట్టుకొనే అలా అన్నాను. ఆ తరువాత నీ ఇష్టం," అంది కమల నిరుత్సాహంగా

"వస్తాను " లేచింది సరళ

"ఇప్పుడే వెళతావా? "

"పెళ్ళాలి అత్తయ్యకు చెప్పకుండా వచ్చాను మా చిన్న బావ నాకోసం ఎదురుచూస్తూ ఉంటాడు " చివరి వాక్యం కావాలనే అంది సరళ

"సత్యం ఇంటిదగ్గిరే ఉన్నాడా? "ఏదో ఆలోచిస్తూ ప్రశ్నించింది కమల

"లేదు, విజయవాడ వెళ్ళేడు అక్కడ చిత్ర ప్రదర్శన వుందట " అయిష్టంగానే జవాబిచ్చింది సరళ

• రెండడుగులు ముందుకు వేసి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆగిపోయింది సరళ కమల ప్రశ్నార్థకంగా సరళ ముఖంలోకి చూసింది.

ఈ విషయం ఎవరితోనూ చెప్పవు గదూ ? "భయపడుతున్నట్లు కమల చేతిని తన చేతిలోనికి తీసుకుంటూ ప్రశ్నించింది

"ఛ ! ఎలాచెబుతాను నామీద ఆమాత్రం నమ్మకంలేదా ? పైగా నేను రేపే ఊరికి వేళుతున్నాను నిశ్చింతగా వుండు కాని మళ్లీ ఓసారి ఆలోచించుకో ఈవిషయంలో తొందరపడవద్దు " హెచ్చరించింది కమల

సరళ వినిపించుకోనట్లే ముందుకు సాగింది వెళ్ళిపోతున్న సరళను చూస్తూ నిట్టూర్చింది కమల సత్యం లాంటి మంచి మనుషులకు దైవం, మానవులూ ఇద్దరూ అన్యాయమే చేస్తారు అనుకుంటూ అలాగే వీధిగుమ్మంలో చాలాసేపు నిలబడి పోయింది కమల

(సశేషం)

జన సంబంధశాఖ

ఉద్దేశాలు—లక్ష్యాలు

జన సంబంధశాఖ రాష్ట్ర ప్రభుత్వపు పౌర సరిబంధ సమాచార విషయాలకు సంబంధించిన ప్రధానాంగం ప్రచురణల ద్వారానూ కార్యకర్తలు వాగ్రూపంగాచేసే ప్రచారం ద్వారానూ సమాచార కార్యకలాపాలు నిర్వహింప బడుతున్నవి

ఈ రెండు సాధనాలనూ గరిష్ఠ ప్రమాణంలో వినియోగించుకుని ప్రయోజన కరమైన పద్ధతిలో నిష్పాక్షికమైన వైఖరితో ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించుకునే ఉద్దేశంతో గత సంవత్సరం ఈ శాఖ పునర్ వ్యవస్థీకరించ బడింది

(అ) ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగానికీ, ప్రజాసామాన్యానికీ మధ్య సన్నిహిత సంబంధాలు సాధించి ఈ ఉభయవర్గాల మధ్య అవగాహనను అభివృద్ధి చేయడం,

(ఆ) ఈ శాఖలో సమర్థతను పెంపొందించడం,

(ఇ) ఈ శాఖను ఎక్కువ శక్తివంతంగానూ, ఎక్కువ ఉపయుక్తంగానూ చేసి దీని కార్యకలాపాలను రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకుకూడా విస్తరింపచేయడం,

(ఈ) ప్రజలలో ఉత్సాహం కల్పించడం—ముఖ్యంగా, అనధికార సంస్థలలో ప్రజలకు అభినివేశం కల్గించడం,

(ఉ) ప్రజల్లో విజ్ఞానం, కళలు, ఆటపాటలు, వ్యాయామం వీటికి సంబంధించిన కార్యక్రమాలపట్ల అభిరుచి పెంపొందించి, ప్రజల సాంఘిక జీవితాన్ని మెరుగు పరచడం,

(ఊ) ప్రాంతీయ ప్రాతిపదికపైగాని, ప్రత్యేక కార్యక్రమాలను పురస్కరించుకుని గాని గ్రామస్థాయిలోనూ ఇతర స్థాయిలలోనూ సామాజిక జీవితాన్ని ఆనందమయం చేయడం,

(ఋ) ప్రభుత్వ విధానాలూ, కార్యకలాపాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సరిగా అవగాహన చేసుకునేటట్లు చూడడం,

(ౠ) ప్రజలు తమ ఆర్థిక అభివృద్ధికోసం, సమాజ సౌభాగ్యంకోసం లోకహిత కార్యాలను ఐచ్ఛికంగా చేపట్టేటట్టు ప్రోత్సహించడం,

(ఎ) పైన చెప్పబడిన కార్యకలాపాలకు అవశ్యకమైన శిక్షణను సమకూర్చడానికీ, సామగ్రిని సమీకరించడానికీ, వసతి నిర్మాణానికీ, భూములను సంపాదించుకొని వాటిని అభివృద్ధి చేయడానికీ అవకాశాలను కలిగించడం,

(ఏ) జాతీయ ప్రశస్తిగల, స్థానికంగా ప్రసిద్ధులైన సాహితీపరులూ, కళాకారులూ, క్రీడాకారుల పేరను కట్టడాలను—ప్రజోపయోగకరమైన భవనాలూ, నాటకశాలల రూపంలో—నిర్మించడానికి సౌకర్యాలు కలిగించడం,

(ఐ) స్థానికంగానూ, యావద్దేశ పరంగానూ మతాతీత లౌకిక దృక్పథాన్ని పెంపొందించడం,

(ఒ) సుసంఘటితమైన, సుదృఢమైన ప్రచార ప్రజాసంబంధ కార్యక్రమాన్ని రూపొందించడం

పునర్ వ్యవస్థీకరణ పథకం అమలు 1967 జూన్ ఒకటవ తేదీని ప్రారంభమయింది ఈ కొత్త పద్ధతి ప్రకారం నిర్దేశింప బడిన విధులు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న వారికి అప్పగించబడినవి 1967 జూలై ఒకటి నుండి వారు తమ తమ ఉద్యోగ ధర్మాలను నిర్వహిస్తున్నారు ఇదేరీతిగా జిల్లా స్థాయిలోనూ ఈ పునర్ వ్యవస్థీకరణ, ఉన్న సిబ్బందితోనే అమలు జరప బడింది ఈ శాఖ నిర్వహిస్తున్న విధులను జన సామాన్యం సులభంగా అర్థం చేసుకోడానికి వీలుగా దీనికి జన సంబంధశాఖ అని నూతన నామకరణం చేయబడింది ఈ నామకరణం 11 వ రాష్ట్రావతరణ శుభ సమయాన 1967 నవంబరు ఒకటవ తేదీన జరిగింది ప్రచారం సమీకృతంగా, సమగ్రంగా జరగాలి అనే

ప్రభుత్వ నిర్ణయాన్ని పురస్కరించుకుని వ్యవసాయ, పశు సంవర్ధక శాఖలలోని ప్రచార విభాగాలను జన సంబంధశాఖలో 1967 జూన్ ఒకటవ తేదీన విలీనం చేయడం జరిగింది నాగార్జున సాగరంలోని జన సంబంధ ఉద్యోగి, ఒక స్టెనో గ్రాఫరు, ఇద్దరు జవానులు కూడా ఇటీవలే ఈ శాఖకు మార్చబడ్డారు

స్త్రీలు - పిల్లలు

మహిళా సంక్షేమం పట్ల, బాలల సంక్షేమం పట్ల ప్రజల ఆసక్తిని కేంద్రీకరించడానికి 1967 నవంబరు 14 నుంచి 20 వ తేదీ వరకూ శిశు-స్త్రీ సంక్షేమ సప్తాహంగా ప్రభుత్వంచే ప్రకటించబడి అమలుజరపబడింది ఈ విషయంలో ప్రత్యేక అభిమానంగల వారిని సంప్రదించి ఈ శాఖ ఈ క్రింది కార్యక్రమాన్ని రూపొందించింది .

నవంబరు	14	విషయం	శిశు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సప్తాహ ప్రారంభోత్సవం
	15	,,	ఆరోగ్యము, పౌష్టికాహారము
	16	,,	విద్య (అభివృద్ధికి తోడ్పడే అక్షరాస్యతతో సహా)
	17	,,	కుటుంబ సౌఖ్యం
	18	,,	కుటుంబంలో శిశువు
	19	,,	స్త్రీలకు ప్రత్యేక కార్యక్రమాలు
	20	,,	పిల్లలకూ స్త్రీలకూ, ఆటలూ, పాటలూ సాంస్కృతిక కార్యక్రమాలూ

పై నిర్ణయాన్ని పురస్కరించుకుని జనసంబంధ శాఖ ప్రోత్సాహంతో హైదరాబాదులోనేకాక అనేకమైన ఇతర చోట్ల కూడా కలెక్టర్లు, పంచాయతీ రాజ్య సంస్థలు, సాంఘిక సంక్షేమ విద్యాశాఖలు, ఇతర శాఖలలోని ఉద్యోగుల సహకారంతో ఈ సప్తాహం ప్రజా సంస్థలచే నిర్వహింపబడింది ఈ కార్యక్రమం ప్రారంభంలోనే బాగా జయప్రదం అయింది ఇది ప్రతి సంవత్సరం జరిగితే బాగుంటుందనే భావం విశదం అయింది. దీనివల్ల ఈ రంగంలో జరిగిన కృషిని సమీక్షించుకోడానికీ, భావి కార్యక్రమాలకు సూచనలు రావడానికీ ఎంతో అవకాశం ఏర్పడింది ఈ విధమైన ఉత్సవాలను తమతమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు యోచిస్తున్నాయి

యువత

పునర్ వ్యవస్థీకరణకు పూర్వం జన సంబంధశాఖ చెప్పుకోదగినంతగా ప్రజా బాహుళ్యంతో అవిచ్ఛిన్నంగా పటిష్ఠంగా సంబంధం కలిగి వుండలేదనే చెప్పాలి అంటే ప్రభుత్వానికి జన సామాన్యానికి మధ్యగాని, ప్రభుత్వానికి ప్రజలలోని ఏ ఒక్క ప్రత్యేక వర్గానికి మధ్యగాని అనుసంధానం లేక పోయిందన్న మాట ఈలోపాన్ని నివారించి వర్గాల వారిగా, 'కార్యక్రమాల వారిగా, ప్రాంతాలవారిగా ప్రజలందరినీ ఆసక్తి పరులుగా చేయడం ఈ పునర్ వ్యవస్థీకరణ ప్రధానోద్దేశాలలో ఒకటి తదనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ తర్వాత శుభారంభం జరిగి యువకులూ, విద్యార్థులూ, తల్లి తండ్రులూ, మహిళలకు సంబంధించిన సంస్థలతోనే కాక ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య, క్రీడా వ్యాయామ కార్య కలాపాలకు చెందిన సంస్థలతో కూడ సంబంధాలు ఏర్పడినవి

నేటి విద్యార్థి లోకాన్ని ఎదుర్కొంటున్న బహుసంఖ్యాక సమస్యలను అర్థం చేసుకోవడానికి 1967 సెప్టెంబరు 12 వ తేదీన జన సంబంధశాఖ కార్యాలయంలో విద్యార్థి సమావేశం ఒకటి జరపబడింది అందులో విశ్వ విద్యాలయంలోనూ, యితర స్థాయిలలోనూ చదువుతున్న విద్యార్థి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు ఈ తరం యువకులను ఎదుర్కొంటున్న సమస్యలను అరమరికలు లేకుండా స్వేచ్ఛగా చర్చించడానికి, ఒకరి అభిప్రాయాలు ఇంకొకరు తెలుసుకోవడానికి అవకాశం కలిగింది పుస్తక సేకరణ, శ్రమదానంతో ఐచ్ఛిక విరాళాలద్వారా యువజన వసతిగృహాల స్థాపన మొదలైన నిర్మాణాత్మక కార్య కలాపాలను' చేపట్టడం మొదలగు విషయాలను గురించి చర్చించడానికి త్వరలోనే విద్యార్థి సంస్థల ప్రతినిధుల సమావేశ మొకటి జరపాలనే ప్రాతిపాదనవుంది. యువజనోత్సవాలు కూడా ఏర్పాటు చేయాలని సంకల్పం వివిధ యువజన సంస్థలతో సంబంధాలు కల్పించుకోవడం జరుగుతున్నది

అల్ప సంఖ్యాక వర్గాలు, ఇంకా యితర సంస్థలతో కూడ సంబంధాలు నెలకొల్పుకునే కృషి జరుగుతున్నది

సాహిత్య, క్రీడా, సాంస్కృతిక కార్యకలాపాలను కొనసాగించే సంస్థలతో సంబంధాలు పెంపొందించుకోవాలనే ఉద్దేశాన్ని పురస్కరించుకుని 1967 ఆగస్టు పదిహేనవ తేదీన ఈశాఖ హైదరాబాదుతోసహా అన్ని జిల్లా ప్రధాన నగరాలల్లో కవిసమ్మేళనాలను ఏర్పాటు చేయించింది 1967 నవంబరు 1వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవంనాడు బహుభాషా కవి సమ్మేళనం ఏర్పాటు చేయబడింది చాలమంది సుప్రసిద్ధ కవులు పాల్గొన్న ఈ సమ్మేళనానికి ఎందరో జనం వచ్చారు ఈ నాడు అత్యంత ఆవశ్యకమైన జాతీయ సమైక్యతా ప్రాముఖ్యం ఈ సమ్మేళనంలో ప్రాధాన్యం వహించింది జంటనగరాలలోవున్న క్రీడాకారుల సమావేశం ఒకటి యీ శాఖ వారిచే 1967 ఆగస్టు 16 న ఏర్పాటు చేయబడింది హైదరాబాదులో జరిగిన అఖిల భారత వార్తా పత్రికా సంపాదకుల మహాసభ సందర్భంలో సభా ప్రతినిధులకోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఈ శాఖ ఏర్పాటు చేసింది

ఇతర దేశాలనుండి మన రాష్ట్రానికి ఏవైనా సాంస్కృతిక బృందాలు గాని, ట్రూపులు గాని వచ్చినప్పుడు స్థానిక సాంస్కృతిక సంస్థల ప్రతినిధులనూ, వారినీ కలిపి ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది అంతర్‌రాష్ట్ర సాంస్కృతిక

బృందాల మార్పిడిపథకం క్రింద ఆంధ్ర కళాకారుల బృందమొకటి పశ్చిమ బెంగాల్, నేఫా ప్రాంతాలకు పంప బడింది ఆ బృందం అచ్చటి ప్రజల, రసజ్ఞుల ప్రశంసలు అందుకొన్నది ఈ సంవత్సరం ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో ఈశాఖ సాంస్కృతిక కార్యక్రమాల లోనూ, శకటోత్సవం లోనూ పాల్గొని శ్లాఘా పాత్రమైంది

పురాతన కాలం నుండి భారత దేశం లోని సాంఘిక జీవితంలో పండుగలు, పర్వాలకు చెప్పుకో దగిన ప్రాముఖ్యం ఉంది జీవితంపై మధురాశలు కల్పించుకుని ప్రజలు పరస్పరం అర్థంచేసుకుని అనురాగాలను పెంపొందించుకోవడానికి ఈపండుగలు దోహదం చేస్తున్నాయి అందువల్ల ప్రజలలోని అన్ని వర్గాలవారు ఉత్సాహంతోను, గౌరవతోను జాతీయ పండుగలను, రాష్ట్ర స్థాయిలోని పండుగలను, ప్రజోత్సవాలను జరుపుకోవడాన్ని ప్రోత్సహించాలని పునర్వ్యవస్థీకృత వ్యవస్థలో ప్రతి పాదించారు పునర్వ్యవస్థీకరణ పధకం ఉద్దేశాలకు అనుగుణంగా ప్రజలు యీ ఉత్సవాలను నిర్వహించి పాల్గొనే విధంగా ప్రోత్సహించడం యీశాఖ నిర్వహిస్తున్నది

హైదరాబాదులో ఉదయంపూట లాల్ బహదూర్ స్టేడియంలో ప్రజా విన్యాసం నిర్వహించబడింది ఈ విన్యాసంలో ఎన్ సి సి, హోంగార్డ్సు, స్కౌట్స్, గైడ్స్ కార్మికులు, క్రీడా సంస్థలు, స్త్రీలు, పిల్లలు, సాంస్కృతిక బృందాలు, తదితర వర్గాలకు చెందిన ప్రతినిధులు ఉత్సాహంతో పాల్గొన్నారు గౌ॥ గవర్నరు, శాసనసభ అధ్యక్షులు, శాసనమండలి అధ్యక్షులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి ప్రభృతులు యీ విన్యాసాన్ని ఉద్దేశించి ప్రసంగించారు ఆ సాయంత్రం హైద్రాబాదు నగరంలోని 15 కేంద్రాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు వాటికితోడు హైదరాబాదు ఎగ్జిబిషన్ మైదానంలో బహుభాషా కవుల కవితా గోష్ఠిని ఏర్పాటు చేశారు సాంస్కృతిక కార్యక్రమాలలో సంగీత కళాకారులు, నర్తకులు, వాద్య బృందాలు, చలనచిత్ర తారలు అనేకమంది పాల్గొన్నారు ఈసాంస్కృతిక కార్యక్రమాలలో వేలాదిమంది ప్రజలు పాల్గొని తమ ఉత్సాహాన్ని, అభినివేషాన్ని, ఆసక్తినీ ప్రదర్శించారు స్వల్ప వ్యవధిలో కార్యక్రమాలను రూపొందించి తుదిరూపం యిచ్చినప్పటికీ జిల్లాలలో కూడా యీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలియవచ్చింది

ఈఅంశాన్ని దృష్టిలో ఉంచుకుని 1967 నవంబరు 1 వ తేదీన 11 వ ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాలను రాష్ట్ర రాజధాని, జిల్లా, బ్లాకు, దిగువ స్థాయిలలో ప్రజలు ఘనంగా జరుపుకునే విధంగా చేయడంలో యీశాఖ కృతకృత్యమైంది

రాష్ట్ర జన వారోత్సవాలు

ఈ ఏడు రోజులపాటు ఉత్సవ ఉత్సాహాన్ని కల్పించడానికి రాష్ట్రమంతటా ఒకే పద్ధతిలో యివి జరగడానికి, ప్రతివారు తమ నైపుణ్యం ప్రదర్శించడానికి, శక్తి సామర్యాలు చూపడానికి, రకరకాల వృత్తులూ, కళలూ, ప్రత్యేక నైపుణ్యతలూ ప్రదర్శించబడి పరస్పర గౌరవాభిమానాలతో కూడిన సుహృద్భావ వాతావరణం ఏర్పడడానికి, ఆయా వృత్తులనూ, కళలనూ ప్రోత్సహించడానికి, ప్రజలందరూ తమతమ విధులనూ, బాధ్యతలనూ గుర్తించడానికి వీలుగా యీ వారోత్సవాలలో ఒక్కొక్కరోజు ఒక్కొక్క తరహాకు చెందిన కార్యక్రమాలు ఏర్పాటుచేయబడినవి

జనవరి 8 : ప్రధాన వృత్తుల దినోత్సవం
జనవరి 9 అనుబంధవృత్తుల దినోత్సవం.
జనవరి 10 పశు సంతతి దినోత్సవం
జనవరి 11 ఆటలు, క్రీడలు, వ్యాయామ దినోత్సవం
జనవరి 12 : సాంస్కృతిక దినోత్సవం
జనవరి 13 : సాంఘిక సేవా దినోత్సవం
జనవరి 14 అందాలు_అలంకరణ దినోత్సవం

రాష్ట్ర ప్రజలందరికీ సమిష్టిగా పనికివచ్చే ఒక సాంస్కృతిక ఉత్సవవేదికను రూపొందించాలనే తలంపుతో జనసంబంధ శాఖ రాష్ట్ర జన వారోత్సవాలను ఏర్పాటు చేసింది రాష్ట్రమంతటా యీ ఉత్సవాలు యీ యేడు జనవరి 8 వ తేదీన ప్రారంభమై వారంరోజుల పాటు జరిగినవి

ఈ పధకమంతా ఊహలోనూ, లక్ష్యంలోనూ, ప్రజా చైతన్య విస్తృతిలోనూ నూటికి నూరుపాళ్లు క్రొత్తది చాలా తక్కువ వ్యవధిలోనే యీ యేడు యీ పథకాన్ని రూపొందించి, తుది రూపురేఖలు దిద్ది అమలుపరచడం జరిగింది అయినా వివిధ స్థాయిలలో రాష్ట్ర జన వారోత్సవాలు ఎంతో విజయవంతంగా జరగడంబట్టి చూచినట్లయితే, మునుముందు యీ కార్యక్రమం యింకా విజయవంతంగా అమలు జరగడానికీ, యింకా ఎక్కువగా ప్రజలు యిందులో పాల్గొనడానికీ మంచి అవకాశం వున్నట్లు కనిపిస్తున్నది

ఈ యేడు కుటుంబ నియంత్రణ, సహకారం, చేనేత, వనమహోత్సవం, మలేరియా నిర్మూలన మొదలగు అంశాలకు సంబంధించిన ప్రత్యేక వారోత్సవాలు మాత్రమే కాకుండా ప్రపంచ ఆరోగ్య దినోత్సవంవంటి ముఖ్య కార్యక్రమాలుకూడా జనసంబంధశాఖ ప్రోత్సాహంతోనూ, ప్రజలు, ప్రజా సంస్థల సంపూర్ణ సహకారంతోనూ విజయవంతంగా నిర్వహించబడినవి

జాతీయ నాయకులు, స్వాతంత్ర్యోద్యమం, సాంఘిక సేవ, సాహిత్యం, సంస్కృతి, క్రీడలు, పత్రికా రచన మొదలగు వివిధరంగాలలో ప్రసిద్ధిజెందిన మహాపురుషుల జన్మదినోత్సవాల సందర్భంగా జనసంబంధ శాఖవారు ఆయా వ్యక్తుల సంగ్రహ జీవిత చరిత్రలను పత్రికలలో ప్రచురణార్థం విడుదలచేశారు అంతే

కాక యీ జయంత్యుత్సవాలను సముచిత రీతిలో నిర్వహించవల సిందని విజ్ఞప్తులు చేయడంకూడా జరిగింది

ఏ యే సూత్రాలు, సూచనల ననుసరించి సామాజిక కేంద్రాల నిర్మాణం జరగాలో వాటిని జనసంబంధ శాఖవారు రూపొందిస్తున్నారు ప్రజా జీవితంలో సుఖ సంక్షేమాలకోసం పాటుపడుతున్న వివిధ కార్యసంస్థలకూ, వర్గ సంస్థలకూ ప్రయోజనకరంగా, వాటి సొంతదని చెప్పుకోదగిన ఒక ప్రాథమిక వ్యవసను రూపొందించడమే యీ కేంద్రాల నిర్మాణంలో ప్రధానోద్దేశం "పది మంది కలిసి ఆలోచించి పనులు చేసుకోడానికి" తగిన ప్రదేశాలుగా యీ సామాజిక కేంద్రాలు భావించబడుతున్నవి ప్రజలు పరస్పరం తమ అభిప్రాయాలు తెలుపుకోడానికీ, సమిష్టి క్షేమం సాధించుకోడానికీ యీ కేంద్రాలు అవకాశాలను కలుగ జేస్తాయి వీటిద్వారా ప్రజల్లో ఏర్పడే పరస్పర అవగాహన, సుహృద్భావ వాతావరణంవల్ల న్యాయబద్ధమైన సాంఘిక వ్యవస్థకు గట్టి పునాది ఏర్పడుతుంది ప్రజలు సాంఘికంగా తమకుగల విధులు, బాధ్యతలను గుర్తించడానికికూడా యివి బాగా ఉపయోగ పడతాయి సాధారణంగా గ్రామాల్లో గ్రామ ప్రాతిపదికతోనూ, పట్టణ ప్రాంతాల్లో బ్లాకు స్థాయిలోనూ సామాజిక కేంద్రాలను ఏర్పాటుచేస్తారు

సమాచార కేంద్రాలు

ప్రస్తుతం హైదరాబాదు, విజయవాడ నగరాలలో రాష్ట్ర సమాచార కేంద్రాలు పనిచేస్తున్నవి హైదరాబాదు కేంద్రంలో వున్న గ్రంథాలయంలో 11,803 గ్రంథాలు వున్నవి దీని సభ్యత్వం 183 రోజుకు సగటున 350 మంది యీ కేంద్రానికి వస్తుంటారు

ప్రస్తుతం హైదరాబాదులో రాష్ట్ర సమాచార కేంద్రం వున్నందున ఆ జిల్లాలో కాక మిగిలిన 19 జిల్లాలలో జిల్లా కొకటి వంతున ప్రధాన నగరాల్లో జిల్లా సమాచార కేంద్రాలు పనిచేస్తున్నవి రాష్ట్రంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన యథార్థ సమాచారాన్ని సేకరించి యీ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో వుంచుతవి

జనసంబంధశాఖ పునర్వ్యవస్థీకరణ తర్వాత బ్లాకులలోని 321 బ్లాకు సమాచార కేంద్రాలు యీ శాఖ అధికార పరిధిలోనికి వచ్చినవి

దేశంలోని వివిధ ప్రాంతాలలోగల ప్రజలకూ, ఆ ప్రాంతాలు సందర్శిస్తున్నవారికీ ఆంధ్రప్రదేశ్‌ను గురించిన సమాచారం అందించి, మన రాష్ట్రం సాధించిన విజయాలను వారి దృష్టికి తెచ్చే వుద్దేశంతో ఢిల్లీ, బొంబాయి, కలకత్తా, మద్రాసువంటి ముఖ్య నగరాల్లో సమాచార కేంద్రాలు స్థాపించాలనే సూచన ఒకటి వచ్చింది ఆరంభంలో ప్రస్తుతానికి ఢిల్లీ లో అటువంటి సమాచార కేంద్రం స్థాపించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నది

పత్రికలు

రిపబ్లిక్ దినోత్సవం (1968 జనవరి 26), స్వాతంత్ర్య దినోత్సవం (1967 ఆగస్టు 15), ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం (1967 నవంబరు 1), యాత్రా వారోత్సవాలు (1967 డిసెంబరు) వంటి ముఖ్య సందర్భాలలో జనసంబంధశాఖ తరపున పత్రికలలో ప్రచురణార్థం 16 ప్రత్యేక వ్యాసాలు విడుదల చేయబడినవి ఇవిగాక 1967-68 లో పత్రికలకోసం విడుదలచేసిన పత్రికా ప్రకటనలు, ప్రభుత్వ ఉత్తరువులు సంగ్రహంగా గల నోటిఫికేషన్లు, నివేదికలు మొదలగువాటి మొత్తం సంఖ్య 2,378 సుప్రసిద్ధులైన మహాపురుషుల జీవిత సంగ్రహాలు కూడా ఆయా సందర్భాలలో పత్రికలకు విడుదలచేయడం జరిగింది అంతర్జాతీయ, జాతీయ వార్తలను ఏ క్షణాని కాక్షణం తెలుసుకునేందుకు వీలుగా పి టి ఐ, యు యన్ ఐ వంటి సుప్రసిద్ధ వార్తా సంస్థలకు జనసంబంధశాఖ చందా చెల్లిస్తున్నది ఇదికాక హైదరాబాదులోని ఎ ఎన్ ఎస్, న్యూఢిల్లీలోని ఇన్ఫా సంస్థల వార్తలకోసం కూడా చందా చెల్లిస్తున్నది

పత్రికల్లో అభూత కల్పనలు

ప్రజలను విభ్రాంతపరచే విధంగా పత్రికల్లో అభూత కల్పనలు ప్రకటించే పద్ధతి బాగా ఎక్కువవుతూ వున్నది కొన్ని కొన్ని పత్రికలు అనుసరిస్తున్న నిర్మాణాత్మక వైఖరివల్ల సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్యనూ, ప్రజలకూ ప్రభుత్వానికి మధ్యనూ పరస్పర అవగాహన ఏర్పడి సత్సంబంధాలు నెలకొంటున్నాయి కాని మరికొన్ని పత్రికలు మాత్రం కావాలని పనిగట్టుకొని విచ్ఛిన్న శక్తులకూ, వేర్పాటు భావాలకూ ప్రోత్సాహం యివ్వడమే తమ కర్తవ్యంగా భావిస్తున్నవి

అఖిల భారత పత్రికా సంపాదకుల మహాసభ

హైదరాబాదు 1967 సెప్టెంబరు 1 నుండి 3 వ తేదీ వరకు జరిగిన అఖిలభారత పత్రికా సంపాదకుల మహాసభ విషయంలో జన సంబంధ శాఖ ఎంతో సహకరించి సౌకర్యాలు కల్పించింది ఆ మహాసభను పూజ్యులైన మన రాష్ట్రపతి ప్రారంభించారు అనేక మంది ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు మహాసభలో అతి ప్రధానమైన అనేక విషయాలను గురించి తీర్మానాలు జరిగినవి హైదరాబాదులో జరిగిన ఏర్పాట్లపట్ల సంతృప్తి వెల్లడించబడింది ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికకూడా ప్రకటింపబడింది.

ప్రెస్ కౌన్సిల్ సమావేశం

1967 సెప్టెంబరు 27, 28 తేదీలలో ప్రెస్ కౌన్సిల్ నాగార్జునసాగర్‌లో సమావేశం జరిగింది ఈ సందర్భంలో కూడా జనసంబంధ శాఖ ఆతిథ్య మర్యాదలను సంతృప్తి కరంగా నిర్వహించింది

పత్రికా నిర్వహణ రంగంలో పనిచేస్తున్న వారందరూ ఒకే వేదికపైన సమావేశమై పరస్పర గౌరవ, సుహృద్భావాలతో తమ సమస్యలను గురించి మహాసభ జరిపించడానికి ప్రాథమిక సన్నాహాలు పూర్తయినవి చర్చనీయాంశాలు సూచించవలసిందని యీ రంగంలో పనిచేస్తున్నవారిని కోరడం జరిగింది సాధ్యమైనంత త్వరలో యీ మహాసభ ఏర్పాటు చేయాలని సంకల్పం

ప్రచురణలు

ఆంధ్రప్రదేశ్ పత్రిక.

ఆంధ్రప్రదేశ్" పత్రిక ద్వారానూ, యితర ప్రచురణలు, ప్రదర్శనలు మొదలగు వాటిద్వారానూ ఎక్కువగా ప్రచారం జరపడం యీశాఖ పునర్వ్యవస్థీకరణ ప్రధాన లక్ష్యాలలో ఒకటి ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాలను గురించి, ప్రత్యేకంగా ప్రజలకు బోధ చేయవలసిన అవసరం గల కుటుంబ నియంత్రణ, వ్యవసాయం, పశుపోషణ, పరిశ్రమలు మొదలగు అతిప్రధాన విషయాలను గురించి విస్తృతంగా ప్రచారం కొనసాగించాలని ఉద్దేశం అందువల్లనే "ఆంధ్రప్రదేశ్" పత్రికలో ప్రకటించే వ్యాసాల విషయంలో కొన్ని ముఖ్యమైన మార్పులు తేవడం జరిగింది రాష్ట్రంలో వివిధ రంగాలలో జరుగుతున్న అభివృద్ధి కృషిని గురించి, ప్రతినెలా ప్రజలకు చెప్పటానికి యిప్పుడు యీ పత్రిక ద్వారా ప్రయత్నం జరుగుతున్నది సాధ్యమైనన్ని ఎక్కువ రంగాలను గురించిన వార్తలు, వ్యాసాలు పత్రికలలో ప్రకటించబడుతున్నవి

పాడి పంటలు

ఇప్పుడు ఈ శాఖ ప్రచురిస్తున్న "పాడి పంటలు" అనే తెలుగు మాసపత్రిక సర్క్యులేషన్ 29,000 ల వరకు వున్నది వ్యవసాయ కార్యక్రమాల విషయాలకు సంబంధించిన పత్రిక యిది ఆంధ్రప్రదేశ్ లోని నూనెగింజలను గూర్చి విపులంగా వ్యక్తంచేస్తూ 1967 నవంబరులో యీపత్రిక ఒకప్రత్యేక సంచికగా వెలువడింది ఈ పత్రిక పాఠకులకు సాంకేతికమైన సమాచారాన్ని అందజేయడంలో వహిస్తున్న ప్రముఖమైన పాత్ర దృష్ట్యానూ, దీనికిగల ప్రాచుర్యం దృష్ట్యానూ దీనిని స్వయం సమృద్ధిచేసే ప్రయత్నాలు యిప్పుడు జరుగుతున్నాయి

పుస్తకాలు

పునర్వ్యవస్థీకరణానంతరం ఈశాఖ, ఆయా సందర్భాలలో తదనుగుణంగా ఆయా విషయాలమీద మొత్తం యిరవై రెండు పుస్తకాలను ప్రచురించింది

పునర్వ్యవస్థీకరణవల్ల వ్యవసాయ శాఖ కార్యాలయం, పశుపోషణశాఖ కార్యాలయాలకు సంబంధించిన ప్రచార విభాగాలు 1_6_1967 నుండి జనసంబంధ శాఖలో విలీనమయ్యాయి దీనివల్ల వ్యవసాయరంగంలోనూ, పశుపోషణ రంగంలోనూ ప్రత్యేక ప్రచారాన్ని మరింత ఎక్కువగానూ, సమన్వయ పూర్వకంగానూ జరిపించడానికి అవకాశం కలిగింది

వ్యవసాయానికి సంబంధించి ఇంగ్లీషులో, తెలుగులో పధ్నాలుగు ప్రచురణలు ప్రచురించడం జరిగింది

కోళ్ళ పెంపకంలోని ప్రయోజనాల్ని గూర్చి ప్రజలకు తెలిపే వుద్దేశంతో ఈ శాఖ పదిహేను పోస్టర్లను ప్రచురించింది దీనికి తోడు పశుపోషణ, కోళ్ళ పెంపకం గొర్రెల పెంపకం, మేకల పెంపకం విషయాలలో ఆధునిక పద్ధతులను గూర్చి, పశుపోషణ శాఖ చేపట్టిన వివిధ పథకాలనుగూర్చి, 38 రేడియో ప్రసంగాలను ఏర్పాటుచేసింది 1967 నవంబరు 2 వ తేదీ నుండి అఖిల భారత గోసంవర్ధన వారోత్సవం ఘనంగా రాష్ట్రమంతటా జరిపించడం జరిగింది ఈ వారోత్సవ సందర్భంగా పశువుల ప్రదర్శనలు దూడల ప్రదర్శనలు జిల్లాలలోనూ, బ్లాకులలోనూ నిర్వహించబడ్డాయి వీటికితోడు "మేలురకం పశువులు_అధికాహారోత్పత్తికి" అన్న చక్కటి పోస్టరును ప్రచురించి పంపిణీచేయడం జరిగింది

వచ్చే సంవత్సరం ప్రచురణల కార్యక్రమంలో సమగ్రమైన అభివృద్ధి సాధించడానికి ప్రయత్నాలు జరుగుతున్నవి

ప్రదర్శనలు

ఇటీవలే హైదరాబాదులో ముగిసిన భారత పారిశ్రామిక ప్రదర్శనలో పాల్గొన్న ప్రభుత్వశాఖల ప్రచారాన్ని సక్రమ పద్ధతిలో కొనసాగించడానికిగాను యిందులో పాల్గొనే ఆయా ప్రభుత్వ శాఖలకు సలహాలను అందించే విషయంలో యీ శాఖ సమన్వయం కోసం కృషి చేసింది ఇంతవరకూ ఏర్పాటవుతూవస్తోన్న పద్ధతిలో గాక ప్రభుత్వశాఖల స్టాలులు ప్రజలను మరింతగా ఆకర్షించే వుద్దేశంతో ఈ పారిశ్రామిక ప్రదర్శనలో ఒక ప్రత్యేకమైన ఆవరణలో ఒకేచోట ఏర్పాటు అయ్యేట్టు యీ శాఖ కృషిచేసింది అనేక ఆటంకాలు, అవరోధాలు వున్నప్పటికీ ఈ కొత్త పద్ధతి సత్ఫలితాలనే యిచ్చింది అందరి మెప్పునూ పొందగలిగింది

1967 జనవరి_సెప్టెంబరు నెలల మధ్య కాలంలో ఈ శాఖ అధికార్లు వివిధ జిల్లాలలోనూ, బ్లాకుల్లోనూ మొత్తం 1,037 ప్రదర్శనలను ఏర్పాటుచేశారు వీటికి మొత్తం 87,658 మంది ప్రేక్షకులు హాజరయ్యారు 1968 ఫిబ్రవరి_మార్చి మధ్యకాలంలో హైదరాబాదు జిల్లాలోని కీసరవద్ద, నల్గొండ జిల్లాలోని యాదగిరి గుట్టవద్ద, నిజామాబాదులోనూ ఏర్పాటుచేసిన ప్రదర్శనలకు ఈ శాఖ తన సహకారాన్ని అందజేసింది ఈ ప్రాంతాలలోని ప్రదర్శన_విజయవంతం కావడందృష్ట్యా ఏడాదికి ఒకసారి ప్రతి జిల్లాలోనూ ఒక పెద్ద ప్రదర్శనను స్వయంసమృద్ధి పద్ధతిన నిర్వహించాలని ఉద్దేశించడం జరిగింది

శాసనసభ కార్యక్రమాల ప్రసారం

శాసనసభలో జరిగే చర్చలను ప్రసారం చేసేందుకు తొలి ప్రయత్నంచేయడం జరిగింది. గత ఏడాది సెప్టెంబరు సమావేశమప్పుడు హైదరాబాదులోని ఆకాశవాణి కేంద్రం శాసనసభ కార్యకలాపాల అయిదు నిమిషాల సమీక్షను ప్రసారంచేయడం జరిగింది ప్రతి శాసనసభ సమావేశమప్పుడూ దీనిని కొనసాగించే ఉద్దేశంతో యీ విషయమై భారతప్రభుత్వంతో యీశాఖ సంప్రదింపులు జరుపుతున్నది ఇదేవిధంగా యితర రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనలు కూడా కేంద్రానికి అందడంతో యిప్పుడు భారత ప్రభుత్వం యీ విషయమైగట్టిగా ఆలోచిస్తోంది త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుని, యీ విషయాన్ని భారత ప్రభుత్వం ప్రకటించవచ్చు. దీనితో ప్రతిదఫా శాసనసభ చర్చలను ఆకాశవాణి ప్రసారంచేయడం జరుగుతుంది ఇందుకు శాశ్వతంగా ఏర్పాట్లు జరగగలవు

వార్తా ప్రసారాలు

ఆకాశవాణి వార్తాప్రసారాలలో రాష్ట్రప్రజలకూ, బయట వారికీ సంతృప్తికరమైన, ఖచ్చితమైన రాష్ట్రవార్తలను అనేక సందర్భాలలో ప్రసారంచేయడం జరుగడంలేదని ఎప్పటికప్పుడు ఆకాశవాణి వార్తావిభాగంలోని అధికార్ల దృష్టికి యీ శాఖ తెచ్చింది.

పాత్రికేయులతో సమావేశాలు

ఇంతవరకు ఈ శాఖ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు ఆకశవాణి ద్వారా తెలియజెప్పేందుకు ప్రభుత్వాధికార్లు పాల్గొనే రాష్ట్ర అభివృద్ధిగోష్ఠుల్ని, గ్రామీణ కార్యక్రమాలకు సంబంధించిన ప్రసారాలనూ ఆకాశవాణిద్వారా ప్రసారమయ్యే ఏర్పాట్లుచేసింది అయితే 1968 ఏప్రిలునుంచి రాష్ట్ర అభివృద్ధిగోష్ఠులకు ఒక కొత్తపద్ధతి అనుసరించడం జరుగుతుంది 'పాత్రికేయులతో సమావేశం' అనే కొత్త పద్ధతిగా దీనిని మార్చడం జరుగుతుంది దీనిలో మంత్రులు, ప్రభుత్వంలోని ముఖ్యులూ, సీనియర్ ఉద్యోగులూ, పాత్రికేయులు పాల్గొంటారు ముందు ముందు యిది శ్రోతలకు ఆసక్తికరంగా వుండగలదని భావించబడుతున్నది

సామాజిక రేడియో సెట్లు

ఈ శాఖ తాలూకు సామూహిక శ్రవణ విభాగం సామాజిక రేడియోసెట్ల సేకరణ, ఏర్పాట్లు, నిర్వహణ విషయాలలోనూ, దృశ్యశ్రవణ పరికరాల నిర్వహణ విషయంలోనూ, డ్రైబేటరీ సెట్లను ట్రాన్సిస్టరైజ్డ్ సెట్లుగా మార్పుచేయడంలోనూ, ప్రముఖుల బహిరంగసభలలో ఉపయోగించే దూరశ్రవణ యంత్రాల ఏర్పాటులోనూ అజమాయిషీ చేస్తుంది. కేంద్ర సబ్సిడీ పథకంక్రింద 12,445 సామాజిక రేడియో సెట్లను (ద్వితీయ ప్రణాళికలో 7,000, తృతీయ ప్రణాళికలో 5,445) యీ శాఖ రాష్ట్రంలో నెలకొల్పింది తృతీయ ప్రణాళికాంతానికి రాష్ట్రంలో నెలకొల్పినవీ, నిర్వహింపబడుతున్నవీ మొత్తం 14,856 సామాజిక రేడియో సెట్లు వున్నాయి దీనిలో శాఖాపరంగా ఉపయోగిస్తున్న సెట్లు 1962-63 లో రాష్ట్ర సబ్సిడీ పథకంక్రింద నెలకొల్పిన 500 సెట్లు కూడా కలిసివున్నాయి చతుర్థ పంచవర్ష ప్రణాళిక అంతానికి ప్రతి గ్రామానికి కనీసం ఒక సామాజిక రేడియోసెట్టు అయినా వుండేటు చేయడం ప్రభుత్వ లక్ష్యం. 12,000 సామాజిక రేడియోసెట్లను ఏర్పాటుచేయడానికి సంబంధించిన పథకం ఒకటి ఆలోచనలో వుంది ఈకార్యక్రమంలో ఒక భాగంగా వర్తమాన సంవత్సరంలో 1,000 కొత్త సెట్లను ఏర్పాటుచేయడం జరిగింది ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరునాటికి మరో 2,000 సెట్లను హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ లఘు పరిశ్రమల కార్పొరేషను సరఫరా చేయగలదు సామాజిక రేడియో సెట్ల పనితీరు యిక్కడ చాలా చక్కగా వుంది మన రాష్ట్రంలో ఈ రేడియో సెట్లు పాడైన సంఘటనలు బహుకొద్ది. ఇతర రాష్ట్రాల వాటితో పోల్చి చూస్తే యీ సంఖ్య చాలాస్వల్పం ఎప్పుడు లెక్కగట్టి చూసినా మొత్తం పనిచేస్తున్న సెట్లతో పోల్చినప్పుడు పాడైనవి 1 నుంచి 2 శాతం లోపు మాత్రమే వుంటాయి ఇది రాష్ట్రం గర్వించదగిన విషయం ఈ శాఖ సామాజిక రేడియోసెట్ల పద్ధతిని క్రమబద్ధంగానూ, సమర్థవంతంగానూ నిర్వహిస్తున్నదనడానికి తార్కాణమిదే సామాజిక రేడియోసెట్లు ఎక్కువ సంఖ్యలోనూ, తక్కువ ఖర్చుతోనూ నిర్వహించడంలో మన రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం వహిస్తుంది

ట్రాన్సిస్టరు సెట్లు

వాల్వుల దిగుమతులు తగ్గిపోవడంవల్ల మామూలు రేడియో సెట్లను నిర్వహించడం ఖర్చుతోకూడిన పని అయింది అందువల్ల గ్రామాలలో పనిచేస్తున్న 9,000 వాల్వు రకం డ్రై బేటరీ సెట్లను అంచెలంచెలుగా ట్రాన్సిస్టరైజ్ చేయాలని ఉద్దేశించారు. ఈ శాఖ ఒక డ్రైబేటరీతో నడిచే వాల్వు సెట్టుని ట్రాన్సిస్టరు సెట్టుగా రూపొందించింది ఈ సెట్టుని ఆకాశవాణి డైరెక్టరు జనరల్ పరీక్షించి యిది ఐ. ఎస్ ఐ ప్రమాణాల స్థాయిలో వున్నట్టు ధృవీకరించారు వాల్వు సెట్లను ట్రాన్సిస్టరైజ్ చేసే పని చురుగ్గా సాగుతోంది ఈ పథకం కింద అయ్యే వ్యయానికి గాను కేంద్రప్రభుత్వం వద్దనుండి ఆర్థిక సహాయాన్ని పొందే ఏర్పాట్లు జరిగాయిగాని విదేశ మారకానికి సంబంధించిన అవరోధాలవల్ల యీ పథకం యింకా విజయవంతంకాలేదు డ్రైసెట్లను ట్రాన్సిస్టరైజ్ చేయడంలో యీ రాష్ట్రం ప్రారంభించిన ప్రయత్నాన్ని యితర రాష్ట్రాలుకూడా అనుసరిస్తున్నాయి వాటికి అవసరమైనప్పుడు సాంకేతిక సలహా, సహాయాలను మనం అందజేస్తున్నాం

తంత్రీ ప్రసారాలు

ఎక్కువమంది కలిసి వినడానికి వీలుగా బహిరంగ ప్రదేశాలలోకి, – ముఖ్యంగా పట్టణాలలోని అనువైన బహిరంగ స్థలాలలోకి – రేడియో కార్యక్రమాలను కొనిపోయే విధానమే తంత్రీ ప్రసార విధానం ప్రస్తుతం యీ విధానం పది పురపాలక సంఘాలలోనూ, ఒక పంచాయతీలోనూ, తిరుపతి దేవస్థానంలోనూ అమల్లో వుంది నెలకొల్పడానికీ నిర్వహించడానికీ అయ్యే ఖర్చులను ఆ యా పురపాలక సంఘాలు, పంచాయతీలే భరించాలి కనుక ఈ పద్ధతిని ప్రవేశపెట్టే బాధ్యత ఆ యా పురపాలక సంఘాలదీ, పంచాయతీలదీను ఇందుకు అవసరమైన సాంకేతిక సలహాలను యీ శాఖ తాలూకు రేడియో యింజనీరింగ్ విభాగం అందజేస్తుంది అవసరమైతే సాంకేతిక సిబ్బంది సహాయాన్ని కూడా వీటికి అందజేస్తుంది ఇందుకుగాను బయటి సంస్థలకు వెళ్లి పనిచేసే నియమాలు ఆ ఉద్యోగులకు వర్తిస్తాయి

గ్రామీణ రేడియో గోష్ఠులు

గ్రామీణ రేడియో గోష్ఠులు రాష్ట్రంలో కొనసాగింపబడుతూనే వున్నాయి ఈ గోష్ఠులు గ్రామీణ ప్రజలకు, ముఖ్యంగా వ్యవసాయదారులకు, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్ని గూర్చి వివిధ విషయాలను తెలియజేస్తుంటాయి తృతీయ పంచవర్ష ప్రణాళికలోని అయిదు సంవత్సరాలలోనూ 1,019 గ్రామీణ రేడియో గోష్ఠులు నిర్వహింపబడ్డాయి ఈనాడు రాష్ట్రంలో 1,109 గ్రామీణ రేడియో గోష్ఠులు వున్నాయి ఈ శాఖ పునర్వ్యవస్థీకరణ వల్లా, బ్లాకు స్థాయి జనసంబంధశాఖ అధికార్ల కృషి వల్లా యీ గోష్ఠులు చాలావరకు మంచి ఉత్సాహంతో పనిచేస్తున్నాయి ప్రత్యేకంగా గ్రామీణ రేడియో గోష్ఠులకే పరిమితపరిచి 'గ్రామవాణి' పేరుతో తెలుగులో ఒక త్రైమాస పత్రికను యీ శాఖ ప్రచురిస్తున్నది ఈ పత్రిక సర్క్యులేషన్ 2,500 ల కాపీలు

దృశ్య, శ్రవణ పరికరాలు

అన్ని బ్లాకుల్లోని దృశ్య శ్రవణ పరికరాలూ 1967 ఆగష్టున యీ శాఖకు అప్పగించబడ్డాయి అందువల్ల యీ శాఖ యీ పరికరాలను ఏవిధమైన చార్జీలను వసూలు చేయకుండా నిర్వహించవలసి వుంది ఈ పరికరాల నిర్వహణ విషయంలో అవసరమయ్యే విడిభాగాలకు అయ్యే అసలు ఖర్చును బ్లాకులు భరించాల్సి వుంది. ఈ పరికరాలను మొదట ఏర్పాటు చేసుకోవడానికి అయ్యే ఖర్చును కూడా పంచాయతీరాజ్ సంస్థలే భరించాల్సి వుంటుంది ప్రస్తుతం యీ శాఖ అధ్వర్యంక్రింద రెండువందల దృశ్య శ్రవణ. పరికరాల సెట్లు వున్నాయి. ఇంతకుముందు పనికిరాకుండా వున్న అనేక పరికరాలు యిప్పుడు యీ శాఖ అందచేస్తున్న సాంకేతిక సేవలవల్ల తిరిగి బాగయ్యాయి

'నిలువు దూరశ్రవణ పరికరాలు'

పెద్ద పెద్ద బహిరంగసభలలో వుపయోగించడానికి వీలుగా ఆదర్శవంతమైనదని చెప్పదగ్గ నిలువు దూరశ్రవణ పరికరాల పద్ధతిని ఈ శాఖ రూపొందించింది. దీనికి ఐ ఎస్ ఐ అనుమతి భారత ప్రభుత్వ అనుమతి లభించింది ఈ విధానాన్ని అనుసరించవలసిందిగా యితర రాష్ట్రాలను కేంద్రం కోరిందికూడా ఈ శాఖ పునర్వ్యవస్థీకరణ అనంతరం యీ శాఖతాలూకు రేడియో ఇంజనీరింగ్ విభాగంవారు చేసిన ఈ విధమైన ఇన్‌స్టలేషన్ పనుల సంఖ్య బాగా పెరిగింది ఉదాహరణకు 1967 ఆగష్టు, డిసెంబరు నెలలమధ్య కాలంలో యీ శాఖ రాజధానీ నగరంలో మొత్తం 123 పి ఎ ఇన్‌స్టలేషన్లనులను చేసింది రోజురోజుకు పెరుగుతున్న అవసరం దృష్ట్యా 50 పి ఎ పరికరాల సెట్లను కొని, వాటిని జిల్లాలలోని అన్ని సర్కిలు కార్యాలయాలలోను, జిల్లా ప్రధాన కార్యస్థానాలలోనూ వుంచాలని ఉద్దేశిస్తున్నారు.

డాక్యుమెంటరీలు

రాష్ట్రప్రభుత్వం, భారత ప్రభుత్వ ఫిల్మ్సుడివిజన్, యింకా ప్రయివేటు సంస్థలూ డాక్యుమెంటరీలను తయారుచేస్తున్నాయి రాష్ట్రంలో ప్రచారదృష్టితో ఎప్పటికప్పుడు జనసంబంధ శాఖ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై డాక్యుమెంటరీ చిత్రాలను తయారు చేస్తున్నది రాష్ట్రప్రభుత్వం తీసే డాక్యుమెంటరీలతో పాటు భారత ప్రభుత్వం తీసే అనేక వార్తా చిత్రాలు, డాక్యుమెంటరీలు కూడ రాష్ట్రంలో ప్రచారానికి రాష్ట్ర ప్రభుత్వానికి లభిస్తున్నవి

ఈ శాఖ, జిల్లా పరిషత్తు, ఉభయులు ఖర్చులు భరించే ప్రాతిపదికపై రాష్ట్రంలోని జిల్లాలపై డాక్యుమెంటరీ చలనచిత్రాలను కూడ నిర్మిస్తున్నారు, ఈ పథకంక్రింద యింతవరకు ఒక్కొక్క దానికి దాదావు రూ 20 000 ల చొప్పున ఖర్చుతో నల్లగొండ, ఖమ్మం నెల్లూరు చిత్తూరు జిల్లాలను గురించి డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించారు ఉత్పత్తిఖర్చులు పెరిగినదృష్ట్యా యీ పథకాన్ని సవరించడం జరుగుతున్నది భవిష్యత్తులో మిగతా అన్ని జిల్లాలను గూర్చి చిత్రాలను నిర్మించాలని ప్రతిపాదించారు ప్రభుత్వం, పంచాయతీ సమితులు ఉభయులు ఖర్చు భరించే ప్రాతిపదికపై సమాజాభివృద్ధి బ్లాకులను గురించి డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించాలనే ప్రతిపాదనకూడ ఉంది భారత ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వం ఉభయులు ఖర్చులు భరించే ప్రాతిపది పై ఫిల్మ్సు డివిజన్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన విషయాలపై కొన్ని డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మిస్తున్నది ఈ పథకంక్రింద ఫిల్మ్సు డివిజన్‌వారు కూచిపూడి నృత్యంపై డాక్యుమెంటరీ చిత్రం నిర్మిస్తున్నారు

ఫిల్మ్ లైబ్రరీలు

ఈ శాఖలో ఫిల్మ్ లైబ్రరీకూడ ఉన్నది. భారతీయ వార్తా చిత్రాలతోసహా దాదాపు 1250 ఫిల్ములు యిందులో ఉన్నాయి. ప్రామాణికమైన, ప్రయోజనాత్మకమైన చిత్రాలు లభించినప్పుడు, సాధ్యమైతే వాటి వ్యాఖ్యలను తెలుగులోగాని, హిందీలోగాని సంపాదించి, కొనుగోలు చేయాలని కూడ ఉద్దేశం. వాటిని యీ లైబ్రరీలో ఉంచడం జరుగుతుంది ప్రజలకు ఫిల్మ్ ప్రదర్శన సౌకర్యం కల్పించడానికి వీలుగా సమావేశాలు జరిగేసందర్భాలలో ప్రదర్శన నిమిత్తం నామమాత్రపు ఖర్చుపై చలన చిత్రాలను యివ్వడానికి అనువుగా నిబంధనలను రూపొందించడం జరిగింది. బ్లాకుస్థాయిలో ఉపయోగానికి వీలుగా గ్రామీణ విషయాలకు సంబంధించిన ఫిల్ములను తగిన సంఖ్యలో సంపాదించి, జిల్లా ఫిల్మ్ లైబ్రరీలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఫిల్మ్ స్టూడియోలు

ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమను అభివృద్ధిపరిచే దృష్టితో యీ పరిశ్రమకు పెద్ద ఎత్తున సహాయం అందజేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దానికి ప్రథమ చర్యగా, చలన చిత్ర పరిశ్రమ కేంద్రంగా పరిఢవిల్లడానికి వీలుగా సినిమా పరిశ్రమ నిమిత్తం, హైదరాబాదు-విజయవాడ రోడ్డు మార్గంలో హైదరాబాదుకు 8 మైళ్ళ దూరాన హయాత్‌నగర్ సమీపములో భూమిని కేటాయించారు. చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖుల సలహాలపై "బ్రహ్మానంద చిత్రపురి" అనే పేరుతో 1967 నవంబరు 1వ తేదీన యీ కేంద్రానికి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. 206.8 ఎకరాల విస్తీర్ణంగల యీ స్థలంలో తాత్కాలికముగా 115 ఎకరాలను స్టూడియోలు, పరిశ్రమకు అవసరమైన యితర కట్టడాల నిమిత్తం కేటాయించారు. 82.8 ఎకరాలు ఉద్యానవనాలకు, 9 ఎకరాలు రోడ్ల నిమిత్తం కేటాయించారు. స్టూడియోల నిర్మాణానికి నిర్దేశించిన భూమిలో ఒక్కొక్కరికి 20 ఎకరాల చొప్పున ప్రముఖ చలనచిత్ర నిర్మాతలిద్దరికి భూమిని కేటాయించడం జరిగింది. ఒక నిర్మాత స్టూడియో నిర్మాణాన్ని ప్రారంభించారు. మరో నిర్మాత త్వరలోనే ప్రారంభించనున్నారు. హైదరాబాదులో, ప్రత్యేకంగా బ్రహ్మానంద చిత్రపురిలో చలనచిత్ర పరిశ్రమను త్వరితగతిని అభివృద్ధి పరచడానికి వీలుగా ప్రభుత్వానికి అనేకమంది వివిధ ప్రతిపాదనలను అందజేస్తున్నారు. జాగ్రత్తతో తగిన చర్యలను తీసుకోవడం జరగుతున్నది. ఫిల్మ్ కన్వెన్షన్ చేసిన సిఫార్సులను అనుసరించి బ్రహ్మానంద చిత్రపురికి ఎదురుగా ఉన్న 130.28 ఎకరాల భూమిని చిత్రపురి నిమిత్తం సేకరించడానికి కూడ ప్రతిపాదించారు. ఈ సందర్భంలో గజెటు నోటిఫికేషన్ జారిచేయడం జరిగింది.

చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి నిధి

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమను పెంపొందించడానికి, ప్రజలకు తగిన వినోద సౌకర్యాలను అభివృద్ధి పరచడానికి వినోదం పన్ను ఆదాయంలో 2 శాతం మొత్తంతో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధినిధి ఏర్పాటు చేయాలని నిశ్చయించడం జరిగింది. ఈ పన్నులలో ఎక్కువ భాగం స్థానిక స్వపరిపాలక సంస్థలకు అందుతుందనే విషయం సభ్యులకు తెలుసు. రాష్ట్ర ప్రభుత్వం యిచ్చిన యీ ప్రోత్సాహంతో తమకు పన్నులు చెల్లించే ఆ ప్రాంతం ప్రజలకు ప్రత్యక్షంగా బాధ్యత వహించే యీ సంస్థలు తగిన విధంగా కృషిచేయాలి చలనచిత్ర అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసే విషయమై తగు చర్యలు గైకొనబడుతున్నవి.

చలనచిత్ర అభివృద్ధి మండలి

చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలపై రాష్ట్ర స్థాయిలో సలహాలు యివ్వడానికి వీలుగా "చలనచిత్ర అభివృద్ధి మండలి"ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. రాష్ట్రంలో శాస్త్రీయ పద్ధతిలో తగిన మార్గాన చలనచిత్ర పరిశ్రమను అభివృద్ధిపరచే విషయాలలో ప్రధాన సలహా సంఘముగా యీ మండలి వ్యవహరిస్తుంది.

సబ్సిడీ పథకం

రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ త్వరితగతిని అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఉద్దేశించగా, రాష్ట్రం అవలి ప్రాంతలలో స్థిరపడిన కేంద్రాలనుండి కళాకారులు, యితర సిబ్బంది రావలసి ఉన్న కారణంగా, హైదరాబాదులో చలనచిత్ర నిర్మాణం సాధారణంగా ఎక్కువ ఖర్చుతో కూడిన పని అని అంటున్నారు. ఈ సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి, అధిక నిర్మాణం ఖర్చులకు పరిహారంగా, రాష్ట్రంలో నిర్మించబడే చలన చిత్రాలకు రూ. 50,000 ను సబ్సిడీగా చెల్లించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రథమంలో యీ సబ్సిడీ పథకం 1964 జనవరి 2 వ తేదీ నుండి 1966 మార్చి 31 వ తేదీ వరకు అమలులో ఉంది. 1966 ఏప్రిల్ 1 వ తేదీ నుండి 1968 మార్చి వరకు రెండు సంవత్సరాలు యీ పథకం అమలును కొనసాగించారు. 1968 మార్చి తర్వాత కూడ యీ పథకం అమలును కొనసాగించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

చలన చిత్ర సదస్సు

1967 డిసెంబరు 26 వ తేదీనుండి మూడు రోజులపాటు హైదరాబాదులో ఫిల్మ్ కన్వెన్షన్ జరిగింది. దేశంలో యీ విధమైన కన్వెన్షన్ జరగడం యిదే ప్రథమం. పరిశ్రమలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతినిధులు చలన చిత్ర పరిశ్రమకు సంబంధించిన సమస్యలను చర్చించారు. బ్రహ్మానంద చిత్రపురి అభివృద్ధి, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీ చిత్రాలతో సహా చలన చిత్రాల నిర్మాణం అభివృద్ధి, ప్రకటనల విధానాలు, ఫిల్మ్ థియేటర్లు, చలన చిత్ర అభివృద్ధి మండలి, చలన చిత్ర అభివృద్ధి నిధి, చలనచిత్ర ఉత్సవాలు మొదలైన విషయాలలో యీ కన్వెన్షన్ సిఫార్సులు చేసింది. ఈ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

యాత్రా వారోత్సవం

యాత్రా ప్రాధాన్యాన్ని గుర్తించి, సమైక్యతకు సాధనగా యాత్రలను పెంపొందించడానికి వీలుగా ఐక్యరాజ్యసమితి, 1967వ సంవత్సరాన్ని అంతర్జాతీయ యాత్రా సంవత్సరంగా నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగే అంతర్జాతీయ యాత్రా సంవత్సరం ఉత్సవాలకు అనుగుణంగా, 1967 డిసెంబరు 25 నుండి 31వ తేదీ వరకు యాత్రా వారోత్సవాన్ని జరపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రముఖ ట్రావెల్ ఏజంట్లు అనేక మంది యీ విషయంలో ఎంతో సహకరించారు. హైదరాబాదులోని హోటల్ యజమానులు యాత్రికుల నిమిత్తం ప్రత్యేక ఏర్పాట్లుగావించి, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అంతేగాక యీ వారోత్సవాల సందర్భంగా దర్శనీయ స్థలలలో పర్యటన, యాత్రా విషయాల ప్రదర్శన, యాత్రిక వ్యవహారాల డాక్యుమెంటరీ చిత్రాల ప్రదర్శన, యాత్రా విషయాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించబడినాయి. జిల్లాలలో కూడా యీ కార్యక్రమాలను నిర్వహించారు. వేల మంది యాత్రికులు యీ ఉత్సవాలలో పాల్గొన్నారు అధిక సంఖ్యలో యాత్రికులను ఆకర్షించి యాత్రావ్యవహారాల ప్రాధాన్యాన్ని గుర్తింపజేయడానికి వీలుగా ప్రతి సంవత్సరం డిసెంబరు ఆఖరు వారంలో యాత్రా వారోత్సవాన్ని నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

పర్యటనల నిర్వహణ

రాష్ట్ర ప్రజలు, భారత దేశంలోని వివిధ దర్శనీయస్థలాలను చూడడానికి అవకాశం కల్పించే ఉద్దేశంతో ప్రత్యేకరైలులో కాశ్మీరు పంజాబు, ఢిల్లీ, ఆగ్రాలను సందర్శించడానికి 1967 అక్టోబరులో పర్యటన కార్యక్రమాన్ని యీ శాఖ ప్రప్రథమంగా నిర్వహించింది. దీనికి ప్రజలనుంచి మంచి ప్రోత్సాహం లభించింది. దాదాపు 450 మంది యాత్రికులు యీ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం గావడంతో లభించిన ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోని దర్శనీయస్థలాలతోపాటు మైసూరు, కేరళ మద్రాసు ప్రాంతాలలోనూ; అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, మైసూరు కేరళ మహారాష్ట్రలతో కూడిన ప్రాంతంలోనూ అంటే, భారతదేశ ఆగ్నేయ నైరుతి ప్రాంతాలలో పర్యటనలను నిర్వహించాలని యీ శాఖ నిర్ణయించింది. ఇప్పటి తాత్కాలిక ప్రతిపాదనలను అనుసరించి 1968 ఏప్రిల్‌లోగాని మే లోగాని యీ పర్యటన నిర్వహించబడవచ్చు. భారతదేశంలోని ఉత్తర, పూర్వోత్తర, పశ్చిమోత్తర, మధ్య ప్రాంతాలలోని దర్శనీయ స్థలాలు, కాశ్మీర్ పర్యటనలను నిర్వహించాలని యీ శాఖ ప్రతిపాదించింది: ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలను దర్శించడానికి వీలుగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుంది.

యాత్రికులకు సౌకర్యాలు

ప్రస్తుతం తిరుపతి, విశాఖపట్నాలలో యాత్రిక సమాచార కేంద్రాలు నిర్వహించబడుతున్నాయి. అధిక ప్రాచుర్యంలో ఉన్న లగ్జరీకోచ్ "మనోరమ"ను వారంలో ఆరు రోజులపాటు నిర్వహిస్తున్నారు. ఇది హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాలలోని దర్శనీయ స్థలాలకు పర్యాటకులను తీసుకెళ్ళుతుంది. దానికి తోడు హైదరాబాదు సందర్శించే ప్రముఖుల నిమిత్తం యీ శాఖ పర్యటన కార్యక్రమాలను తరుచుగా నిర్వహిస్తున్నది విశాఖపట్నంలో యిటువంటి పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించే ప్రతిపాదన పరిశీలనలో ఉంది జిల్లా, బ్లాకు స్థాయిలలో యాత్రల నిర్వహణను ప్రోత్సహించడం జరుగుతున్నది. భవిష్యత్తులో యీ కార్యక్రమం చురుకుగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

దర్శనీయ స్థలంగా హుస్సేన్‌సాగర్

ఇంతవరకు క్రమబద్ధంగా ఉపయోగించకపోవడం కారణంగా నగర మధ్యంలో ఉన్న హుస్సేన్‌సాగర్ రిజర్వాయరు, దాని పరిసర ప్రాంతాలు నిరుపయోగంగాఉండి, యాత్రికులకు ఎటువంటి ఆసక్తిని కలిగించలేకపోయాయి. అందువల్ల హుస్సేన్‌సాగర్ ప్రాంతంలో చక్కని హోటళ్లు పార్కులు, యితర యాత్రిక సౌకర్యాలు కల్పించి, ఆ ప్రదేశాన్ని సర్వాంగ సుందరం చేయడానికి వివిధ చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. మంచి హోటళ్లు, అందమైన పార్కులు, సరస్సులో పడవ విహారం ఏర్పాటుచేసినప్పుడు, స్థానిక యాత్రికులు, విదేశయాత్రికులకు ప్రముఖ విహార కేంద్రంగా యీ ప్రదేశం రూపొందుతుందని భావించబడుతున్నది.

నాగార్జునసాగర్, శ్రీశైలం

నాగార్జునసాగర్ ప్రముఖ యాత్రాస్థలిగా రూపొందింది. అక్కడ ప్రపంచమంతటిలోను 'దీవిపైవుండే ప్రథమ పురావస్తు ప్రదర్శనశాల' ఏర్పడింది. ఆ దీవిపై యిటీవల రెండు విశ్రాంతి గృహాలు, ఫలహారశాలలను ఏర్పాటుచేశారు. అందులో ఒక విశ్రాంతి గృహం భారత ప్రభుత్వ పురావస్తుశాఖకు చెందినది. అయితే యాత్రికుల ఉపయోగానికి వినియోగించడానికి వీలుగా ఆ భవనాన్ని రాష్ట్రప్రభుత్వ అధీనం చేయబడింది. దీవి కుడివైపునుండి ప్రస్తుతం ఒక టూరిస్టు మోటారు లాంచి పని చేస్తున్నది. 1968-69 లో కనీసం మరిరెండు పడవలను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఈ పడవల నిర్మాణానికి కాకినాడలోని రాష్ట్రప్రభుత్వ పడవల నిర్మాణకేంద్రం సేవలను వినియోగించుకోవడం జరుగుతున్నది చారిత్రాత్మకమైన ప్రాచీన మల్లికార్జున దేవాలయం ఉండడంతోపాటు రాష్ట్రంలోని అతి పెద్ద జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నిర్మించబడుతున్న దృష్ట్యా శ్రీశైలం యాత్రా కేంద్రంగా అభివృద్ధిచెందుతున్నది. భవిష్యత్ అభివృద్ధికి అపార అవకాశాలను కలిగించే శ్రీశైలం రిజర్వాయరు యాత్రికులను ఎంతగానో ఆకర్షిస్తూ ప్రముఖ విహారకేంద్రంగా రూపొందుతుంది.

నాగార్జునసాగర్‌నుండి శ్రీశైలందాక

నాగార్జునసాగర్ ఆనకట్టమీద క్రెస్ట్‌గేట్లు నిర్మించిన తరువాత, సాగర్ నుండి శ్రీశైలం వరకు 60 మైళ్ల పొడవున

(తరువాయి 60 వ పుటలో)

సీరియల్

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి



ఇటీవల ఒకనాడు కృష్ణమూర్తి హైస్కూల్లో టీచర్ల రూములో కూర్చుని ఆవేళ చెప్పవలసిన పాఠం సంగతి ఆలోచిస్తూ దానికి సంబంధించిన పుస్తకం ఒకటి చదువుకుంటున్నాడు. అదే సమయంలో తోటి మేష్టర్లు కొందరు తమ పనులన్నీ కట్టిపెట్టి ఏదో లోకాభిరామాయణంలో పడ్డారు క్రమక్రమంగా వారి మాటల్లో ఆనాటి నాటకాల గొడవలతోబాటు కృష్ణతులాభారం ప్రదర్శనం సంగతి కూడా దొర్లింది. ఇద్దరు ముగ్గురు చాలా బాగున్నదని మెచ్చుకున్నారు. ఇంకొకాయన అది ఈమధ్యన అనుకున్నంత గొప్పగా రక్తి కట్టలేదని చప్పరించి ఆవలించాడు. ఇంకొక టీచరు పార్థసారథి విగ్రహపుష్టి, వేషము కొంత వరకు మాట దక్కించాయని మొత్తం మీద పరవాలేదని సమర్థించాడు. అదే క్షణంలో జాగ్రఫీ టీచరు వెటకారంగా కళ్ళెగరవేసి వికటంగా నవ్వుతూ అడుకున్నాడు.

'అన్నట్టు మన ప్రబుద్ధుడు పార్థసారథి ఆ సరోజ అంటే విపరీతంగా పడిచచ్చిపోతున్నాడు గాని, ఆవిడ ఈ మధ్యన రాఘవతో బాగా జోస్తీ కలిపిందంట? నిజమేనా?'

దానిమీద లెక్కల మేష్టారు మరింతగా వేళాకోళం చేసి వెక్కిరించాడు.

'దీనికి నీకింత సందేహం ఎందుకు కలిగింది? వెనకటికి ఏదో సామెత చెప్పినట్టుంది నీ ప్రశ్న! ఆ సరోజ ఏమన్నా మహా పతివ్రత అనుకున్నావేమిటి? హరి నీచాదస్తం కూలా!'

ఆ టీచరు అదేపనిగా నవ్వడం మొదలుపెట్టాడు. ఆపైన వారి ప్రసంగం క్రమ క్రమంగా ఆవేళ బజారులో కూరగాయల ఖరీదుల మీదికి తిరిగింది.

కృష్ణమూర్తి సామాన్యంగా అలాంటి పోచికోలు కబుర్లలో కలగజేసుకోడు. అసలు అటువంటి గొడవలే అతని చెవికెక్కవు. ఎంతసేపూ తన పని సంగతి తప్ప అతని కింకొకరి జోలి, సొంటి అక్కరలేదు సరోజా రాఘవలను గురించి అతడంతకు మునుపు కొంచెం చూచాయగా మాత్రమే విన్నాడు. అంతేగాని వారి వివరాలేవి అతనికి తెలియదు. అయితే సాటి మేష్టర్ల మాటలలో పార్థసారథి ప్రసంగం వచ్చింది కనక చెవి అటు పారవేసి చాలా జాగ్రత్తగా విన్నాడు. అయితే అందువల్ల ఆ సమయంలో కృష్ణమూర్తికి పార్థసారథి ప్రవర్తన మీద రవంతయినా అనుమానం కలగలేదు. లోకులు సామాన్యంగా 'అదుగో! పులి! అంటే! ఇదిగో! తోక' అంటారని అతనికి తెలుసును! అదేకాక ఓర్వలేని వాళ్ళెవరో పార్థసారథి మీద అలాంటి నీలాపనింద వేసి ఉంటారని అనుమానించాడు నాటకాల్లో వేషాలు వేసే వాళ్లకి ఆ విధమయిన అప్రతిష్ఠలేమో నెత్తిమీద విరుచుకు పడుతూండడం కొంత వరకు సహజమే అనికూడా సమాధాన పడ్డాడు.

కాని ఇప్పుడు విజయలక్ష్మి పరిస్థితి ప్రత్యక్షంగా గమనించి, ముసలావిడ చెప్పిన సంగతులన్ని విన్న తరవాత, అతనికి ఆనాడు తోటి మేష్టర్లు పార్థసారథి మీద, సరోజా రాఘవల మీద వేసిన నింద నిజమే అయిఉండవచ్చునన్న నిశ్చయం కలిగింది. అయితే సరోజా రాఘవల జోస్తీ సంగతి పార్థసారథికి తెలుసునా? తెలియదా? ఊరందరికీ తెలిసినప్పుడు అతనికి మాత్రం ఎందుకు తెలియదు? తెలిసి తీరుతుంది! అలాంటప్పుడు సరోజ మీద అంతటి మమకారం ఎందుకు? ఒక వేళ ఆ సంగతి అతనికి తెలియలేదేమో! ప్రత్యేకంగా పనికట్టుకొని పార్థసారథి కారహస్యం చెప్పవలిసినంతటి

జరిగిన కథ

పార్థసారథికి నాటకాలపిచ్చి రాఘవ నాట్యకళా మండలి ద్వారా నాటకాలు వేస్తుండేవాడు నాటకాల పిచ్చిలో పడి అతను సరిగా యింటికే వచ్చేవాడుకాడు అతని భార్య విజయలక్ష్మి ఎంతగా చెప్పినా అతను వినిపించుకోలేదు ఒకసారి పార్థసారథి వాళ్ళ నాటకంలో హీరోయిన్‌తో ఏలూరువెళ్ళి చాలా రోజులవరకూ రాలేదు విజయలక్ష్మి బెంగతో మంచం పట్టింది ఆమె బావ కృష్ణమూర్తికి ఆవిషయం తెలిసి భార్యను వెంట బెట్టుకుని పరామర్శించడానికి వెళ్ళాడు

అగత్యం పైవాళ్ళ కెందుకు కలుగుతుంది? బహుశః అతనికా వ్యవహారం రవంతయినా తెలిసి ఉండదు? ఒకవేళ తెలిసినా సరోజ మీద మమకారం మళ్ళించుకోలేక తెలిసీ తెలియనట్టు మాటాడ కూరుకుంటున్నాడేమో! ఆ వ్యవహారంలో పార్థసారథి ధోరణి అతనికెంతో విడ్డూరంగా కనబడింది ఆ విధంగా పచ్చిమోసం కొనసాగిస్తున్న సరోజమీద అతని కంతటి వ్యామోహం బలపడ డాని కేమిటి కారణం? కృష్ణమూర్తికి అంతగా ఆలోచించినా ఆ విచిత్ర సమస్య చిక్కు విడలేదు! దానికి తగినంత లోకానుభవం లేకపోవడమే ప్రధాన కారణం కనుకనే తన స్వల్పానుభూతి పరిమిత పరిధిలోనే దానిని గురించి అదేపనిగా తల బ్రద్దలు కొట్టుకున్నాడు అయితే ఇంటరువరకు ఇంగ్లీషు చదువు వెలగబెట్టినందువల్ల, చిత్రమయిన చలాకీతనం వల్ల, ఎంతో చాకచక్యంతో మభ్యపెట్టడం వల్ల పార్థసారథి ఆ విధంగా ఆమె వలలో పడి చిక్కుకుని ఉండవచ్చునని కొంతవరకు సరిపుచ్చుకుని సమాధాన పడ్డాడు

ఏది ఏమయినా పార్థసారథి మద్రాసు నించి తిరిగి రాగానే సరోజా రాఘవల వ్యవహారంలో తాను విన్న సంగతులన్ని ఏవో మాటల సందర్భంలో యాధాలాభంగా అన్నట్టుగా తప్పకుండా చెప్పితీరాలని నిర్ణయించుకున్నాడు అతనితో తనకంతగా సన్నిహితమయిన స్నేహం దృఢపడలేదు కనుక, అంతకంటె గట్టిగా నొక్కిచెప్పడానికి కృష్ణమూర్తికి ధైర్యం కలగలేదు! అయితే తాను చెవిని వేసినవన్ని అక్షరాల యధార్థాలే అని నమ్ముతాడా? మేనమామ రాసిన ఉత్తరాలే లక్ష్యపెట్టని మనిషి తాను చెప్పినదంతా యధార్థమే అని నిర్ణయిస్తాడా? అది అంతా వట్టి గాలి పుకారని కొట్టిపారవేస్తే? ఏది ఏమయితేనేం? అసలు సంగతి కాస అతని చెవిని వేస్తే ఏం పోయింది నమ్మితే నమ్ముతాడు! లేకపోతే లేదు! ఎంతో ఆత్మగౌరవమున్న మనిషి కనక ఈవేళ కాకపోతే రేపయినా ఆ సంగతి లోతుగా ఆరాతీయ వచ్చును

దానిమూలాన సరోజ నటన అంతా తప్పకుండా బయటపడి తీరుతుంది! అందువల్ల క్రమక్రమంగా విజయ కామె బెడద పూర్తిగా తొలగిపోయి కాపరం తిన్నబడి తీరుతుంది! ఆ సంగతి ఊహించుకోగానే అతని కెంతో ఆనందం కలిగింది! ఆమె తిరిగి పిల్లలతో, భర్తతో సుఖంగా కలకల లాడుతుంటే కళ్ళారా చూచి ఆనందించడంకన్న తనకిక కావలసిన దేమిలేదని కృష్ణమూర్తి సంతృప్తి పడ్డాడు అందుచేత చిట్టచివరికి ఏది ఏమయినా తన విధి కృత్యం తప్పక నెరవేర్చి తీరవలసిందే అని నిశ్చయించుకున్నాడు

అదే సమయంలో అతనికి చిన్ననాటి ఆటపాటలలో ఎప్పుడు కలకలనవ్వే విజయలక్ష్మి ముఖము, ఆమె చెక్కిళ్ళమీద సుళ్ళుతిరిగే సొట్టలునుదుటి మీద జారే నల్లనల్లని ముంగురులు జ్ఞప్తికి వచ్చాయి. ఆ రోజుల్లో తల్లి ఎప్పుడయినా రవంత తాయిలంపెడితే విజయలక్ష్మి వెంటనే ఒక్క పరుగులో అతని దగ్గరికి వచ్చి పరికిణీ అంచు అడ్డుపెట్టి మునిపళ్ళతో అది సగం కొరికి ఎంతో ఆప్యాయంగా అతని చేతికందించేది ఆపైన ఇద్దరు కలసి ఒక చోట కూర్చుని

ఒక మొదలు, తుది లేకుండా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ కులాసాగా కాలక్షేపం చేసేవారు ఆ నాటి ఆ నవ్వు ముఖం తీరు, దుస్సహమయిన ఈ నాటి విజయ వదన వైఖరి తలుచుకుంటే అతని గుండె ఒక్కమారుగా వెయ్యి తేళ్లు కుట్టినట్టు విపరీతమయిన తీవ్రవ్యధతో విలవిలలాడింది!

చిన్ననాటినించి ఆమె యెడల ఆత్రుత, ఆత్మీయత ఏర్పడడంవల్లనే అతనికిప్పుడు ఆవిధంగా తీవ్రవేదన కలిగింది ఎన్నెన్ని ఘాతాలు కలిగినా ఆమె యెడల అతని అభిమానమేమాత్రమూ క్షీణించలేదు తమరిద్దరు క్రమక్రమంగా పెరిగికొంచం పెద్దవారయిన తరవాత మేనమామ విజయలక్ష్మిని తనకిచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించుకున్నాడు కాని ఎంతగా ప్రయత్నించినా చిట్టచివరికాయన సంకల్పం ఫలించలేదు కృష్ణమూర్తి కూడా విజయనే వివాహం చేసుకోవాలని ఎంతయినా ఉబలాట పడ్డాడు తన అభిలాష ఆవిధంగా వ్యర్థమయిన పిమ్మట అతడు పడిన మానసిక వ్యధ ఇంతా, అంతా కాదు! కాని మరి కొన్నాళ్లు గడిచిన తరవాత విజయలక్ష్మి కన్నివిధాల మంచి సంబంధం కుదిరినదని ఎంతగానో ఆనందించాడు

కృష్ణమూర్తిది చాలా సున్నితమయిన మనస్సు ఆత్మీయుల కెవరికయినా రవంత బాధ కలిగితే ఇట్టే విలవిలలాడి పోతాడు అందువల్లనే అడుగులోనే హంస పాదన్నట్టు తన జీవిత ప్రారంభంలోనే ఎదురయిన ఆ దారుణాఘాతం వల్ల అతనికి మేనత్త యెడలగాని, మేనమామ యెడలగాని ఏమాత్రము వైమనస్యం కలగలేదు! దైవ నిర్ణయమే విధంగా ఉన్నప్పుడిక తనంతటివాడేమి చేయగలడని ఆ విధి విధానం చిరునవ్వుతో శిరసావహించాడు.

కొంచెం జ్ఞానం వచ్చినప్పటినించి పూజలు, పునస్కారాలు, మంత్రాలు, జపాలు మొదలయిన కుటుంబ సంప్రదాయాల యెడల అతనికి ప్రగాఢంగా భక్తి శ్రద్ధలేర్పడ్డాయి ఇంగ్లీషు చదువు చదివినా కృష్ణమూర్తికి వాటి యెడల గౌరవాదరాలేమాత్రము సడలలేదు పైగా వాటి కనుకూలంగా ఉండే ఆంగ్ల గ్రంథాలే అతడెక్కువగా చదవడం అలవాటు చేసుకున్నాడు తన జీవితానికెక్కడ రవంతయినా ఆశా జ్యోతి కానరాలేదని నిరాశ చేసుకున్న

తరువాత తలవని తలంపుగా ఒక మంచి ఉద్యోగం దొరికింది. అందువల్ల ఆ సంప్రదాయాల యెడల అతనికి మరింత గాఢంగా అభినివేశం పెరిగింది అప్పటినించి ఏదో పెద్ద అడ్డంకి వచ్చి నప్పుడే గాని తన పూజా పునస్కారాలెన్నడు విరమించలేదు

అసలీ విధమయిన సహజ సరళత వల్లనే, సౌశీల్యం వల్లనే విజయలక్ష్మికి అన్నివిధాల తనకన్న గొప్ప సంబంధం వచ్చినా అతని మనస్సులో ఆవంతయినా అసూయ మొలకెత్తలేదు. పైగా ఆమె జీవితాంతం పిల్లలతో, పాపలతో, సిరిసంపదలతో సదా కలకలలాడుతూ సుఖించాలని త్రికరణశుద్ధిగా అభిలషించాడు విజయలక్ష్మి యెడల ఏర్పడిన ప్రగాఢాత్మీయత వల్లనే అతని కామె ఈ విశాల ప్రపంచంలో ఎక్కడో అక్కడ సుఖంగా జీవించి ఉంటేనే చాలునని అనిపించింది అంతేకాదు. ఆమె ఎప్పుడయినా అల్లంత దూరంలో ఎదురు పడితే చాలు. కృష్ణమూర్తి కెంతో ఆనందం కలిగేది శరీరం జలదరించి పులకించేది. కనకనే ఆమె ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం దొరికింది కదా అని అంతర్యంలో అనేక విధాల ఉప్పొంగి పోయాడు

ఇటీవల ఒకప్పుడు కృష్ణమూర్తి మనస్సులో విజయలక్ష్మి యెడల రేకెత్తిన తన ఆత్మీయత ఎప్పుడయినా ఏకాంతంలో ఆమె ఎదుట వ్యక్తీకరించాలని అనిపించక పోలేదు కాని దాని వల్ల విజయలక్ష్మి అపోహపడ వచ్చును అందువల్ల ఆమె మనస్సులోను సాంసారిక జీవితంలోను, తన అంతర్యంలోను, కుటుంబంలోను లేనిపోని కలతలేవయినా చెలరేగ వచ్చును తన మూలాన విజయలక్ష్మి ఆవంతయినా బాధపడడం కృష్ణమూర్తి కేమాత్రము రుచించ లేదు అందుచేత అటువంటి సంకల్పంతిరిగి తనమనస్సులో ఎన్నడు చూచాయగానయినా పొటమరించనీయలేదు. జీవితంలో ఎన్నెన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురు పడుతున్నా ఆమె ఉనికి వల్లనే తన కెంతో ఆనందము, హాయి కలుగుతున్నాయి. అటువంటప్పుడు ఆ సంగతి ఆమె ఎదుట ఎత్తవలసినంతటి అగత్యం ఏమి వచ్చింది?

తన జీవయాత్రలో ఎల్లప్పుడు సుఖంగా ఉన్న ఆమె చిరునవ్వు ఎప్పుడయినా ధ్రువతారకలాగ తళుక్కుమని తరళిస్తే చాలు. తన కదే పదివేలు.

విజయలక్ష్మికి కూడా తన మీద అటువంటి ఆత్మీయత అభిమానము కలిగాయా? లేదా? అని ఒకప్పుడు కృష్ణమూర్తికి జిజ్ఞాస కలగక పోలేదు కాని చిన్ననాటినుండి అనేకమయిన ఇబ్బందులెదురు పడుతూండడం వల్ల మొత్తం మీద తన జీవితం మీదనే అతనికాదృష్టి ఏర్పడలేదు. కనకనే కృష్ణమూర్తి ఎల్లప్పుడు కలిగిన దానితోనే కొంతవరకు సంతుష్టి పొందడం అలవాటు చేసుకున్నాడు అందుచేత విజయలక్ష్మి వైఖరి యెడల కూడా అతని కదేవిధమయిన దృష్టి ఏర్పడింది ఆమెకు తన మీద ఆత్మీయత కలిగితేనేం? కలగక పోతేనేం? విజయలక్ష్మి పేరు తలుచుకున్నంతలోనే తనకెంతో ఆనంద తన్మయత కలుగు తున్నది. తన దురదృష్ట జీవితానికంతకన్న వేరే పెన్నిధి ఏమికావాలి. అందుచేత అతడిక దానిమాటే తలపెట్టలేదు'

అయితే ఆమె తన కుటుంబానికనేక విధాల సాయపడు తున్నది తీరిక వేళలో లక్ష్మి కేవేవో కుట్టుపనులు, అల్లికలు నేర్పుతున్నది. ఎప్పుడయినా తాను వాళ్ళ ఇంటికి వెళ్లినప్పుడు ఉట్టి పడుతున్న అభిమానంతో ఆదరిస్తున్నది సొమ్ము ఏమయినా అవసరమయినప్పుడు మొహమాట పడకుండా అడిగి తీసుకువెళ్ళ వలసినదని మాటిమాటికి ప్రోత్సహిస్తున్నది. ఆవిధంగా తన యెడల, భార్యయెడల విజయలక్ష్మి వ్యక్తీకరిస్తున్న ఆదరణ అతని కెంతయినా ఆనందం కలిగించింది ఆ పట్టణంలో జీవితం ఆవిధంగా గడచిపోతే తన కంతకన్న కావలసినదేమి లేదని కృష్ణమూర్తి బాగా సంతృప్తి పడ్డాడు ఆ సమయంలో అతని దృష్టి అనామిక మీద తరళిస్తున్న పద్మరాగం పొదిగిన బంగారు ఉంగరం మీద పడింది అది తన వివాహసమయంలో విజయలక్ష్మి తనపేరట భర్తపేరట ఎంతో ఆప్యాయంగా అందించిన బహూకృతి.

(సశేషం)

(57వ పుట నుండి)

పడవ ప్రయాణానికి వీలైన జలమార్గం ఏర్పడుతుంది ఈ జల మార్గం ప్రక్కన సహజసుందరమైన పర్వతప్రాంతాలు, ప్రకృతి శోభ చూడడానికి యింపుగొలుపుతుంటాయి అందమైన యీ ప్రదేశంలో కొన్ని విశ్రాంతి గృహాలు నిర్మించడంద్వారానూ, లాంచీలు, హౌస్‌బోట్ల సౌకర్యం కల్పించడంద్వారానూ, దీనిని ప్రముఖ యాత్రా కేంద్రంగా రూపొందించడానికి అవకాశం వున్నది శ్రీశైలం ఆనకట్ట పూర్తి అయిన తర్వాత యిదే విధంగా పడవ ప్రయాణానికి అనువైన మరొక జలమార్గంకూడా ఏర్పడుతుంది శ్రీశైలం సమీపానగల ఫరహాబాదు చాలా కాలం నుండి వేసవి కేంద్రంగా వున్నది దీనిని బాగా అభివృద్ధిపరిచి చక్కని వేసవి కేంద్రంగా చేయాలని సంకల్పించబడింది నాగార్జునసాగర్ - శ్రీశైలం ప్రాంతాలు బహుశః ప్రపంచ మంతటిలోకి ప్రసిద్ధమైన యాత్రా కేంద్రాలుగా అభివృద్ధి పొంద వచ్చు నాగార్జునసాగర్ వద్ద యాత్రికుల సౌకర్యాలను వృద్ధి చేయడానికి జనసంబంధశాఖ తగిన చర్యలను తీసుకుంటున్నది పైన పేర్కొన్న జలమార్గ ప్రాంతాల్లో యాత్రిక సౌకర్యాల అభివృద్ధికై ఒక బృహత్ ప్రణాళిక తయారుచేయబడుతుంది

టూరిస్టు వాహనాలు

హైదరాబాదు నుండి నాగార్జునసాగర్, తదితర ప్రదేశాలకు 10, 12 మంది వ్యక్తులుగల బృందాలను తీసుకవెళ్ళడానికి వీలైన మధ్యతరహా రవాణా వాహనాలను ప్రవేశపెట్టాలనే ప్రజల వత్తిడిదృష్ట్యా యీ సంవత్సరం కొన్ని వాహనాలను సేకరించడానికి యీ శాఖ చర్యలు తీసుకున్నది 1968-69 ప్రారంభంలో ఈ వాహనాలను ప్రవేశపెట్టినప్పుడు చిన్నచిన్న బృందాలుగా వచ్చే యాత్రికుల చిరకాల వాంఛ నెరవేర్చడమే గాక తద్వారా రాష్ట్రానికి తగినంత ఆదాయం కూడా లభిస్తుంది

(1968-69 జనసంబంధశాఖ బడ్జెటు డిమాండునుండి కొన్ని భాగాలు)

చైతన్యమూర్తులు

విమర్శకాగ్రేసర

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి

(జననం : 1863 ఏప్రిల్ 2)

తెలుగు విమర్శకులలో అగ్రగణ్యు లనదగిన కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు స్వాతంత్ర్యానికి పూర్వం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో గుమాస్తాగిరీ చేసేవారు. విశ్వవిద్యాలయ చదువులకు వెళ్ళే తాహతు ఆయనకులేదు. శాస్త్రిగారు సంస్కృతిమీద, సాహిత్యంమీదా, శాస్త్ర విషయాలమీదా, మతం మీదా, జీవ పరమాత్మలమీదా ఎంతో ఉపయుక్తమైన చక్కటి వ్యాసాలను అనేకం వ్రాశారు. అమోఘమైన వాగ్ధాటి గలవారు ఆయన. ప్రజల్లో చక్కటి వక్తగా ఆయనకు మంచి పలుకుబడి వుంది. విమర్శించదగినదనిపిస్తే అతి నిర్భయంగా. ఏమాత్రం జంకు గొంకులు లేకుండా, అతి తీవ్రంగా విమర్శించేవారు ఆయన. శాస్త్రిగారు శబ్దోత్పత్తికి సంబంధించిన భాషా శాస్త్రంలోనూ, మత విషయాలలోనూ మంచి పండితుడు. చారిత్రక పరిశోధనలోకూడా చక్కటి ఆసక్తి ఆయనకువుంది. వారు వ్రాసిన 'పెద్దాపుర సంస్థాన చరిత్ర'ను బట్టి మనకు ఈ విషయం సువిదితమౌతుంది వీరు యింకా ఎన్నో జీవిత చరిత్రలను, నాటకాలను రచించారు.

గుమాస్తాగిరీ బండపని వీరి ప్రతిభా వ్యుత్పత్తులను ఏ విధంగానూ ఆటంక పరచలేకపోయింది సాహిత్య కృషికీ, ధర్మ వ్యాప్తికీ ఆయన తన శక్తి యుక్తులను వినియోగించారు. శబ్దోత్పత్తి. వ్యాకరణ, చారిత్రక రంగాలలో అయన చేసిన కృషి ఎంతగా పేర్కొనదగ్గదైనా ప్రధానంగా ఆయన విమర్శకుడిగానే ప్రసిద్ధులయ్యారు. 'విమర్శ కాగ్రేసర' అన్న బిరుదును పొందారు.

కందుకూరి వీరేశలింగం

(జననం: 1818 ఏప్రిల్ 16)

ఆధునిక కాలంలోని ఆంధ్రదేశ సాంఘిక, సాహిత్య చరిత్ర ఒక విధంగా కందుకూరి వీరేశలింగంగారి చరిత్రే. 1867 లో వీరేశలింగంగారు తొమ్మిదేళ్ళ ప్రాయంలో వున్నప్పుడు తొలి స్వాతంత్ర్య పోరాటానికి అంకురార్పణ జరిగింది. సిపాయిల తుపాకీ గుండ్లు బ్రిటిష్ రాజ సింహాసనాన్ని గడగడలాడించాయి. అంతకు సుమారు పాతిక సంవత్సరాల ముందు ప్రముఖ సాంఘిక సంఘ సంస్కర్త రాజా రామమోహనరాయ్ పరమపదించారు. కాని వారి ఆత్మ మానసిక ఛాందసుల మూఢత్వాలను బ్రద్దలు కొట్టింది. అది దేశమంతటా పరివ్యాప్తమై లక్షలాది సంస్కర్తలను ప్రభావితం చేస్తున్న రోజులవి.

రాజా రామమోహనరాయ్ అనేకమంది స్త్రీలను భర్తతో సహగమనం చేయకుండా రక్షించాడు. విద్యాసాగర్, వీరేశలింగం గారలు స్త్రీలకు కొత్త జీవితాన్ని, కొత్త ఆశలను కల్పించారు. స్త్రీ విద్య అవసరాన్నిగూర్చి తెలియజెప్పడం, స్త్రీ దాస్య విమోచనానికై



వ్యాసాలను వ్రాయడం యీనాడు విపరీతంగా అనిపించవచ్చు. విధవ వివాహాలను గురించి ప్రచారంచేస్తే యీనాడు అది హాస్యాస్పదంగా అనిపించవచ్చు. కాని ఆ రోజుల్లో అదొక ఉద్యమం లాగ నడపించవలసిన అవసరం వుండేది. తను నమ్మిన మార్గంలో పయనించాలంటే వీరేశలింగంగారికి వందలాది వాగ్యుద్ధాలు చేయవలసి వచ్చింది. మాటలతో కుస్తీపట్లు పట్టవలసి వచ్చింది.

స్నేహితులు దూరంగా తొలగిపోయినా, ప్రజలు వెలివేసినా, దూషించినా, రాళ్ళు రువ్వినా ఆయన వెనుకంజ వేయలేదు. తొలి రోజుల్లో విధవ వివాహాల ఊరేగింపులకు పోలీసు బందోబస్తు కావలసి వచ్చేది. స్త్రీ విద్యకు వ్యతిరేకంగా వున్న ప్రజాభిప్రాయాన్ని, 'భోగంమేళాలను' దెయ్యాలూ మొదలైన మూఢ నమ్మకాలను అపహాస్యం పట్టిస్తూ అసంఖ్యాకంగా రచనలు చేశారు ఆయన.

సాంఘిక సంక్షేమంలో ఒక భాగంగా సమాజంలోనూ అధికార వర్గాలలోనూ పేరుకునివున్న కపటం, మోసాలమీద తన ధ్వజమెత్తి రచనలచే బాణాల్ని ప్రయోగించారు. ఒకసారి ఒక న్యాయస్థానంలోని అధికారులు ఒక వర్గంనుండి లంచం పుచ్చుకుని జడ్జిమెంటు కాగితాల్ని ముక్కలు ముక్కలుగా చింపేసి, ఫైల్లో ఫోర్జరీ కాగితాల్ని వుంచారు.

వీరేశలింగంగారు ఆ చింపిన ముక్కల్ని జాగ్రత్తగా అతికించి నిందితులమీద కేసుపెట్టారు. చివరికి ఆ నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు ఆ సంఘటన వీరేశలింగంగారిని బాధించింది. మరో నేరాన్ని బట్టబయలు చేసిన సందర్భంలో, ఆ నేరం చేసిన అధికారి గుండె ఆగి మరణించాడు. ఇంకో సందర్భంలో అధికారి ఉద్యోగంనించి తొలగించబడ్డాడు వీరేశలింగం

గారు తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడంలో ఎలాంటి వ్యామోహాలకు తావివ్వలేదు.

సాహితీ రంగంలోకూడా ఆయన ఒక గొప్ప విప్లవాన్ని, అనేక సంస్కరణలను తెచ్చారు. చిన్నయసూరి మార్గంలో నీతి చంద్రికను క్లిష్టమైన శైలిలో వ్రాసారు 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం' పేరుతో అచ్చ తెలుగు పద్యాలలో నల చరిత్రను రచించారు. దీనిలో పద్యాల మధ్య అక్కడక్కడ సాధారణంగా వుపయోగించే గద్యభాగం అసలు ఎక్కడాలేదు.

అయితే యీ విధంగా ఒకరు ప్రదర్శించిన పాండితీ ప్రకర్షనే మళ్ళీ మళ్ళీ ప్రదర్శించే యీ తరహా రచనలవల్ల అంత ప్రయోజనం లేదని గుర్తించి సరళమైన తెలుగులో సంస్కృత పదాలులేని రచనలు చేశారు. విజ్ఞానాన్ని వెదజల్లడానికీ, సాహిత్యంలోని మగ్ధ సౌకుమార్యాన్నీ, ఆనందాన్నీ విస్తరింపజేయడానికీ యీ తెలుగునే ఆయన ఉపకరణంగా చేపట్టారు.

తెలుగులో తొలి నవల, తొలి జీవిత చరిత్ర ఆయన లేఖిని నుంచే వెలువడ్డాయి. ఆయన నాటకాల్ని, వ్యాసాల్ని, కథలను, జీవిత చరిత్రలను, ప్రహసనాలను, సాహితీ విమర్శలను, శాస్త్రీయ, చారిత్రక రచనలను అనేకమైన వాటిని వ్రాశారు. అనేక సంస్కృత గ్రంథాలను, ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. 'ఆంధ్ర కవుల చరిత్ర' అనే బృహత్ గ్రంథాన్ని రచించారు. తెలుగు సాహిత్యంలోని వివిధ శాఖలలో ఆయన చేసిన కృషి, అది తెలుగులో ఒక కొత్త ప్రయోగంగానో, లేదా దానిని అభివృద్ధి పరిచేదిగానో భాసించింది.

రామమోహనరాయ్ భారతదేశ పునరుజ్జీవన పితామహుడు అయితే వీరేశలింగంగారు ఆంధ్రదేశ పునర్జాగృతీ గగన పథంలో ధ్రువతార. ప్రజా శ్రేయస్సుకే ఆయన తన జీవితాన్ని యావత్తూ అంకితంచేశారు. రాజమండ్రిలోని ఆయన సమాధిమీద చెక్కిన ఈ పద్యాన్ని చూస్తే ఆయన జీవిత సత్యం అవగతమౌతుంది.

'తన దేహము తన గేహము
తన కాలము తన ధనంబు తన విద్య జగ
జ్జనులకె వినియోగించిన
ఘనుడీ వీరేశలింగ కవి జనులారా!

డా. అంబేద్కర్

భారత రాజ్యాంగ చట్టం ప్రధాన నిర్మాత డా. అంబేద్కర్ స్వేచ్ఛా సమానతా, సౌభ్రాతృత్వ భావాలను ప్రజల మనస్సుల్లో ప్రజ్వలింపజేసిన మహామనీషి. ఈ ఉజ్వల భావాలే భారత దేశానికి ప్రపంచ దేశాలలో విశిష్ట స్థానాన్ని సమకూర్చినవి.

ఆయన ముఖ్యంగా మానవతావాది. తన మాతృభూమిలోనూ, యితర దేశాలలోనూ తాను చూసిన అసమానత్వాలు ఆయనలోని మానవతాదృక్పథాన్ని కలవరపెట్టినవి. అణచబడిన వర్గాల ప్రజల దుర్భర జీవితం దృశ్యాలు ఆయన హృదయాన్ని కలచివేసినవి. అట్టి వారి పట్ల ఆయన జాలిపడేవాడు, వారిని ప్రేమించేవాడు, వారి నికృష్టతనుచూసి కంటతడి పెట్టేవాడు.

ఎన్ని అవరోధాలు వచ్చినా, మానవజాతి ప్రాథమిక హక్కుల విషయంలో ఆయనకు గల అచంచల విశ్వాసం సడలలేదు. ఆయన స్థైర్యానికి, ధైర్య సాహసాలకు, వివశులై ప్రజలు ప్రేమతో ఆయన్ను "బాబాసాహెబ్" అని గౌరవాభిమానాలతో పిలుచుకునే వారు.

డా. అంబేద్కర్ స్వచ్ఛమైన, నిష్కళంకమైన జాతీయవాది. మానవజాతి సర్వతో ముఖాభివృద్ధి ఒక్కటే ఆయన ఏకైక లక్ష్యం.

డా. అంబేద్కర్ మహా ప్రతిభావంతుడు, పండితుడు, రాజనీతి వేత్త. న్యాయశాస్త్రము, ఆర్థిక శాస్త్రము, సాంఘిక శాస్త్రము, మతము, తత్వ శాస్త్రము మొదలగు వాటిలో నిష్ణాతుడు, వ్యక్తి స్వాతంత్ర్యానికి ఆయన నిజమైన ప్రతినిధి. ఏరూపంలోనైనా దోపిడీదారీ పద్ధతులకు ఆజన్మ శత్రువు. బ్రతికినంత కాలము, యీ దోపిడీ వ్యవస్థా నిర్మూలనానికే తన సర్వస్వాన్ని త్యాగంచేసి డా. అంబేద్కర్ ప్రజలందరి మన్ననలకు పాత్రుడైనాడు.

—"దక్కన్ క్రానికల్"

మాగ్జిం గోర్కీ

మాగ్జింగోర్కీ శతజయంతికి చిహ్నంగా మార్చి 28న తంతి తపాలశాఖ 15 పైసల ప్రత్యేక తపాలబిళ్ళలు జారీచేయడంద్వారా భారతదేశం ఆయనకు సముచితరీతిని నివాళులు అర్పించింది. విదేశ ప్రముఖుని జ్ఞాపక చిహ్నంగా తపాళబిళ్ళలు జారీచేయడం చాలా అరుదుగా జరుగుతుంది. తనదేశంలోని తోటిపీడిత ప్రజలపై తనకుగల గాఢమైన సానుభూతిని ఆయన రచనలు వ్యక్తంచేస్తాయి. రష్యన్ రచయితపై గౌరవ సూచకంగా యీ బిళ్ళను జారీచేశారు. కొన్ని సంవత్సరాల క్రితం రష్యనులు ఆయనపై "మాగ్జిమ్ గోర్కీబాల్యం" అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ఉన్నత ప్రమాణంలో ఉండి వాస్తవమైన స్మారక చిహ్నంగా నిల్చింది. 7 సంవత్సరాల చిరుతప్రాయంలోనే అనాధుడైనాడు. 9వ ఏట నుండి సంపాదన ప్రారంభించాడు. 12 సంవత్సరాల ప్రాయంలో నిర్దయులైన తనబంధువుల బారినుండి పారిపోయాడు.

రష్యా అంతటా పర్యటించడంతో అనేక విషయాలు తెలిసి జీవిత ప్రథమార్థభాగంలో ఆ జ్ఞాపకాలే ఆయన కథలకు నాటకాలకు కథావస్తువులు అయినాయి. అటువంటి వ్యక్తి ఆందోళనలలో పాల్గొనడం సహజం. 1905లో జరిగిన విప్లవంలో పాల్గొనడంతో పశ్చిమ యూరపు వెళ్ళాల్సి వచ్చింది. అక్టోబరు విప్లవంపై ఆయనకుగల సానుభూతి జగద్విదితం. ఆయన జీవితం అంతిమ దశలో ఉత్తమ రచనలు చేశాడని ఆయన విమర్శకులు భావిస్తారు. 1913లో ప్రచురించిన "బాల్యం" 1923లో వెలువడిన 'యవ్వనపు జ్ఞాపకాలు" 1925లో ప్రచురించిన 'జ్ఞాపకాలు' ఆయన రచనల

ప్రౌఢత్వానికి తార్కాణాలు గోర్కీ "అధోలోకం" రష్యా వెలుపల వెలువడిన రచనలలో ఉత్తమమైనది

—ఇండియన్ ఎక్స్‌ప్రెస్.

'శ్రీవాత్సవ'

తెలుగుభాష సృజనాత్మకరచయితలకు, తెలుగు సాహితీ ప్రియులకు శ్రీవాత్సవలేనిలోటు అశనిపాతంవంటిది. ఉగాది పర్వ దినాన ఢిల్లీలో ఆయన దివంగతులైనారు.

"శ్రీవాత్సవ' ఆయన కలంపేరు ఆయనపూర్తిపేరు యండమూరి సత్యనారాయణరావు తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలుకాలోని ఒక చిన్న గ్రామంలో (1913) జన్మించారు కాకినాడ పి ఆర్ కళాశాలనుండి పట్టభద్రులైనారు ఆతర్వాత బోధనా విషయాలలో పట్టాతీసుకున్నారు అయితే నాలుగు గోడల తరగతి గది ఆయన అభిరుచికి అనువైనదికాదని త్వరలోనే తెలుసుకున్నారు విశాల విశ్వంలో విహరించాలని ఉవ్విళ్లూరినారు కొంతకాలం పాటు జిల్లాలలో పత్రికా విలేఖరిగా పనిచేసి మద్రాసు తరలివెళ్ళారు అక్కడ తాపీ ధర్మారావు సంపాదకత్వంలో వెలువడిన పత్రికలో పనిచేశారు శ్రీధర్మారావు, ఆయనకు జర్నలిజంలోని అన్ని శాఖలతో పరిచయం చేశారు

(ఆ తర్వాత) శ్రీయండమూరి సత్యనారాయణ ఆలిండియా రేడియోలో ప్రవేశించి జీవితాంతం వరకు పనిచేశారు .. మరణించే సమయానికి ఆయన, (ఢిల్లీలోని ఎ ఐ ఆర్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయంలో) అసిస్టెంట్ డైరెక్టరుగా ఉన్నారు

శ్రీ వాత్సవ అనేక గ్రంథాలు రచించారు వాటిలో కొన్నిటికి అకాడమీ బహుమతులు లభించాయి విరివిగా రచనలు చేశారు కవిత్వం, గేయాలు నాటకాలు నవలలు, సాహితీ విమర్శలు, బాలల సాహిత్యం, యీ విధంగా సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను చేపట్టిన సాహితీ సవ్యసాచి అన్నిటినిమించి సాహిత్యోపాసకుల ప్రతి ఒక్కరితో వ్యక్తిగత పరిచయం, స్నేహం వృద్ధి చేసుకున్నారు ఉత్సాహంతో ఉరకలు వేసే మెరపులాంటి వ్యక్తి శ్రీ వాత్సవ "

— దక్కన్ క్రానికల్

డా. మార్టిన్ లూథర్‌కింగ్

డా మార్టిన్ లూథర్‌కింగ్ దారుణహత్య భారతీయులకు గాంధీజీ హత్యను జ్ఞప్తికి తెస్తోంది ఈ యిరువురి జీవితాల్లోనూ, చివరకు మరణాల్లోనూ సామ్యం వుంది వీరిద్దరూ గొప్ప మానవతామూర్తులు వీరిరువురూ జాతి, మత, కుల, వర్ణ విచక్షణతో ప్రమేయంలేని మానవహక్కుల గురించి, సర్వ మానవ సమానత్వాన్ని గురించి శ్రమించి జీవితాల్ని అంకితం చేసిన వ్యక్తులు పరిస్థితులు వారిని నిర్భీతులను చేశాయి తమ తమ ప్రజల హక్కుల సాధనలో తిరుగులేని నాయకులుగా పనిచేశారు ఒకే బోధ చేశారు అనుచరులను పరిస్థితులకు జంకవద్దనీ, తోటి వారిని అసహ్యించుకోవద్దనీ బోధించారు గాంధీజీ డా కింగ్ తమ నీగ్రో అనుచరులకు యిచ్చిన సందేశంకూడా అదే

విద్వేషం, హింసాయుత చర్యలు, సమ్మెలకు స్వస్తి చెబుతూ, జాతుల మధ్య సుహృద్భావ వాతావరణాన్ని నెలకొనేట్టు చూడడమే ఆ మహా నీగ్రోనాయకునికి అమెరికా యివ్వగల భక్త్యంజలి అదే ఆయనకు స్మృతి చిహ్నం

సముద్రాల

సుప్రసిద్ధ కవీ, సినీరచయిత శ్రీ సముద్రాల రాఘవాచార్యులుగారు మార్చి 16వ తేదీన మద్రాసులో స్వర్గస్తులయ్యారు తొలి రోజుల్లో సుప్రసిద్ధకవిగా ప్రసిద్ధికెక్కి అనేకశతావధానాలను చేశారు 1936 లో చలనచిత్ర రంగంలో ప్రవేశించి 200 లకు పైగా చిత్రాలకు కథను కూర్చడమో, సంభాషణలను వ్రాయడమో చేశారు.

యూరీ గగారిన్

తమ 34వ ఏటనే విషాదమరణానికి గురైన యూరీ గగారిన్ మానవ చరిత్రలో ఉన్నతమైన, చిరస్థాయి అయిన కీర్తిని గడించుకున్నారు అంతరిక్షంలో పరిభ్రమించిన తొలి మానవుడు ఆయనే తమ 27వ ఏటనే ఆయన అంతరిక్షంలో భూమిచుట్టు పరిభ్రమించారు ఈ ఘన విజయానంతరం ఆయన భారత దేశానికి విచ్చేశారుకూడా

పండుగలూ పర్వదినాలూ

ఆదర్శమూర్తి - శ్రీరామచంద్రుడు

శ్రీరామచంద్రుణ్ణి భూలోకంలో భగవదంశగా, భగవదవతారంగా హిందువులు భావిస్తుంటారు ఆ పేరులోనే ఏదో ఆకర్షణవుంది రామనామాన్నీ, రామరాజ్యాన్నీ గాంధీజీ ప్రజాహృదయాలలోకి అతి సన్నిహితంగా తీసుకొనివెళ్ళారు "అన్ని వ్యాధులకూ_అది శారీరకమైనదైనా, మానసికమైనదైనా, ఆధ్యాత్మికమైనదైనా_ రామనామం వాటన్నిటినీ కుదిర్చే దివ్యౌషధం"గా ఆయన భావించే వారు

వాల్మీకి సృష్టించిన శ్రీరామచంద్రుని గుణగణాలు, ఏపార ఋణయినా_అతను ఏ మతస్థుడయినా_అతని హృదయాన్ని చూరగొంటాయని నిస్సంశయంగా చెప్పవచ్చు

రాముడు ఉన్నత గుణాలు ఒక్కచోట మూర్తీభవించిన ఆదర్శమూర్తి ఆదర్శ పతి సీతాదేవి లేనప్పుడు అశ్వమేధ యాగం చేయవలసివస్తే అర్ధాంగి స్వర్ణప్రతిమను రూపొందించి పరోక్షంలో నిర్వర్తించాడు ఆయన, నిజానికి మరో భార్యను కట్టుకుని ఆ కార్యాన్ని నిర్వర్తించినా ఆయనను యిసుమంతైనా తప్పుపట్టేవారు కాదు అయినా ఆ పని ఆయన చేయలేదు

ప్రజల సుఖ సంతోషాలనిమిత్తం దేనినైనా, చివరకు అత్యంత ప్రియమైన జానకినికూడా విడిచిపెట్టడానికి సంసిద్ధుడైన వ్యక్తి ఆయన ఒక సామాన్యుడు సీతాదేవిని గూర్చి అనుచితంగా మాట్లాడినప్పుడు, దానిని ప్రజాభిప్రాయంగా మన్నించి తనకు ప్రాణప్రదమైన సీతాదేవిని పరిత్యజించాడు ప్రజాభిప్రాయానికి అనుగుణంగా రాజ్యపాలన కొనసాగించాలన్నది ఆయన ఆశయం

హనుమంతుడికి తన కృతజ్ఞతలు తెలుపుకునే శ్రీరాముని పలుకులు వింటే హృదయం చలించిపోతుంది శ్రీరాముడు అంటాడు _ "నాకూ, లక్ష్మణుడికీ నా కుటుంబానికీ నువ్వుచేసిన సేవలకు నా కృతజ్ఞత ఎలా తెలుపుకోను? దీనికి సరితూగగలిగినది నాదగ్గర ఏమీలేదే కృతజ్ఞతతో, అభిమానంతో నిన్ను ఆలింగనం చేసుకుంటాను నీ సేవకు నా ప్రాణాల్ని అర్పించినా యింకా అది చాలదు నీ మంచి నాలోనే లీనంకానీ నీకు సహాయపడవలసిన అవకాశం ఏదీ రాకుండుగాక ఎందుకంటే ఆపదకలిగితేనే సహాయ పడవలసిన అవసరం ఏర్పడుతుంది నీవు ఆపదలలో చిక్కుకోవడం నేను అభిలషించను " నిజంగా ఎంత గొప్పపలుకులివి ! హిందూయేతరులైనా, నిరీశ్వరవాదియైనా శ్రీరాముని గుణగణాలను మానవతను కీర్తించక మానడు బహుశా ప్రపంచ సాహిత్యంలో శ్రీరామచంద్రునికన్న మించిన ఆదర్శమూర్తి, ఉన్నతగుణ సంపన్నుడు మరొకరు వుండకపోవచ్చు.

వాల్మీకినుంచి గాంధీజీవరకు ఎన్నికోట్లమందో శ్రీరామ నామ సంకీర్తనతో పవిత్రులయ్యారు మోక్షసిద్ధి పొందారు. పోతన, త్యాగరాజు, రామదాసు ఎందరో మహానుభావులు శ్రీరాముని కొలిచి తరించారు తమ కవిత్వాన్ని, తమ హృదయాలను సుర భిళ పుష్పాలుగా చేసి అర్పించారు ప్రజల హృదయాలలో భక్తావతంసులుగా నిలిచి పోయారు

– ఎం. సాయిబాబా

జైనమతోద్ధారకుడు మహావీరస్వామి

అశాశ్వతమైన శరీరానికీ, అనుక్షణ చంచలమైనమనస్సునకూ అతీతమై శాశ్వతమూ, స్థిరమూఐనదేదో మానవునిలోవుంది అదే ఆత్మ అదే వాస్తవమైన నేను వాస్తవమైన నువ్వు వాస్తవమైన 'తాను' ఆత్మానం విద్ధి నిన్ను నువ్వుతెలుసుకో అనేఘోష ఉపనిషత్తుల కాలంనుంచి మనదేశంలో వినిపిస్తూవుంది ప్రతివ్యక్తీ తన్ను తాను తెలుసుకోవాలి ఆత్మజ్ఞానమే కేవల జ్ఞానం కేవలజ్ఞానం మన లక్ష్యం

సంపూర్ణ సత్యాన్ని తెలుసుకోవడమే కేవల జ్ఞానం సమగ్ర సత్యసందర్శనం సామాన్యులకు సాధ్యంకాదు సంపూర్ణసత్యం యొక్క ఒక్కొక్క భాగం మాత్రమే ఒక్కొక్కనికి కనబడుతుంది గుడ్డివాళ్లు ఏనుగును తడిమి దాని రూపాన్ని గ్రహించడానికి ప్రయత్నిస్తే చెవులు తాకిన వానికి చేట అనిపిస్తుంది, తోకపట్టుకొన్న వానికి పాములా తోస్తుంది ఇద్దరు చెప్పినదీ సత్యమే కాని ఏ ఒక్కరు చెప్పినదీ సమగ్ర సత్యంకాదు ప్రతివాడు తను గ్రహించినది మాత్రమే సత్యమనీ, రెండవవాడు గ్రహించినది సత్యంకాదని వాదిస్తే పొరపాటు అవుతుంది

సమగ్ర సత్యం సాధించాలంటే ఆత్మజ్ఞానం కావాలి ఆత్మజ్ఞానం పొందడానికి శీలం అవశ్యం అహింస, సత్యం అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం_వీటిని శక్తికొలది అభ్యసించాలి

ప్రతిప్రాణి సుఖాన్ని అపేక్షిస్తుంది అవధిలేని, అంతరాయం లేని సుఖం ముక్తివల్లనే ప్రాప్తిస్తుంది

ప్రపంచంలో రెండు భేదాలు ఉన్నాయి జీవము, అజీవము అని, జీవాజీవసంయోగం వల్లనే ప్రపంచంలో ఇంతవికారము కనిపిస్తూ ఉంది జీవికి అజీవబంధం లేకుండా పోతే అదే పరమ ముక్తి

జీవి క్రిందికి పడిపోకుండా కాపాడేది ధర్మం. పైకి పోవడమే ప్రతిజీవియొక్క అంతఃప్రవృత్తి. జీవిని క్రిందికి దిగదీసి ప్రపంచానికి అంటి పెట్టి ఉంచే బంధం కర్మం. కర్మబంధం తెంచుకోవడమే కర్తవ్యం. కర్మ తరిగిపోయే కొద్దీ జీవి తేలిక పడతాడు. కర్మ తరిగి, పూర్తిగా తరిగి పోయేటప్పటికి సంపూర్ణమైనముక్తి లభిస్తుంది. జీవి మహోన్నతమైన సిద్ధ క్షేత్రాన్ని చేరుకుంటాడు.

ప్రపంచంలోని అనర్థాలన్నిటికీ కారణాలు రెండు– రాగం, ద్వేషం. ద్వేషం పరిహరించదగినదే. రాగం కూడా త్యజించదగినదే. ఈ రెండింటి వల్లా బంధం ఏర్పడుతుంది.

జైనమతం బోధించే అత్యుత్కృష్ట ధర్మం అహింస. అన్ని జంతువుల పాదాలూ ఏనుగు పాదంలో ఇమిడిపోయినట్లు అహింసా ధర్మంలో సమస్త ధర్మాలు యిమిడిపోయి ఉన్నాయి.

సత్యం అనాది ఐనట్టే జైనంకూడా అనాది అని జైనుల విశ్వాసం. జైనమత స్థాపకుడు అని ఎవరూ లేరు. ఇరవై నలుగురు తీర్థంకరులు ఉన్నారు. వారందరూ అగురూపదిష్టులు అంటే గురువులవల్ల ఉపదేశం పొందనివారు. వారందరిలో మహావీరస్వామి చివరివాడు. తీర్థంకరులను జైన మతోద్ధారకులు అనవచ్చు.

మహావీరుడు మహోగ్రతపస్సు చేసి కేవలజ్ఞానం పొందిన మహాపురుషుడు. ఆయన తపశ్చర్యను గురించిన ఒక గాథ ఉంది.

మహావీరుడు (అప్పటికి ఆయన పేరు వర్ధమానుడు) కుమార గ్రామ పరిసరాలలో ధ్యాన నిమగ్నుడై ఉన్నాడు. ఆ దారిన పోతూ ఉన్న ఒక రైతు ఆయనను చూచాడు. పనీపాటూ లేకుండా సోమరిగా కూర్చున్నాడనుకొని తనువచ్చే వరకు తన ఎద్దులను చూస్తూ ఉండవలసిందని చెప్పి వెళ్లిపోయాడు. వర్ధమానునికి ఆ మాటలు వినబడలేదు. ఆ ఎద్దులు కనబడలేదు. రైతు తిరిగి వచ్చేటప్పటికి ఆ ముని అలాగే కూర్చొని ఉన్నాడు. ఎద్దులు అక్కడ లేవు. ఏమయ్యాయి అని అడిగాడు. ఉలుకూ, పలుకూ లేదు. ఎద్దులను వెతకడానికి వెళ్లిపోయాడు రైతు. రాత్రి అంతా వెతికాడు. ఎక్కడా కనబడలేదు. మరునాడు ఉదయం వచ్చేటప్పటికి ఎద్దులు బాగా మేసివచ్చి మునీశ్వరుని పక్కన పడుకొని ఉన్నాయి. ఇదంతా దొంగఎత్తు అని రైతు, ఎద్దుల పలుపుతీసి వర్ధమానుని కొట్టడం మొదలు పెట్టాడు. అంతలో ఇంద్రుడు అడ్డం వచ్చాడు. తానే కావలి ఉంటానన్నాడు. లేదాఅంటే ఇంకెవ్వరినైనా రక్షణకు ఇస్తానన్నాడు. వర్ధమానుడు అంగీకరించలేదు. "తీర్థంకరుడు ఇతరుల సాయం అపేక్షింపకుండా తానుగా కృషిచేసి కేవలజ్ఞానాన్ని పొందాలి. ఎవరిరక్షణా లేకుండానే ముక్తి సాధించాలి" అని వర్ధమానుడు సహాయాన్ని నిరాకరించాడు. ఆ మహాత్మునికి తెలియకుండానే ఇంద్రుడు కావలి ఏర్పాట్లు చేశాడట. అది వేరే విషయం. చెప్పవలసిన మాట ఏమిటంటే ప్రతిజీవి తన ప్రయత్నంవల్లనే ముక్తిని పొందాలి అన్నది.

--ఆళ్ళ రామకోటేశ్వరరావు

శూలారోపణ శుక్రవారం (గుడ్ ఫ్రైడే)

ఆనాడు యూదులలో రెండు ప్రబలమైన వర్గాలు ఉండేవి. ఫారసీలు, సద్దూసీలు. అవి ఫారసీలు మోజెస్ ప్రవచించిన పురాతన ధర్మంలో విశ్వాసం కలవారు. దెబ్బకు దెబ్బ అనే నీతివారిది. భక్తిమీదకంటె డంబాచారంమీద ఎక్కువ రక్తి. వారికి ప్రపంచంలో వారిది సర్వోత్తమమైన జాతిఅనే దురహంకారంతో ఇతర జాతులను ద్వేషించేవారు. సద్దూసీలు ధనికులైన ప్రభువర్గంవారు. పునరుత్థానంలో నమ్మకంలేదు వారికి. మానవుడు తన యిష్టం వచ్చినట్టు జీవించవచ్చు ననే తత్త్వం వారిది. యేసు బోధించినది దయ. బాహ్య కర్మకాండకంటె అంతఃశుద్ధి ప్రధానం అని ఉపదేశించిన వాడు ఆయన. ఈశ్వర పితృత్వమూ, మానవ సౌభ్రాత్రమూ ప్రవచించిన వాడు ఆయన. పూర్వాచార పరాయణులకు ఆయన మీద ద్వేషం కలిగింది.

యేసు తన అనుచరులతో కలిసి జెరూసలేము నగరంలో ప్రవేశించాడు. జనసమూహాలు ఆనందంతో, ఉత్సాహంతో ఆయనకు ఘనస్వాగతం ఇచ్చారు. ప్రజలు ఎదురు తిరుగుతారని పురోహితులు భయపడ్డారు. దేశాన్ని పరరాజులైన రోమనులు పరిపాలిస్తున్నారు. వారి పాలనలో ప్రజలకు ఆరాధనా స్వేచ్ఛ ఉండేది. తిరుగుబాటు వస్తే మాత్రం రోము సహించదు. దేవాలయాల నుంచి పూజారులూ, పురోహితులు పారిపోవలసి వస్తుంది. అదీ వారి భయం. జెరూసలేము దేవాలయంలో ప్రవేశించి యేసు తమ వర్తక వ్యాపారాలతో ఆ మందిరాన్ని అపవిత్రం చేస్తున్న వంచకులను తరిమివేశాడు. యావత్తు యూదు జాతియొక్క స్వేచ్ఛకూ, స్వత్వాలకూ, మనుగడకూ భంగం కలుగకుండా విప్లవకారుడైన ఒక వ్యక్తి అంతరించడం మంచిదని మతోన్మాదులు నిశ్చయించుకొన్నారు.

ప్రభువు జీవితంలోని తుది భోజనం ఆ రాత్రి శిష్యులతో కలిసి యేసు భోజనం చేశాడు. "నా ఆత్మలో మహావేదనగా ఉంది. మీరు ఇక్కడ కూర్చుని జాగరూకతతో ఉండండి" అని చెప్పి యేసు ఆలివ్ ఆరామంలో ప్రార్థనకు వెళ్ళిపోయాడు. "తండ్రి, నీకు సమస్తమూ సాధ్యమే. నానుంచి ఈగిన్నెను తొలగించు. ఏమైనా నా ఇచ్ఛకాదు నీసంకల్పమే నెరవేరుగాక!" అని ప్రార్థించాడు.

ప్రార్థనచేసి తిరిగి వచ్చేటప్పటికి శిష్యులు నిద్రపోతున్నారు. యేసు వారిని మేల్కొలుపుతూ ఉండేసరికి దూరాన్ని అడుగుల చప్పుడూ, కత్తులధ్వనీ వినబడ్డాయి. కాగడాల వెలుగు కనబడింది. తన శిష్యులలో ఒకడైన యూదాస్ ముప్పయి వెండినాణాలకు కక్కుర్తిపడి గురుదేవునికి ద్రోహంచేసి శత్రువులకు అప్పగించాడు. తక్కిన శిష్యులందరూ భయపడి యేసును విడిచి పారిపోయారు.

పురోహితులు, అనుయాయులు, రోమన్ సైనికులూ యేసును ప్రధాన పురోహితుని దగ్గరకు తీసుకుని వెళ్ళారు. దొంగ సాక్షులను ఏర్పాటు చేశారు. కాని వారి మాటలలో ఐకమత్యం లేకపోయింది. అప్పుడు పురోహితులు యేసును చూచి 'నువ్వు దేవుని

కుమారుడవైన క్రీస్తువా?" అని గద్దించి అడిగారు ఇకమీదట మానవ కుమారుడు భగవచ్ఛక్తికి కుడివైపున కూర్చుని ఉంటాడు అని యేసు జవాబు "ఐతే నువ్వు దేవుని కుమారుడవా?" అని మళ్ళీ ప్రశ్న "ఆమాట మీరే అంటున్నారు కదా!" అని యేసు ప్రత్యుత్తరం ఇంకేమి కావాలి? దైవదూషణ నిరూపింప బడింది "చంపండి చంపండి" అని కేకలు బయలుదేరాయి విచారణ ఐపోయింది కాని శిక్షను స్థిరపరచ వలసినది రోమన్ గవర్నర్.

శుక్రవారం ఉదయం న్యాయస్థానం క్రిక్కిరిసి ఉంది మళ్ళీ విచారణ జరిగింది గవర్నర్‌కు యేసులో ఎట్టిదోషమూ కనబడలేదు 'ఇతడు జాతిని పెడదారిని పట్టించాడని, రోమన్ చక్రవర్తికి పన్నులు చెల్లించ వద్దన్నాడనీ మీరు ఆరోపణలు చేశారే ఇతడు ఏ నేరమూ చేసినట్లు ధృవపడలేదు మీ ఎదటనే విచారణ చేశాను కదా! మరణదండన విధించడానికి తగిన నేరం రుజువు కాలేదు కొరడాదెబ్బల శిక్షవేసి విడుస్తాను చాలు" అన్నాడు గవర్నర్

మూక మరీ రెచ్చిపోయింది "వానికి సిలువ వెయ్యాలి సిలువ వెయ్యవలసిందే" అని గోల బయలుదేరింది ఆయన ప్రజల ఒత్తిడికి తట్టుకోలేక యేసుకు సిలువ శిక్ష విధించాడు

వధ్యస్థానానికి ఊరేగింపు బయలుదేరింది పాస్ ఓవర్ పండుగ వస్తూంది నగరం అంతా జనం కోలాహలంగా ఉంది. అందులో ఇదివరలో ప్రభువు ప్రసంగాలు విన్నవారు ఉండి ఉండవచ్చు యేసు దేవకుమారుడిని ఇదివరలో నమ్మినవారుకూడా ఉండిఉండవచ్చు కాని అప్పుడు యేసు యెడల ఎట్టి సానుభూతిని కనబరిచినట్లు కనబడదు కొందరు స్త్రీలుమాత్రం శోకించారు

ప్రభువు వెంట ఇద్దరు దొంగలు కూడా సిలువ శిక్షపడి బయలుదేరారు ఊరేగింపు కాల్వరి దగ్గరకు వచ్చింది అక్కడ ప్రభువును సిలువమీద ఎక్కించి మేకులు కొట్టారు కుడివైపున ఒకడు ఎడమవైపున ఒకడూ-మొత్తంఇద్దరు దొంగలూ సిలువ ఎక్కారు దారుణమైనబాధ అనుభవిస్తూ యేసు అన్న మాటలు ఇవి "తండ్రీ, వీరిని క్షమించు పాపం! తాము ఏమిచేస్తున్నదీ వారికి తెలియదు"

"ఇతరులను రక్షించడానికి పూనుకున్న ఈ రక్షకుడు తనను తాను రక్షించుకోలేకపోయాడు" అన్న ఎత్తిపొడుపు మాటలు జనంలోనుంచి వినబడాయి సిలువమీద యేసు తలకు మీదుగా కర్రపలక మీద "యూదులరాజు" అని నల్ల అక్షరాలలో వ్రాశారు అవును ఆయన రాజే కాని ఆయన రాజ్యం ఐహికరాజ్యం కాదు సిలువయే ఆయన సింహాసనం అయింది ముళ్ళే ఆయన కిరీటం అఖిల మానవకోటి పాపాలకోసం ఆత్మబలిదానం చేసిన మహారాజు ఆయన ప్రపంచంలో అసంఖ్యాకులైన రాజుల రాజ్యాలూ, సమ్రాట్టుల సామ్రాజ్యాలూ చూస్తూ చూస్తూ ఉండగానే అస్తమించిపోయాయి క్రీస్తు ఆధ్యాత్మిక సామ్రాజ్యం దాదాపు రెండు వేల సంవత్సరాలుగా నిలిచేఉంది వేల సంవత్సరాలుగా నిలిచేఉంటుంది

—నల్లంరెడ్డి సుచరిత

మొహరం

మహమ్మదు ప్రవక్తమనుమడూ, అలీకుమారుడూ అయిన హుసేన్, 72 మందికిమించని తన బంధువర్గంతో 4000మంది యాజీద్ సేనలను, తన స్వస్థలం మదీనాకుదూరంగా ఇరాక్‌లోని కూఫా నగర సమీపంలో యుఫ్రెటెస్ నదీ తీరాన కెర్బలా మైదానంలో ఎదుర్కొన్నాడు ఆరోజు 61వ హిజ్రా సంవత్సరంలో పదవ మొహరం రోజు (క్రీ శ. 680 అక్టోబరు 10)

యాజీద్ తన తండ్రి అమిర్ మావియా మరణానంతరం సింహాసనాన్ని అధిష్ఠించాడు ఇస్లాం ప్రజాస్వామ్య సూత్రాలను విస్మరించి తానే ఇస్లాం మత ప్రపంచానికంతటికీ అధినాయకుడుగా ప్రకటించదలిచాడు యాజీద్ విలాసపురుషుడు అంతేకాదు మత సిద్ధాంతాలఎడ అతనికి ఏమాత్రం లక్ష్యంలేదు యాజీద్ సింహాసనాన్ని అధిష్ఠించిన వెంటనే తన సామంతులందరికి ఉత్తర్వులు జారీ చేశాడు తన రాజ్యాధిపత్యానికి సామంతులు అంగీకారాన్ని తెలుపుతూ తమ ప్రభుభక్తిని ప్రకటించుకోవలసిందిగా ఆజ్ఞాపించాడు అలీ కుమారుడు హుసేన్, మరో యిద్దరు యిందుకు తిరస్కరిస్తే వారి శిరశ్ఛేదంచేయవలసిందిగా తన ప్రతినిధికి ఆదేశించాడు

అయితే రాజప్రతినిధి హుసేన్ తలను నరక సాహసించలేకపోయాడు హుసేన్ మక్కాకు పారిపోయి అక్కడినుంచి కుఫాచేరుకున్నాడు తమ వద్దకు వచ్చిఉండమని అనేక మంది నుంచి హుసేన్‌కు ఆహ్వానాలు అసంఖ్యాకంగావచ్చాయి హుసేన్ తనతోపాటు తన కుటుంబాన్నికూడా మక్కాకు తీసుకొనివెళ్ళాడు అక్కడివాళ్ళు తనకు ఆతిధ్యం యివ్వగలరని భావించాడు అయితే కుఫా రాజప్రతినిధి 4000 మంది అశ్వికదళాన్ని పంపి హుసేనును ప్రాణాలతోగాని, చంపిగాని తనకు అప్పగించవలసిందిగా ఆజ్ఞాపించాడు

హుసేన్‌ను కుఫా వద్ద ఎదురుగా వున్న కర్బలామైదానంలో ఆ సైన్యం చుట్టుముట్టింది తమకి లొంగిపోమని ఆదేశించింది. తనని, తన అనుచరుల్ని మక్కాకు తిరిగి వెళ్ళడానికి గాని, కనీసం తమను డెమాస్కస్‌కు పంపడానికిగాని అంగీకరిస్తే తాను లొంగిపోగలనని హుసేన్ చెప్పాడు సైన్యాధిపతి ఆ విషయాన్ని అబిదుల్లాకు తెలియజేశాడు అబిదుల్లా మళ్ళీ తనపాత ఉత్తర్వునే తిరిగి పలికి హుసేన్‌ను ప్రాణాలతోగాని, చంపిగాని 61 హిజ్రాసంవత్సరం 9వ మొహరం (680 క్రీ శ, అక్టో 9) నాడు తనవద్దకు పట్టుకొని రమ్మన్నాడు సైన్యాధిపతి కర్బలచేరుకుని హుసేన్‌ను లొంగిపొమ్మని మరోసారి హెచ్చరించాడు అయితే వీరోచితమైన మరణం పొందడానికే హుసేన్ నిశ్చయించి, ఆ సైన్యంతో తలపడ్డాడు ఆ పోరాటంలో హుసేన్‌ను,అతనిఅనుచరుల్ని వధించారు. అతనితలను ఖండించి కుఫానగరానికి తీసుకొని వెళ్ళి అక్కడ నుంచి డెమాస్కస్‌కు పంపించారు మర్నాటివరకు అతని మొండేనికి ఖనన సంస్కారం జరగలేదు

ఈ సంఘటన ముసల్మానులలో తీవ్రసంచలనాన్ని కలిగించింది. యాజీద్‌చక్రవర్తి అంటేనూ, రాజప్రతినిధి అబిదుల్లా

అంటేనూ, సైన్యాధిపతి షిమీర్ అంటేనూ అందరికీ అసహ్యం వేసింది

మొహరం 10వ రోజు హుసేన్‌కు ప్రజలు శ్రద్ధాంజలి ఘటించినదినం ఆనాటినుండి దుష్టత్వానికీ క్రౌర్యానికి యాజీద్‌రాజు సంకేతమైతే; యిస్లాంమతోద్ధారణకు ప్రాణత్యాగం చేసిన హుసేను ధర్మసంస్థాపనకు చిహ్నంగా చరిత్రలో నిలిచిపోయాడు. హుసేన్, యాజీద్‌కు లొంగిపోయివుంటే అది సత్యమే పరాజయం పొందినట్టయివుండేది మొత్తం సమాజమే కలుషితమైవుండేది.

ఈ నాటికికూడా హుసేన్‌ను మానవజాతికి శుభ జీవ ప్రదాతగా జ్ఞప్తి చేసుకుంటారు అతని జ్ఞాపకంగా ప్రతియేడూ శ్రద్ధాంజలి ఘటిస్తారు

ప్రాణత్యాగానికైనా సిద్ధపడాడుగాని దుష్టునికి తలవంచలేదు హుసేను అందుకే ముసల్మానులు ముసల్మానేతరులు కూడా ఆయనకు యీరోజున శ్రద్ధాంజలి ఘటిస్తారు ’

హైదరాబాదులో మొహరం పెద్దఎత్తున ఉత్సాహంగా జరుపుతారు ముసల్మానులేగాక హిందువులు, యితర మతాలవారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు

—గులాం జీలానీ

ఆంధ్ర ప్రశస్తి

వేఁగిరాజ్యపు పల్లెవీథులఁ జెడుగుళ్ళ
రిపుల గవ్వించు నేరుపులు తెలిసి
ఎగురు గోడీబిళ్ల సొగసులో రిపు శిర
స్సుల బంతులాడు శిక్షలకు డాసి
చెడ్డాడి యుప్పు తెచ్చిననాఁడె శాత్రవ
వ్యూహముల్ పగిలించు నొఱపు గఱచి
కోఁతి కొమ్మచ్చిలోఁగోట గోడల కెగఁ
బ్రాకి లంఘించు చంక్రమణ మెఱిఁగి

తెనుఁగు లంతట్టె యవినేర్చుకొనిరు యుందు
రెన్నగాఁ దెల్గుతల్లులు మున్నుశౌర్య
రసమొదిచి యుగ్గుఁబాలతో రంగరించి
బొడ్డుకోయని కూనకే పోయుచురట

—విశ్వనాథ సత్యనారాయణ

ఉగాది

ఉగాది సందర్భంగా రాష్ట్ర జనసంబంధ శ్రామికశాఖా మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ. యీ దిగువసందేశాన్ని యిచ్చారు

"శీత కాలం ప్రారంభంతో ఆకురాలు కాలం మొదలవుతుంది దీనినే మనం తెలుగులో వసంత ఋతువుగాను, ఉర్దూలో "మోసమె ఖిజాం" గాను వ్యవహరిస్తున్నాము ఈ వసంత ఋతువులో చెట్లు తిరిగి కొత్త చిగుళ్లువేసి, పూత పూసి, పూవులను అంది స్తాయి ఈ ఋతువును ఇంగ్లీషులో స్ప్రింగ్ అనీ, ఉర్దూలో మోసమెబహార్ అనీ తెలుగులో వసంతఋతువని మనం అంటున్నాము ఈ ఋతువులో ప్రపంచ మందంతటా చెట్లు, చేమలు కొత్త జీవితాన్ని సంతరించుకుంటాయి ప్రకృతి కొత్త చిగుళ్లను తొడుక్కునే యీ కాలంతోనే కొత్త సంవత్సరం ఆరంభ మవుతుందని ప్రజలుభావిస్తున్నారు

భారతదేశం ముఖ్యంగా వ్యావసాయిక దేశం ఇక్కడ వ్యావసాయిక జీవితం ఋతువులతో పెనవేసుకొని ఉంది అందు వల్లనే మన పూర్వీకులు, ప్రకృతి, ఋతు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మొత్తం సంవత్సరానికి సంబంధించి ఆర్థిక, సాంఘిక, సామాజిక కార్యక్రమాలను రూపొందించారు మన వ్యవసాయ దారులు, గత సంవత్సరపు లావాదేవీలను మదింపు వేసుకొని, కొత్త సంవత్సరంలో చేయాల్సిన పనులకు కార్యక్రమాలను యీ ఋతువులోనే రూపొందించుకొనడం సహజమేకదా!

విశాలమైన మన దేశంలో మత, కుల విచక్షణ లేకుండా వ్యవసాయదార్లు ఋతు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తూ వివిధ ప్రాంతాలలో ప్రకృతి ప్రసాదించిన విభిన్న సామాజిక సంప్రదాయలను అనుసరిస్తున్నారు అయితే దాదాపుగా మన దేశం మొత్తంలో సహజంగా ఉగాదినాడే యీ సంప్రదాయాలను అనుసరిస్తున్నారు 'యుగ-ఆది' నుండే ఉగాది పదంఉద్భవించింది చైత్రమాస శుక్ల పాడ్యమి రోజున ఉగాది వస్తుంది

ప్రకృతి చిగిరించడంతో ప్రారంభమయే క్రొత్త సంవత్సరం క్రొత్త ఆశలు, ఆకాంక్షలు కలిగిస్తుంది నూతన వుత్సాహంతో సార్థక్యమైన జీవితం సాగించడానికి కార్యోన్ముఖులను చేస్తుంది అందుచేత సంవత్సరాదినాడు ప్రజలందరూ ఉత్సాహంతో వేడుకలు జరుపుకోవడం సముచితం నూతన సంవత్సరంలోనికి ప్రవేశించే ముందు వ్యక్తిగత జీవితంలోనేగాక దేశంలో వర్తమాన సంవత్సరంలో జరిగిన సంఘటనలను సింహావలోకనం చేస్తాము భావి కార్యక్రమాలనుగురించి యోచనచేస్తాము ఈ విధంగా నూతన సంవత్సరం కొత్త ఆశలతో, ఆకాంక్షలతోనేగాకుండా తాను, తన కుటుంబం, సమాజం శ్రేయస్సుకూడా, అభివృద్ధికి పాటుబడ గలమంటూ ప్రతినలు చేయడంతోకూడా ప్రారంభమవుతుంది

ఈ లక్ష్యంతో 1968 మార్చి 29 వ తేదీనాడు ఉగాది వేడు కను వైభవంగా జరుపుకొనడానికై ప్రజలను ముఖ్యంగా ప్రజా సంస్థలను ప్రోత్సహించడానికి జన సంబంధ శాఖ కాయకష్టులా కృషి చేస్తున్నది అన్ని జిల్లాస్థాయి, బ్లాకుస్థాయి కార్యాలయాలకూ కరపత్రాలను, సర్క్యులర్లను జారీచేయడం జరిగింది. పట్టణ ప్రాంతాలలోకూడా ఈ పండుగను పైన తెలిపిన విధంగా సముచిత రీతిని జరుపుకోవాలి

ఉగాది పండుగను ఉత్సాహపూరితంగా వైభవోపేతంగా జరుపుకొనవలసిందిగా నేను యావన్మందికి విజ్ఞప్తి చేస్తున్నాను "

ఉగాది వేడుకలు

రాష్ట్ర వ్యాప్తంగా యిటీవల జరుపుకున్న ఉగాది పండుగ ప్రజలలో నూతనోత్సాహాన్ని, కొత్త దృక్పథాన్ని, యుగాల తరబడి జరుపుకుంటూ వస్తున్న విధంగా గాక కలిసి కట్టుగా నూతన రీతులలో జరుపుకునే అవకాశాన్ని కలిగించింది జన సంబంధ, శ్రామిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకుని ప్రజలు తమ తమ వాడలలో ఉగాది పండుగను ఉత్సాహంతో ఘనంగా జరుపుకున్నారు నూతన సంవత్సర భానూదయం, మతభాషా విచక్షణలేకుండా ప్రజలందరిలోను ఆనం దోత్సాహాలను కలిగించింది. మత, భాషా అల్పసంఖ్యాక వర్గాల ప్రజలుకూడ నూతన సంవత్సర దివసాన్ని సంతోషంగా జరుపు కున్నారు జన సంబంధ, శ్రామిక మంత్రి ఉగాది సందేశం రాష్ట్రంలోని ప్రతి పౌరునిలో 'సంఘీభావమే బలం' అనే సూక్తిని పునరుజ్జీవింపచేసింది ఉగాది పండుగను యింతకుముందెన్నడూ సామూహికంగా జరుపుకోలేదు కుటుంబంలోని సభ్యులు తమ గృహాలలో జరుపుకునే యీ పండుగను యీ సంవత్సరం ప్రజలం దరు కలిసి సామూహికంగా ఒకచోట చేరి జరుపు న్నారు వేపపూ పచ్చడిని ప్రజలకుపంచారు పురోహితులు మంత్రపఠనం, పంచాంగ శ్రవణం జరిపారు ప్రతి వాడలో ప్రతిజ్ఞ స్వీకారం, సమావేశాలు, ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమం, కవి సమ్మేళనం మొదలైనవి జరిగాయి ప్రాతఃకాలంలో నినాదా లతో ప్రభాతభేరి, ఆ తర్వాత ఆటలపోటీలు నిర్వహించబడినాయి

జంట నగరాలలో 150 కి పైగా వాడలలో ఉగాది వేడుకను ఘనంగా జరుపుకున్నారు కొన్ని వాడలలో జరిగిన ఉత్సవాలలో మంత్రులు, అనధికార ప్రముఖులుకూడ పాల్గొన్నారు

ఉగాది సందర్భంగా జంట నగరాలలోని సింధీలు సిద్ధెంబరు బజారులో బ్రహ్మాండమైన మేలాను ఏర్పాటుచేశారు శ్రీ కొండా

లక్ష్మణ్ బాపూజీ, డా. జరానంద రాష్ట్రవాది, డా. కె. సత్యనారాయణస్వామి తదితరులు అనేకలు యీ మేలాలో ప్రసంగించారు.

సనత్‌నగర్ కార్మిక సంక్షేమ కేంద్రంలో యీ ఉత్సవాలను మనోహరంగా జరుపుకున్నారు కార్మిక సంక్షేమ కేంద్రాల సూపరింటెండెంటు శ్రీ ఎ యాదిగిరి, కార్మిక సంక్షేమ సలహా మండలి సభ్యుడు శ్రీ చెన్నకేశవులు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌కు చెందిన శ్రీ లాన్‌సోవ్ సమావేశంలో ప్రసంగించారు. ఈ కేంద్రంలోనే సోవియట్ వోమగామి మేజర్ యూరీ గగారిన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు ఆరోజు జరిగిన ఆటల పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు యిచ్చారు. ఆజమాబాదు కార్మిక సంక్షేమ కేంద్రంలో శ్రీ జి గండయ్య యాదవ్ అధ్యక్షతన ఆరోజు ఉత్సవాలు జరిగాయి డా॥ కె సత్యనారాయణస్వామి, శ్రీ యాదగిరి సమావేశంలో ప్రసంగించారు రంగవల్లి పోటీలలో అనేకమంది స్త్రీలు పాల్గొన్నారు

పరస్పరం కలిసి ఒక చోట చేరడానికి పండుగలు అవకాశం కల్పిస్తాయి తద్వారా ప్రజలలో సాంఘిక జీవితం పెంపొందుతుంది ఉగాది దినోత్సవం సందర్భంగా 25 స్థానిక గ్రంథాలయాలలో 'నాటి_నేటి పరిస్థితుల'ను గూర్చి చర్చాగోష్ఠులు ఏర్పాటు చేశారు జంట నగరాలలోని 46 సామాజిక కేంద్రాలలో యీ ఉత్సవాలను అతి వైభవంగా జరుపుకున్నారు విజయనగర్ సంక్షేమ సంఘం అధ్వర్యంలో జరిగిన ఉగాది సమ్మేళనానికి రెవెన్యూ మంత్రి, శ్రీ వి బి రాజు అధ్యక్షత వహించారు

అన్ని వర్గాల సంస్థలు యీ వేడుకలను జరుపుకున్నారు దబీర్‌పురా, లకట్‌కోట, ఫతేవుల్లాబేగ్‌వాడ, సీతారాంపేట ఇంకా అనేక ముఖ్యప్రాంతాలలో అధికసంఖ్యలో ప్రజలు యీఉత్సవాలను జరిపారు

బాలాగంజ్‌లో జరిగిన ఉత్సవాలలో సినిమాతారలు సంధ్యారాణి, హరనాథ్ పాల్గొన్నారు యీ ఉత్సవాలకు రాష్ట్రదేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆర్ రామలింగరాజు అధ్యక్షత వహించారు డా॥ డి లక్ష్మీరాజ్‌వైద్య ప్రసంగిస్తూ యీ పండుగ ప్రాముఖ్యతను గూర్చి వివరించారు జనసుధార్ సమితిలో జరిగిన సమావేశానికి శాసన సభ్యులు శ్రీ బద్రీవిశాల్‌పిర్తీ, అధ్యక్షత వహించారు.

సికింద్రాబాదులోని అశోక యువజన సంఘం జరిపిన ఉత్సవాలలో శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రసంగిస్తూ సర్దార్ భగత్ సింగ్, ఝాన్సీరాణి, సుబాస్‌వంటి మహా నాయకులను ఆదర్శంగా స్వీకరించి వారి అడుగుజాడలలో నడవాలని యువకులకు ఉద్బోధించారు హైదరాబాదు పురపాలక సంఘం మేయరు శ్రీ కె కొండారెడ్డి, శ్రీ వేదప్రకాష్ దుసాజ్, శ్రీమతి సుశీలాదేవి, విద్యాలంకార్, శ్రీ విజయకుమార్ సిన్హా, శ్రీ యదువీర్ ప్రభృతులు ప్రసంగించారు జంట నగరాలలోని ప్రజలు ఉగాది ఉత్సవాలను అధికోత్సాహంతో జరుపుకున్నారు

గుంటూరులో

జనసంబంధశాఖ ఏప్రెల్ 29 న నిర్వహించిన ఉగాది వేడుకలకు అధ్యక్షత వహిస్తూ ఇక్కడి ఒక ట్యుటోరియల్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ సి.వి ఎన్ ధన్ బస్సురూట్లను జాతీయం చేసినందుకు ప్రభుత్వాన్ని అభినందించారు. వివిధ అభివృద్ధి పథకాలను అమలు పరచడంలో ప్రభుత్వంతో సహకరించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు ఆంధ్రప్రదేశ్ మాస్టర్ వీవర్స్ సంఘం అధ్యక్షులు శ్రీ టి శ్రీకంఠం, జనసంబంధశాఖ చేస్తున్న నిర్మాణాత్మక కృషిని అభినందించారు


ఉట్నూరులో

ఉట్నూరు పంచాయతీ సమితిలో ఉగాది ఉత్సవాలు జరిగాయి పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. సాయంకాలం హైస్కూలు గ్రౌండ్స్‌లో ఆటలపోటీలనుకూడా జరిపించారు

హస్నాబాదులో

హస్నాబాదు పంచాయతీ సమితిలో తెలుగు సంవత్సరాదిని వేడుకగా జరుపుకున్నారు ఈ ఉత్సవంలో పాఠశాల పిల్లలు పాల్గొన్నారు ఈ బ్లాకులో అభ్యుదయ రైతుగా పరిగణింప బడుతున్న శ్రీ వి చంద్రారెడ్డిని ఈసందర్భంలో సన్మానించారు

ఉగాది ఉత్సవాలు వైభవోపేతంగా జరిగినట్లు రాష్ట్రంలో యింకా పలు చోట్లనుండి వార్తలు వచ్చినవి



14 వ అ భా చేనేత వారోత్సవాలను మార్చి 3వ తేదీన జనసంబంధ, శ్రామిక మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రారంభించారు

14వ చేనేత వారోత్సవం

పధ్నాలుగవ చేనేత వారోత్సవం మార్చి మూడున హైదరాబాదులో అతి ఘనంగా ఆరంభమైంది. అలంకరించబడిన ఏనుగులు ముందు నడువగా ఆ వెనుక కళ్ళకు విందు చేకూర్చే మనోహరమైన ఊరేగింపు, పెద్ద బహిరంగ సభలను జరిపించారు ఈ ఉత్సవాలకు జనసంబంధ శ్రామిక మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రారంభోత్సవంచేశారు సమావేశానికి పరిశ్రమలమంత్రి శ్రీ బి వి. గురుమూర్తి అధ్యక్షత వహించారు చేనేతకార్మికుల అపెక్స్ సొసైటీ వద్ద అమ్మకాలకు ప్రణాళికామంత్రి శ్రీ కె. వి నారాయణరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. తమ ప్రారంభోపన్యాసంలో శ్రీ కొండా లక్ష్మణ్ ప్రభుత్వ సబ్సిడీమీదా, రిబేటు సహాయంమీదా చేనేతకార్మికులు

ఎక్కువగా ఆధారపడివున్న విషయాన్ని ప్రస్తావించారు ఈపరిశ్రమ తన కాళ్ళమీద తాను నిలబడగలగాలి, చేనేతకార్మికుల సహకార సంఘాలలో వున్న ఏలోపాన్నయినా చక్కటి కార్యకర్తలు, అధికార్ల పర్యవేక్షణలో తొలగించ వచ్చు" అని ఆయన అన్నారు ఆంధ్రుల చేనేత వస్త్రాలను బాగా ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు పశ్చిమరాజ్యాలకు, దూరప్రాచ్య దేశాలకు అమ్మకపు బృందాల్ని పంపించాలని ఉద్దేశిస్తున్నట్టు ప్రణాళికా మంత్రి తెలియజేశారు ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాల్లోని ప్రజలు ఆంధ్ర దేశపుచేనేత వస్త్రాలంటే,ముఖ్యంగా జరీ చీరలంటే విపరీతమైన మోజు చూపిస్తున్నారనీ ఆయన తెలియజేశారు జపాను పోటీ వల్ల మన మార్కెటు కొద్దిగా యిబ్బందిని ఎదుర్కో వలసివస్తున్నదని కూడా ఆయన చెప్పారు ఈపోటీని తట్టుకుని మనం నిలబడాలంటే ఉత్పత్తి ఖర్చు సాధ్యమైనంత తక్కువగా వుండేట్టు చూడాలి, వినియోగదారుల అభిరుచులను మనం దృష్టిలో పెట్టుకోవాలి అన్నారు.

తమ అధ్యక్షోపన్యాసంలో పరిశ్రమల మంత్రి శ్రీ బి.వి గురుమూర్తి మనరాష్ట్రంలో మూడులక్షల చేనేత కార్మికులు ఉన్నారనీ. యిది గాక వ్యవసాయ కార్మికులకు చేనేతపని తీరిక వేళల్లో చేపట్టే వృత్తిగా వున్నదనీ తెలియజేశారు. చేనేతకార్మికులకు విద్యుచ్ఛక్తితో నడిచే మగ్గాలు లాభసాటివని చెప్పారు ఆంధ్రుల చేనేత వస్త్రాలకు గిరాకీ పెరగాలంటే విదేశాలలోని భారతీయ దౌత్యకార్యాలయాల్లో ఫేషన్ పేరేడ్‌లను ఏర్పాటుచేయడం మంచిదని సూచించారు

కొయనాలోని విద్యాసంస్థలకు విరాళాలు

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి విజ్ఞప్తి

రాష్ట్ర విద్యాశాఖామంత్రి శ్రీ టి వి రాఘవులు దిగువ విజ్ఞప్తి చేశారు

"మన దేశంలో పడమటి తీరపు దిగువ భాగంలో యిటీవల సంభవించిన భయంకరమైన భూకంపాన్ని గూర్చి మీరు పత్రికల్లో చదివేవుంటారు. ఈ భూకంపంలో కొయనా నగరమూ, ఆ పరిసర గ్రామాలున బాగా దెబ్బతిన్నాయి 1895 ప్రాథమిక పాఠశాలలు ఈ భూకంపం బారికి గురై దెబ్బతిన్నాయనీ, 410 క్లాసురూములు పూర్తిగా కూలిపోయాయనీ, 5060 క్లాసురూములు బాగా పాడైపోయాయనీ వార్తలు తెలియజేస్తున్నాయి. వీటన్నిటినీ తిరిగి నిర్మించాలంటే సుమారు రూ 38 లక్షలు కావలసివుంటుంది ఇదేవిధంగా 135 సెకండరీ పాఠశాలలు యీ భూకంపానికి గురై దెబ్బతిన్నాయి. 16 క్లాసురూములు పూర్తిగా కూలిపోయాయి 770 క్లాసు రూములు బాగా పాడయ్యాయి వీటిని తిరిగి బాగు చేయాలంటే సుమారు రూ. 6 లక్షలు కావాల్సివుంటుంది దెబ్బతిన్న ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్ని తిరిగి బాగు చేయాలంటే మొత్తం రూ 44 లక్షలు కావాల్సి వుంటుంది.

భూకంపానికి తట్టుకోగలిగే ప్రత్యేకమయిన రూఫ్ డిజైన్లలో ఈ నిర్మాణం జరిపించాలని ఉద్దేశిస్తున్నారు ఈ పద్ధతిలో ఒక్కొక్క క్లాసు రూము నిర్మాణానికి సుమారుగా రూ. 6 600 లు వ్యయమవుతుందని అంచనా వేశారు చాల వరకు ఈ భవనాలన్నిటినీ విద్యార్థుల స్వచ్ఛందకృషిమీదనే ఆధారపడి నిర్మించాలని తలపెట్టారు. తిరిగి నిర్మించడానికి అయ్యే ఖర్చును విరాళంగా యిచ్చిన రాష్ట్రం పేరున. లేదా విశ్వవిద్యాలయం పేరున. లేదా విద్యాసంస్థపేరున ఆ భవనాన్నిపిలిచే ప్రతిపాదనకూడా ఒకటి వుంది

ఈ కృషిని మనం ఏవిధంగా చేపట్టాలో మీరు ఆలోచించగలరని యీ వివరాలన్నీ తెలియజేస్తున్నాను ఇలాంటి సందర్భాలలో దేశమంతా ముందుకువచ్చి భూకంపంవల్ల దెబ్బతిన్న ప్రాంతాలలోని దురదృష్టవంతులైన ప్రజలకు సహాయపడి జాతీయ సమైక్యతను ప్రకటించుకోవలసిన అవసరం ఎంతయినా వుంది

విద్యారంగంలో వున్నవారి బాధ్యత యీ సందర్భంలో మరింత ఎక్కువగా వున్నదని ఒకసారి గుర్తుచేస్తున్నాను

భూకంప బాధితులకు సహాయపడడానికి ముందుకు రావలసినదిగా మన రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు విజ్ఞప్తిచేస్తున్నాను. ఈ రాష్ట్రం కనీసం రూ 50 000 విరాళాలుగా సేకరించాలని ఉద్దేశిస్తున్నది ఎవరో కొద్దిమంది నుండి పెద్దమొత్తాలతో విరాళాలు సేకరించడంకన్న విద్యార్థుల నుండి, ఉపాధ్యాయులనుండి చిన్నచిన్న మొత్తాలలో సేకరించడం సమంజసమైనదని భావించబడుతున్నది దీనివల్ల ఎక్కువ మందివద్దకు జాతీయ సమైక్యతా సందేశాన్ని కొనిపోయే ఆస్కారం వుంది

ఈ విజ్ఞప్తిని మన్నించి ఉదారంగా మీరంతా తోడ్పడగలరనీ, మనరాష్ట్రం రూ 50,000 లను సేకరించగలదనీ, అవసరమైనప్పుడు దేశంలోని యితర ప్రాంతాలను ఆదుకోవడానికి మన రాష్ట్రం ముందంజవేయగలదనే విషయాన్ని నిరూపించుకో గలదని నేను విశ్వశిస్తున్నాను

ఈ నిధికి సంబంధించిన విరాళాలను చెక్కు రూపంలో గానీ. డ్రాఫ్ట్ రూపంలోగాని "విద్యాశాఖామంత్రి" మహారాష్ట్ర ప్రభుత్వం, సచివాలయ్, బొంబాయి-1" కు పంపించవచ్చు"

టోకియో లేఖలు

అల్లూరి వెంకటేశ్వర రావు

టోకియో,
20_11_63

చిరంజీవులయిన బాబులకు మీ నాయన దీవించి వ్రాయునది ఏమనగా_

జపాను దేశం పారిశ్రామికంగా చాల అభివృద్ధి చెందిన దేశము ఇక్కడ పరిశ్రమలను గూర్చి కొన్ని విషయాలను ఉత్తరంలో వ్రాస్తాను

అమెరికాకు జపాను టెలివిజన్లు

ఇక్కడ సోని కంపెనీ, టెలివిజన్లు, టేపురికార్డులు, రేడియోలు తయారు చేయుటలో అంతర్జాతీయ ప్రఖ్యాతి గడించింది ఆ ఫ్యాక్టరీ చూచుటకు కొన్ని రోజుల క్రితం వెళ్లితిని ఆ ఫ్యాక్టరీలో టెలివిజను సెట్టులు తయారు చేయు విభాగమునకు వెళ్ళితిని టెలివిజను అనగా రేడియో లాగు శబ్దంతోపాటు కళాకారులను గూడ మన ఇంటిలోనే చూచుటకు పనికివచ్చు పరికరము దీని సహాయం వలన ఇంటిలోనే సినిమాలు, డ్రామాలు మొదలయిన అనేక వినోద కార్యక్రమాలను చూచి ఆనందించ వచ్చును ఇప్పుడు ట్రాన్సిస్టరు టెలివిజను సెట్లను తయారు చేయుచున్నారు దీనిని కార్లోకూడ అమర్చవచ్చును. అనగా కారులో ప్రయాణము చేయునప్పుడు కూడ వినోదాలను చూడ వచ్చును అమెరికా దేశస్థులు ఈ ట్రాన్సిస్టరు టెలివిజను సెట్లను ఎక్కువగా కొనుచున్నారు

అత్యాధునిక వస్తువులు

ఇటీవలనే ఈ కంపెనీలో రంగు టెలివిజను సెట్లను కూడ చేయుచున్నారు. అనగా రంగు చిత్రాలను కూడా ఇంటిలోని సాధనంలో చూచి ఆనందించవచ్చును ఈ మధ్య రేడియో టేపు రికార్డరనుకూడ తయారుచేస్తున్నారు అనగా టేపు రికార్డులో పాటలను రికార్డు చేసినట్లుగా టెలివిజను ప్రోగ్రాంను కూడ ఇంటిలో రికార్డు చేసికొని అవసరం వచ్చినన్నిసార్లు పెట్టుకొని ఆనందించు సాధనము ఈ విధంగా ఈ ఫ్యాక్టరీలో అనేక ఆధునిక వస్తువులను ఉత్పత్తి చేస్తున్నారు

కార్మికుల్లో సగం మంది స్త్రీలే

ఈ ఫ్యాక్టరీలో సుమారు ఐదువేల మంది కార్మికులు పని చేస్తున్నారు ఇంతమంది కార్మికులు పనిచేయుచున్నప్పటికీ చాల నిశ్శబ్దంగా నుండును ఇక్కడ కార్మికులలో సగంమంది స్త్రీలే అందరు కార్మికులు ఫ్యాక్టరీలో పనిచేయునంత సేపు ఫ్యాక్టరీ దుస్తులనే ధరించవలెను అందువలన ప్రతికార్మికునికి ఫ్యాక్టరీలో బీరువాలో అరలు నిర్దేశించబడును అందులో ఫ్యాక్టరీ దుస్తులు, కాళ్ళ జోళ్లు మొదలయిన వస్తువులు ఉండును ఫ్యాక్టరీకి రాగానే వారి దుస్తులను విడచి ఫ్యాక్టరీ దుస్తులను ధరిస్తారు ఫ్యాక్టరీ మేనేజరు దగ్గరనుండి చిన్నపనివాని వరకు అందరూ ఒకేరకమైన దుస్తులను ధరిస్తారు

సాటిలేని టోకియో టవరు

అక్కడనుండి తిరిగి వచ్చు త్రోవలో పెద్ద టవరు ఎక్కి చూశాను. దానిని టోకియో టవరు అంటారు దీని ఎత్తు వెయ్యి అడుగులు ఇంత ఎత్తయిన టవరు ప్రపంచంలో మరెక్కడా లేదు దానిని టెలివిజను ప్రసారాలు జరుపుటకు ఉపయోగిస్తారు దీనిపైకి వెళ్లుటకు సాధనాలున్నవి పైనుండి టోకియో పట్టణ మంతయు చూడవచ్చును రోజుకు కొన్ని వేల మంది ఈ టవరు ఎక్కి దిగుతారు అంత ఎత్తునుండి చుట్టు ప్రక్కల దృశ్యాలను చూచిన ఒక వింత అనుభవము కలుగును

కెమేరాల ఉత్పత్తిలో అగ్రస్థానం

జపాను దేశం కెమేరాల ఉత్పత్తిలో అగ్రస్థానం ఆక్ర మించుకొన్నది. కెమేరాల ఉత్పత్తిచేయు కేనన్ ఫ్యాక్టరీని ఈ మధ్యనే చూచివచ్చాను ఇక్కడ సుమారు మూడువేల మంది కార్మికులు పనిచేస్తున్నారు వీరిలో సగం భాగం స్త్రీలే.

ఫ్యాక్టరీలోనికి వెళ్ళి ఉత్పత్తి విధానాన్ని చూచుటకు పూర్వం ఒక సినిమాద్వార ఉత్పత్తి విధానాలను చూపిస్తారు. సినిమా ద్వార ఉత్పత్తి విధానం విశదపరచుట వలన ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా

చూచునప్పుడు అన్ని విషయాలు సులభంగా అర్థమగును ఇక్కడ రోజుకు కొన్నివేల కెమేరాలు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఈ ఫ్యాక్టరీనుండి తిరిగి వచ్చునప్పుడు నిర్మాణంలో నున్న ఒక పెద్ద క్రీడా స్థలాన్ని చూచితిని. ఇచ్చట ఒక లక్షమంది ప్రేక్షకులు కూర్చుండుటకు ఏర్పాట్లు ఉన్నవి 1964 వ సంవత్సరం లో ప్రపంచ ఒలింపిక్ పోటీలు టోకియో పట్టణంలో జరుగును గాన ఇట్టి బ్రహ్మాండమయిన ఏర్పాట్లను చేయుచున్నారు ఒలింపిక్ సమయంలో వచ్చు వివిధ దేశ ప్రజలకు జపాను దేశాన్ని గూర్చి మంచి అభిప్రాయం కలుగుటకుగాను ఇక్కడ ప్రతి పౌరుడు తన శాయశక్తుల కృషి చేయుచున్నాడు అసలు ప్రతివారు ప్రపంచ పోటీలు జరుగునప్పుడు తొడుగుకొనుటకుగాను విలువైన దుస్తులను ఇప్పటినుండియే సిద్ధం చేస్తున్నారు

ముత్యాల పరిశ్రమ

ముత్యాలను తయారుచేయుట ఇక్కడ ఒక పెద్ద పరిశ్రమ సామాన్యంగా ఇక్కడ ముత్యాలు సముద్రపు అడుగుభాగంలో దొరకును కాని వీరు కృత్రిమంగా ముత్యాలను తయారుచేయు పద్ధతిని కనిపెట్టిరి ముత్యపు చిప్ప మూడు సంవత్సరాల వయస్సులో నుండునప్పుడు దానిని తెరచి దాని గర్భంలో కృత్రిమ ముత్యము యొక్క బీజమును ఉంచెదరు ఇది చాల నేర్పుతో కూడిన పని ఏమాత్రం అశ్రద్ధ జరిగినను ముత్యపు చిప్ప వృధా అయిపోవును ఇట్లు బీజమును ఉంచిన తరువాత ఆ ముత్యపు చిప్పను ఇనుప తీగలతో అల్లిన బుట్టలలో ఉంచి వాసపు బొంగు-తో తయారు చేసిన తెప్పలకు కట్టి సముద్రపు నీటిలో ఉంచుతారు ఈ తెప్పలు నీటిమీద తేలి ఉం-టచే వాటికి కట్టిన బుట్టలలోనున్న ముత్యపు చిప్పలు సముద్రపు నీటిలో ఉండును. సంవత్సరానికి అనేక పర్యాయములు ఈ బుట్టలను బయటకు తీసి ముత్యపు చిప్ప పై భగమును శుభ్రపరుస్తారు ఇట్లు ఆరు సంవత్సరాలు ఉన్న పిదప ముత్యపు చిప్పలను పగులగొట్టి ముత్యములను తీసి శుభ్ర పరుస్తారు ఈ ముత్యపు పరిశ్రమ మీద తీరపు ప్రాంతాంలో నివసించు ప్రజలలో చాల భాగము ఆధారపడియున్నారు. ఈ పరిశ్రమ వలన చాల విదేశ మారక ద్రవ్యంకూడ ఆర్జించుచున్నారు

పై ఉదహరించిన పరిశ్రమలే కాక అనేక ఇతర పరిశ్రమ లలో కూడ ఈ దేశం అగ్రస్థానము నాక్రమించినది ఇక్కడ ఉక్కు రసాయనిక పదార్థాల ఉత్పత్తిలో కూడ గణనీయమైన అభివృద్ధిని సాధించిరి ఇచ్చట పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలు లేనందున వాటిని ఇతర దేశాలనుండి దిగుమతి చేసుకొను చున్నారు. ఇక్కడ తయారయిన వస్తువులను ఇతర దేశాలకు అమ్మి ఆ డబ్బుతో ముడి పదార్థాలను దిగుమతి చేసుకొనుచున్నారు అందువలన ఈ దేశప్రజలు ప్రకృతి సహజమయిన అనేక ఆటంకములను జయించి, ప్రపంచంలో ఉత్తమ దేశంగా పేరు సంపాదించుకొన్నారు

ఇట్లు,
మీ ప్రియమయిన నాన్న

ఈ సంచికలోని రచయితలు

శ్రీ సి వి హెచ్, రావు, జర్నలిస్టు, హైదరాబాదు
శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి, సిద్ధాంతి, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, డిప్యూటీ డైరెక్టరు, విద్యాశాఖ కార్యాలయం, హైదరాబాదు,
శ్రీ పి శేషాద్రి, లెక్చరర్, న్యాయశాస్త్రకళాశాల, హైదరాబాదు.
శ్రీ ఎ. పండరినాథ్, ఉపాధ్యాయుడు, ఇబ్రహీంపట్నం.
శ్రీ ఆరెకపూడి కౌసల్యాదేవి, ఇన్నీసుపేట, రాజమండ్రి.
శ్రీ రావుల శ్రీరామ చంద్రమూర్తి, నరేంద్రపురం, రాజమండ్రి తాలూకా
కుమారి వాసిరెడ్డి సీతాదేవి, ప్రకాశ్‌నగర్, హైదరాబాదు.
శ్రీ పిలకా గణపతి శాస్త్రి, ఆంధ్రపత్రిక, మద్రాసు.
శ్రీ అట్లూరి వెంకటేశ్వరరావు, హైదరాబాదు.
శ్రీ ఎ సూర్యప్రకాశ్, నిజామాబాదు
శ్రీ మసూనా, విశాఖ పట్టణం.
శ్రీమతి నల్లంరెడ్డి సుచరిత, అరండల్‌పేట, గుంటూరు.
శ్రీ ఆళ్ళ రామ కోటేశ్వరరావు, సికింద్రాబాదు

ఆదర్శఘట్టాలు

ప్రభుత్వోద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

తమ విధినిర్వహణలో చొరవ, ప్రతిభా వ్యుత్పత్తులను ప్రదర్శించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు యిచ్చే పథకంక్రింద వివిధశాఖలు పంపిన ప్రతిపాదనలను, ప్రోత్సాహక బహుమతులసంఘం పరిశీలించి తమ సిఫార్సులను ప్రభుత్వానికి అందజేసింది ప్రభుత్వం యీ సిఫార్సులను జాగ్రత్తగా పరిశీలించి దిగువ విధంగా ఉత్తర్వులు జారీ చేసింది

1. ఆహారధాన్యాల దొంగరవాణాను నిరోధించటంలో వ్యక్తిగత ప్రమాదానికికూడా సరకుచేయక ధైర్యంతో తన విధి బాధ్యతలను నిర్వహించిన మెదకుజిల్లా, జహీరాబాదు డిప్యూటీ తహసిల్దార్ శ్రీ ఎన్ పర్వత రెడ్డికి పూర్వంనుండి అమలుకువచ్చేవిధంగా రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

2 తొర్రిగడ్డ పంపింగు పథకం అమలుజరపడంలో ఇతోధిక శ్రద్ధాసక్తులు కనబరచి ఉత్సాహంతో తమ బాధ్యతలను నిర్వహించిన తొర్రిగడ్డలో సూపరింటెండింగ్ ఇంజనీరు శ్రీ బి వి ఎస్. రామారావుకు రూ 500 ల రొక్కం బహుమతి ఇవ్వాలి

3 తమ విధి నిర్వహణతో ప్రభుత్వానికి కొన్ని లక్షల రూపాయలను ఆదా చేసినందుకు గుర్తింపుగా సూపరింటెండెంటెంగు ఇంజనీరు, టెక్నికల్ విద్యుచ్ఛక్తి శ్రీ ఎ రామచంద్రరావుకు రూ 1000 ల రొక్కం బహుమతి యివ్వాలి

4. గుంటూరుజిల్లా తెనాలి సబ్‌డివిజన్‌లో లోగడ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుగా పనిచేసి ప్రస్తుతం హైద్రాబాదులో సి ఐ డి శాఖలో ఉంటూ తనకు తీవ్రమైన గాయాలు తగిలినప్పటికీ ముఖ్యమంత్రికి ఎస్కార్టుగా ధైర్యసాహసాలతో విధి బాధ్యతలను నిర్వహించిన శ్రీ ఎ. వి. హనుమంతరెడ్డి సేవలకు గుర్తింపుగా ఆయనకు, పూర్వంనుండి అమలులోకి వచ్చేవిధంగా రెండు అడ్వాన్సు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

5. హైద్రాబాదులోని ప్రాంతీయ రవాణా సంస్థ కార్యాలయంలో 20 సంవత్సరాలనుండి పెండింగులో ఉన్న రికార్డులను ఒక్క సంవత్సరంలో పరిష్కృతం చేయడంలో చొరవతో కృషి చేసినందుకూ, 45,000 మోటారు వాహనాలకు చెందిన 'బి' రిజిష్టర్లను పరిశీలించడంలో ఉత్సాహంగా పనిచేసి పూర్తిచేసినందుకు, గుర్తింపుగా ఆ కార్యాలయంలోని యు. డి. సి. ఆర్. శ్రీనివాసులు రెడ్డికి నెలజీతానికి సమానమైన రొక్కం బహుమతి యివ్వాలి

6 ఉత్తమ ఫలితాలను సాధించినందుకు గుర్తింపుగా విశాఖపట్నంలోని జోనల్ ఆఫీసరు (మలేరియా) డా. బి. మహంతికి, పూర్వంనుండి అమలులోకి వచ్చేవిధంగా ఒక అడ్వాన్సు ఇంక్రిమెంటుగానీ రూ 500 గాని – ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని మంజూరు చేయాలి

దేశరక్షణ

రక్షా ప్రదర్శని

మద్రాసులో 1968 జనవరి 7 వ తేదీన బయలుదేరి మద్రాసు, కేరళలలో అనేక ముఖ్య రైల్వే స్టేషన్లలో ఆగుతూ 'రక్షా ప్రదర్శని' ప్రత్యేకరైలు ఆంధ్రప్రదేశ్‌కు 1968 ఏప్రిల్ 13 న రానున్నది

ఆంధ్రప్రదేశ్‌లో అది ఆగే స్టేషన్లు–ధర్మవరం, ద్రోణాచలం, కర్నూలుటౌన్, మహబూబ్‌నగర్, కాచిగుడా, నిజామాబాదు.

ఈ 'రక్షా ప్రదర్శని' ప్రకటనలు – దృశ్యశ్రవ్య ప్రచార డైరెక్టరేట్ కార్యాలయంవారు, రక్షణ మంత్రిత్వ శాఖ సహాయంతో ఏర్పాటు చేశారు రక్షణ విషయాలకు సంబంధించిన ప్రదర్శన యిది ఈ ప్రదర్శనను పదహారు బోగీలుగల సంచారక రైలులో ఏర్పాటు చేశారు ప్రదర్శనకు వీలుగా వుండేవిధంగా రైల్వేశాఖవారు ప్రత్యేకంగా యీ బోగీలను నిర్మించారు పది బోగీలను ప్రత్యేకంగా ప్రదర్శనకు కేటాయించారు ఈ పదింటిలోనూ ఎనిమిది బోగీలను 1962 చైనా దురాక్రమణానంతరం మనం జరిపిన రక్షణ కృషి సన్నాహాలకు సంబంధించిన ఫొటోగ్రాఫులు, రక్షణపరికరాలు, మొ॥ వాటి ప్రదర్శనకు కేటాయించారు. మిగతా రెండు బోగీలను, గత రెండు దశాబ్దాలుగా వివిధ రంగాలలో దేశం సాధించిన అభివృద్ధిని వ్యక్తం చేసే ప్రదర్శనకు కేటాయించారు

నిజమైన ఆయుధాలు, ఆయుధ సామగ్రి పరికరాలు మొదలైనవేగాక విమానాలు, ఓడలు, టేంకులు, కొండలమీద వేసే గుడారాలు, విమాన విధ్వంసక శతఘ్నులు మొదలైనవాటి మోడల్‌లను కూడా ఇందులో ప్రదర్శించారు. ఇంకా ఇటీవలి కాలంలో రక్షణ రంగంలో భారతదేశం చేస్తున్న కృషిని వ్యక్తం చేసే ఫొటోలు, మేప్‌లు, ఛార్టులు అనేకం యిందులో ప్రదర్శించారు

దక్షిణ భారతదేశ యాత్ర

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జనసంబంధశాఖ ఆధ్వర్యాన 1968 మే 16వ తేదీ నుంచి 16 రోజులపాటు రెండు వేర్వేరు మార్గాలలో దక్షిణ భారతదేశ యాత్ర నిర్వహించబడుతున్నది యాత్రికులు ప్రత్యేక బస్సులలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మైసూరు, కేరళ, మద్రాసు రాష్ట్రాలలోని ప్రాచీన దేవాలయాలు, ప్రసిద్ధ చారిత్రక ప్రదేశాలు, ప్రకృతి రామణీయకతతో విరాజిల్లుతున్న వేసవి విశ్రాంతి కేంద్రాలు, ప్రఖ్యాత ఉద్యానవనాలు ఆదిగాగల అనేక ఆకర్షణీయస్థలాలను సందర్శిస్తారు. రెండు పూటల భోజన వసతి సౌకర్యాలతో సహా యాత్రికుని ఒక్కంటికి (ఒక మార్గంలో) రూ 450లు మాత్రమే పన్నెండు సంవత్సరాలలోపు వయస్సుకల బాల బాలికలు ఈ యాత్రలో పాల్గొనడానికి అర్హులుకారు

మొదటి మార్గం :—

లేపాక్షి, నందికొండలు, బెంగుళూరు, శ్రీరంగపట్నం, బృందావనతోటలు, మైసూరు, ఉదకమండలం, ఎర్నాకుళం, కొచ్చిన్, తిరువనంతపురం, కన్యాకుమారి, మధుర, రామేశ్వరం, తంజావూరు, తిరుచినాపల్లి, పుదుచ్చేరి, మహాబలిపురం, మద్రాసు, కంచి, తిరుపతి, కాళహస్తి మొదలైనవి

రెండవ మార్గం :—

తుల్జాపూర్, షోలాపూరు, పండరీపురం, బీజాపూరు, బాదామి, జోగ్ జలపాతం, హంపి, తుంగభద్ర ఆనకట్ట, మంగుళూరు, కాలికట్, ఉదకమండలం, మైసూరు, బృందావనతోటలు, శ్రీరంగపట్నం శ్రావణ బెళగోళ, బెంగుళూరు, నందికొండలు, లేపాక్షి, హార్స్‌లీకొండలు, తిరుపతి మొదలైనవి

పై రెండు యాత్రలూ హైదరాబాదులో గాంధీభవన్‌కు ఎదురుగాగల జనసంబంధశాఖ కార్యాలయం నుంచి ఒకే సమయంలో ప్రారంభించబడుతాయి.

అతి మనోహరంగా సాక్షాత్కరించే అనేక ప్రదేశాలను తిలకించి, అధికంగా విజ్ఞానం సముపార్జించుకుని, అమితమైన ఆనందం పొందండి

పరిసర రాష్ట్రాలలో పర్యటించి, స్వజనులను కలుసుకుని పరస్పరావగాహనను పెంపొందించుకోండి.

పూర్తి వివరాలకు, సీట్ల రిజర్వేషనులకు ఈ దిగువ వారిని సంప్రదించండి

రాష్ట్ర యాత్రిక సమాచార కేంద్రం

ముఖరంజాహిరోడ్, హైదరాబాదు (ఫోను నెం 43281 & 43282)

జిల్లాలలో

జిల్లా జన సంబంధ అధికారులు, లేక బ్లాకు జన సంబంధ అధికారులు.

జన సంబంధశాఖ
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం.

సాహితీ సదనం

గ్రంథ సమీక్ష

కవితా పట్టాభిషిక్తులు
వ్యాసభారతి

(రెండు వ్యాస సంపుటులు)
రచన శ్రీ తేరాల సత్యనారాయణ శర్మ
ప్రచురణ విజయభారతి ప్రచురణలు, నల్లగొండ.
వెల ఒక్కొక్కటి నాలుగు రూపాయలు
ప్రతులకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం,
జిల్లాశాఖ, నల్లగొండ

కవితా పట్టాభిషిక్తులు అనే సంపుటిలోని వ్యాసాలన్నీ సాహిత్య సంబంధమైనవే నన్నయగారి పాత్రలు, స్థల పురాణ ప్రబంధ రీతులు, నాచనసోమన, ముక్కుతిమ్మన సత్యభామ, విజయవిలాస కవిత, కవయిత్రులు, భక్తి శృంగార శతకములు, శాకుంతలము మొదలగు విషయాలను గురించిన వ్యాసాలు వున్నవి ఈ గ్రంధమునకు "పరిచయము" రాస్తూ శ్రీ కోదాటి నారాయణ రావుగారు యిలా అన్నారు

"వివాదగ్రస్థములైన అంశాలపై తలపట్లు పట్టక, అభిమాన దురభిమానాలను పెట్టుకొని దూషణ భూషణలను చేయక ఆ యా మహారచనలలోని ఉత్తమాంశాలను అరటి పండొలిచి చేతిలో పెట్టినట్లు పాఠకులకు అందించాడు ఆయా కవుల కావ్యాల లోని గుణ విశేషాలను తెలిపి ఆంధ్రసాహిత్యంలో అభిరుచిని కలిగించుటకున్నూ, తద్వారా కావ్య పరిశీలనలో శ్రద్ధ పెంపొందించుటకునూ యీ వ్యాసాలు ప్రథమ పాఠాలుగా ఉపకరించగల వని నా అభిప్రాయము"

ఈ సారస్వత వ్యాసములు పరిశోధనాత్మకములనీ, వీటిలో రచయిత క్రొత్త విషయములను త్రవ్వి తీసినాడని ఊహించి చదువు వారికి ఆశాభంగం కలుగక తప్పదు రచయితకు కూడా అట్టి ఉద్దేశమున్నట్లు తోచదు. క్లాసులో పాఠం చెప్పేటప్పుడో, తాను స్వయంగా ఆయా కావ్యముల చూసినప్పుడో రచయితకు కలిగిన ఉత్సాహమే యీ వ్యాసరూపంలో బయలు పడింది. స్కూలుఫైనల్ పరీక్షల స్థాయిగలిగిన విద్యార్థులకూ, సాహిత్య రంగంతో పరిచయంలేని యితరులకూ, పరిచయకారులన్నట్లు ప్రథమ పాఠములుగా ఉపయోగపడతాయి. కొన్ని వ్యాసాలలో తగినంత పరిశీలన లేక, చదువుతుంటే హఠాత్తుగా ముగింపు చేసినట్లు కనిపిస్తుంది ఆయా కావ్యాలలోని అనేక ప్రసిద్ధ పద్యములు యీ వ్యాసములలో ఉదహరించబడినవి

రెండవ వ్యాసన పుటి 'వ్యాసభారతి'లో మొత్తము 36 వ్యాసములున్నవి వీటిలో ఒకటి రెండింటికి తప్ప సాహిత్య ప్రమేయము లేదు శ్రీశైలము, పోచంపాడు ప్రాజెక్టు, గ్రంథాలయ విజ్ఞానము, వార్తాపత్రికలు, చలనచిత్రములు, ఆరోగ్యము విద్యుచ్ఛక్తి - విషయములను గురించిన వ్యాసములు. పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థులు వీటిని చదువుకుని పోతే కొంతవరకు లాభపడవచ్చు చాలాభాగం పరీక్షా పత్రాలలో వ్యాసం ప్రశ్న క్రింద వచ్చే శీర్షికలనే యీ వ్యాసాలలో చర్చించారు

రెండు క్రొత్త సాహిత్య పత్రికలు :

సంవేదన. సంపాదకుడు శ్రీ రాచమల్లు రామచంద్రారెడ్డి
(త్రైమాసిక) ఏప్రిల్ 1968,
నిర్వహణ యుగసాహితి సంవేదన 19/78 మద్రాస్‌రోడ్
కడప వెల రు 1 25

కళాకేళి సంపాదకుడు. సోమసుందర్, కార్యాలయం, గాంధీనగర్, కాకినాడ వెల 0-50 పై.ఏప్రిల్ 1968 (మాసపత్రిక)

గత 50 సంవత్సరాల కాలంలో తెలుగులో వందల కొలది సాహిత్యపత్రికలు వచ్చివుంటాయి కాని భారతి తప్ప ఏ ఒక్కటీ పదికాలాలపాటు నిలబడలేక పోయింది ఆనాటికీ యీనాటికీ భారతి ఒక్కటే తెలుగుల ఏకైక సాహిత్యపత్రిక తెలుగువారిలో సాహిత్యాభిరుచి లేదని చెప్పడానికి వీల్లేదు, కాని ఒక సాహిత్య పత్రికను నిలుపుకోడానికి తగినంత సాహిత్య చైతన్యం లేదనే చెప్పాలి సాహిత్యాభిమానం కలవారు పత్రికలు చదువుతారు, కాని కొనరు దీనివల్ల క్రొత్తగా వెలువడిన పత్రికలు ఆర్థికంగా నిలబడలేక పోవడం జరుగుతుంది. ఈ విషయంలో యితర రాష్ట్రాలవారిని చూసి మనం నేర్చుకొనవలసింది ఎంతో వుంది

"సంవేదన" కవిత కంటే సాహిత్య విమర్శకు అంకితమైన పత్రికగా కనిపిస్తుంది 'సృజన' అనే సాహిత్య పత్రిక 6 వ సంచికను గురించి, శ్రీ కాళోజీ యిటీవల ప్రకటించిన 'జీవనగీత' అనే గ్రంథాన్ని గురించి చాలా ఘాటైన విమర్శలు వున్నాయి శ్రీ మహీధర రామమోహనరావుగారు రచించిన "కొల్లాయి గట్టితే నేమి" అనే చారిత్రక నవల గురించి విపులమైన విమర్శ చేయ బడింది, శ్రీయుతులు శ్రీశ్రీ, కె వి రమణారెడ్డి, వరవరరావు, అద్దేపల్లి రామమోహనరావు, వేగుంట మోహన్ ప్రసాద్, వి సి మౌళి ప్రభృతుల కవితలు, నలుగురు కథకులు రాసిన గొలుసు కథ మొదలగు ఆకర్షణలు వున్నాయి

లక్ష్యనిర్వచనంలో సంపాదకులు యిలా చెప్పుతున్నారు "సాహిత్యం వాస్తవ జీవితానికి ఎంతదూరంగా వుంటే అంతబాగా తెలుగు అభిరుచులకు నచ్చుతున్నది వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించడమూ, ఉత్తమ హృదయ సంస్కారానికి ప్రేరణ

యివ్వడమూ సాహిత్య లక్ష్యాలుగా చలామణి కావడంలేదు నిస్సారమూ, తరచు బాధాకరమూ అయిన జీవిత వాస్తవాన్ని విస్మరించడానికి - మద్యంలాగే-ఒక సాధనమైంది సాహిత్యం" ప్రజా జీవిత సమస్యలకు ప్రాధాన్య మిచ్చే సాహిత్య వ్యాసంగాన్ని సమర్థించడం యీ పత్రిక లక్ష్యమని దీనివల్ల స్పష్టమవుతున్నది సాహిత్యాభిమాను లందరూ తప్పక చదువ వలసిన పత్రిక

ప్రస్తుతం భారతిని మినహాయిస్తే సాహిత్యరంగానికి పరిమితమై కృషిచేస్తున్న రెండు త్రైమాసిక పత్రికలు-"నవత", "సృజన" మాత్రమే వున్నాయి ఇవి కూడా సరియైన ఆర్థిక పరిస్థితి లేక సతమతమవుతూనే వున్నాయి సాహిత్యాభిరుచిని విస్తృతంగా కలిగించాలంటే త్రైమాసిక పత్రికలు చాలవనే తలంపుతో ప్రఖ్యాత కవి శ్రీ సోమసుందర్ "కళాకేళి" అనే సాహిత్య మాస పత్రిక ప్రకటనకు పూనుకున్నారు

కళాకేళి ప్రథమ సంచికలో సర్వశ్రీ మిరియాల రామకృష్ణ, ఇస్మాయిల్, వరవరరావు, శీలా వీర్రాజు, నిఖిలేశ్వర్, వే నరసింహారెడ్డి, వేగుంట మోహన ప్రసాద్ ప్రభృతుల కవితలూ ప్రఖ్యాత ఆకాశవాణి కార్యక్రమ విమర్శకులు శ్రీ ఆర్ యం చల్లా రాసిన "రైనర్ మారియా రిల్కే" కవితా సమీక్షా వ్యాసం, "ఆధునిక కవిత్వంలో ఆంగ్లభాషా పదాడంబరం" అనే కుందుర్తి వ్యాసమూ వున్నాయి మొత్తంమీద చూస్తే, పత్రిక స్థాయి అనుకున్నంత ఆదర్శ వంతంగా లేదేమోననే సందేహం కలుగు తున్నది పత్రిక "గెటప్" బాగులేదు పత్రిక నిండా అచ్చుతప్పులు కొల్లలుగా వున్నాయి సాహిత్య పత్రికలో అచ్చు తప్పులుండడం క్షమార్హం కాదు. పత్రిక వెల అర్ధరూపాయి పెట్టడం కొంతవరకు ప్రజలలో దీని వ్యాప్తికి తోడ్పడుతుందేమో వేచి చూడవలసి వున్నది

సమర్పణ :

కథా సంకలనం ప్రచురణ జ్యోతిర్మయి,
సాహిత్య సాంస్కృతిక సమితి, వనపర్తి,
మహబూబ్‌నగర్ జిల్లా వెల రెండు రూపాయలు:
ప్రతులకు జ్యోతిర్మయి సంస్థ, వనపర్తి

అయిదు కథలుగల యీ కథా సంపుటి కీ శే దేవరకొండ బాలగంగాధర్ తిలక్‌కు అంకితం చేయబడింది డా అరిపిరాల విశ్వంగారు రాసిన "ఆముఖం"లో యీ కథలలోని విశేషాలను స్థూలంగా సూచించారు కథకులు శ్రీ వల్లపురెడ్డి (పరాజితులు) శ్రీ కాచిరాజు శేషగిరిరావు (మాయా మాళవగౌళ), నూగూరి శాంతాదేవి (సమర్పణ), శ్రీ ప్రభాకర్,"ప్రేమశ్రీ" (సమానాంతర రేఖలు), శ్రీ సి నాగేశ్వరరావు (ఒకటీ-రెండూల మధ్య)

"జ్యోతిర్మయి" వార్షిక సంచిక -1968.

ఇందులో సమితి ఆశయాలు, కార్యక్రమ నివేదికలతోపాటు అబల, అద్దంలో నీడ, హిస్టీరియా అనే కథానికలు, ఆశాగీతం, ఎవరు నీవు, ఉత్తరాలు వ్రాయలేను అనే కవితలు కే.శే బూర్గుల ను గురించి "జ్యోతిర్మయుడు" అనే వ్యాసమూవున్నాయి మామూలు వార్షిక నివేదికకూడా సాహిత్యస్థాయి కల్పించడానికి చేసిన ప్రయత్నం యీ చిన్న పుస్తకంలో ఫలించింది

శ్రీ రామలింగేశ్వర నక్షత్రమాల:

రచయిత - "రసప్రియ" శ్రీ రంగాపురం కేశవాచార్య బి ఎ
వెలవేదు

హైదరాబాదుజిల్లా మెడచల్ సమితిలోని కేసరగిరి (కీసర) శ్రీరామలింగేశ్వరస్వామిని గురించి చెప్పిన 27 పద్యముల చిన్న పుస్తకం యిది రచయిత మంచి ధారాశుద్ధి కలవాడు మచ్చునకు ధారాశుద్ధి, భక్తిభావము పెనవేసుకున్న ఒక పద్యము।

స్వామీ నీ వెటు మంచుకొండ పయి వా
సంబుంటి వో యెంతగా
నీమేనెట్లు చలిన్ భరించెనొగదా
నీకోసమై వెచ్చగా
ధామంబేర్పడ నిత్తు నా యెదలో
తంద్రీ వసింపంగదే
ప్రేమాంభోనిది కేసరాద్రినిలయా
శ్రీరామలింగేశ్వరా ।

స్వీకారం:

అపజయం(నవల), **కీలుబొమ్మ**(నవల);

కన్నడమూలం త్రివేణి అనువాదం శర్వాణి
వెల ఒక్కొక్కటి మూడు రూపాయలు
దేశీ ప్రచురణలు, విజయవాడ.

-- చైతన్య

మృత్యుంజయుడు

—ఏ. సూర్యప్రకాశ్

ఎక్కడో ఏదోపిట్ట వికృతంగా అరుస్తున్నది
కుక్క ఎందుకో గుక్కపట్టి ఏడుస్తున్నది
చుక్క తెగిపోయి నింగినుండి జారి నేలవేపు పయనిస్తున్నది
ఎక్కడి నుండో ఒక బల్లి నా నడినెత్తి మీద చెంగున దూకింది

మల్లెలను, వెన్నెలను పూర్తిగా అనుభవించలేదు
జీవితం మీద యింకా యావ చావలేదు
బ్రతుకు బాటలోని పల్లేరుకాయలను ఏరి పారేయడంలోనే యింతవరకు గడచింది
ఈ లోకం నుండి తీసుకున్నదానిలో సగమైనా తిరిగి ఇవ్వలేదు
తుది పయనానికి మూటా ముల్లే సర్దుకోనేలేదు
అప్పుడే పచ్చజెండా చూపిస్తున్నాడు గార్డు

సుడిగాలిలో ఎండుటాకులా కాయం గజగజ వణకుతున్నది
తుది పోరాటంలో ఆశ శాయశక్తులా పెనగులాడుతున్నది
కన్నీటిలో కాలుజారిపడి తల బొప్పి కట్టినా చేయూత నిచ్చి లేపేవారులేరు
కటిక చీకటిలో చిరుదివ్వె కాంతిరేఖ కనిపించటంలేదు
జీవితనావ తలక్రిందులయి వెల్లువలో ఊగులాడుతున్నది
పూచికపుల్లంత ఆధారం కోసం చుట్టూ చూస్తున్నాను
రంభా ఊర్వశులు గజ్జె కట్టే ఆ నాకం నా కక్కరలేదు
సుధలు లేకున్నా ఈ వసుధంటేనే నాకు ప్రాణం
ఇక్కడే ఇంకా ఏదీ సాధించలేదు
ఎక్కడో ఏదో జుఱ్ఱుకోవాలని అఱ్ఱులు సాచటం నాకిష్టంలేదు
మంచుముక్క వంటి మృత్యుభామ చల్లనిముద్దు నాకొద్దు

శ్మశానంలోలా ఈ నిశ్శబ్దం నన్నుచూచి కన్నులురుముతున్నది
మృత్యువు మాట్లాడలేదు
పైగా విరగబడి నవ్వుతున్నట్లున్నది
భగవాన్! మృత్యువు కళ్ళల్లో కళ్ళుపెట్టి అంతకంటే
గట్టిగా నవ్వగలిగే శక్తి ప్రసాదించు!

అరసవిల్లి సూర్యదేవాలయము

- మసూనా

సూర్యుడు ప్రత్యక్ష దైవం

పల్లెటూరి రైతూ, పట్నవాసపు కార్మికుడూ, పండితుడూ పామరుడూ, స్త్రీ పురుష వివక్షత లేకుండా అందరూ సూర్యునికి నమస్కరిస్తారు.

సూర్యోపాసన వేదకాలం నుండి ఆచారంగా వస్తున్నది సంధ్యావందనంలో అనేక మంత్రాలలో సూర్యుని స్తోత్రించడం జరుగుతుంది

పాప వినాశనానికీ, ఆయుర్భాగ్యానికీ, నూతన తేజస్సుకూ, నిత్యారోగ్యానికీ సూర్యుని అర్చిస్తారు.

ధర్మరాజు సూర్యదేవుని ఆరాధించి కోరిన భోజ్యాలిచ్చే అక్షయపాత్రను పొందేడు.

కృష్ణుని కుమారుడు సాంబుడు సూర్యుని అర్చించి కుష్టు రోగాన్ని పోగొట్టుకున్నాడు

మయూరుడను మహాకవి సూర్యుని ప్రార్థిస్తూ శతకంచెప్పి తన కుష్టువ్యాధి నివారణ చేసుకున్నాడు.

ఋగ్వేదంలో "రోగఘ్న ఉపనిషత్తు" ఉంది ఈ స్తోత్రాన్ని జపిస్తే సమస్త వ్యాధులూ, పాపాలు నివారిస్తాయని ప్రతీతి

ప్రసిద్ధ ఖగోళ శాస్త్రవేత్త, జోతిశ్శాస్త్ర పారంగతుడూ ఆయిన వరాహ మిహిరుడు సూర్యదేవుని భక్తుడు

పురాణేతిహాసాల్లో చాలచోట్ల సూర్యారాధన గురించి చెప్ప బడింది

రామాయణ మహాభారతాలలోనూ, మార్కండేయ, బ్రహ్మ, విష్ణు, అగ్ని, గరుడ, భవిష్య పురాణలలోనూ సూర్యార్చనగూర్చి తెలుపబడింది. 'సౌరసంహిత' సూర్యోపాసనకు సంబంధించిన సాహిత్యంలో ముఖ్యమైనది.

సూర్యుడు అందరికీ ప్రత్యక్షంగా దర్శనమిచ్చే దేవుడు కనుక భారత దేశంలో సూర్యదేవాలయాలు బహుకొద్దిగనే వున్నాయి.

ఒరిస్సాలోని కోణార్క దేవాలయము, ముల్తాన్‌లోని సూర్యదేవాలయము, కాశ్మీర్‌లోని మార్తాండాలయము, గుజరాత్ లోని మొధేరా దేవాలయము, గ్వాలియర్‌లోని సూర్యాలయమూ ఆటివి పై దేవాలయాలకు చెందినదే ఆంధ్ర దేశమందలి అరసవిల్లిలో సూర్యదేవాలయమున్నూ.

అరసవిల్లి దేవాలయం దేవేంద్రునిచే నిర్మింపబడినదని స్థలపురాణంచెప్తుంది

బలరాముడు తీర్థయాత్రలుచేస్తూ కళింగదేశ ప్రజలకోరిక ననుసరించి గంగను ప్రార్థించి తన ఆయుధమైన నాగలివెంబడిని తీసుకురావడం జరిగింది ఆ కారణంగా ఆ నదిని 'నాగావళి' అని పిలుస్తారు

"ఈ నది తూర్పు కనుమల్లో పుట్టి శ్రీకాకుళం దగ్గర కళ్లే పల్లి అనేచోట సముద్రంలో కలుస్తున్నది"

బలరాముడు నాగావళీ తీరాన పంచలింగ ప్రతిష్ఠచేసేడు కోటీశ్వరాలయం శ్రీకాకుళంలో స్థాపించడం జరిగింది కోటీశ్వర లింగ ప్రతిష్ఠకాలమున దేవత లందరినీ ఆహ్వానించగా దేవేంద్రుడు మాత్రం సుముహూర్తానికి రాలేకపోయాడట

దేవేంద్రుడు రుద్రకోటీశ్వరుని దర్శించడానికి రాత్రి అను కూలంగా వుంటుందని తలచేడు నంది ద్వారపాలకుడు కదా! దేవేంద్రుడు రాత్రివేళ బలాత్కారముగ లోన ప్రవేశించ సిద్ధ పడగా నందీశ్వరుడు అడ్డుకున్నాడు ఇరువురికీ యుద్ధం జరిగింది నందీశ్వరుడు కోపముతో దేవేంద్రుని గుండెపై తన్నేడు దేవేంద్రుడా దెబ్బకు క్రోసుదూరంలో అరసవిల్లివుండే ప్రదేశమందు స్పృహ తప్పి పడ్డాడు అప్పుడు కలలో సూర్యదేవుడు కనిపించి "నీవు పడివున్నచోటు త్రవ్వితే నామూర్తి దొరుకుతుంది దానిని ప్రతిష్ఠించి పూజిస్తే పూర్ణారోగ్యము పొందగలవు" అని చెప్పేడు

దేవేంద్రుడు సూర్య ప్రతిష్ఠచేసి ఆరోగ్యవంతుడై తన రాజ్యానికి వెళ్ళేడు

అరసవిల్లి సూర్య దేవాలయ ప్రతిష్ఠకు సంబంధించిన పురాణగాథయిది.

చరిత్రకు సంబంధించిన ఈ దేవాలయాన్ని 7 వ శతాబ్దిలో గాంగ వంశీయుడైన మహేంద్రవర్మ నిర్మించినట్లు శాసనములు చెప్తున్నవి.

ఆనాటినుండి 13 శతాబ్దాలుగా అరసవిల్లిలో సూర్యదేవాలయము దివ్యమహిమలతో ప్రజల పూజలందుకొంటూన్నది.

17 వ శతాబ్దములో ఉత్తర సర్కారులు మహమ్మదీయుల పాలనలోకి రావడంతో కొన్ని ఘోరాలు జరిగేయి.

మత దురహంకారులగు మహమ్మదీయ పాలకులు హిందూ దేవాలయాలను ధ్వంసం చేసేరు. ఆ దాడికి సూర్యనారాయణ మూర్తి ఆలయమూ గురి అయింది.

అయితే మూలవిగ్రహం మాత్రం సురక్షితమైవుంది. తరువాత మరికొంతకాలానికి దేవాలయము పునరుద్ధరింపబడింది.

మాఘశుద్ధ సప్తమి [రథసప్తమి] సూర్యదేవుని ఆరాధించే పర్వదినాల్లో ముఖ్యమైనది.

మాఘమాసపు ఆదివారాలూ తీర్థప్రజలతో అరసవిల్లి కోలాహలంగా వుంటుంది. మాఘమాసమే ఏమిటీ సంవత్సరం పొడుగున ఆదివారాలన్నిటా సూర్యదేవుని అర్చించడానికి భక్తులు వస్తూనే వుంటారు.

అరసవిల్లి చిన్న గ్రామము. ఇది శ్రీకాకుళం పట్టణానికి సుమారు రెండు మైళ్ల దూరంలో వుంటుంది. రేలు మీద వెళ్లే వారు శ్రీకాకుళం రోడ్డు (ఆముదాలవలస) స్టేషనులో దిగి శ్రీకాకుళం పట్టణానికి బస్సుమీద చేరుకోవాలి. అక్కడినుండి కాలినడకనో రిక్షాలోనో అరసవిల్లి చేరుకోవచ్చు.

"ఆరోగ్యం భాస్కరాధీనం"

దీర్ఘవ్యాధి పీడితులైన వారు విశ్వాసంతో అరసవిల్లిలోని సూర్యదేవుని అర్చిస్తే తప్పక సంపూర్ణారోగ్యం పొందగలరు.

పుణ్యం కోసమేకాక, ఆరోగ్యంకోసమూ అరసవిల్లి యాత్ర ఆంధ్రులందరికీ అత్యంత ప్రీతి పాత్ర మౌతుంది!

ముఖచిత్రం

నాగార్జునకొండకు శాసన సభ్యుల విహార యాత్ర


జనసంబంధశాఖ 1968 మార్చిలో నాగార్జున కొండకు శాసన సభ్యుల విహార యాత్రను ఒకదానిని ఏర్పాటు చేసింది.



విశ్రాంతిగృహానికి, కేంటీనుకు ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి

నాగార్జునకొండ ద్వీపంలో నిర్మించిన పురాతత్వశాఖవారి విశ్రాంతి గృహానికి, కేంటీనుకు మార్చి 16 న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర జనసంబంధ, శ్రామిక మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ అధ్యక్షత వహించారు. ఈ ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారిలో సహకారమంత్రి శ్రీ కె. విజయభాస్కరరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి శ్రీ అరిగె రామస్వామి యింకా శాసనసభ, శాసనమండలి సభ్యులు అనేకులు వున్నారు.


17 వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖామంత్రితోపాటు శాసనసభసభ్యులు లాంచీలలో రిజర్వాయరును సందర్శించారు. ఈ ప్రాంతంలో యాత్రికులకు ఆసక్తి కలిగించే వివిధప్రదేశాలను పరిశీలించారు. రిజర్వాయరు వైపునుండి ఆనకట్టను కూడా సందర్శించి, యింతవరకు జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను తిలకించారు. ఐక్యరాజ్యసమితి వర్తక వాణిజ్య అభివృద్ధి మండలి ప్రతినిధులుకూడా యాత్రలో పాల్గొన్నారు. అంతా రిజర్వాయరును, ఆనకట్టను సందర్శించారు. తిరిగి ద్వీపానికి కలిసి లాంచీలలో వచ్చిన పిదప మధ్యాహ్నం జనసంబంధశాఖ విశ్రాంతి గృహానికి విధానసభ స్పీకరు శ్రీ బి. వి. సుబ్బారెడ్డి ప్రారంభోత్సవం చేశారు.



లాంచీలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్న దృశ్యం

చిత్రసీమ

చలనచిత్ర బహూమతి ప్రధానోత్సవం



ముఖ్యమంత్రి వద్దనుండి బంగారునంది బహుమతిని అందుకుంటున్న శ్రీ అక్కినేని, శ్రీ ఆదుర్తి

చలనచిత్ర బహుమతుల ప్రదానోత్సవం 1968 మార్చి 29న ఉగాది నాడు రవీంద్ర భారతిలో వైభవంగా జరిగింది ఈ ఉత్సవానికి రాష్ట్ర జన సంబంధ శ్రామిక శాఖా మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అధ్యక్షత వహించారు. ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి బహుమతులను పంచిపెట్టారు.


1967 సంవత్సరానికి ఆంధ్ర ప్రదేశ్ బంగారు నంది బహుమతి, చక్రవర్తి చిత్రవారి 'సుడిగుండాలు' చిత్ర నిర్మాతలైన శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ ఆదుర్తి సుబ్బారావు గార్లకు లభించింది. ప్రథమ బహుమతిగా 10,000లను వీరికి యివ్వడం జరిగింది ఇదిగాక ఉత్తమచిత్ర దర్శకుడిగా రూ 4,000లు నగదు బహుమతి కూడా శ్రీ ఆదుర్తి సుబ్బారావుకు లభించింది. ఈ చిత్రంలో నటించిన మాస్టర్ రాజా, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, కుమారి సుకన్యలకు చిత్రఫలకాలు బహూకరించబడ్డాయి.



చిత్ర ఫలకాన్ని అందుకుంటున్న మాస్టర్ రాజా

ఎస్. వి. ఆర్. ఫిల్మ్సవారి 'చదరంగం' చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ రజిత నంది బహుమతి లభించింది. నిర్మాత శ్రీ వి. సత్యనారాయణకు ఈ బహుమతి అందజేయబడింది. నగదు బహుమతిగా రూ 3,000లు వీరికి బహూకరించారు. ఈ చిత్ర దర్శకుడు శ్రీ ఎస్. వి. రంగారావుకు రూ 1,000లు బహూకరించారు. ఈ చిత్రంలో నటించిన శ్రీ హరనాథ్, శ్రీమతి జమున, శ్రీమతి అంజలీదేవిలకు చిత్ర ఫలకాలు బహూకరించారు.


ఎ. వి. ఎం. ప్రొడక్షన్ వారి 'భక్త ప్రహ్లాద'కు ఆంధ్ర ప్రదేశ్ కాంస్య నంది, రూ 1000లు నగదును బహూకరించారు. దర్శకుడు శ్రీ సి. హెచ్. నారాయణమూర్తికి రూ 600 నగదు బహుమతి అందజేయబడింది. ఈ చిత్రంలో నటించిన శ్రీ ఎస్. వి. రంగారావు, శ్రీమతి అంజలీదేవి, బేబీ రోజారాణిలకు చిత్ర ఫలకాలు బహూకరించబడ్డాయి.



ఉత్తమ కథా రచనకు శ్రీ డి. వి. నరసరాజు బహుమతిని అందుకుంటున్న దృశ్యం

ఉత్తమ కథా రచయితగా చదరంగం కథా రచయిత శ్రీ డి. వి. నరసరాజుకు రూ 1000 నగదు బహుమతి అందజేయ

బడ్డది. పూలరంగడు కథా రచయిత శ్రీ ముళ్ళపూడి వెంకటరమణకు రూ 500లు నగదు బహుమతి అందజేయడం జరిగింది. వీరికి పురస్కార చిత్రఫలకాలు కూడా బహూకరించారు.



జనసంబంధ శాఖ సంచాలకుడు శ్రీ బి. ఎస్. రామన్ సభికులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మొదట జనసంబంధశాఖ సంచాలకుడు శ్రీ బి.ఎస్. రామన్ సభికులకు స్వాగతం పలుకుతూ హైదరాబాదులో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలనుగూర్చి వివరించారు. ఏటా ఉత్తమ చిత్రాలకు బహుమతులను ఇవ్వడం అట్టి చర్యలలో ఒకటిగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో స్టూడియో పరికరాలకై విదేశీ మారకాన్ని విడుదల చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు కేంద్రం అంగీకరించినట్లు ఆయన తెలియజేశారు.

బహుమతి గ్రహీతలను ముఖ్యమంత్రి అభినందించారు. బహుమతులకు అర్హమైనవిగా ఉత్తమ చిత్రాలను ఎన్నిక చేయడంలో ప్రభుత్వం ఉన్నత ప్రమాణాలు, విలువలను దృష్టిలో పెట్టుకున్నట్లు పేర్కొన్నారు

శ్రీ బి.వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పడిన న్యాయనిర్ణేతల సంఘం సిఫారసుల నన్నిటినీ ప్రభుత్వం అంగీకరించిందని ముఖ్యమంత్రి తెలియజేశారు.

భవిష్యత్తులో హైదరాబాదులో చలనచిత్ర పరిశ్రమ ఆశాజనకంగా వుండగలదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంలో జనసంబంధ శ్రామిక మంత్రి కృషిని ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి మరింతగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోగలదని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ప్రభుత్వం ఒక క్రొత్త పథకాన్నిగూర్చి ఆలోచిస్తోందనీ, ఈ పథకం క్రింద జనసంబంధశాఖ ఉత్తమమైన కథాచిత్రాలను కొనుగోలుచేసి, వాటిని 16 మి. మి ల క్రింద మార్చి వాటిని డాక్యుమెంటరీ చిత్రాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాలలో ప్రదర్శించడం జరుగుతుందని ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించిన జనసంబంధ శ్రామికమంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు.



బహుమతి ప్రదానోత్సవానికి అధ్యక్షత వహించిన జనసంబంధ శ్రామికమంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ ప్రసంగిస్తున్న దృశ్యం

సర్వశ్రీ అక్కినేని నాగేశ్వరరావు, ఎస్ వి రంగారావు, బి. సత్యనారాయణ, ఆదుర్తి సుబ్బారావు, డి. వి. నరసరాజు, గుమ్మడి, శ్రీమతి జమున ఈ సందర్భంలో ప్రసంగిస్తూ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం ఆసక్తితో పూనుకుంటున్నందుకు ప్రభుత్వాన్ని అభినందించారు.

జనసంబంధశాఖ డిప్యూటీ డైరెక్టరు (ఫిల్మ్స్) శ్రీ వి. వి. మాణిక్యాలరావు వందన సమర్పణ చేశారు.

క్రీడారంగం

జైరాజ్




నిజాం గోల్డ్ కప్‌ను గెలుచుకున్న ఆంధ్రప్రదేశ్ పోలీసుజట్టు నాయకుడు యూసఫ్‌ఖాన్, రెవెన్యూమంత్రి శ్రీ పి. వి. రాజు వద్దనుండి కప్పును అందుకుంటున్న దృశ్యం

ఆంధ్ర ప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం అధ్వర్యంలో హైదరాబాదులో మార్చి ప్రారంభంలో జరిగిన అఖిలభారత నిజాం గోల్డ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంటులో ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టు గెలుపొందింది. పోలీసు జట్టు మద్రాసు జట్టును ఒకే ఒక గోల్ ఆధిక్యంతో ఓడించింది. ఇన్‌సైడ్ లెఫ్ట్ ఫరీద్ దీనిని నేర్పుగా సాధించాడు. పోలీసు జట్టులోని సెంట్రల్ ఫార్వర్డ్ సత్యనారాయణ చక్కని ఆట ప్రదర్శించాడు. విజేతలకు లభించిన ఏకైక గోలు ఆట విరామ సమయానికి అయిదు నిమిషాలు ముందుగా జరిగింది.

ఈ టోర్నమెంటులో 18 జట్లు పాల్గొన్నాయి. వీటిలో 4 జట్లు రాజధాని బయటినుంచి వచ్చాయి. ఒక క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖపట్నం జిల్లా జట్టు ఆంధ్ర ప్రదేశ్ పోలీసు జట్టుతో ఓడిపోగా మరో క్వార్టర్ ఫైనల్స్‌లో హైద్రాబాదు టెలిఫోన్స్ జట్టు 39వ గూర్ఖా ట్రైనింగ్ సెంటర్ (డేరాడూన్) జట్టును ఓడించింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో బెంగుళూరు జట్టు హైద్రాబాదు సెంట్రల్ పోలీసు జట్టును ఓడించగా, మద్రాసు జట్టు సౌత్ సెంట్రల్ రైల్వే జట్టుపై విజయం పొందింది. ఒక సెమీ ఫైనల్స్‌లో మద్రాసు, బెంగుళూరు జట్లకు మధ్య జరిగిన మొదటి మ్యాచ్ డ్రా కాగా రెండవ మ్యాచ్‌లో మద్రాసు గెలుపొందింది. మరో సెమీ ఫైనల్స్‌లో ఆంధ్ర ప్రదేశ్ పోలీసు జట్టు హైదరాబాదు టెలిఫోన్స్ జట్టును ఓడించింది.

హాకీ

గత నెలలో హైద్రాబాదు నగరంలో గుజరాత్ హాకీ జట్టుకూ, హైద్రాబాదు హాకీ సంఘం జట్టుకూ మధ్య ఎగ్జిబిషన్ మ్యాచ్ జరిగింది. గుజరాత్ రాష్ట్రంలో ఈ జాతీయ క్రీడలో ప్రమాణాలను పెంపొందించడానికి వీలుగా రాష్ట్రంలో మంచి జట్టును తయారుచేసి దేశంలో, వివిధ రాష్ట్రాలకు పర్యటనార్థం పంపడానికై గుజరాత్ హాకీ సంఘానికి ఆ రాష్ట్రపు క్రీడా వ్యవహారాల మండలి రు. 9,000 ల గ్రాంటు యిచ్చింది. ఈ జట్టు




లాల్ బహదూర్ స్టేడియంలో ఫిబ్రవరి 16న రాష్ట్రీ స్పోర్ట్ అండ్ గేమ్స్ నాలుగవ పోటీలకు విధాన సభ ఛైర్మన్ శ్రీ జి. బ్రహ్మయ్య ప్రారంభోత్సవం చేశారు

బొంబాయి, పూనా, హైద్రాబాదు, నాగ్‌పూర్, భిలాయ్, మద్రాసు, బెంగుళూరు తదితర ప్రదేశాలలో పర్యటించింది. గుజరాత్ క్రీడా వ్యవహారాల మండలి, యితర రాష్ట్రాలలో క్రీడా మండలులకు క్రొత్తదారి చూపించింది. జాతీయ ఛాంపియన్ షిప్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న హైద్రాబాదు హాకీ సంఘం జట్టు, గుజరాత్ జట్టుపై తన ఆధిక్యాన్ని స్పష్టంగా నిరూపించుకున్నది.

(తరువాయి 87వ పుటలో)

నగరంలో విశేషాలు



జన సంబంధ, కార్మిక మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ మార్చి 4న హైదరాబాదులో 'సన్నిన్ డే' కు ప్రారంభోత్సవం చేశారు. పార్లమెంటు సభ్యులు శ్రీ అక్బర్ అలీ ఖాన్ అధ్యక్షత వహించారు




మార్చి 29న ద్రాక్ష చెంపకందార్ల సదస్సు సందర్భంలో ద్రాక్షపండ్ల ప్రదర్శనను శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.



శ్రీ చదలవాడ పిచ్చయ్య వ్రాసిన 'మానవుడు-మానవ సంఘము' గ్రంథం మార్చి 1వ తేదీన గాంధీ భవన్‌లో ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డికి అంకిత మివ్వబడింది. ఈ ఉత్సవానికి ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. జగన్మోహన రెడ్డి అధ్యక్షత వహించారు



హైదరాబాదులో మార్చి 9వ తేదీనుండి 15వ తేదీవరకు బెంగాలీ నాటకాల్ని ప్రదర్శించిన శ్రీ శంభుమిత్ర, మార్చి 7వ తేదీన పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేసినప్పటి చిత్రం



రాజధాని నగరంలో ఆంధ్రకేసరి విగ్రహ ప్రతిష్ఠ

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారి నిలువెత్తు విగ్రహాన్ని లోకసభా స్పీకర్ శ్రీ నీలం సంజీవరెడ్డి మార్చి 25వ తేదీన హైదరాబాదులో ఆవిష్కరించారు. రాష్ట్ర శాసన సభకు ఎదురుగా మూడు రోడ్ల కూడలిలో ఈ విగ్రహాన్ని నెలకొల్పారు.

శ్రీ సంజీవరెడ్డి మాట్లాడుతూ తాను విద్యార్థిగా వున్నప్పటినించే ప్రకాశంగారి ప్రసంగాలు వింటుండే వాడినని అన్నారు. ప్రకాశంగారి మనసు అతి స్వచ్ఛమైనది. ఆయన ఎవరినీ ద్వేషించడం ఎరుగరు. అభిప్రాయభేదాలు వున్నా ఎదుటివారిని గౌరవించే వ్యక్తి ఆయన- అన్నారు శ్రీ నీలం సంజీవరెడ్డి.

రాష్ట్రం 13 సంవత్సరాలలో సాధించలేక పోయిన దానిని ప్రకాశం గారు ముఖ్యమంత్రిగా వున్న 13 నెలల లోనూ సాధించ గలిగారనీ, అధికారికమైన లాంఛనాలంటే ఆయనకు నచ్చవనీ, కృష్ణా బేరేజి విషయంలో ప్రకాశంగారు 'ప్రజలకు మంచి జరిగేపని చేస్తున్నప్పుడు ముందుగా లాంఛనం ప్రకారం అనుమతి అక్కర్లేదని' అన్నారనీ, ఆ విధంగా బేరేజి ఏర్పాటైందనీ శ్రీ సంజీవరెడ్డి తెలియజేశారు.

ప్రజల నాయకుడు

ఈ ఆవిష్కరణోత్సవానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం గారు ప్రజల నాయకుడనీ; త్యాగంలోనూ, దేశాభిమానాన్ని ప్రకటించడంలోనూ, ధైర్యంలోనూ ఆయనకు ఆయనే సాటి అనీ అన్నారు

తాను యింకా యువకుడిగా వున్నప్పుడే ప్రకాశం గారు ఏ విధంగా తనను గుర్తించినదీ, గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షునిగా చేసినదీ ముఖ్యమంత్రి తెలియజేశారు. మద్రాసు ముఖ్యమంత్రి శ్రీ అన్నాదురై మద్రాసులో ప్రకాశంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆలోచించడం తనకు సంతోషాన్ని కలిగించిందనీ, బ్రిటిష్ ప్రభుత్వం రోజుల్లో ప్రకాశంగారు పోలీసుల తుపాకులకు అతి ధైర్యంగా తన ఛాతిని ఎదురొడ్డిన ప్రాంతంలో ఈ విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతయినా సమంజసంగా వుంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

ప్రకాశంగారి విగ్రహాన్ని చేసిన శిల్పి శ్రీ రాజారామ్ నాగప్పను ముఖ్యమంత్రి సభికులకు పరిచయం చేశారు.

దేశానికి గాంధీజీ ఎలాగో ఆంధ్ర దేశానికి ప్రకాశం గారు అలాగని శాసనమండలి అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య తెలియజేశారు. త్యాగము, శౌర్యము మూర్తీభవించిన ప్రకాశంగారి పేరు వినడంతోనే ఆంధ్రప్రజల హృదయాలు పులకరించడంలో ఆశ్చర్యపడాల్సినది ఏమీ లేదని అన్నారు.

ప్రకాశంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచి పనుల్లో ఒకటిగా స్వతంత్ర పార్టీ నాయకుడు శ్రీ గౌతు లచ్చన్న వ్యక్తం చేశారు. ప్రకాశం చరిత్రే ఆంధ్ర దేశ చరిత్ర అని ఆయన అన్నారు.

ఆలస్యంగానైనా మొత్తంమీద నగరంలో ప్రకాశంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం తనకు ఆనందంగా వున్నదని పార్లమెంటు సభ్యులు శ్రీ తెన్నేటి పేర్కొన్నారు. భాషాప్రాతిపదికగా కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు పరోక్షంగా కారకులు పొట్టి శ్రీరాములుగారని, అందుకని వారి విగ్రహాలను అన్ని రాష్ట్రాలలోనూ నెలకొల్పబడగలవని తాను విశ్వసిస్తున్నాననీ ఆయన అన్నారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైన సమయంలోనే ప్రకాశం గారు కాంగ్రెసునుంచి విడిపోయినప్పటికీ రాష్ట్ర ప్రజలను ఆయనగానీ, ఆయనను రాష్ట్రప్రజలుగానీ విడిచి పెట్టలేదనీ అన్నారు

ప్రకాశంగారి చరిత్ర గొప్ప చరిత్ర అనీ, అదొక ఉజ్వలమైన చరిత్ర అనీ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నం అన్నారు.

ఈ ఆవిష్కరణోత్సవానికి వేలాది ప్రజలు విచ్చేసారు. ఇంచుమించు అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు

సభికులకు నగర మేయరు శ్రీ కొండారెడ్డి స్వాగతం పలికారు

పురపాలక సంఘాలకు ముఖ్యమంత్రి సూచన

ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మార్చి 24న హైదరాబాదులో ఆంధ్ర ప్రదేశ్ పురపాలక సంఘాధ్యక్షుల ఛాంబర్ 12వ సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు పురపాలక సంఘాలు తమ ఆదాయ వనరులను మెరుగుపరచుకోవాలని, పౌరులకు మరిన్ని సౌకర్యాలను కలిగించాలని, అనవసరపు ఖర్చును తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి తెలియజేశారు కేవలం అలంకార ప్రాయంగా పురపాలక సంఘాలు వుండకూడదనీ, పౌరులకు సేవ చేయడంలో శక్తివంతమైన వ్యవస్థలుగా వుండాలని కూడా ఆయన అన్నారు

పురపాలక సంఘాల ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించవల్సిన అవసరం వుందనీ, మంచినీటి సరఫరా లాభసాటిగా కాకున్నా కనీసం నష్టంలేకుండా దాని డబ్బు దానికి వచ్చే పద్ధతిలో పని చేయాలనీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు మురికి ప్రాంతాల నిర్మూలనాన్ని గురించి ముఖ్యమంత్రి తెలియజేస్తూ, మురికి ప్రాంతాల నిర్మూలన సాధ్యం కాకపోతే కనీసం మురికి ప్రాంతాలు అభివృద్ధి చెందడమైనా జరగాలనీ, మురికి ప్రాంతాల్లో భవనాలు కట్టడంతో అది అభివృద్ధి చెందినట్టు లెక్క కాదనీ, ఆ ప్రాంతం శుభ్రంగా వుండి చక్కటి పారిశుధ్య సౌకర్యం, మంచినీటి సౌకర్యం, రాకపోకల సౌకర్యం కలిగివున్నప్పుడే అభివృద్ధి చెందినట్టనీ అన్నారు

పన్నుల వసూళ్ళను గురించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. వృత్తి పన్ను వసూలును మెరుగు పరచవచ్చనీ, ఆస్తిపన్నును సకాలంలో కట్టిన వాళ్ళకు రిబేటు యిస్తే బావుంటుందేమో పురపాలక సంఘాలు ఆలోచించాలనీ ఆయన అన్నారు

అంతకు ముందు ముఖ్యమంత్రి, లోగడ పురపాలక విషయాల నిర్వహణశాఖా మంత్రిగా పనిచేసిన స్వర్గీయ ఆలపాటి వెంకట్రామయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించారు ఛాంబర్ అధ్యక్షుడు శ్రీ ముప్పన రామారావు ముఖ్యమంత్రికి, సమావేశానికి అధ్యక్షత వహించిన పురపాలక విషయాల నిర్వహణ మంత్రి శ్రీ ఎన్ చెంచు రామానాయుడుకు స్వాగతం పలికారు.

హైదరాబాదు మేయరు శ్రీ కె కొండారెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘాల ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి ధైర్యంగా ఏవైనా చర్యలు తీసుకుంటేనే తప్ప యీ సమస్య తొలగిపోదని అన్నారు ప్రస్తుతం పురపాలక సంఘాలకు వున్న ఆర్థిక వనరులు పౌరులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చాలవని తెలియజేశారు

ఉస్మానియా ఆసుపత్రిలో కాల్పులవార్డుకు శంకుస్థాపన

ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో మార్చి 27న 'కాల్పుల వార్డు'కు ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి వి నరసింహారావు శంకుస్థాపన చేశారు ఈ వార్డు నిర్మాణానికి రూ. 1 25,000ల చెక్కును శ్రీ అబ్దుల్ ఖాదర్ జహీద్ రజ్వీ మంత్రికి అందజేశారు

శ్రీ రజ్వీ సహాయానికి ఆరోగ్యమంత్రి కృతజ్ఞతలు తెలుపుతూ, ఉస్మానియా ఆసుపత్రి ప్రధానమైన ఆసుపత్రిగా రూపొందగలదని పేర్కొన్నారు ఈ విరాళాన్ని యిచ్చిన దాత శ్రీ రజ్వీ అనారోగ్య కారణాలవల్ల యీ శంకుస్థాపన ఉత్సవానికి హాజరు కాలేని కారణంచేత, లోగడ ఆరోగ్యశాఖ డైరెక్టరుగా పనిచేసిన డా॥ ఎ టి ఎం అబ్దుల్ ఖాదర్ ఈ చెక్కును ఆరోగ్యశాఖా మంత్రికి అందజేశారు.

తమ మతంవారి నుంచీ ప్రాంతంవారి నుంచీ విరాళాలకై అభ్యర్థనలు వచ్చినా శ్రీ రజ్వీ వాటి వత్తిడులకు లొంగిపోక సార్వజనీక ప్రయోజనాయుతమైన ఉత్తమ లక్ష్యానికి విరాళ మిచ్చారని శ్రీ జహీర్ అహమ్మద్ తెలియజేశారు. ఒక మధ్య తరగతి వ్యక్తి యీ విరాళాన్ని యివ్వడం నిజంగా గర్వించదగ్గ విషయమని శ్రీ అక్బర్ అలీఖాన్ అన్నారు

బయటిరోగుల వార్డుకు ఎదురుగా యీ కొత్త వార్డు నిర్మింపబడుతుంది దీనిని అగ్ని ప్రమాదాలకు గురై-శరీరం కాలినవారి చికిత్సకు యీ కొత్త వార్డును ఉపయోగిస్తారు

మలక్‌పేటలో హౌసింగ్‌కాలనీ

మలక్‌పేటలో మార్చి 31న సహకారనగర్ హౌసింగ్ సొసైటివారి 'బ్రహ్మానందనగర్'కు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

ఆంధ్ర ప్రదేశ్‌లోనే యిది పెద్ద సహకార గృహ నిర్మాణ సంఘం బహుశా దక్షిణాదిలోనే యిది పెద్ద స్వంత గృహ నిర్మాణ సహకార సంఘం

హాస్టలు భవనం

హైదరాబాదులోని కమలా నెహ్రూ బాలికల పాలిటెక్నిక్ నిమిత్తం ఒక హాస్టలు భవనాన్ని నిర్మించేందుకు భారత ప్రభుత్వమంజూరీ లభించింది త్వరలోనే నిర్మాణపు పని ప్రారంభమౌతుంది దీనికి రూ 5,62 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా

జిల్లాలనుంచి

కరీంనగర్ ఎక్స్ఛేంజిలో కొత్తగా మరికొన్ని టెలిఫోన్ లైనులు

ఆంధ్ర సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ మార్చి 28వ తేదీన కరీంనగర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజిలో మూడవ నాన్ మల్టిపుల్ 100 లైన్ల టెలిఫోన్ బోర్డుకు ప్రారంభోత్సవంచేశారు.

కాటారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


కరీంనగర్ జిల్లాలోని మహదేవపూర్ పంచాయతీ సమితి ప్రాంతంలో మారుమూల గ్రామమైన కాటారం గ్రామంలో ఫిబ్రవరి నెలలో ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

గార్లపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. కె. రెడ్డి మార్చి 26 న గార్లపాడు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.

నేలకొండ పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

నేలకొండపల్లిలో రూ 40,000 ల ఖర్చుతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి సుప్రసిద్ధ చలన చిత్ర నటుడు అక్కినేని నాగేశ్వరరావు మార్చి 8 వ తేదీన ప్రారంభోత్సవం




ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మార్చి 15 న ఖమ్మంలో కొత్తగా నిర్మించిన హాస్పిటలు భవనానికి ప్రారంభోత్సవం చేశారు


చేశారు. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ జె. కొండలరావు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఖమ్మంలో ఆసుపత్రి

ముఖ్య మంత్రి శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి మార్చి 15 వ తేదీన ఖమ్మం జిల్లా ఆసుపత్రికి ప్రారంభోత్సవం చేశారు. 130 పడకలుగల ఈ ఆసుపత్రి నిర్మాణానికి రూ 24 లక్షలు ఖర్చయ్యింది.



ఖమ్మంలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనం



పశ్చిమ గోదావరి జిల్లాలోని రాఘవాపురంలో మార్చి 8 వ బహిరంగ సభలో ఉపన్యసిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి


దయతోనూ, సానుభూతితోనూ రోగులకు చికిత్స చేయవలసిందగా ముఖ్య మంత్రి డాక్టర్లకు విజ్ఞప్తి చేశారు. సేద్యపు నీటి విషయాల మంత్రి శ్రీ శీలం సిద్ధారెడ్డి ఈ ఉత్సవానికి అధ్యక్షత వహిస్తూ తెలంగాణా ప్రాంతం వెనుకబడిన ప్రాంతం కావడం వల్ల దీని అభివృద్ధికి మరింతగా నిధులు అవసరమని చెప్పారు.

భూముల పంపిణీ

మెదక్ జిల్లాలోని సిద్దిపేట తాలూకాలో భూములు లేని పేదలకు భూముల్ని పంపిణీచేసే ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గత ఆగస్టు 1వ తేదీ నుండి యింతవరకు 6338 మందికి ప్రభుత్వ భూమి 7436 ఎకరాలను పంపిణీ చేయడం జరిగింది.

నల్గొండ కళాశాలలో క్రొత్త భవనానికి శంకుస్థాపన


విద్యాశాఖా మంత్రి శ్రీ టి. వి. రాఘవులు మార్చి 16 వ తేదీన నాగార్జున ప్రభుత్వ కళాశాల ఆవరణలో వివేకానంద బ్లాకు అనే పేరున నిర్మించ దలచిన నాలుగు లెక్చర్ హాలుల భవనానికి శంకుస్థాపన చేశారు.



ఘటకేసర్ లో ఫిబ్రవరి 17 వ పంచాయతీరాజ్ శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి "పంచాయతీరాజ్ సమ్మేళనా" నికి ప్రారంభోత్సవం చేసినప్పటి చిత్రం

(82వ పుట నుండి)

టేబిల్ టెన్నిస్




జపాను టేబిల్ టెన్నిసు బృందం

జపాను టేబిల్ టెన్నిస్ జట్టు మన దేశంలో ఆడిన టెస్టు లన్నింటిలోనూ విజయం పొందింది. జపాను ఆటగాళ్లు మన ఆటగాళ్ళ కంటే చాలా సమర్థులు. వారి జట్టు నాయకుడు_శిక్షకుడు హైద్రాబాదు ఆటగాళ్ళను గురించి మాట్లాడుతూ యువ ఆటగాడు దిలీప్ రాజ్ సక్సేనాను సాహసవంతుడైన ఆటగానిగా కొనియాడాడు.


క్రికెట్

హైద్రాబాదులో జరిగిన మహారాజా సర్ కిషన్ పెర్షాద్ స్మారక ట్రాఫీ క్రికెట్ టోర్నమెంటు పైనల్స్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పోర్ట్స్ క్లబ్ జట్టు దక్కన్ బ్లూస్ క్లబ్ జట్టుతో ఓటమి పొందింది. బ్యాంకు జట్టు లోగడ జరిగిన 'ఏ' డివిజను లీగు మ్యాచులన్నింటిలోనూ గెలుపొందింది. అంతేగాక బెహారముద్దౌలా స్మారక టోర్నమెంటు, గులాం ఆలీ స్మారక టోర్నమెంటులలో కూడా వారు విజయం సాధించారు. ఈ రెండు టోర్నమెంట్ల లోనూ బ్యాంకు జట్టు బ్లూస్‌ను ఓడించింది. కాగా సర్ కిషన్ పెర్షాద్ టోర్నమెంటులో మాత్రం వారు యిదివరలో తాము ఓడించిన వారి చేతిలోనే పరాజయం పొందవలసి వచ్చింది. *

ప్రముఖుల రాకలు



యు. ఎస్. ఎస్. ఆర్. ఎలక్ట్రికల్ పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ప్రతినిధివర్గం ఫిబ్రవరి 18 న నగరానికి విచ్చేసినప్పటి చిత్రం



ఇంపీరియల్ ఇరాను సాయుధబలాల ప్రధానాధిపతి జనరల్ బి. ఆర్యానా ఫిబ్రవరి 24 న నగరానికి విచ్చేసినప్పటి చిత్రం

నగరంలో ఐక్యరాజ్య సమితివర్తక, వాణిజ్య ప్రతినిధివర్గం

ఘనా, టర్కీ, యుగొస్లావియా, కెన్యా, లెబనాన్, టాంజనియా దేశాలకుచెందిన ఐరాస వర్తక, వాణిజ్యసంఘం ప్రతినిధులు హైదరాబాదులో మూడురోజులపాటు పర్యటించేనిమిత్తం మార్చినెలలో నగరానికి విచ్చేశారు. వీరు భారత భారీవిద్యుత్పరికరాల కర్మాగారాన్ని, హిందుస్థాన్ యంత్ర పరికరాల కర్మాగారన్ని, సింథటిక్ మందులకర్మాగారాన్ని, నాగార్జునసాగర్ ఆనకట్టను సందర్శించారు.

టాంజనియా ప్రతినిధి శ్రీ ఎస్. కె. జి. విస్రాం పత్రికలవారితో మాట్లాడుతూ, భారత దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే తనకు అసూయ కలుగుతున్నదనీ, తమ దేశంమీద తనకే చిన్నచూపు ఏర్పడుతున్నదనీ అన్నారు. ఇంత విశేషమైన సాంకేతిక అభివృద్ధిని సాధించడం ఘనా ప్రజలకూ, ప్రభుత్వానికీ సాధ్యంకానిపని అనీ, అయితే భారత దేశం సాధించిన పారిశ్రామిక అభివృద్ధితో తాము తులతూగ లేకపోయినా వాణిజ్యపరంగా దీని అభివృద్ధిని తాము పాలుపంచుకోగలమనీ, అదే తమకు ఓదార్పనీ అన్నారు.

భారత దేశంలో రష్యా, స్విడ్జర్లాండ్, యుగొస్లావియా, ఫ్రెంచి, చకొస్లవెకియా దేశాలు సహకరించి పనిచేస్తున్నాయంటే చక్కటి సహజీవన విధానం యిక్కడి వెల్లి విరిసివున్నదనడానికి నిదర్శనం. ఐక్యరాజ్య సమితి అభిలషించే సహజీవనపద్ధతి యింతవరకూ అక్షరా నే వుండేదిగాని భారత దేశంలో ఆ విధానాన్ని క్రియాత్మకంగా చూడగలుగుతున్నాం అని శ్రీ విస్రాం అన్నారు.

యుగొస్లావియా ప్రతినిధి శ్రీ వై. రుడి సివిస్ మాట్లాడుతూ భారత దేశంతో భవిష్యత్తులో తమవర్తకసంబంధాలు విస్తృతి చెందగలవని తమదేశం అభిలషిస్తున్నదని అన్నారు. నిజానికి భారత దేశం, యు. ఎ. ఆర్, యుగొస్లావియా దేశాలమధ్య వాణిజ్య ఒప్పందం ఒకటివుండనేవుంది. శ్రీఘ్రంగా పారిశ్రామిక అభివృద్ధిని సాధించడంలో యీ మూడు దేశాలు పరస్పరం తోడ్పడ గలవని అభిలషించవచ్చు.

లెబనాన్ ప్రతినిధి మాట్లాడుతూ స్వశక్తిమీద నమ్మకం ఏర్పరచు కోవడంలోనూ, ఆర్థికస్వాతంత్ర్యాన్ని సాధించడంలోనూ భారత దేశం చూపించిన మార్గంలోనే అభివృద్ధిచెందిన దేశాలు నడువగలవని తాము విశ్వశిస్తున్నామన్నారు.

PUBLISHED BY THE DIRECTOR, JANA SAMBANDHA SAKHA, A. P. HYDERBAD, PRINTED BY THE DIRECTOR OF PRINTING AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERBAD.



Regd. No. H. 133

